జూలై 2022 సంచిక : 449 వెల : 25/-

ISSN 0971-278X

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక




## రావిశాస్త్రి

శతజయంతి సంచిక

జనసాహితి ప్రచురణ

# నిర్మలానందకు జోహార్లు!

# ప్రజాకళలు, ప్రజాసాహిత్యం వర్ధిల్లాలి!!



జననం : **20 అక్టోబర్ 1935**

మరణం : **24 జూలై 2018**

**నిర్మలానంద** మనల్ని వీడి నాలుగు సంవత్సరా లయింది. ఎంతోమంది యువ రచయితలను, అనువాదకులను ప్రోత్సహిస్తూ 'రాయవలసినవారంతా రాయాలిరా' అంటూ వారిచేత రాయించిన సాహిత్య శ్రమజీవి. సరైన ఫోను సౌకర్యాలు అందుబాటులో లేని ఆ రోజుల్లో కార్డులు రాస్తూ, టెలిగ్రామ్‌లు ఇస్తూ ఇళ్ళకు వెళ్ళి మాట్లాడుతూ సాహిత్య జీవులను కూడగట్టేందుకు కృషిచేశారు. ప్రజాసాహిత్యపు అవసరాన్ని గుర్తించి జనసాహితి ఆశయాలను ముందుకు తీసుకుపోవటానికి 1991 నుండి 'ప్రజాసాహితి' సంపాదకత్వ బాధ్యతలను స్వీకరించారు. సమష్టి కృషి, సమష్టి సాధనను సాగించటంలో ముందుపీఠిన నిలబడి 177 సంచికలకు సంపాదకునిగా పనిచేశారు. ఇతర రాష్ట్ర, ఇతర దేశాల ప్రజాసాహిత్యాన్నీ, సాహిత్యకారులను తెలుగువారికి పరిచయం చేశారు, చేయించారు. ప్రజాసాహితి ఒరవడిని, ఉరవడిని తీర్చి దిద్దుతూ ప్రత్యేక సంచికలు, విశిష్ట సంచికలను తీసుకు రావటంలో సంస్థ సమష్టి కృషికి ఆయన నాయకుడు.

జనసాహితి కార్యాచరణ పట్ల నిక్కచ్చిగా వుంటూ రచయితలందరితో సున్నితమైన, స్నేహపూరితమైన సంబంధాలను కొనసాగించారు. భగత్సింగ్ రచనలన్నింటినీ తెలుగులోకి అనువదించడంలో విశేష కృషి చేశారు. జనసాహితి ప్రచురణగా వెలువడిన భగత్‌సింగ్ రచనల సంకలనం 'మా నెత్తురు వృథా కాదు' ఇప్పటికి 4 ముద్రణలు పొంది యువతరాన్ని జాగృతం చేస్తూనే వుంది. లూషన్ ప్రత్యేక సంచిక తెచ్చినా, పాలస్తీనా పోరాటంపై 'నేను నేలకొరిగితే' సంకలనం తెచ్చినా, 'కలాల కవాతు', మొదలైన ఎన్నో జనసాహితి ప్రచురణలు తీసుకురావటంలో ఆయన పెట్టిన శ్రద్ధ, శ్రమ, సమష్టితనం నేర్చుకోవల్సిన అంశాలు. శ్రీశ్రీ 'మహాప్రస్థానాన్ని', శీలా సుభద్రాదేవి 'యుద్ధం ఒక గుండెకోత'నూ, శీలా వీర్రాజు, కుందుర్తి, ఛాయరాజ్ కవితలను హిందీలోకి అనువదించారు. మహాశ్వేతాదేవి రచనలను తెలుగు సాహిత్య లోకానికి పరిచయం చేశారు. మాతృభాష తెలుగుతోపాటు హిందీ, ఉర్దూ, ఇంగ్లీషు, బెంగాలీ, ఒడియా భాషలలో ఆయనకు పరిచయం వున్నది.

తన సమయాన్నంతా సాహిత్యోద్యమ సాంగత్యంలో, విప్లవోద్యమ అనుబంధంతో గడిపారు. జీవితాన్ని మార్క్సిజానికి అంకితం చేసిన బుద్ధిజీవి ఆయన. "నూరేళ్ళు బ్రతుకుతాను. మీ మధ్యే బ్రతుకుతాన్నేను. మన గురించి కాదు మన శక్తి కొద్దీ మన దేశం గురించి పనిచేద్దాం" అంటూ చివరి నిముషం వరకూ ప్రజాసాహిత్య కృషిలో కొనసాగిన నిర్మలానంద నిబద్ధత, నిమగ్నత, నిరాడంబరత, నిక్కచ్చితనం, సమష్టితత్వం మనమందరం నేర్చుకోవాల్సినవి ఆచరించాల్సినవి. ఆయన చివరి శ్వాస వరకు సాహిత్య కృషిలో నిమగ్నమై యువతరాన్ని రచయితలుగా తీర్చిదిద్దిన ఆంధ్రా లూషన్. నిర్మలానంద నాలుగవ వర్ధంతి సందర్భంగా, ఆయన యాదిలో, ఆయన అందించిన ఆచరణను, స్ఫూర్తిని స్వీకరిస్తూ ప్రజాసాహిత్యోద్యమాన్ని కొనసాగిద్దాం!

– జనసాహితి

45 ఏళ్ళుగా నిరంతరాయంగా ప్రచురింపబడుతున్న

# ప్రజాసాహితి

449

సంపుటి : 45
సంచిక : 12
జూలై 2022

జనసాహితి ప్రచురణ

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

## ఈ సంచికలో...

website : www.prajaasaahithi.com


✦ ముఖచిత్రం : సాహిత్యానికి కొండంత గుర్తు రావిశాస్త్రి – చిత్రం : అంతర్జాలం నుండి ..... 01
✦ రెండవ అట్ట : నిర్మలానందకు జోహార్లు ..... 02
✦ మూడవ అట్ట : ప్రేమను కురిపించే కర్మయోగి మన ప్రధాని కావాలి! (కవిత) – అను : కొత్తపల్లి రవిబాబు ..... 51
✦ నాల్గవ అట్ట : దండాలండి బావు–ఛాత్రి బావుకు దండాలు! – ఛాయరాజ్ ..... 52
✦ సంపాదకీయం : క్షీణ దోపిడీ వ్యవస్థపై సర్చ్‌లైట్ రావిశాస్త్రి సాహిత్యం! ..... 05
✦ రావిశాస్త్రి రాసిన : కథ – ఆకలి ..... 07
: కవిత – వెన్నెలా! కన్నతల్లీ! పేదోడి దీపమా! ..... 23
✦ రావిశాస్త్రి సాహిత్య పరామర్శ :
: ఆస్తి దురాక్రమణను తేటతెల్లం చేసిన రావిశాస్త్రి 'ఇల్లు' నవల – ఐ.టి.ఆర్.వి. శివాజీరావు ..... 11
: రావిశాస్త్రితో ఇంటర్వ్యూ – తాటి శ్రీకృష్ణ ..... 14
: వేతనాలతో సరిపుచ్చుకునే 'వేతనశర్మ' కథ – ఓవీవీయస్ రామకృష్ణ ..... 16
: సామాజిక సాంస్కృతిక జీవనాన్ని రికార్డు చేసిన రావిశాస్త్రి కథలు– గౌరీశంకర్ ..... 24
: రావిశాస్త్రి 'నిజం' – రాజ్యాంగ యంత్రాంగం – ఆచార్య వెలమల సిమ్మన్న ..... 28
: మరణం తటస్థ మూల్యాంకనానికి అడ్డుకాదు – ఎ.కె. ప్రభాకర్ ..... 38
: 'నిజం' నాటకంలో హతులు–హంతకులు – దివికుమార్ ..... 41
: 'గూఢచారి 666' రావిశాస్త్రి రాసిన పొట్టి పిట్ట కథలు – అరుణ ..... 49
: తెలుగు కథల ఛాత్రిబాబు (కవిత) – ఎస్. శంకర్రావు ..... 33
✦ శీలా వీర్రాజు స్మృతిలో :
: శీలా వీర్రాజు స్మృతిలో (కవిత) – డా॥ ఎన్. గోపి ..... 10
: శీలావి నా స్వాప్నికుడు – ఆంతరంగికుడు – డా॥ నాళేశ్వరం శంకరం ..... 32
: 'అక్షర.. బొమ్మల' రారాజు శీలా వీర్రాజు జ్ఞాపకాల తడిలో – జనజ్వాల ..... 34
✦ పుస్తక పరిచయాలు : డిజిటల్ శ్రమ – కార్ల్‌మార్క్స్ – జి.వి. భద్రం ..... 18
✦ ఖండన ప్రకటనలు : అల్లూరి సీతారామరాజును హైజాక్ చేయాలనుకుంటున్న బిజెపి కుట్రను తిప్పికొట్టండి! (04)
తీస్తా సేతల్వాడ్ అరెస్టును ఖండించండి! (43)
✦ సినిమా సమీక్ష : 'జన గణ మన' (2022) – బాలాజీ (కోల్‌కతా) ..... 36
✦ జాతీయ అక్షరయోధులు : గిరీష్ కర్నాడ్ – సింగంపల్లి అశోక్‌కుమార్ ..... 35
✦ వివిధ : ముప్ఫై ఏళ్ళ క్రితం 'ప్రజాసాహితి' (13); చైతన్యవాహిని (48); ఈ పుస్తకాలు అందాయి (49)
సాహిత్య, సాంస్కృతిక సామాజికాంశాలు (06, 17, 33, 34, 40)
✦ సంతాపాలు : 'ఎల్లి' అరుణ (43)


ప్రధాన సంపాదకుడు : **కొత్తపల్లి రవిబాబు** ఫోన్ : 9490196890 E-mail : ravibabujs@yahoo.co.in

చందాలు పంపవలసిన చిరునామా :
**డా॥ బి. అరుణ,** జనసాహితి ప్రధాన కార్యదర్శి
జనసాహితి కార్యాలయం : ప్రజాసాహితి
30–7–6, అనపర్తివారివీధి, అన్నదాన సమాజం రోడ్డు,
దుర్గాఅగ్రహారం, విజయవాడ – 520002.
ఫోన్ : 7075957010 prajasahithi1977@gmail.com

ISSN 0971-278X

LCCN 94903393

రచనలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా :
**పి.ఎస్.నాగరాజు,** సంపాదకుడు, ప్రజాసాహితి
ప్లాట్ నెం. 59, రాధాకృష్ణ నగర్ కాలనీ
ఆర్మీ క్యాంటీన్ దగ్గర, దగ్గస్ స్కూల్ ఎదురు వీధి,
శ్రీకాకుళం – 532001
ఫోన్ : 9441913829 prajasahithi1977@gmail.com

**'ప్రజాసాహితి'**
**కెనరాబ్యాంకు అకౌంటు వివరాలు**
**"అకౌంట్ నెం.**
***0680101004936***
***IFSC No. CNRB0000680***
**ఫోన్ : 94901 96890**

| | |
|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | రు. 300-00 |
| ఐదేళ్లకు చందా | రు. 1300-00 |
| సంస్థలకు సం॥ చందా | రు. 500-00 |

**చందాలు, విరాళాలు**
**మనియార్డరు, డి.డి.ల. ద్వారా పంపండి.**
**చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.**
డి.డి.లపై 'ప్రజాసాహితి, విజయవాడ' అని రాయండి

**ప్రజాసాహితి ప్రకటనల ధరలు**
**1/4 డెమ్మీ పరిమాణం**

| | |
|---|---|
| 2వ, 3వ అట్ట మల్టీకలర్ | రు. 20,000 |
| లోపలి పూర్తి పేజి | రు. 15,000 |
| లోపలి అరపేజి | రు. 7,000 |

ప్రజాసాహితి పాఠకులు, అభిమానులు తమతమ ప్రాంతాల నుండి (దేవుళ్ళు, సినిమాలు, వైన్‌షాపులు లాంటివి తప్ప) ప్రకటనలు సేకరించి పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం

## చందాదారులకు విజ్ఞప్తి

1. మీ చిరునామా పైన మీ చందా ప్రారంభమైన నెల, సంవత్సరం - చందా పూర్తయ్యే నెల, సంవత్సరం వివరాలు పోస్టల్ శాఖవారి ఆదేశాల ప్రకారం ముద్రించటంలేదు. ప్రజాసాహితి కార్యాలయం నుండి చందా పూర్తికాకమునుపే మీకు సమాచారం పంపుతాము. వెంటనే చందా పంపిస్తే, పత్రిక ఆగకుండా మీకు చేరుతుంది.
2. ప్రతినెల పత్రిక మొదటివారంలో పోస్టు చేస్తున్నాం. 10వ తేదీ లోపు మీకు పత్రిక రాకపోతే పోస్టుమాన్‌ని వాకబు చేయండి. కార్యాలయానికి ఫోన్‌చేసి తెలియచేయండి.
3. చందా పూర్తయి కొన్ని సంవత్సరాలు దాటినా కొందరికి పత్రిక పంపిస్తున్నాము. ఇకముందు చందా పూర్తికాగానే, ఆపై నెల వచ్చే సంచిక నుండీ ఆపేస్తాము.
4. మీ మిత్రుల చేత, సన్నిహితుల చేత 'ప్రజాసాహితి'కి చందాలు, విరాళాలు సేకరించండి.

– సంపాదకవర్గం

# అల్లూరి సీతారామరాజుని హైజాక్ చేయాలనుకుంటున్న బిజెపి కుట్రను తిప్పికొడదాం!!

ఈ జులై 4వ తేదీన గిరిజన పోరాటయోధుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఆవిష్కరించడానికి దేశ ప్రధాని నరేంద్ర మోడీ పశ్చిమగోదావరి జిల్లా భీమవరం రాబోతున్నారు. ఆ రోజుకి శ్రీరామరాజు పుట్టి 125 సంవత్సరాలు. ఆయనను బ్రిటిష్ పాలకులు భౌతికంగా నిర్బంధించి, తుపాకులతో క్రూరంగా కాల్చి చంపి 98 సంవత్సరాలు దాటింది. ప్రభుత్వాలు సాగించే ఎన్కౌంటర్ హత్యలకు తొలి నిదర్శనంగా అది చరిత్రలో నిలిచిపోయింది. పాలకుల అన్యాయాలను ఎదిరించి నిలబడ్డ శ్రీరామరాజుపైన ఉన్నట్టుండి భాజపా పాలకులకు అంతటి అభిమానం ఎందుకు పుట్టుకు వస్తోంది?

మతవాద కోణం నుండి చరిత్రను తిరగరాసి విద్యార్థులకు బోధించాలనే భాజప బృహత్తర ప్రణాళికలో భాగంగానే ఈ కుట్ర జరుగుతోంది. దానితోపాటు తమకు, తమ భావజాలానికి సంబంధం లేని చారిత్రక పురుషుల కీర్తి ప్రతిష్టలను తమవిగా ప్రచారం చేసుకునే దుర్లక్షణం వారికి నిలువెల్లా నిండి ఉంది.

భగత్‌సింగ్ విషయంలో అలాంటి ప్రయత్నాలు చాలా చేశారు. కానీ ఆయన మార్క్సిస్టు దృక్పథంతో సోషలిస్టు సమాజ స్థాపన లక్ష్యంతో 'విప్లవం వర్ధిల్లాలి! సామ్రాజ్యవాదం నశించాలి!!' అనే రెండు గొప్ప నినాదాల వ్యాప్తికి ముఖ్య కారకుడు అనీ, అలాగే 'నేనెందుకు నాస్తికుడను?' అనే పుస్తక రచయిత అనీ సాధారణ ప్రజలకు కూడా తెలియటంతో భగత్సింగ్ చరిత్రను మార్చలేకపోయారు. అంతేకాదు కర్ణాటక రాష్ట్రంలో 10వ తరగతి విద్యార్థుల చరిత్ర పాఠ్యగ్రంథంలో భగత్ సింగ్ గురించిన భాగాన్ని రద్దుచేసి దానికి బదులుగా ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపక నాయకుడు హెగ్డే వార్ ఉపన్యాసాన్ని చొప్పించాలని ప్రయత్నం చేశారు. అయితే ప్రజల నుండి తీవ్ర నిరసన రాగానే భగత్ సింగ్ చరిత్రను తిరిగి చేర్చక తప్పలేదు.

ఇలాంటివాటిలో వారు ఆరితేరిన వారు. గాంధీ హత్యానంతరం ఆర్‌ఎస్‌ఎస్ పై నిషేధాన్ని విధించిన ఆనాటి హోంమంత్రి, కాంగ్రెసు నాయకుడు అయిన సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను తమ వాడేనంటూ హైజాక్ చేసిన భాజపావారు 600 అడుగుల, ఎత్తైన విగ్రహాన్ని నిర్మించారు. ఆజాద్ హింద్ ఫౌజ్‌లో చారిత్రాత్మక హిందూ ముస్లిం ఐక్యతను గొప్పగా సాధించిన సుభాష్ చంద్రబోస్ చరిత్రను హైజాక్ చేయడానికి ప్రయత్నం చేశారు.

భాజపా వారికి జాతీయోద్యమ పోరాట చరిత్రలో ప్రజానుకూల పాత్ర ఇసుమంత కూడా లేకపోగా బ్రిటిష్ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్ని నీరు కార్చే విధంగా భారత ప్రజానీకం నడుమ హిందూ ముస్లిం విద్వేషాలను పెంచే పనిలో వారు నాటికి నేటికి కొనసాగుతూ ఉన్నారు. బ్రిటిష్ వ్యతిరేక పోరాటం చేయనందుకు ప్రాయశ్చిత్తంగా ఇప్పుడు అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణ చేస్తున్నారనుకోవాలి. ఆవిధంగా ఒక వర్గం ప్రజలకు చేరువ కావాలనే రాజకీయంతో ఆయనను తమవాడిగా చెప్పుకోవాలని తాపత్రయపడుతున్నారు. రెండు నెలల క్రితం హోం మంత్రి అమిత్ షా తెలంగాణ ప్రజా విముక్తికి అల్లూరి సీతారామరాజు త్యాగపూరితమైన కృషి చేసినట్లు ప్రకటించి దేశస్థులను సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తారు.

అంతేకాదు బ్రిటిష్ సామ్రాజ్యవాదుల దోపిడీ రూపాలను దొంగ చాటుగా అమలుపరుస్తున్నారు. ఆదివాసీల అటవీ హక్కులను, పోడు వ్యవసాయ హక్కులను కాలరాస్తున్నారు. అటవీసంపదలను, ఖనిజ సంపదలను ఒక వైపు చట్టబద్ధంగా మరొకవైపు చట్ట విరుద్ధంగా విదేశీ దోపిడీ శక్తులకు, దేశీయ బడా కార్పొరేట్ వర్గాలకు కట్టబెడుతున్నారు. రాజ్యాంగంలోని షెడ్యూల్ ఎ ప్రకారం ఆదివాసీల గ్రామ పంచాయతీలకు ఉండే స్వయం నిర్ణయాధికార హక్కులను నీరు కారుస్తూ రద్దు పరుస్తూ ఎత్తివేయడానికి చూస్తున్నారు. జాతీయ పౌరసత్వ చట్టం పేరుతో గుర్తింపు పత్రాలు లేని గిరిజనులందరి పౌరసత్వం రద్దుచేయాలని ప్రయత్నిస్తున్నారు. అటవీ సంరక్షణ అంటూ ఫారెస్టు గార్డులకు గిరిజనులను కాల్చి చంపే హక్కు కట్టబెట్టారు. అభివృద్ధి ప్రాజెక్టుల పేరుతో 40 నుండి 50 శాతం ఆదివాసులను విస్తాపన చేస్తున్నారు. ఇప్పుడు రానున్న రాష్ట్రపతి పదవికి ద్రౌపది ముర్మ అనే ఆదివాసి మహిళను అభ్యర్థిగా నిలబెట్టి ఆదివాసీల కళ్ళు కప్పాలని యత్నిస్తున్నారు.

నిర్మాణయుతమైన సాయుధ సైన్యాలు కలిగిన బ్రిటిష్ సామ్రాజ్యవాద సైనిక శక్తిని ధిక్కరించి రెండు సంవత్సరాల పాటు కొండ కోనల్లో నివసించే ఆదివాసీల చేత గెరిల్లా యుద్ధాన్ని నడిపించి, ఆ పోరులో తన జీవితాన్నే సమర్పించిన అసమాన దేశభక్తుడు పీడిత ప్రజల పక్షపాతి అయిన అల్లూరి సీతారామరాజును ఆయన కీర్తి ప్రతిష్టలను బిజెపి హైజాక్ చేయటాన్ని ఖండిద్దాం!

అటవీ సంపదలను దోపిడీ చేయడానికి, ఆదివాసీలను అణచివేసే విధానాలను, అడవి నుండి ఆదివాసీలను గెంటివేసే విధానాలను, గత పాలకులను మించి అమలుపరచాలని ప్రయత్నిస్తున్న భాజపా కుట్రలను త్రిప్పికొడదాం!

**– జనసాహితి**

# సంపాదకీయం

# క్షీణ దోపిడీ వ్యవస్థపై సర్చ్‌లైట్ రావిశాస్త్రి సాహిత్యం

**ఆధునిక** తెలుగు సాహిత్యానికి కొండంత గుర్తు రావిశాస్త్రిగా ప్రసిద్ధుడైన రాచకొండ విశ్వనాథశాస్త్రి. 2022 ఆయన శతజయంతి సంవత్సరం. ఆ మహారచయిత స్మరణలో ఆయన సాహిత్యపు ప్రాసంగికతను గుర్తుచేస్తూ తీసుకువస్తున్న 'ప్రజాసాహితి' ప్రత్యేక సంచిక ఇది. ఆధునిక సాహిత్యంతో పరిచయం వున్నవాళ్ళందరూ ఆయన రచనలు చదివి వుంటారు. 1952 నుండి నాలుగు దశాబ్దాల పాటు ఆయన కథ, నవల, నాటకం ప్రక్రియల్లో గొప్ప సాహిత్యం సృజించాడు. 'మూడు కథల బంగారం', 'ఋక్కులు', 'ఆరు చిత్రాలు', 'ఆరు సారా కథలు', 'సారో కథలు', బాకీకథలు; 'కలకంఠి' అనే కథాసంపుటాలు; 'అల్పజీవి', 'రాజు–మహిషి', 'రత్తాలు–రాంబాబు', 'గోవులొస్తున్నాయి జాగ్రత్త', 'సొమ్ములు పోనాయండి', 'ఇల్లు' అనే నవలలు; 'నిజం', 'విషాదం', 'తిరస్కృతి' నాటకాలు ఆయన రచించాడు.

“ఏమీ తోచనప్పుడు కథలు రాస్తాను. కథలు రాస్తేగాని ఏమీ తోచదు” అని ఆయన చమత్కరించాడు. ఎంతో ఆలోచనతోనూ, అనుభవంతోను, నిబద్ధతతోను సాహిత్య సృజన చేశాడని మనకి తెలుసు. 'సమాజాన్ని వేయి కళ్ళతో కనిపెట్టినవాడు' రావిశాస్త్రి అని శ్రీశ్రీ ప్రశంసించాడు.

“రచయిత అయిన ప్రతివాడూ తాను రాస్తున్నది ఏ మంచికి హాని కలిగిస్తుందో ఏ చెడ్డకి ఉపకారం చేస్తుందోనని ఆలోచించవలసిన అవసరముందని నేను భావిస్తాను. మంచికి హాని, చెడ్డకి సహాయం చెయ్యకూడదని నేను భావిస్తాను. ఇది తెలుసుకుందికి, తెలియజెప్పడానికీ నేనిదంతా రాసేను”, అని ఆయన సూటిగా, స్పష్టంగా ప్రకటించాడు. పదవుల కోసం, సన్మానాల కోసం ఆయన వెంపర్లాడలేదు.

పీడితులు, నిర్భాగ్యులు, నిస్సహాయులు, నేరగాళ్ళు, జూదగాళ్ళు, అల్పజీవులు రావిశాస్త్రి సాహిత్యంలో కొల్లలు కొల్లలుగా కనిపిస్తారు. లంపెన్ వర్గం గురించే ఆయన ఎక్కువగా చిత్రించాడని ఒక విమర్శ వినిపిస్తుంది. అయితే వాళ్ళెలా ఉత్పన్నమవుతారు? బ్రిటిష్ వలస పాలకుల నుండి అధికారం అందుకున్న మనదేశ దళారీ, దోపిడీవర్గాల నిర్వాకమే ఈ పరిస్థితిని కల్పించింది. భూస్వామ్యాన్ని కూలదోసి జాతీయ పారిశ్రామిక సేవారంగాలను రావిశాస్త్రి కాలం నాటికి గాని, నేటికి గాని అభివృద్ధి చేయకపోవడమే సకల రంగాల వెనుకబాటుతనానికి దేశ పరాధీనతకు నిరుద్యోగానికీ, అర్ధనిరుద్యోగానికీ మూలకారణం. అధోజగత్తు అనబడేది దాని ఫలితంగా ఉత్పన్నమయినదే. దాన్ని సాహిత్యంలో స్పృశించక తప్పదు. వెంకటచలం సృజించిన సాహిత్యంపై ఎందరో దుమ్మెత్తి పోస్తున్నప్పుడు ఆయన రాసిన విషయాలు ఎవరో ఒకరు తప్పక రాయాల్సినవే అని కొడవటిగంటి కుటుంబరావు ప్రకటించాడు. అధోజగత్తు లంపెన్ జీవుల గురించి రాయడం సాహిత్య సామాజిక కర్తవ్యాల్లో భాగమే. అద్దంలో మొహం బాగాలేదని అద్దాన్ని పగులగొట్టడం వల్ల ప్రయోజనముండదు. ఎంతటి గొప్ప రచయిత అయినా జాతి జీవిత సర్వస్వాన్ని చిత్రించలేడు. అది ఆ జాతి భాషా సాహిత్యం మొత్తం చేయగల పని. తెలుగు భాషా సాహిత్యం ఆ పని చేస్తూనే వుంది. ఇంకా చేయవలసింది ఎప్పుడూ మిగిలే వుంటుంది. ఎందుకంటే అది మారుతూనే వుంటుంది. నిజానికి అన్ని రంగాలు లంపెన్ స్వభావాన్ని సంతరించుకున్నాయనడం అతిశయోక్తి కాదు. ఇదంతా మారాలి అనే వైపుగా రావిశాస్త్రి సాహిత్యం పాఠకుల్ని చైతన్యపరుస్తుంది. వాస్తవంగా ఆయన విభిన్న శ్రేణుల జీవితాన్ని సాహిత్యంలోకి తెచ్చాడు. ఎవర్ని గురించి రాసినా, దేన్ని గురించి రాసినా ఆయన ప్రజాపక్షపాతిగానే వున్నాడన్నది సత్యం. ఆయన కొన్ని నవలలకు ముగింపునివ్వలేదు అని భావిస్తున్నామంటే వాటి ఇతివృత్తాలలోని జీవన సమస్యలు అలాగే కొనసాగే సామాజిక పరిస్థితులున్నాయని బహుశ ఆయన భావించి వుంటాడు.

తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట విరమణానంతర దశలో అభ్యుదయ సాహిత్యం నిర్మాణాత్మక ఉద్యమంగా నిస్తబ్ధతలో వున్న కాలంలో బాధితులు, శ్రమజీవుల పక్షాన రావిశాస్త్రి ఉత్తమోత్తమ సాహిత్యం సృజించాడు. అదే కాలంలో చిత్తజల్లు వరహాలరావు (సి.వి.) అద్వితీయ సాహిత్య సృజన చేశాడు. కె.వి.ఆర్., కాళీపట్నం రామారావు, ఇంకొందరు సాహిత్యంలో అభ్యుదయం వెలుగును కాపాడుతూ రచించారు.

రావిశాస్త్రిది కవితాత్మక వచనశైలి. అది అనుపమాన ఉపమానాత్మకమైన విశాఖ మాండలిక శైలి. అదే ఆయన బలమూ, బలహీనత కూడా అని అనుకొంటుంటాం. అది వస్తువు నడకను నెమ్మదింపచేస్తుంది. నిజమే. అయితే అది అతని శైలి. అంతే. పైగా అది నవలలకే పరిమితం. ఆయన కథల్లో ఒక వాక్యం తీసివేయడంగాని, చేర్చడంగాని కుదరదు. అందుకే ఆయన్ని ఆంధ్ర చెహోవ్ అంటాం.

సామాజిక విప్లవ సందేశాన్నిచ్చే “పిపీలకం” వంటి కథ రావిశాస్త్రి మాత్రమే రాయగలిగినది. సారా కథ “మాయ”లోని ముత్యాలమ్మ ఆయన చేసిన ఒక గొప్ప సామాజిక డిస్కవరి. “ఈ లోకంలో డబ్బు వ్యాపారం తప్ప మరేట్లేదు” అంటూ దొంగసారా కేసులో ఇరికించబడిన ముత్యాలమ్మ కుర్ర లాయర్ మూర్తికి చేసిన ఉద్బోధ మూర్తినేగాక మనల్నందరినీ విస్తుపరుస్తూ సామాజిక వ్యవస్థను బోనులో నిలబెట్టింది.

“జరీ అంచు తెల్లచీర” కథలో దిగువ మధ్యతరగతి విశాలాక్షి వంటివారి అత్యల్పకాంక్షలు కూడ ఈడేరని దైన్యం మనల్ని వెన్నాడుతుంది. “వర్షం” కథలో సాహసగుణానికుండే విలువను చిన్న పరిశీలన ఇతివృత్తంగా వినూత్నంగా ఆవిష్కరించారు. 'కాదేదీ కవితకనర్హమ'ని ఋక్కుల్లో శ్రీశ్రీ వక్కాణిస్తే అవన్నీ కథలకు కూడా అర్హమైనవేనని రావిశాస్త్రి నిరూపించారు. కారల్‌మార్క్స్ అదనపు విలువ సూత్రాన్ని

సామాన్య పాఠకులకు కూడా సులువుగా అర్థమయేటట్లు "బల్లచెక్క" వంటి గొప్ప కథలు రాసాడు.

మొత్తం మూడు నాటకాలే రాసినా అన్నీ సామాజిక స్పృహ కలిగినవే రాశారు. 'నిజం' నాటకం 14 ఏళ్ళ అధికారమార్పిడి తర్వాత కూడా మన రాజ్యవ్యవస్థను సార్వభౌమరావులే శాసిస్తున్నారనీ, పోలీసు, న్యాయవ్యవస్థలలో ప్రజానుకూల మార్పులు జరగలేదనీ, అవి నిజాల్ని నిలువులోతు కప్పిపెడుతున్నాయనీ, అమాయకులనే శిక్షిస్తున్నాయనీ గొప్ప నాటకీయ చిత్రీకరణతో దృశ్యమానం చేశారు. అది నేటికీ ప్రదర్శనాయోగ్యమే! మిగిలిన రెండూ మహిళల జీవిత విషాదాన్ని, వంచనాత్మక పురుషులపై స్త్రీ ధిక్కారాన్ని ప్రతిభావంతంగా చూపాయి. 1957లోనే ఆత్మవిశ్వాసపూరిత మహిళల్ని 'తిరస్కృతి' నాటకంలో ఎత్తిపట్టటం ఆయనలోని ప్రతిభావంతమైన ముందుచూపు.

"నిజం" నాటకంలో సార్వభౌమరావు, "సొమ్ములు పోనాయండి" నవలలో పంచాయితీ ప్రెసిడెంట్, "గోవులొస్తున్నాయి జాగ్రత్త"లో కిరీటిరావు పెదనాన్న వంటి దోపిడీ దౌర్జన్యాల క్షుద్ర శక్తులు భారత సమాజంలో లుకలుకలాడుతున్నారు. వారి దౌష్ట్యాలపై రావిశాస్త్రి సాహిత్య యుద్ధం ప్రకటించాడు. "సొమ్ములు పోనాయండి" నవల భూస్వామ్య అణచివేతను, వికృతీకరించబడి కొనసాగుతున్న వలస పాలననాటి అధికార యంత్రాంగం దుర్నీతిని గొప్పగా స్పష్టపరచింది. ఆ నవలలో దోపిడీ దౌష్ట్యాలకు గురైన 'బోడిగాడు' భారతదేశ అట్టడుగు రైతాంగ ప్రతినిధి.

ఆయన సాహిత్యంలో న్యాయవ్యవస్థ, జైళ్లు, పోలీసు - ప్రభుత్వ కార్యాలయాలు, పైరవీ రాయుళ్ళు, సారా కాంట్రాక్టర్లు, భూస్వాములు, లంపెన్ రాజకీయులు ప్రజలను పట్టి పల్లారుస్తున్న వైనం మనకు సాక్షాత్కరిస్తుంది.

"జీవన భయాన్నుంచి బయట పడాలంటే జీవితాన్ని గురించి మరింతగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి" అని విజ్ఞానశాస్త్రంలో ధృవతార మేరీక్యూరీ చెప్పింది. మనం వ్యవస్థను మార్చాలంటే పాలక వర్గాల దోపిడీ చైతన్యాన్ని, పాలక ప్రజల శ్రమ జీవన చైతన్యాన్ని కూడా అర్థం చేసుకొని రచయితలు రచించాలి. "గోవులొస్తున్నాయి జాగ్రత్త" నవలలో రావిశాస్త్రి, కిరీటిరావు పాత్ర ద్వారా స్వీయకథనంగా పాలకవర్గపు దోపిడీదారుల ప్రాపంచిక దృక్పథాన్ని వెల్లడించడం విశిష్ట సాహితీ సందర్భం. పతంజలి ఆ మార్గంలో తనదైన వ్యంగ్య వైభవాన్ని కొనసాగించాడు.

నక్సల్బరి రైతాంగ సాయుధ తిరుగుబాటు, శ్రీకాకుళ పోరాటం వెలుగులో ఏర్పడిన విరసంలో చేరడంలో వ్యవస్థలో మౌలిక మార్పుకోసం రాచకొండ విశ్వనాథశాస్త్రి - ఆకాంక్షకు నిదర్శనం. ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ కాలంలో విరసానికి రాజీనామా చేసినా ఆయన నూతన ప్రజాతంత్ర విప్లవోద్యమ అభిమానిగా, సమర్ధకుడిగా వుండినాడన్నది ప్రధాన విషయం.

పేదల వకీలుగా, పేదల, శ్రమజీవుల రచయితగా జీవితాన్ని అంకితం చేసిన మహారచయిత ఛాత్రి బాపుకు జనసాహితి, 'ప్రజాసాహితి' ప్రగాఢ స్మృత్యంజలి ఘటిస్తున్నాయి. ✦

# 'అగ్నివీరుల'ను తయారుచేసే 'అగ్నిపథం'

**ఇటీవల** కేంద్ర ప్రభుత్వం 'అగ్నిపథం' పేరుతో ప్రకటించిన సైనిక నియామకాల పథకం కొన్ని లక్షలమంది నిరుద్యోగులలో ఆగ్రహావేశాలను కల్పించింది. ఫలితంగా పలు రాష్ట్రాలలో రైళ్ళ దహనం ద్వారా యువజనులు తమ నిరసన తెలియచేశారు.

ఉత్తరాదిన కొన్ని రాష్ట్రాలలో సైనికోద్యోగమంటే యువతకు వారి జీవితాశయము. జై జవాన్.... జై కిసాన్ నినాదంగా జీవితాశయాన్ని ఆ స్థాయికి చేర్చుకోవాలన్నదొక్కటే కారణం కాదు. సైన్యంలోకి రావాలనుకునేది ప్రధానంగా నిరుపేద బిడ్డలే. అణగారిన వర్గాల యువకులకి ఒకసారి సైనికోద్యోగమే వస్తే, ఒకేసారి ఒకవైపు భద్రజీవితమూ, మరోవైపు సామాజిక గౌరవము.... రెండూ కలుగుతాయన్న ఆశ. కొన్ని ప్రాంతాలలోనైతే.... సైనికోద్యోగినైతేనే తప్ప ఊళ్ళోకి అడుగు పెట్టనని శపథాలు చేసి మరీ యువకులు ఆ ఉద్యోగాలకి ప్రయత్నిస్తుంటారు.

ఐతే సకల ప్రభుత్వరంగ సంస్థలనూ నిర్వీర్యంచేసి, అమ్మి.... చేతులు దులిపేసుకుందామనుకుంటున్న కేంద్ర ఏలికలు తమ విధానాలలో భాగంగా సైన్యాన్ని కూడా ఆ గాలానికే ఎరవేయబోతున్నారనేది స్పష్టంగా అర్థమౌతుంది. స్థూలంగా చూసినపుడు 5,25,166 కోట్ల రూపాయల మన రక్షణరంగపు బడ్జెట్లో 1,19,696 కోట్ల రూపాయలు పెన్షన్లకే వ్యయమైపోతున్నాయని, రక్షణరంగపు రెవెన్యూ కేటాయింపులు 2,33,000 కోట్ల రూపాయలుగా కేటాయించవలసి వస్తున్నదని, రక్షణరంగ సాంకేతిక అభివృద్ధికి కేవలం 1,72,470 కోట్లు మాత్రమే కేటాయించవలసి వస్తున్నదని వారు ఆవేదన చెందుతున్నారు. బోఫోర్సు, రాఫెల్‌ల నుండి చివరకు శవపేటికల వరకు పాలకులు చెప్పే అభివృద్ధులు ఏవైనా కుంభకోణాల అభివృద్ధులేనని అందరికీ తెలిసిందే. ఏతావాతా అర్థమౌతున్నదేమిటంటే సైన్యాన్ని సాంకేతికంగా బలోపేతం చేయడం పేరుతో సామ్రాజ్యవాద దేశాల యుద్ధ మార్కెట్టుకు జో.. హుకూం.... అంటూ పాలకులు సాగిలపడదల్చుకున్నారు. అందుకు అవరోధంగా ఉన్నాయని భావిస్తూ సైనికోద్యోగుల పెన్షన్ వగైరా జీవన భద్రతలను అడ్డంగా తెగ్గోయజూస్తున్నారు. ఆలయాలనీ, శివలింగాలనీ దైవభక్తినీ, హిజాబ్‌లనీ, హలాల్‌లనీ మతద్వేషాలనూ యధేచ్ఛగా రెచ్చగొడుతూ వారు చేసే ఏ పనైనా దేశభక్తేనని మాయపొరలు దట్టంగా కమ్మిస్తున్నారు. అగ్నిపథ్‌లాంటి రోమాంచిత నామకరణాలతో ప్రజల కళ్ళకు గంతలు కట్టాలని చూస్తున్నారు. కుంభకర్ణులు కూడా నిరంతరమూ నిద్రపోతూనే ఉండరని, పురాణాలే చరిత్రగా నమ్మే, నమ్మింపజేసే పాలకులు తెలుసుకోవాలి. ✦

# ఆకలి

- రావిశాస్త్రి

**అన్నారావుని** శనిలా వెంటాడుతున్నాడు ముష్టివాడు.

ఆకల్లో అందం కనిపించదు. ఆకల్తో ఉన్నవాళ్లు బొత్తిగా బావుండరు చూడ్డానికి. వాళ్ళనసలు చూడరు చాలామంది. ఇక్కడ "ఆకలి" అంటే ఆకలేకాని మరొకటి కాదు. పుస్తకాలంటే ఆకలి, పరస్త్రీ అంటే ఆకలి, పరాయి సొమ్మంటే ఆకలి, ఆ తరహాది కాదు. ఆకలంటే అసలైన ఆకలి. అంటే ఏమిటో చాలామందికి తెలిసుండాలి.

అతనసలు ఆదినుంచీ ఆకల్తో ఉన్నవాళ్ళా ఉన్నాడు. అంతకాలం అలా ఉంటే మనిషి రూపు మారిపోతుంది. అతను, చెదపుట్టలోంచి తీసిన వస్తువులా ఉన్నాడు. అయితే, అతన్లో మనిషి పోలిక ఇంకా అక్కడక్కడ లేకపోలేదు. వంట్లో ఎమికలు చాలా ఉన్నాయి. ఎన్నున్నాయో తెలుసుకోడానికి వీలయినన్ని ఉన్నాయి. ముక్కు కనిపించకపోయినా కన్నొకటి మాత్రం కనిపిస్తోంది. పటుత్వం లేకపోయినప్పటికీ, పుల్లలా ఉన్నప్పటికీ, ఏనుగంత ఎత్తున్నాడు. ఎమికల మీద సాగి సడలిన చర్మం కురుపులతో నిండింది, తెగింది, ఈగలతో చింకి పేలికలతో మూయబడింది, మూయబడకుండా ఉంది. మొత్తంమీద (మనిషా, ముష్టివాడా?) అతగాడు ఆకలీ రోగమూ ఈగలూ తప్ప మరేమీ తెలియనివాళ్లా ఉన్నాడు. చూడ్డానికి చాలా బీభత్సంగా ఉన్నాడు. కాలీకాలని శవాలు అలానే ఉంటాయి.

సాయంకాలం ఆరుగంటలకి అయిదేళ్ల కొడుకును వెంటబెట్టుకొని యింటికి వచ్చేస్తున్నాడు అన్నారావు. ఆదివారం కూడా అతనికి తెరిపిలేదు. ఇంట్లో బోలెడుండి పోయింది ఆఫీసుపని. పదిహేనేళ్ళ ఆఫీసు జీవితం చూస్తే, అది నలుగురాడపిల్లలు, లేదు లేదనుకొని ఆశంతా వదులుకున్నాక ఆఖర్న ఓ కొడుకు. అన్నారావుని చూస్తే అతనికి ఆశలన్నీ ఉడిగిపోయినట్టుగా స్పష్టంగా తెలుస్తుంది. వచ్చిన చిక్కేమిటంటే ఆ సంగతి అతనికి మాత్రం ఇంకా తెలీదు. అందుచేతనే, చీటికీ మాటికీ చిరాకు పడిపోతూ ఉంటాడు.

సిగరెట్టుపెట్టె కొనుక్కుందికి, అన్నారావు కిల్లీకొట్టుదగ్గరికి వెళ్తే, అతన్ని అక్కడ కూడా వెంటబడ్డాడు అతగాడు.

"నాయనగారూ! మూడు దినాలనించీ కూడు మొహం చూళ్ళేదు. ధర్మం చెయ్యండి నాయనగారూ!" అంటూ అంతదూరంలో నిల్చున్నాడు. అతగాడు ముక్కుతో మాట్లాడటం లేదు. ముక్కులోంచి మాట్లాడుతున్నాడు. మనిషికంటే మాట ఎక్కువ భయంకరంగా ఉంది. అదేదో లిపిలేని భాషలా ఉంది. లోపల్నించి పాములు బుసలుకొట్టి పలుకుతూన్నట్టుగా ఉంది.

"ధర్మం చెయ్యండి నాయనగారూ!"

"చెయ్యను" అని టూకీగా అన్నాడు అన్నారావు.




"మూడ్రోజుల్నించీ తిండిలేదు నాయన గారూ! ఆకలవుతోంది, ఒక్కణా...."

"ఇవ్వను"

"మాడిపోతున్నాను నాయనా."

"పోరా బాబూ!"

అన్నారావు అసహ్యించుకొని కోపగించాడు.

కిల్లీ దుకాణంలో గడియారం ఆరయిందని అయిదు నిముషాలు ఆలస్యంగా చెప్తోంది. సూర్యుడు అస్తమించేస్తున్నాడర్రో అని పడమటి దిక్కు ఎర్రగా ఏడుస్తూ చెప్తోంది. ఎండ తగ్గినా, వేసవికాలం సుమా ఇది అని వేడి అందర్నీ కుమిల్చేస్తోంది. వీధిలో శరవేగంతో వెళ్ళిపోయే కార్లు "కారులు గలవాడె రాజు గదరా సుమతీ" అని పొగలు కక్కి దుమ్మెత్తి చెప్తున్నాయి. ముష్టివాళ్లంతటా "రోగమో రోగమో, ఆకలో, ఆకలో" అని కేకలేసి చెప్తున్నారు. సినీమావాళ్లు ఆడబొమ్మల బొమ్మ గుండెలు చూపించి సినిమాకి రమ్మని ఊరించి చెప్తున్నారు. అన్నారావు కొడుకు ముష్టివాడివైపు చూస్తూ "రా నాన్నా ఇంటికి పోదాం" అని చెప్పలేక చూస్తున్నాడు.

"ఒక్క కాణీ, నాయనగారూ!"

"నీకో దండంరా బాబూ! ఫో ఇక్కణ్నుంచి."

అన్నారావు కొడుక్కి ఈగల మనిషిని చూస్తే భయం వేసినట్టుంది. అయినా ఆ ముష్టివాణ్ణి చూడ్డం మాత్రం మాన్లేదు. అంతలో ఈగలతో ఆ మనిషి "చిన్న తండ్రీ! ఒక్క నయాపైస" అంటూ కుర్రాడివైపు ముందుకి కొంచెం జోగాడు.

నల్లవాళ్ళని తెల్లవాడొకంతట వదలనట్టు, దారిద్ర్యాన్ని ఈగలొదలవు.

అన్నారావు కొడుకు అన్నారావుకి ముద్దు. పిల్లడిమీద ఈగపిల్లనయినా వాలనివ్వడతను. అటువంటిది, అన్ని ఈగలు అంత దగ్గరా వచ్చేసరికి అతనికి గాభరా వేసింది. కోపం ఎక్కువయింది.

"పోరా వెధవా! పోతావా పోవా? పోకపోతే తంతాను. ఫో ముందిక్కణ్ణించి" అని వాణ్ని తిట్టి "అయినా నిన్ను అనేం లాభం. కాలం అలా ఉంది. ప్రభుత్వం అలా ఉంది. పరిపాలనలా ఉంది" అని కేకలు వేసుకుని, అప్పుడు దుకాణం వాడివేపు తిరిగాడు అన్నారావు.

"ఓయ్, ఏది నా బర్కిలీ పెట్టె? ఇక్కణ్నిలబడితే ముష్టివాల్లు భక్షించేస్తారు. తే, వేగరం తే! చిల్లరేదీ? రూపాయిచ్చాను. మంచివాడివే! అవునవును, జ్ఞాపకాలుండవు. నాకు తెలుసు. కాలం అలానే ఉంది మరి" అంటూ సిగరెట్టు పెట్టె, చిల్లరా తీసుకొని డబ్బులు లెక్కపెట్టుకుంటూ నడిచాడు అన్నారావు.

కిల్లీ కొట్టు దగ్గర 'రుచికరమైన ఈ మార్కు సిగరెట్టునే వాడుడు. మిక్కిలి ఉల్లాసమునిచ్చును' అని చెప్పే బోర్డొకటుంది. దానికి పదిగజాల దూరంలో మరో బోర్డుంది. 'ఈ మార్కుగల అసలైన అమృతమునే సేవించుడు. ఆకలి కలిగించి బలము నిచ్చును' అని నొక్కి వక్కాణిస్తోంది. అన్నారావూ అతని కొడుకూ ఓ బోర్డునుంచి ఓ బోర్డుదాకా నడిచారు.

అప్పటికి చేతిలోని చిల్లరడబ్బుల చిల్లు చెల్లులు సరిచూసుకోడం పూర్తిచేసిన అన్నారావు, పిల్లడు బితుకూ బితుకూ వెనక్కి చూస్తూ నడవడం గమనించి, "ఏం రాజుబాబూ! ఆ వెధవకాని ఇంకా వస్తున్నాడేవిటి?" అంటూ వెనక్కి తిరిగాడు.

వెనకనే ఉంది సగం కాలిన శవం.

"నాయనగారూ! బాబూ! కన్నతండ్రీ! ఒక్కపైస."

వాణ్ని చూడగానే, కొడుకుని దగ్గరగా తీసికొని "పోరా రాస్కెల్ ఛో! దమ్మిడీ ఇవ్వను ఛో" అని ముష్టివాణ్ని తిట్టి వాడిమీద కేకలు వేసి "ఇలాటి రాస్కెల్స్‌ని షూట్ చెయ్యాలి. చెయ్యకపోతే లాభంలేదు" అని కేకలువేస్తూ తొందరగా ముందుకి నడిచాడు అన్నారావు. ముష్టివాళ్ల మధ్య బతకడమే బ్రహ్మాండంగా ఉంది.

రాజుబాబు మరొకసారి వెనక్కి తిరిగాడు. ఈగల మనిషిని ఆపాదమస్తకం మళ్ళీ ఓసారి చూశాడు. కుర్రవాడి కళ్ళూ అవతలమనిషి ఒంటికన్నూ క్షణంలో సగంపాటు కలిశాయి. చూపు కలియగానే అతగాడు చెయ్యి ముందుకి జాచి, ప్రార్థనాపూర్వకంగా కొంచెం బరువుగా ముందుకి వంగాడు. దాంతో "పదపద" అంటూ జనప్రవాహంలోకి ముందుకి తీసుకుపోయాడు రాజుబాబుని అన్నారావు. పిల్లవాడు మరోసారి వెనక్కి తిరిగాడు. ఈగలమనిషి అక్కడే అలాగే ప్రార్థనాపూర్వకంగా నిల్చున్నట్టనిపించింది. మళ్ళీ చూస్తే, లేడు.

అన్నారావు తన స్వంత గొడవల గురించి ఆలోచిస్తున్నాడు. చిరాకులు ఎక్కువవడంతో ఆలోచనలు కూడా ఎక్కువయ్యాయి. ప్రపంచంలో అతనికి మానవులకంటే మృగాలే ఎక్కువ కనిపిస్తున్నాయి. దృష్టిదోషమా? కాదు, పరిస్థితే అసలలా ఉంది. ఎవరికి వాళ్ళు దోచుకోడం, ఎవరి వాళ్ళకి వాళ్ళు దోచిపెట్టడం, అవతల వాణ్ణి నిలువునా గోతులో తోసేయడం! ఇలా, లోకంలో అంతమందీ కూడా స్వార్థపరులు, సెల్ఫిష్ రాస్కెల్స్! ఆ ఇంగ్లీషు ముక్కల్ని గట్టిగా పైకే అన్నాడు అన్నారావు. తండ్రిమాట విని కొడుకు తలెత్తి చూసి "ఏమిటి నాన్నా?" అనడిగాడు.

"ఏంలేదురా బాబూ! నడునడు" అన్నాడన్నారావు. ఉద్యోగంలో ప్రమోషన్‌కి పాసవ్వవలసిన టెస్టులన్నీ అన్నారావు నాలుగేళ్ళయి పాసయి కూర్చున్నాడు. కాని, అలా కూర్చొనే ఉన్నాడు. పైకి వెళ్ళలేదు. వెళ్ళడానికి అవకాశం దొరకలేదు. 'సరి, సరి, మర్లాభం లేదు. మంచంమీంచి దించీవలసిందే అనుకొనే సమయంలో అనుకోకుండా మంచి ఛాన్సొచ్చింది. ఇంకా బతికే ఉన్నానంటూ అన్నారావు లేచి కూర్చున్నాడు. కాని, ఎక్కడో ఉన్న పెద్ద సెక్రటరీగారి కొకరికి ఇక్కడ ఆఫీసులో దూరపు బంధువున్నాడు. అతను చాలామందికి ముద్దులకొడుకు కూడాను. అతడు అంతలో తెరవెనక్కి వెళ్ళి మీటనొక్కడం, తీగెలు లాగడం, ఇటువంటి చేయకూడని పనులన్నీ అతి సునాయాసంగానూ, బహు చమత్కారంగానూ చేశాడు. ఆఫీసర్లు ఎత్తుకు ముద్దులాడి వాడికి ప్రమోషనిచ్చారు. సరిసరి పరిస్థితిలో అన్నారావు యథాప్రకారం కొట్టుమిట్టాడుతున్నాడు.

ఒకరి కూట్లో రాయి వెయ్యడానికి అందరూ తయారే. మరొకరి అన్నపుగిన్నె తన్నుకుపోవడానికి అందరు సిద్ధమే. పై వాణ్ణి తొక్కిపారేయడమే. వాడేదుస్తే ఏడవడం, లేకపోతే చావడం. వాళ్లవాడు కాబట్టి వాడికి ప్రమోషను! వాడూ మనిషే, తనూ మనిషే, ఏం? వాళ్ళాటి ఆకలికాదూ తనాకలి? కాని ఎవడాకలి ఎవడిక్కావాలీ రోజుల్లో!

అన్నారావు మనసులాగే వీధంతా కంగాళీగా ఉంది. దుమ్ముగా దొమ్మిగా ముష్టిగా ఉంది. అసహ్యంగా ఉంది. కలకల్లాడుతున్న పెద్ద పెద్ద మేడలు కూడా అసహ్యంగా సిగ్గువిడిచి నిల్చున్న ఆడవాళ్ళలా ఉన్నాయి. అన్నారావు కంటికి ముష్టివాళ్లు విపరీతంగా అదేపనిగా కనిపిస్తున్నారు. ఓ కార్లోంచి ఎవరోకాని గోల్డుఫ్లేక్ సిగరెట్టు పెట్టె ఖాళీది పైకి విసిరేశారు. దానికోసం పదిమంది ముష్టి పిల్లలు, అదే మంచి బంగారంలా, దానిమీద వాలి దానికోసం తన్నుకు చస్తున్నారు. వాళ్ళని చూసి చీదరించుకొని నాలుగడుగులు తొందరగా ముందుకి వేశాడు అన్నారావు.

అంతలో అన్నారావుని ఎవరో ఆపారు. ఎవరని చూస్తే, ఆపినది రాజుబాబు. "ఏరా బాబు?" అనడిగేడు అన్నారావు.

రాజుబాబు కళ్లు ఆడకళ్లూ, మనసు బేల మనసూను. పిల్లడికి రెండో యేటిదాకా గిరజాలుండేవి. ఆడపిల్లలా అందంగా చక్కగా ఉండేవాడు. చూసినవాళ్లు ముద్దులాడకుండా విడిచిపెట్టేవారు కారు. వాళ్ళంతా కూడా కుర్రాడికి దిష్టిపెట్టేస్తారేమోననే అన్నారావు భయం. ఆఖరికి, తక్కువ తిండివల్లా, ఎక్కువ దోమలవల్లా ("దిష్టమ్మా దిష్టి; దిష్టివల్ల") రాజుబాబు జబ్బు పడిపోయాడు. రెండేళ్లపాటు – టాబ్లెట్సు, కాప్సూల్సు, ఇంజెక్షన్లు, వైటమిన్సు, ప్రోటీన్సు, టానిక్కు, హాస్పిటల్సు, డాక్టర్సు – చాలా డబ్బు ఖర్చయింది అన్నారావుకి. ఖర్చయితేనేం? బాబు బుగ్గలు మళ్ళీ సొట్టలు పడుతున్నాయి.

"ఏరా?" అనడిగాడన్నారావు.

"ఆకలేస్తోంది" అన్నాడు రాజు.

"ఇప్పుడాకలేమిట్రా?" అని ఆశ్చర్యపడ్డాడు అన్నారావు.

"ఆకలేస్తోంది. ఇప్పుడే" అన్నాడు రాజు.

కొడుక్కి ఆకలేసిందని ఆశ్చర్యపడ్డందుకు తనని తను నిందించుకున్నాడు తండ్రి. ఆకలి ఎప్పుడైనా వేస్తుంది. ఎవరికైనా – ఎక్కడైనా వేస్తుంది. నాలుగు రోడ్ల జంక్షన్ దగ్గర ఉడిపీ, లక్ష్మీ బ్రాహ్మణ భోజన కాఫీ ఫలహారశాల దగ్గరకొచ్చేసరికి రాజు బాబుకి ఆకలేసినట్టుంది.

"దా, రా బాబూ! ఇడ్లీ తిందువుగాని రా!" అన్నాడు అన్నారావు.

రాజుబాబు తండ్రి చేతిని విడిపించుకొని ఒకడుగు వెనక్కివేసి నిల్చున్నాడు. "మావాడి నోరు చక్కగా 'గ'లా ఉంటుంది" అంటుంది వాళ్లమ్మ. బుగ్గలు పూరించి చిన్న విల్లులాటి నోరు ఇంకా చిన్నది చేసి,

"నాకు ఇడ్లీ ఒద్దు" అన్నాడు రాజుబాబు.

"మరేం కావాలి? దోసె తింటావా?"

"తిన్ను."

"పోనీ, కోవాబిళ్ళ తిందువుగాని, రా."

"నా క్కోవాబిళ్ళొద్దు."

"మరేంకావాలి? చెప్పు!"

"ఆకలేస్తోంది. నాకు అణా ఇయ్యి" అనడిగాడు రాజుబాబు. ఆ అడిగినప్పుడు, "ఇస్తాడా ఇవ్వడా నాన్న?" అనే ఆవేదన కుర్రవాడి ముఖంలో జాయగా కనిపిస్తోంది.

"అణా ఎందుకూ?" అని అడిగిన అన్నారావు, కొడుకు ముఖం చూసి, వెంటనే జేబులోంచి డబ్బులు తీసి, "పోనీ, ఇదం. ఇదుగో అణా! ఏం చేస్తావ్? అరటిపళ్ళు కొనుక్కొంటావా?" అంటూ అణాకాసు ఇచ్చాడు.

అణా పుచ్చుకొని, రాజుబాబు అలా నిల్చుండిపోయాడు. అణాకాసుని ఎడంచేత్తో పట్టుకుని, కుడిచేతి వేళ్ళతో దాని రాస్తూ తుడుస్తూ నిల్చున్నాడు. ఏం చెయ్యాలో తోచనట్టుగా ఉంది కుర్రవాడికి.

"ఏరా బాబూ? ఏం చేద్దాం? పోనీ, పిప్పరమెంట్లు, కొనుక్కుంటావా?" అని అడిగాడు అన్నారావు.

పెద్దవాళ్ళ మేడలు చూడ్డానికి ఆఖర్న మరొక్కసారి వెలిగాడు సూర్యుడు. రోడ్డుమీద రాజుబాబు నీడ పొడవుగా పడింది. ఆ నీడ మెల్లిగా ముందుకి నడిచింది. అన్నారావు కూడా నీడ వెనక నడిచి కొడుకుని కలుసుకున్నాడు.

"ఏరా బాబూ? ఏం కావాలంటావ్?"

"నా కణా ఒద్దు. ఇంద, తీసుకో" అంటూ తండ్రివేపు చెయ్యి జాచాడు, ఆ తండ్రివేపు ముఖం తిప్పకుండా.

అణా తీసుకొంటూ, "మరి, ఆకలేస్తోందన్నావు?" అన్నాడు అన్నారావు.

రాజుబాబు మాట్లాడలేదు.

"ఏఁవిఁరా బాబూ? నిజంగా ఆకలెయ్యడంలేదుట్రా?" అని ముద్దుగా అడిగాడు అన్నారావు.

రాజుబాబు అయిదడుగులు ఊరుకొని, ఆ తర్వాత "మరి, నువ్వు, ఇందాకా ఎందు కివ్వలేదూ?" అన్నాడు.

"ఇందాట్లా నువ్వడిగావా? ఎప్పుడడిగావురా?" అని కొంచెం ముద్దుగా ప్రశ్నించాడు అన్నారావు.

"ముష్టబ్బి అడిగాడు కదూ!" అన్నాడు రాజు. దాగి వున్న ప్రశ్నకి వెంటనే సమాధానం ఇచ్చేశాడు అన్నారావు.

"వాడు ముష్టివాడూ" అన్నాడు. ముష్టివాళ్ళకి అణాలివ్వకూడదని రూలున్నట్టు.

"మరి వాడికాకలేస్తోందిట!?"

"వెయ్యనీ, ఏం చేస్తాం?"

"మరి, నాకిచ్చావు!"

"పద పద. అణా దాచుకుందువుగాని. ఇంటికెళ్లాక దాచమని అమ్మకిస్తాను" అంటూ సంభాషణ ఆపేయజూశాడు అన్నారావు.

శ్రీరాములుగారికున్నంత మొండితనం ఉన్నట్టుంది రాజుబాబుకి. దాదాపు ఇంటివరకూ వెళ్ళేదాకా ఆకల్నీ అణానీ ముష్టివాణ్ని పట్టుకు విడువకుండా అలా ప్రశ్నలు వేస్తూనే ఉన్నాడు.

అన్నారావుకాఖరికి విసుగేసింది. "నువ్వు నా కొడుకువిరా బాబూ! అందుకూ! అందుకిచ్చాను. మరింక మాటాడక నడు!" అని ఫైనల్‌గా అన్నాడు. అతని చీదరింపు చూసి మరి మాటాడక ఊరుకున్నాడు రాజుబాబు.

ఇంటికి వెళ్ళగానే అన్నారావు భార్య,

"రెండురూపాయలుంటే ఇద్దరూ!" అని అడిగింది.

"చిల్లర కాయితాల్లేవు" అని విసుక్కున్నాడు అన్నారావు.

"పోనీ, వో అయిదుంటే అదే యివ్వండి" అందతని భార్య.

అయిదు రూపాయల కొత్తనోటు జేబులోంచి తీసి దాన్ని మరో కొత్త నోటు అంటుకోలేదని వేళ్లతో రాసి రూఢిచేసుకుని భార్య చేతికిచ్చాడతను.

రాత్రి ఏడున్నర గంటలకి తమ్ముడూ అక్కలూ భోజనాలు చేసేక, ఆడపిల్లలు నలుగురూ డాబామీదికి చాపలూ, దుప్పట్లూ, తలగడలూ పట్టుకు వెళ్ళిపోయారు. రాజుబాబు మాత్రం ఏబిసిడిలు దిద్దుకుంటూ కూర్చున్నాడు. గదిలో బల్లదగ్గర. వాలుకుర్చీలో పక్కనే వున్న అన్నారావు ఆఫీసుకట్టల్లో మునిగిపోయున్నాడు.

ఎనిమిది గంటలు కొట్టేసరికి అన్నారావుకి కడుపులో దేవినట్టయింది. గుండెల్లో చిరుమంట లేసింది. కళ్లముందున్న అకౌంటు కాయితాలు చూపుకి దూరమయ్యాయి. కాయితాలని పట్టుకున్న చేతులు వజవజ వణికాయి. కాయితాలు కిందని పడేసి, గప్పున కుర్చీలోంచి లేచాడన్నారావు. భార్య, వారపత్రిక చదువుతోంది.

"ఆకలేస్తోందే పూర్ణా! అన్నం వడ్డించు వేగిరం! వేగిర వేగిర!" అంటూ తొందరపెట్టాడు, అన్నారావు.

"మీదే ఆలస్యం, పదండి" అంటూ పూర్ణమ్మ, పత్రిక పడేసి, లేచి వంటింటివేపు నడిచింది. వంటింట్లోకి, ఆమెని దాటి ఆమెకంటే ముందు వెళ్లాడు అన్నారావు. వాళ్ళనలా చూస్తూ కూర్చున్నాడు రాజుబాబు.

భోజనం చేశాక, అన్నారావు మళ్ళీ కాయితాల్లో కలిసిపోయాడు. తల్లీ, పిల్లలూ డాబా మీద పడుకున్నారు. అక్కడ రాజుబాబు, "అమ్మా! నాన్న నీకు కొడుకా?" అని తల్లిని అడగడం, "అవేం మాటల్రా నాయనా! కళ్ళు మూసుకు పడుకో" అని పూర్ణమ్మ కొడుకుని ముద్దుగా మందలించడం అన్నారావుకి తెలియలేదు. రాత్రి పదిగంటలకి అతను డాబామీదికి వెళ్ళేసరికి అతని భార్యాపిల్లలూ ఆ వెన్నెల్లో వరుసగా 'క్యూ'లోలా పడుకునున్నారు.

అన్నారావుండే మురికి యిల్లు చాలా ఇరుకుల్లో ఉంది. ఆ యింటికి అటుపక్కా యిటుపక్కా రెండు మురికి సందులు పాముల్లా వంకలు తిరిగున్నాయి. దగ్గర్లో ఉన్న ఇళ్లన్నీ పాడుపడి పోతూన్నవి, కూలిపోతూన్నవీను. డాబా ఎక్కి చుట్టూచూస్తే దూరంలో కొత్త మేడలూ, దగ్గర్లో పాత పెరళ్ళలోని పొడవాటి కొబ్బరిచెట్లూ, వేపచెట్లవి నల్లని కొమ్మలూ, ఇటికలే మిగిలిన గోడలూ, ఊచలే లేని కిటికీలు కనిపిస్తాయి.

అన్నారావు, డాబామీద పిట్టగోడని ఆనుకొని, సిగరెట్టు కాలుస్తూ, నిల్చొని పిల్లల వైపొకసారి చూశాడు. రాజుబాబు నిద్రలో కొంచెం కదిలి ఏవో కలవరించాడు. అణా అన్నాడా? ఆకలన్నాడా? ఏదో అనడం మాత్రం అన్నాడు. దగ్గరగా వెళ్ళి చూసొచ్చాడు అన్నారావు. వెన్నెల జాలులో కుర్రవాడి లేతముఖం జాలిగా ఉంది. అన్నారావుకి భయం వేసింది. ముష్టివాణ్ని చూసి పిల్లడు జడుసుకొన్నట్టున్నాడు.

ఏమో! రోజులిలాగే ఉంటే అందరం ముష్టి వెధవలమైపోయేట్టున్నాం!

అన్నారావుకి భయంతోపాటు ఏదో అసంతృప్తి కూడా కలిగింది. పిల్లడి ప్రశ్నలన్నీ అతనికి గుర్తుకొచ్చాయి. తన ప్రమోషన్ విషయమై అర్జీ పెట్టుకొంటే అధికారులు జవాబివ్వకపోవడం, రాజుబాబు వేసిన ప్రశ్నలకి తను సరైన జవాబివ్వలేకపోవడం, అన్నీ అతణ్ని ఆలోచనలో ముంచాయి. సిగరెట్టు

"కథను సమాజానికి సర్జరీ చేసే సర్జన్ చేతి కత్తిలా వాడిన రావిశాస్త్రి చేతిలో గురజాడ అందించిన వ్యావహారిక భాష మరింత జీవం పోసుకుంది." - వాకాటి పాండురంగారావు

విసిరేసి పిట్టగోడని రెండు చేతులూ ఆన్చుకొని అతను నిల్చోడం మాత్రం నిశ్చలంగా నిల్చొనున్నాడు.

ఆ పాత కొంపల్లో ఎక్కడో కాని ఓ చిన్న పిల్లడితో, పిల్లడో "వ్వా! ఉవ్వా!" అనే ఏడుపు అదొక పక్షికేకలా వినిపిస్తోంది. ఆకలికా? అనుకున్నాడన్నారావు. తల్లో ఎవరోపాడే జోలపాట ముక్కముక్కలుగా తెగిపోయి దీనంగా అస్పష్టంగా కొంచెం కొంచెంగా చెవిని పడుతోంది. ఓ ఫర్లాంగు దూరంలో, ఓ పాడుబడ్డ పాత మేడమీది కిటికీ, కురుపు వేసిన కంటిలా, ఎర్రగా కనిపిస్తోంది. గదిలోపల హరికేన్ లాంతరు వెలుగులో, ఆరిపోయిన మనిషెవడో పడుకోలేక కాబోలు పచార్లు చేస్తున్నాడు. గుడ్డి వెలుక్కి అడ్డుగా అతను పచారు చెయ్యడంతో, ఆ కన్నులాటి కిటికీ రెప్ప వేసుకొని తెరుస్తున్నట్టుగా ఉంది. పక్కన సందులో "వెన్నెలా! కన్నతల్లీ! పేదవాడి దీపమా!" అనుకొంటూ ముసలాడెవరో టక్కూ టక్కూ వెళ్ళాడు. అతని కర్రకాళ్ళు చప్పుడు దూరమయింది, చిన్నదయింది, చివరికి వినిపించకుండా పోయింది. అంతలో రెండోపక్క సందులో దడదడ చప్పుడైంది. చెత్తడబ్బాలోని కాయితాలకోసమూ, ఎంగిలాకుల కోసమూ అక్కడ నాలుగావులు పులుల్లా పోట్లాడుకుంటున్నాయి. వాట్లో రెండావులు దెబ్బలాళ్ళేక తొందరగా పారిపోయి, అక్కణ్ణించి చెత్తడబ్బా వైపు ఆశగా చూస్తూ వెర్రిముండల్లా నిల్చున్నాయి. సందుల్లోంచి గాలంతా, కుళ్ళు కాలవల మురికి వాసనతో మత్తెక్కిపోయి మతిచెడిపోయి సొమ్మసిల్లిపోయి మెదలకుండా పడుంది.

వర్షం కరిగి సన్నని తుంపరై, చల్లని ఆవిరైనట్టుగా వెన్నెల మాత్రం అంతటా జాలికి జారిపడుతోంది. పాతమేడలు, మొండిగోడలు, వేపకొమ్మలు, కొబ్బరాకులు, సందులోని రాళ్ళు, కాలవల్లోని మురికినీళ్ళు, అన్నింటినీ ఆ వెన్నెల తాకుతోంది. రానక్కర్లేదని రావద్దురావద్దని అడ్డుపెట్టుకొంటే తప్ప ఆ వెన్నెల వెళ్ళని చోటంటూ లేదు. అక్కరలేదని చెప్పి దాగుంటేనూ, దాచేస్తేనూ తప్ప ఆ వెన్నెల జాలు పడని ప్రాణిలేదు. పదార్థం లేదు.

తలెత్తి చంద్రుణ్నోసారి చూసిన అన్నారావు. "తండ్రీ! చంద్రశేఖరా! సర్వేశ్వరా!" అనుకున్నాడు. ఇలా అనుకున్నాడు, అలా అదిరిపడ్డాడు. ఆ రాత్రి సమయంలో ఏ తెరవని గుమ్మం దగ్గరో ఎక్కడో నిల్చొని ఏ ముష్టివాడో ఎవరో వేసిన, "అమ్మా! అన్నపూర్ణేశ్వరీ!" అనే పెనుకేక అతని చెవిని బద్దలు చేసింది. ఆ పిలుపులోని బలం, ఆ పిలుపులోని నైరాశ్యం అతణ్ణి భయకంపితుణ్ని చేశాయి. ఊరుదాటి ఊళ్ళన్నీ దాటి పాలకుళ్ళీ, పాతకుళ్ళీ అందర్నీ దాటి అడవులు, కొండలెడారులన్నింటినీ దాటి ఆవిడ ఎక్కడుంటే అక్కడికి దూరమైనా వెళ్ళి ఆ తల్లి చెవిని దూసుకుపోవాలా కేక. అదంతటి కేక!

భయంతో ఏవేవో ఆలోచిస్తూ పడుకున్నాడు అన్నారావు.

ఆ రాత్రి రెండు జాముల వేళప్పుడు రాజుబాబు నిద్రలేచి, పూర్ణమ్మని "అమ్మా! అమ్మా! ఆకలేస్తోందే!" అన్నాడు. ఆవిడ కళ్ళు నులుపుకొని చటుక్కున లేచి కూర్చుని "కిందకెళ్ళి పాలు - పాల్లేవు - కాస్త మజ్జిగ తెస్తానుండరా నాయనా!" అంది.

రాజుబాబు ఒక్క క్షణం ఊరుకొని, "నాకొద్దు నాకొద్దు!" అంటూ మళ్ళీ పడుకున్నాడు.

**తొలిప్రచురణ : 'భారతి' ఆగస్టు 1961**
**పుస్తకరూపం : ఆరుచిత్రాలు**
**సంకలనం : నవకథామాల 1962**
**రచనాసాగరం - 2007** ✦

కవిత

# శీలా వీర్రాజు స్మృతిలో..

– డా॥ ఎన్. గోపి

వీర్రాజుగారూ!
మీరికలేరంటే
రాత్రంతా నిద్ర పట్టలేదు
మీరు లేకుండానే తెల్లారటం
ఒక నల్లని వాస్తవం.

సాహిత్యంలో
ఎన్నో మైలురాళ్లను నాటారు మీరు
మీ మంచితనంతో
అసంఖ్యాక హృదయాలను మీటారు
మిమ్మల్ని కలిసిస్తే
మనిషిని కలిసినట్టుండేది

తెలంగాణా పల్లెల్లోని
కవికిశోరాలు దశాబ్దాలపాటు
మీ ముఖచిత్రాల కోసం
హైదరాబాద్‌కు క్యూ కట్టేవారు

ఎవరికీలొంగని
ఇనుప జంతువు హైదరాబాద్
అది మీ ప్రేమ ముందు మాత్రం
వినమ్ర సుందరంగా వొదిగిపొయ్యేది
మీరు ఇండ్లు మారినప్పుడల్లా
మా నడకదారులు మారేవి
అవి బస్టాండ్‌లకు
సుదూరంగా ఉండటం మీ స్టైల్.

మీ ఇంట్లోకి అడుగుపెట్టగానే
మినియేచర్ ఆర్ట్ గ్యాలరీలోకి
ప్రవేశించినట్టుండేది.
గుమ్మాలకు కట్టిన
కళాత్మక తోరణాలు
మీ చిరునవ్వుల్లా వేలాడుతుండేవి

కవిచిత్రకారుడనేది ఒక పార్శ్వం
సాదాసీదా వ్యక్తిత్వం మీది
గోదావరిని దేశమంతా అద్దిన
ఆర్ద్రమూర్తి మీరు
యాభైయేండ్ల మన స్నేహితం
నేటినుంచి ఒక అఖాతం

ఇవాళ ఒక మహానుభావుని
మహాభి నిష్క్రమణం జరిగింది
అంతటా ఖాళీలు ఏర్పడుతూ
కాలం ఒంటరిదయ్యింది. ✦



# ఆస్తి దురాక్రమణను తేటతెల్లం చేసిన రావిశాస్త్రి 'ఇల్లు' నవల

– ఐ.టి.ఆర్.వి. శివాజీరావు

**రావిశాస్త్రిగారు** చివరగా రాసిన నవల 'ఇల్లు'. ఈ నవలను 1992లో మొదలుపెట్టి 93లో పూర్తి చేశారాయన. 'స్వాతి' వారపత్రికలో సీరియల్‌గా వచ్చింది. నవల పుస్తకరూపం తీసుకోక ముందే ఆయన మరణించారు.

నవల రచనాకాలం 1992–93, అయితే నవలలోని జరిగిన కథాకాలం 1969 ('ఇల్లు' నవలా ప్రవేశంలో రావిశాస్త్రిగారే ఈ విషయం ప్రస్తావించారు). ఈ రెండు కాలాలు రచయిత మీద రచయిత రాసిన కథ మీద జమిలిగా ప్రభావం చూపించకపోవు. ఈ రెండు కాలాలు కొంత విశిష్టత గలిగినవనే చెప్పవచ్చు. కథాకాలం 1969 శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాటం ముమ్మరంగా సాగుతున్న దశ. పైగా 1969 నాటికి ఉద్యమం ప్రజాపంథాను వదిలి చారుమజుందార్ వర్గశత్రు నిర్మూలనా పంథాలోకి మళ్లుతున్న సమయం కూడా.

1992–93 కాలపు ప్రాముఖ్యత ఏమిటి?! పీవీ నరసింహారావు భారతదేశ ప్రధాన మంత్రిగా వున్నాడు. అప్పటికి దేశంలో నెలకొని వున్న ఆర్థిక సంక్షోభం నుండి దేశాన్ని గట్టెక్కించాలంటే ఎల్పీజీ (లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్) విధానాలను దేశంలోకి ఆహ్వానించక తప్పదని WTO (డబ్ల్యూటీఓ) ఒప్పందాల మీద సంతకాలు చేసి ఎన్నాళ్ళో కాలేదు. ఆ విధంగా ప్రపంచీకరణ గాలులు దేశంలో వీస్తున్న సమయం. ఒక విధంగా చెప్పాలంటే ఆయన నుంచి ఇటువంటి నవల రావడానికి తగిన కాలమాన పరిస్థితులు ఆ నాటి దేశ రాజకీయార్థిక యవనికపై నెలకొని వున్నాయి.

అయితే ప్రపంచీకరణ 1990ల తర్వాతే మొదలయిందని చెప్పడం అర్ధ సత్యమే అవుతుంది. తరిమెల నాగిరెడ్డి 'రాసిన తాకట్టులో భారతదేశం' పుస్తకంలో చెప్పినదాని ప్రకారం దీని మూలాలు వలస పాలన కాలంలోనే మొదలయ్యాయని మనకు అర్థం అవుతుంది. అయితే దాని ప్రతిఫలనాల తీవ్రత 1990ల తర్వాత తీవ్రరూపం ధరించి తదుపరి కాలంలో లక్షలాది మంది రైతులు, గ్రామీణ వృత్తులు చేసుకునే కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు. గ్రామీణ ఆర్థికవ్యవస్థ ఛిన్నాభిన్నం అయిన కాలం (అంతకుముందు కంటే కూడా) ఇదే!

మన స్వాతంత్ర్యంలోనే వున్న ఒక దళారీస్వభావం, మనుషుల్లో బ్రోకర్ స్వభావాన్ని ఎలా పెంచి పోషిస్తుందో, ఆ బ్రోకర్లు రాజ్యం అందించే అవకాశాలతో తెగ బలిసి పెద్దలుగా చెలామణీ అయి ఇంకా దోపిడీ పీడనలకు ఎలా తెగబడతారో, కష్టజీవుల్ని, అమాయక జనాల్ని ఎలా దోచుకుంటారో 'ఇల్లు' నవల సోదాహరణంగా చూపిస్తుంది.

ఇక కథ విషయానికి వస్తే చిట్టెమ్మ ఉరఫ్ సుందరమ్మ అనబడే విధవరాలు నాలుగిళ్ళ లోగిలి అయిన తన సొంత ఇంట్లో ఒక పోర్షన్లో వుంటుంది. ఇక మిగిలిన భాగాలలో అనంతం అనే హాస్పిటల్ ఉద్యోగి తన భార్య ఇద్దరు పిల్లలు, ముసలి తండ్రితో అద్దెకు వుంటాడు. మరొక పోర్షన్లో చిట్టెమ్మ ఆడపడుచు కాంతమ్మ తన కొడుకు సూర్యప్రకాశంతో వుంటుంది. కాంతమ్మ పెద్ద కొడుకు ఉదయ భాస్కర్ నక్సలైట్లలో కలిసిపోతాడు.

ఇంటి పన్ను పెరిగిందని చిట్టెమ్మ తన వార్డ్ కౌన్సిలర్ అయిన సోమయాజుల వద్దకు వెళుతుంది. చిట్టెమ్మ ఒంటరి స్త్రీ అనే విషయాన్ని గమనించి ఆమెను లోబరుచుకొని ఆమెకు ఆధారంగా వున్న ఇంటిని కాజెయ్యాలనుకుంటాడు సోమయాజులు. అందుకు ఈ పరిచయాన్ని వాడుకొని ఆమె ఇంటిలోకి ప్రవేశిస్తాడు.

అలా ప్రవేశించిన సోమయాజులు ఆ ఇంటి ఆనుపానులు గమనించుకుంటాడు. తన ప్రణాళికను అమలు చేయడానికి తగిన వ్యూహ, ప్రతివ్యూహాలు రచించడం ప్రారంభిస్తాడు.

మొదటగా అతని కళ్ళు అద్దెకుంటున్న అనంతం మీద పడతాయి. అతను సంవత్సరాల తరబడి నెలకు 60 రూపాయల అద్దె మాత్రమే చెల్లిస్తున్నాడని, అద్దె పెంచేందుకు అతని మీద దావా వెయ్యమని చిట్టెమ్మను ఒప్పించి అందుకు జరగాల్సిన తతంగం అంటే వకీలు దగ్గరకు వెళ్ళడం వంటివన్నీ తను నడిపిస్తాడు. ఆ క్రమంలో చదువురాని చిట్టెమ్మతో దావా వెయ్యడానికి అవసరం అయిన కాగితాల మీదా మరియు ఆవిడకి అవసరంలేని, సోమయాజులకి అత్యవసరమైన (ఆవిడని సర్వవిధాలా భ్రష్టురాలిని గావించేందుకు) పేపర్ల మీద అనగా ఇల్లు తనకు పురోణీ రాసినట్టుగా వున్న స్టాంప్ పేపర్ల మీద సంతకాలు పెట్టించుకుంటాడు.

సోమయాజులని పూర్తిగా నమ్మేసిన అమాయకురాలైన చిట్టెమ్మ అతను పెట్టమన్నచోటల్లా సంతకాలు పెట్టేస్తుంది. తన ఆస్తినంతా స్వయంగా పువ్వుల్లో పెట్టి సోమయాజులు చేతిలో పెట్టేస్తుంది.

ఈ లోగా అనంతం వైపు వాదిస్తున్న లాయర్ నాయుడుగారి ప్లీడర్ గుమస్తాని సోమయాజులు లంచమిచ్చి లొంగదీసుకుంటాడు. సోమయాజులు గడ్డి కరిచిన ఆ ప్లీడరు గుమస్తా, నాయుడుగారు పూరెళ్ళిన సమయంలో అనంతం తరుపున వాయిదా కోరకుండా చేస్తాడు. దానితో చిట్టెమ్మకి అనుకూలంగా కేసు డిక్రీ అయిపోతుంది. ఈ గొడవ చిట్టెమ్మ మేనల్లుడు అరుణ ప్రకాశం వచ్చాక సెటిల్ అవుతుంది. అదిగో అప్పుడు సోమయాజులు కంట్లో అరుణ ప్రకాశం పడతాడు.

సోమయాజులకి రైవల్ అయిన గవర్రాజు, సోమయాజులకి పోటీగా మనోహరాన్ని ప్రవేశపెడతాడు. ఇంటిని బేరానికి పెడతారు. ఆ ఇంటి విలువ లక్ష రూపాయలకు దిగొద్దని ప్రైవేటుగా చిట్టెమ్మకి చెబుతాడు సోమయాజులు.

ఈ విషయం తెలిసిన సోమయాజులు ఇటు చిట్టెమ్మకి అటు మనోహరానికీ ఆ ఆస్తికి సంబంధించిన లావాదేవీలు జరపరాదని లాయరు నోటీస్ పంపిస్తాడు.

కోర్టు ద్వారా ఈ గొడవను సెటిల్ చేసుకొనే ఉద్దేశ్యం సోమయాజులుకు లేదు. చిట్టెమ్మ పెద్దమేనల్లుడు ఉదయ భాస్కరం నక్సలైటనే సమాచారం తన మిత్రుడైన డిఎస్పీ చిటికెల వెంకన్నకి సోమయాజులు ఇస్తాడు. అందుకు ప్రతిగా చిట్టెమ్మ ఇంటిని సోమయాజులు ద్వారా సెటిల్ చేసుకోవాలనుకుంటాడు. అంటే ఇప్పటి క్విడ్ ప్రో కో అన్నమాట.

చిటికెల చిట్టిబాబు సోమయాజులు ఇచ్చిన ఇన్ఫర్మేషన్‌తో ఉదయ భాస్కరం టీమ్ ముఖ్యమంత్రిని హత్య చేయటానికి వేసిన పథకాన్ని నిర్వీర్యం చేస్తాడు. ఆ క్రమంలో చిట్టెమ్మను ప్రశ్నించడం కోసం అనధికారిక కస్టడీలోకి చిట్టిబాబు తీసుకుంటాడు. ఆ సమయంలో చిట్టెమ్మ చిట్టిబాబును "అన్నా"అని పిలవడంతో కొంత కరుగుతాడు. చిట్టిబాబు పురోణీలోని లొసుగును బయటపెట్టి సోమయాజులను డిఫెన్స్‌లో పడేస్తాడు. సోమయాజులు అంతటితో విరమించుకుంటాడు అయినా చిట్టిబాబు సోమయాజులుకి మూడవభాగం ఇప్పిస్తానంటాడు. ఆ ఆస్తిలో భాగం చిట్టిబాబుకి కూడా కావాలి మరి.

ఆ విధంగా చిట్టెమ్మ ఇల్లు ముగ్గురి పేరునా రిజిస్ట్రేషన్ అవుతుంది. చిట్టెమ్మకి లక్ష రూపాయల చెక్ అందుతుంది. చిట్టెమ్మ తన యావదాస్తిని అమ్ముకొని అందులో తను కొంత వుంచుకొని మిగిలింది అరుణ ప్రకాశానికి ఇచ్చేసి తను కాశీ వెళ్ళిపోతుంది.

అరుణ ప్రకాశాన్ని, జ్యోతిర్మయిని ఉగ్రవాదులు కిడ్నాప్ చేస్తారు. అరుణ ప్రకాశం తమకు ద్రోహం చేశాడనుకుంటారు. కానీ అసలు విషయం తెలుసుకొని వదిలిపెట్టేస్తారు. అతని అన్న ఉదయ భాస్కరం అరుణ ప్రకాశాన్ని ఏ దారిన వెళ్ళాలో నిర్ణయించుకోమని అతని సహచరులతో "విప్లవం వర్ధిల్లాలి" అని నినాదాలు ఇచ్చుకుంటూ నిష్క్రమిస్తాడు. ఇది టూకీగా కథ!

★ ★ ★ ★ ★

'ఇల్లు' నవలలో 1969 కాలం నాటికీ ఇప్పుడు 2022 నాటికీ హస్తిమశకాంతర భేదం వుంది. రోమ్ దేశం నిర్మాణం వెనుక బానిసల రక్తం ఉందంటారు. ఆధునిక నగరాల నిర్మాణం క్రింద బానిసల రక్తం వుండదు కానీ ఎంతోమంది చిట్టెమ్మల్లాంటివాళ్ళ నలిగిపోయిన జీవితగాథలు వుంటాయి.

2022లో "నగరం (అది ఏ నగరమైనా) ఇంత అందంగా వుందేమిట్రా బాబూ!", అని మూర్ఛనలు పోయేవాళ్ళకి ఎన్ని జీవితాలు ఆ నగర పునాదుల కింద చితికిపోయాయో! రావిశాస్త్రిగారే ఒకచోట రాసినట్టు "వాళ్లంతా ఒకప్పుడు చంద్రకాంత పువ్వుల్లా రాలిపోయి వుంటారు,సబ్బు బుడగల్లా పేలిపోయి వుంటారు".

అలా రాలితే వొచ్చిన సువాసనలే, అలా పేలితే విరిసిన మెరుపులే నేడు మనకి కనబడుతున్న నగర అందాలు.

ఒకానొక సమయంలో రియల్‌ఎస్టేట్ బూమ్ నెమ్మదిగా అందుకుంటున్న తొలి నాళ్లలో, ఇంత బరితెగింపుగా మాఫియాలు తెగబడని రోజుల్లో అప్పుడప్పుడే మధ్యవర్తులు ఈ వ్యవస్థలో పురుడు పోసుకుంటున్న సమయంలో, రాజకీయ నాయకులు కూడా తమ రాజసాన్ని వదిలి, అధికారులు తమ అధికార దర్పాన్ని విడిచి మధ్యవర్తులుగా అవతారం ఎత్తుతున్న సమయంలో వాళ్ళ కంటికి బాగా ఆనిగ్గా కనబడింది ఎవరయ్యా అంటే 'ఆస్తిగలిగిన ఒంటరి ఆడవాళ్ళు!' అలాంటి వాళ్లను నయానో భయానో లొంగదీసుకొని ఆ ఆస్తిని సొంతం చేసుకోవడం, అందుకు పాలనాయంత్రాంగం, న్యాయవ్యవస్థ సహాయాన్ని కూడా పూరాగా పొందడం.

దీనికి కొనసాగింపు రూపమే గిరిజన ప్రాంతాల్లో కొద్దిపాటి ఆస్తి భూమి రూపంలో గలిగిన ఒంటరి గిరిజన స్త్రీలను మంత్రగత్తెల పేరుతో సజీవదహనం చేసి వారి ఆస్తిని ఆయా గ్రామ పెత్తందారులు కలిపేసుకుంటున్న వార్తలు. ఇది ఇటీవలి పరిణామం. ఆస్తిపట్ల గిరిజన ప్రాంతాలలో మారిన దృక్కోణానికి నిదర్శనాలుగా ఈ సంఘటనలను చూడాలి.

ఆ తర్వాత అది తన ఆక్టోపస్ టెంటకిల్స్ మరింతగా సాచి అందిన వాళ్లనల్లా అందుకొని నమిలి మింగేస్తుంది.

ఇప్పుడున్న దోపిడీ సమాజం వ్యక్తిగత ఆస్తులను సంరక్షించే సమాజం. దోపిడీ ప్రయోజనాల కోసం ఎవరి వ్యక్తిగత ఆస్తులను సంరక్షిస్తారో, ఎవరి వ్యక్తిగత ఆస్తులను పెంపొందిస్తారో 'ఇల్లు' నవల చదివితే మనకు స్పష్టంగా బోధపడుతుంది.

అందరూ సమానులే అని చెప్పే పాలనావ్యవస్థ, న్యాయవ్యవస్థ మనకు వున్నాయి. కానీ అందరికన్నా కొందరు ఎక్కువ సమానము, వారి ఆస్తి మాకు కాస్త ఎక్కువ ప్రాముఖ్యము అందుకోసం అనగా వారికి సేవలు చెయ్యడం కోసం మా కాలాన్ని, అధికారాన్ని సర్వవిధాలా వెచ్చిస్తాం అని అవే పాలనావ్యవస్థ, న్యాయవ్యవస్థలు నిరంతరం ఉద్ఘోషిస్తూ ఉంటాయి. అందుకోసం అవి మనోహరం వంటి వాడి ముందు మోకాలి దండా వేసి దండలు కట్టుకొని అతని ఆజ్ఞ కోసం ఎదురుచూస్తూ వుంటాయి.

ఇంతకీ ఆ గోపికా మనోహరం బాగా చదువుకున్నవాడే! మంచి భావాలు కలిగినవాడే!అందుకే చిటికెల చిట్టిబాబు మనోహరం గురించి ఇలా అంటాడొకచోట

"ఈ మనోహరంగాడు అప్పట్లో అందరి డబ్బూ అందరికీ పంచాలి అనేవాడు. ఇపుడు అందరి డబ్బూ కొందరమే పంచుకుందాం రండంటాడు. అప్పటికీ ఇప్పటికీ ఒచ్చిన తేడా అంతే, అదే! ది మోస్ట్ డేంజరస్ బగ్గర్ ఆన్ ద ఫేస్ ఆఫ్ ది ఎర్త్!" అంటాడు.

"చదవని వాడజ్ఞుండగు, చదివిన సదసద్వివేక చతురత కలుగున్" అని.

కానీ గోపికా మనోహరం చదువుకున్నవాడు, ఎంతో కొంత అభ్యుదయ భావాలు వున్నవాడు. కానీ చివరికి దోపిడీదారుడుగా మారి చట్టంలోని, పాలనాంగంలోని లొసుగులను జాగ్రత్తగా ఉపయోగించుకొని తన దోపిడీని యధేచ్ఛగా సాగిస్తాడు.

సోమయాజులు, మనోహరం, చిట్టిబాబుల మధ్య అసాధారణమైన బంధం వుంటుంది. అదేమిటంటే వారు ముగ్గురూ మూడు రంగాలకు ప్రతినిధులు. సోమయాజులు చోటా రాజకీయ నాయకుడిగా రాజకీయరంగ ప్రతినిధి, చిట్టిబాబు పాలనా యంత్రాంగంలో భాగమైన లా అండ్ ఆర్డర్‌కు ప్రతినిధి, ఇక మనోహరం వ్యాపారవర్గ ప్రతినిధి.

ఈ ముగ్గురికీ పంపకంలో పోటీ వున్నప్పటికీ దోపిడీలో ఒకరికొకరు కుమ్మక్కు అవుతారు. ఈ ముగ్గుర్నీ మూడు వ్యవస్థలుగా చూస్తే నవల రచనాకాలం కన్నా ఇప్పటి ప్రపంచీకరణ కాలంలో వాటి మధ్య దోపిడీలో పోటీ, కుమ్మక్కు మరింత నగ్నంగా చూడొచ్చు.

ఈ వ్యవస్థ యొక్క దోపిడీ స్వభావాన్ని అర్థం చేసుకున్న ఉదయ ప్రకాశం "ఇది దొంగల రాజ్యం" అని చెప్పి ప్రభుత్వం మీద పోరాడడానికి అడవుల్లోకి వెళ్ళిపోతాడు. తన తమ్ముడిని,జ్యోతిర్మయిని కిడ్నాప్ చేసి తీసుకెళ్ళి అతని ముందు హాజరు పరిచినపుడు అరుణ ప్రకాశాన్ని పెటీ బూర్జువా అని పిలుస్తాడు. అంతేగాక పెటీ బూర్జువాలని విప్లవోద్యమానికి శత్రువులుగా పరిగణిస్తాడు. ఇది ఆనాటికి శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాట దశను, మారిన స్వభావాన్ని మనకి పట్టి ఇస్తుంది.

అన్న తమ్ముడికి మరణశిక్ష విధించబోతాడు. కానీ అతని తప్పు లేదని తెలిశాక వెళ్ళిపోతూ సమాజం మార్పుకి తనమార్గం ఎంచుకోమని లేదా యథావిధిగా కొనసాగమని చెప్పి వెళ్ళిపోతాడు. ఈ సందర్భంగా మనకి వాసిరెడ్డి సీతాదేవి రాసిన 'మరీచిక' నవల గుర్తు రాక మానదు. ఆ నవలలోని నాయకుడు అడవుల్లో పోలీసులతో పోరాటంలో గాయపడి మరణిస్తూ నాయికకు ప్రజామార్గంలోకి వెళ్ళమని పంపిస్తాడు.

చిట్టెమ్మ నడుచుకుంటూ వెళుతూ మార్గమధ్యంలో వర్షం పడుతూ వుంటే ఒక పశువులశాల దగ్గర ఆగుతుంది.

అక్కడ ఒక గోవుని నిమురుతూ, "నీకు ఇల్లు లేదమ్మా తల్లీ? అదృష్టవంతురాలివి! అవునా? కాదా?" అంటుంది. ఈ విధంగా చదువు అంతగా లేని చిట్టెమ్మ ఆస్తి వెనుక వున్న గతితార్కిక సంబంధాన్ని అర్థం చేసుకోగలిగింది. అర్థం చేసుకుంది గనుకనే తనకు తోచిన దారిలోకి నడిచింది.

ఆస్తి అనే భూతం ఆనాటికి అనగా రావిశాస్త్రిగారు ఈ నవల రాసేనాటికి తన కన్నులు విప్పి కోరలు సాచి అమాయకులని పీడించిన దానికన్నా నేడు వేనవేల రెట్లు పీడిస్తూ వున్నది. అందుకే ఇల్లు నవల నేడు మరింత అవసరం. ✦

# ముప్ఫై ఏళ్ళ క్రితం ప్రజాసాహితి

## 1992 జూలై - సంపుటి : 15 : సంచిక : 10

**రాంబాబు** రూపొందించిన రచయితల, కళాకారుల ఐక్యతాసదస్సు ఫొటోల కూర్పు ముఖచిత్రంతో, జనసాహితి – అరుణోదయ సంస్థల పునర్నిర్మాణ ఐక్యతా ప్రకటన సంపాదకీయంతో ఈ సంచిక వెలువడింది. 'హింసావేదం' అనే మరో సంపాదకీయంలో పాలకులు ప్రజలపై ప్రయోగిస్తున్న హింస గురించి తెలియచేశారు. జనసాహితి అరుణోదయ సంస్థల ఐక్యతా సదస్సు విజయవంతం కావాలని కాంక్షిస్తూ ఎర్నాకులం నుండి సుప్రీంకోర్టు మాజీ జడ్జి వి.ఆర్. కృష్ణయ్యర్, కలకడ నుండి రచయిత ఎ.ఎన్. నాగేశ్వరరావు, తిరుపతి నుండి రచయిత భూమన్ పంపిన సందేశాలను ప్రచురించారు. ఐక్యతాసదస్సు రిపోర్టు, ఐక్యతా సదస్సు తీర్మానాలను ప్రచురించారు. ఎస్కే రాసిన 'ఇక్కడ చదువు 'కొనవలెను" – కథనూ, నవీన్ రాసిన 'సత్యజిత్‌రే అపూత్రయం – ఒక విశ్లేషణ' వ్యాసాన్ని, విజయవాడ నుండి ఆర్.బి. వర్మ రాసిన 'జాతీయ ముస్లిం విశ్వవిద్యాలయంలో మతతత్త్వ వికారాలు' అనే 'స్పందన'నూ, 'ఆంక్షలు – నిషేధాలు' శీర్షికలో బ్రిటీష్ పరిపాలకులతో పత్రికా సంపాదకునిగా మహదేవ దేశాయ్ చేసిన పోరాటం గురించి ఉద్యమ సూర్యుడు రాసిన "నా రూపం మార్చుకుంటాను గాని నేను మరణించను" వ్యాసాన్నీ, 'సాహిత్యం సాంస్కృతిక వార్తలు' శీర్షికలో 'సుభాష్ ముఖోపాధ్యాయకు 1991 జ్ఞానపీఠ బహుమతి' గురించీ, 'శంకర్ గుహ నియోగిపై డాక్యుమెంటరీ 'లాల్ హరా లహరేకా' వార్తలను ప్రచురించారు.

జగం రాసిన గల్పిక 'మద్దతు', కత్తుల కాంతయ్య రాసిన "జనాల్ని ఆకట్టుకోవాల లేక పేదోళ్ళందర్నీ కలపాల' వ్యంగ్యాన్నీ, పరజ రాసిన 'అనాథ బాలల వ్యథార్థ దృశ్యం 'భద్రం కొడుకో' సినిమా సమీక్షని, విద్యాసాగర్ రాసిన 'బడ్జెట్' అనే మరొక గల్పికనూ, నిర్మలానంద సంపాదకత్వంలో జనసాహితి ప్రచురించిన 'పాష్ కవిత' పుస్తకంపై సూర్యతేజ చేసిన సమీక్షనూ ప్రచురించారు. ధారావాహిక వ్యాసంగా 'సంస్కృతీ : ప్రజాసాహితీ సాంస్కృతికోద్యమం – భూస్వామ్య సంస్కృతీ రూపాలు' శీర్షికలో 'మతం : అవతార పురుషులు : కర్మసిద్ధాంతం' వ్యాసాన్నీ, 'సామ్రాజ్యవాద భూతలస్వర్గం : 2 శీర్షికలో డా॥ కిరణ్మయి రాసిన 'అమెరికాలో ఆఫ్రికన్ జాతి పరిస్థితి' వ్యాసాన్నీ, జనసాహితీ అరుణోదయ కార్యక్రమాల వివరాల 'చైతన్యవాహిని', 'ప్రజాసాహితి'కి సమీక్ష కోసం పంపిన పుస్తకాల 'స్వీకారం'లను ప్రచురించారు.

రెండవ అట్టమీద కొత్తపల్లి రవిబాబు రాసిన 'తరగతి గది నా తుపాకీ!' కవిత, మూడో అట్టమీద అణుకుమార్ రాసిన 'ఎలర్జీ' కవిత, నాలుగవ అట్టమీద దర్భశయనం శీనివాసాచార్య రాసిన 'సాక్ష్యం' కవిత, లోపలి పేజీల్లో క్లాడ్ మెకీ రాసిన 'చావాల్సివస్తే', మార్గరెట్ వాకర్ రాసిన 'ముందస్తు బెయిలు లేకుండా అరెస్టయిన బాలిక కథనం' అనే రెండు అమెరికన్ నీగ్రో కవితలనూ, కాసుల ప్రతాపరెడ్డి రాసిన 'మూసీ సాక్షిగా', నీలి రాసిన 'స్వాతకోత్సవం', మధు దేశ పాండే రాసిన 'బాల్యాన్ని నిర్వచిస్తే', ఆశారాజు రాసిన 'మనం అక్షరాలు రాయాల్సి ఉంది', అల రాసిన 'అక్షరాల్ని రగిలించక తప్పదు', నారాయణస్వామి రాసిన 'మృత్యువును ద్వేషిద్దాం', ఛాయరాజ్ రాసిన 'నేలకొరిగింతర్వాత' కవితలను ప్రచురించారు. 'జనంపాటలు' శీర్షికలో నగారా రాసిన 'ఎందుకు ఈ చదువులూ! ఎన్నాళ్ళీ చదువులు!, శశి రాసిన 'త్యాగాల మందారం వేణన్న', ప్రతిన్ రాసిన 'మా వేణన్న–నెత్తుటి మడుగుల సూరీడు' పాటలను ప్రచురించారు. 'పిల్లల ప్రపంచం' శీర్షికను పి. చంద్రశేఖర్ అజాద్ నిర్వహించారు. ఇందులో 'వేసవికి వీడ్కోలు', 'కుక్క–దొంగ' కథ, 'బొమ్మను గీయను' కవిత, వాయిస్ ఆఫ్ చిన్ని శీర్షికలో 'ప్రధానమంత్రికి ఉత్తరం' అలాగే '21వ శతాబ్దంలో 2010 సం॥లో మీరేం చేయాలనుకుంటున్నారు?' అనే అంశాలున్నాయి.

1/8 డెమ్మీలో 92 పుటలు. వెల : రూ. 5/– ✦

# రావిశాస్త్రితో ఇంటర్వ్యూ

**– తాటి శ్రీకృష్ణ**

**ప్ర : మీరు 'విరమించిన రచయిత' అనీ, 'రైటర్స్ మెనోపాజ్' మీలో ఏర్పడిందనీ అనే వాదనతో మీరు ఏకీభవిస్తారా? 'ఇల్లు' కట్టడం పూర్తయిందా?**

జ : 'ఇల్లు' నవలను చిన్న కథగా రాద్దామనుకున్నా. కాని చివరకు అది నవలై కూర్చుంది. 1992 ఫిబ్రవరిలో 'ఇల్లు' మొదలుపెట్టినా, రెండవ భార్య రామం మృతి, పక్షవాతంతో దొరికిన విశ్రాంతి వలన 1992 మార్చిలో 'ఇంటి' పని ఎక్కువగా చూడగలిగాను. ఆస్తుల దురాక్రమణ వృత్తాంతమే ఇల్లు నవల. దాదాపు 12 సంవత్సరాల తరువాత ('మూడు కథల బంగారం') దీనిని రాశాను. నాకు రాయటానికి సరైన సమయం లేక, మంచి వాతావరణం లభించక యింతకాలం రాయలేదు. 'రాజు–మహిషి', 'మూడు కథల బంగారం'లతో నాలో మెనోపాజ్ ఏర్పడిందని వాదించేవాళ్ళతో నేను ఏకీభవించను. వాళ్ళ వాదనలకు నా 'ఇల్లు' ఒక విధంగా సమాధానం.

**ప్ర : మీ రచనల్లో వర్ణనలు ఎక్కువనే భావం వుంది?**

జ : అవును. ఇది కొంతవరకు వాస్తవమే. విషయ పరిపుష్టికి, భావ తీవ్రతాసూచికంగా, సమర్థంగా వర్ణనలు చేస్తే తప్పేమీ లేదు. చుట్టూవున్న వాతావరణాన్ని పరిచయం చేయటానికి కూడా వర్ణనలు అవసరమే. ఆ వాతావరణ అనుభూతిని పాఠకునికి అందించటానికిగూడ వర్ణనలు అవసరమే. అయితే అది అదుపు తప్పి పోరాదు.

**ప్ర : మీ నవలల్లో ఉపన్యాస ధోరణి చోటు చేసుకుందనే అభియోగం వుంది. మీరు అంగీకరిస్తారా?**

జ : చెడును తుంచాలనీ, మంచిని పెంచాలనే సదుద్దేశంతో కొన్నిచోట్ల అలాంటి ధోరణి చోటుచేసుకోవచ్చు. అయితే ఈ పద్ధతి నాకు చార్లెస్ డికెన్స్ నుంచీ అలవడింది. డికెన్స్ ప్రభావం నాపై చాలా గాఢంగా వుంది. ఆ నవలల్ని విపరీతంగా చదివాను. చెహోవ్ అన్నా యిష్టమే. 1939 వరకు వచ్చిన గొప్ప నవలలన్నీ చదివాను. డిటెక్టివ్ నవలల్ని మక్కువతో చదివేవాణ్ణి. టాల్‌స్టాయ్, గోర్కీ, మపాసా, ఓహెన్రీ, పానుగంటి, కొడవటిగంటి, గురజాడ, శ్రీశ్రీ, చలం యింకా.... అంతా యిష్టమే. అయితే చలం ఉత్తరాలు చదివిన తరువాత ఆయనపై వుండే గౌరవభావం తగ్గిపోయింది.

**ప్ర : చలం వచనం గురించి ప్రస్తావించారు గాబట్టి అడుగుతున్నాను. వచన కవిత్వంపై మీ అభిప్రాయమేమిటి?**

జ : వచన కవిత్వం నాకు మింగుడుబడదు. పనిగట్టుకుని చదివినా ఏ వచన కవిత్వం నాకు బోధపడదు. అయితే శ్రీశ్రీలాగ రాసేవారుంటే యిష్టపడతాను. కవిత్వం, రచన విషయాలలో నాకు విశ్లేషకుడిగా వ్యవహరించిన అబ్బూరి వరద రాజేశ్వరరావును ఏనాటికీ మరచిపోలేను. ఆ 'వరద' జీవయాత్ర చాలించినపుడు ఒక వ్యాసం రాద్దామనుకున్నాకాని.. ఇంకా రాద్దామనే వుంది.

**ప్ర : మీ రచనల్లో గొప్ప ఆలంకారిక శైలి వుంది గదా!**

జ : అవును. ఇది వాస్తవమే. ఆలంకారిక శైలి రచనకు అలంకార ప్రాయంగా వుండాలేగాని, కథాగమనానికి అవరోధంగా వుండకూడదనేది నా అభిమతం. అసలు మనం రాసేటప్పుడు 'హౌ బెస్ట్ వుయ్ కెన్ రైట్' అనేది ఆలోచించాలి. నేను రాసేప్పుడు అలా తపనపడేవాణ్ణి. ఎలాబడితే అలా, ఏదిబడితే అది రాస్తే ఎలా? నేను చిన్నప్పుడే సంస్కృతం, తెలుగు చదువుకున్నా దేనిలోను నాకు మంచి పాండిత్యం అబ్బలేదు. అయినా నాది ప్రత్యేకమైన రచనావిధానం. ఒక ప్రత్యేక ముద్ర నాది. బాగా రాయాలనే ప్రయత్నం, దానికోసం సాధన నిరంతరం కొనసాగాలి. ఇలా అనవసరమైన వర్ణనలు, అలంకారాలు వాడితే వాస్తవస్థితి దెబ్బతింటుంది గదా అనుకోవచ్చు. వాస్తవాన్ని వాటిద్వారా మరుగుపరచరాదు. వాటితోటి అసలు పరిస్థితిని జోకొట్టి నిద్రబుచ్చరాదు.

**ప్ర : వస్తు రూపాలలో దేనికి ప్రాధాన్యతనివ్వాలంటారు?**

జ : ఇంతకు ముందు చెప్పినట్లు చెప్పే విధానంలో ఒక ఆకర్షణ వుండాలి. అయస్కాంత ఆకర్షణలా హృదయానికి హత్తుకుపోయే ప్రత్యేకత వుండాలి. అయితే రచయిత ఎలా చెప్తున్నాడు అనే దానికంటే ఏమి చెప్తున్నాడు అనే దానికి ప్రాముఖ్యతనివ్వాలి. కాబట్టి ముందు సబ్జెక్ట్‌ని నిర్ణయించుకోవాలి. దానిని యెలా అందించాలి? ఏవిధంగా చెప్పాలనేది తరువాత విషయం. కనుక వస్తువు ముఖ్యం. రచనావిధానం రచయిత సామర్థ్యాన్ని బట్టి వుంటుంది. నాది ప్రత్యేకమైన రచనావిధానంగా రూపుదిద్దుకోవటానికి న్యాయవాదిగా నా ప్రాక్టీసు, కోర్టు వాతావరణం, వివిధ ప్రాంతాల నా క్లయింట్స్, లోక పరిశీలన, నా జీవితానుభవం – వీటన్నింటిని నాకు తెలిసిన భాషలో వ్యక్తం చేశాను. అది విశాఖ మాండలికమనుకోండి, ఉత్తరాంధ్ర భాష అనుకోండి, మరోటనుకోండి.

**ప్ర : సాహిత్యం సామాజిక మార్పుకు ఏ మేరకు దోహదపడుతుంది?**

జ : రచనల వలన సామాజిక మార్పు వస్తుందనుకోవడం వట్టి భ్రమ. ఎక్కడన్నా మార్పుకు రచన దోహదకారి అయితే కావచ్చు. కాని మొత్తంమీద సామాజిక మార్పు రచనల వల్ల జరిగే పనికాదు.

**ప్ర : రచయితకు నిబద్ధత అవసరమంటారా?**

జ : రచయితలకు ఫలానా అనే కమిట్‌మెంట్ అవసరం. అయితే లేబిల్స్ తగిలించుకోకుండా రచయిత మంచికి నిబద్ధుడైతే చాలు. మరి ఏది మంచి అనేది వివాదాస్పద అంశం. ఇది సాపేక్షత్వంపై ఆధారపడి వుంటుంది. రచయిత జీవితాన్ని



బట్టి అతని జీవన దృక్పథాన్ని బట్టి మంచి అనేది వుంటుంది. మళ్ళీ యిక్కడ రకరకాల దృక్పథాల గురించి చెప్తారు. అలాగే మార్క్సిస్టు దృక్పథం లేక అవగాహన అనేది ప్రత్యేకంగా లేదు. నేను రాసేప్పుడు ఫలానా అవగాహనాదృష్టితో రాయాలి అనేమీ రాయలేదు. ఆయా కథావస్తువుని బట్టి ఆయా పాత్రల రూప నిర్మాణం; సమాజాన్ని అనుసరించి ఆయా పాత్రల రూపశిల్పం వుంటుంది. కాబట్టి 'వుయ్ కెనాట్ ఛేంజ్ ది క్యారెక్టర్' అనేది నా అభిప్రాయం. దేనికైనా పునాది సమాజం. జీవితం. వీటిని బట్టే యితివృత్తంగాని, పాత్రలుగాని మరొకటిగాని వుంటుంది.

**ప్ర :** **వి.ర.సం. ఆవిర్భావమప్పుడు మీరు ఉపాధ్యక్షులుగా వున్నారు గదా! విరసం మీ జీవితంలో మార్పుకు దోహదపడిందా?**

**జ :** ఎవరేమనుకున్నా విరసం వల్ల నాలో ఏ మార్పూ కలగలేదు.

**ప్ర :** **ఫెమినిస్టు సాహిత్యం, మహిళోద్యమాలపై మీ అభిప్రాయమేమిటి?**

**జ :** ఈనాడు స్త్రీ విముక్తి అని, పురుషాహంకారమని, ఫెమినిజం అని రకరకాలవాళ్ళు రచనలు జేస్తున్నారు. స్త్రీ విముక్తి గాదు, సామాజిక బానిసత్వం నుండి ప్రజలందరికి విముక్తి లభించాలి. నేను స్త్రీని అనే ప్రత్యేకవాదం నాకు నచ్చదు. ఇలా అంటేనే నా మీద విమర్శ వచ్చింది. స్త్రీలలోగూడ మంచివాళ్ళు, చెడ్డవాళ్ళు వుంటారనేది విస్మరించగూడదు. అలానే పురుషులు. అన్యాయానికి గురైనవాళ్ళు స్త్రీలలో ఎక్కువగా వుండవచ్చు. అణచివేయబడుతున్నామనే భావన వారిలో వుండవచ్చు. అణచివేత విధానాన్ని, అప్రకటిత నిర్బంధాన్ని, దోపిడీ దుర్మార్గాన్ని, పెత్తందారీతనాన్ని, ధనమద దురహంకారాన్ని, నైతిక విలువల దిగజారుడుతనాన్ని, పరిస్థితుల ప్రభావం వల్ల మనిషిలో గలిగే పతనావస్థని, సమాజంలో సగభాగమైన స్త్రీల జీవితాల్ని, వాళ్ళ చైతన్యాన్ని నేను వివిధ సందర్భాలలో వర్ణించాను.

**ప్ర :** **'రత్తాలు – రాంబాబు'లో దారుణ పరిస్థితులలో చిక్కుకున్న రత్తాల్ని మీరు సినిమా ఫక్కీలో శీలం చెడకుండా కాపాడుకొచ్చారనే అభిప్రాయం పాఠకలోకంలో వుంది. మీరేమంటారు?**

**జ :** 'రత్తాలు – రాంబాబు'లో రత్తాలు క్యారెక్టర్ ఆయా సన్నివేశ పరిస్థితులను బట్టి చెరచబడాలి. కాని ఆ నవల రాస్తున్నప్పుడు నేను జైలులో వున్నాను గదా. జైలులో నాతోపాటు వున్న మిత్రుల కోరిక మేరకు కొంతమేరకు ఆదర్శం కోసం రత్తాల్ని అలా నగిషీగా చిత్రించుకుంటూ పోవాల్సొచ్చింది. రత్తాలు కోసం ముత్యంలాంటి ముత్యాలు పాత్ర సృష్టి జరిగింది. ఒక మంచిని నిలబెట్టడం కోసం, పతనమవుతున్న సామాజిక విలువలకు ప్రతినిధులుగా వున్న పాత్రలను సృష్టించడం కూడా అవసరమే. విప్రనారాయణ థీమ్‌ని ఆధారంగా జేసుకుని, మంచి – చెడులను విశ్లేషిస్తూ ఒక రచన చేద్దామని తలంచాను. అదే చివరకు 'రత్తాలు – రాంబాబు'గా పరిణమించింది. దానిని పూర్తిచేయాలనే తలంపు నాకు లేదు.

**ప్ర :** **లంపెన్ కారెక్టర్స్ మీ రచనలలో ఎక్కువని, సమాజాన్ని నెగెటివ్ కోణం నుండి చూశారనే వాదం వుంది.**

**జ :** సమాజంలో లంపెన్ విధానం వున్నంతవరకు లంపెన్ పాత్రల సృష్టి జరుగుతూనే వుంటుంది. శూన్యం నుండి ఏ సృష్టి జరగదు కాబట్టి, సామాజిక పరిస్థితులనుబట్టి సింహాచలం, అడ్డబుర్ర, నరసమ్మ మొదలైన పాత్రలు ప్రాణం పోసుకుంటాయి. ఒక మంచిని ప్రబోధించడం కోసం చెడును కూడా చూపించాలని ఎమిలీ జోలా లాంటివాళ్ళు ఏనాడో సూచించారు.

**ప్ర :** **కాలమాన పరిస్థితులకతీతంగా సాహిత్యం వుంటుందంటారా?**

**జ :** సాధారణంగా వుండదు. 20వ శతాబ్దపు ప్రథమ భాగంనాటికి వున్న బలాత్కార పద్ధతి, తనకు నచ్చిన స్త్రీని ఆవిడ యిష్టా యిష్టాలతో సంబంధం లేకుండా అనుభవించే పద్ధతి, అందునా ఆమెను వివాహం చేసుకోకుండా తన వుంపుడుగత్తెగా అనుభవించే ఒక దుర్మార్గ పాశవిక విధానాన్ని తీవ్రంగా నిరసించటం కోసం 'గోవులొస్తున్నాయి జాగ్రత్త'ను రచించాను. అయితే ఆ వాతావరణం యీనాడు లేదు. కాని అలాంటి వ్యక్తులు అక్కడక్కడా అవశేషాలుగా వుండటాన్ని మనం కాదనలేము.

ఈనాటి సమాజం ఎక్కువభాగం గిరీశాలతో నిండిపోయింది. మంత్రులంతా గిరీశాలే. హర్షద్ మెహతా ఓ పెద్ద గిరీశం. రాజ్యాంగ యంత్రాంగాన్ని నడిపేవాళ్ళంతా గిరీశాలే. ఈ గిరీశాల ధాటికి అల్పజీవులు ఆహుతైపోతున్నారు.

1950 నాటికి వస్తున్న కొన్ని నవలల్ని చదవటం వల్ల ముఖ్యంగా జేమ్స్ జాయిస్ మొదలైనవారి ప్రభావం వల్ల 'అల్పజీవి'ని సృష్టించడం జరిగింది. ఆనాడు నాకు సమాజంలో సుబ్బయ్యలాంటి అల్పజీవులు చాలా ఎక్కువగా కనిపించారు. సుబ్బయ్యని గురించి తేలికగా రాయవచ్చు. ఏదో ఒక టెక్నిక్‌ని ప్రవేశపెడదామనే వుద్దేశంతో మాత్రం నేను 'అల్పజీవి'ని రాయలేదు.

**ప్ర :** **ప్రస్తుతం వస్తున్న సాహిత్యంపై మీ అభిప్రాయం చెబుతారా?**

**జ :** ఈనాడు బూతు సాహిత్యం టన్నులకొద్దీ వుత్పత్తవుతోంది. ఈ విధానంలో మార్పురావాలి. పత్రికలలో, పాఠకులలో, రచయితలలో ఆరోగ్యకరమైన చైతన్యవంతమైన మార్పు రావాలి.

**ప్ర :** **ఇంకేమైనా రచనలు చేస్తున్నారా?**

**జ :** ఆరోగ్యం పూర్తిగా పాడైపోయింది. ఒక పేజీ కథలు కొన్ని రాశాను. ఆరోగ్యం కుదుటపడితే (నమ్మకం లేదు) ఒక యాభైదాకా వీటిని రాద్దామని వుంది.

**(తాటి శ్రీకృష్ణ ఇంటర్వ్యూ – 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక, 26-7-1993) ఆధారం. ప్రచురణ : 'రావిశాస్త్రి నవలానుశీలన' – నాగార్జున విశ్వవిద్యాలయానికి సమర్పించిన పిహెచ్.డి. థీసిస్)** ✦

"శతాబ్దాల కిందట
ఒక రావి గౌతముణ్ణి ప్రభావితం చేసి
అతన్ని బుద్ధుణ్ణి చేసింది.
ఈ శతాబ్దంలో ఒక రావి తెలుగువాళ్ళని ప్రభావితం చేసి
వారిని ప్రబుద్ధుల్ని చేసింది."
**- శ్రీశ్రీ**

# వేతనాలతో సరిపుచ్చుకునే "వేతన శర్మ" కథ

- ఓ.వీ.వీ.యస్. రామకృష్ణ

**రాచకొండ** విశ్వనాధశాస్త్రిగారు రాసిన మంచి కథల్లో "వేతనశర్మ" కథ కూడా ఒకటి. ఈ కథని ఆయన 1971లో రాశారు. ఈ కథను మొదట 'ఆంధ్రజ్యోతి' వారపత్రికలోనూ, తర్వాత 'బాకీ కథలు' సంకలనంలోనూ, 'ఉపాధ్యాయ 2004', సంకలనంలోనూ ప్రచురించారు.

పాలకయంత్రపు రథాన్ని సజావుగా నడిపించే కర్తవ్యం, ఏ దేశంలోనైనా ఉద్యోగవర్గానిదే. ఐయ్యేయెస్సులు మొదలుకొని, పంచాయితీ ఆఫీసు ప్యూన్ల వరకు.... ఇంకా చెప్పాలంటే నేటి ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామపంచాయితీ వలంటీర్ల వరకు ఈ కర్తవ్యాన్ని పాలకస్వాములకు అనుకూలంగా ఎలా నిర్వహిస్తూ ఉంటారో మనకందరకూ తెలిసినదే. ప్రజాస్వామ్యపు గోముఖం ధరించి, లోపల కోరలు సాచి సదా సిద్ధంగా ఉండే పులి లాంటి మన పాలకవర్గపు తోకలాగ ఉద్యోగవర్గం ఇమిడిపోయి ఉంటున్నది. ఈ తోక ఏక కాలంలో అటు ప్రభువుల ఆలోచనలకు అనుగుణంగానూ, ఇటు అమాయక ప్రజలకు బెదిరింపులుగానూ "ఎప్పటికెయ్యది ప్రస్తుత" మన్నట్లు ఊగుతూ ఉంటుంది. ఒకవేళ తోకే గనక పులికి ఎదురు తిరగాల్సిన పరిస్థితి ఏర్పడితే..... తోక ఎలాగూ గెలవలేదు గానీ, పులి ఎలా లొంగదీస్తుంది? రాజీ బేరాలెలా కుదురుతాయి?!.... తోకని ఎప్పుడూ తోకగానే ఎలా ఉంచాలి?!. మొదలైన నిస్పృహత్మపు ప్రశ్నల నుండి,.. ఛీ.. ఛీ.. అసలు పాలకులు పులులేంటి? ఉద్యోగులు తోకలేంటి?!.. ఏమిటీ ఛండాలపు పోలిక.... ప్రజలే పాలకులైన ఈ ప్రజాస్వామ్యంలో పాలకుల పీడన ఏమిటి?!.. ఉద్యోగులనేవాళ్ళు సకల సంపదల సృష్టికర్తలైన ప్రజలవైపు ఉండాలా.. పీడించే ఈ పాలకుల వైపు ఉండాలా.... లాంటి అనేకానేక ప్రశ్నలు రావిశాస్త్రిగారి "వేతనశర్మ" కథ చదువుతున్నప్పుడు మనకు కలుగుతాయి.

కథలోకి వెళితే, మగధ దేశాన్ని సుందరసేన మహారాజు "పాలకవర్గ జనరంజకంగా" పాలించేవాడు. ప్రారంభంలో,.... ప్రజలను పాలిస్తున్నందుకుగానూ వారు ఉత్పత్తి చేసే సంపదలో పదవ వంతే పన్నుగా స్వీకరించేవాడు. క్రమేపీ మహారాజుకూ, రాజకుటుంబీకులకూ, బంధుమిత్రులకూ లాభాపేక్ష బాగా పెరిగిన మీదట ప్రజల మీద పన్నుల భారం భరించలేనంతగా పెరగడమూ, ప్రజల నడ్డి వంగడమూ జరిగింది. కాగా రాజ్యంలో అటు రాజుకీ, ఇటు ప్రజలకీ మధ్య చదువుకొని పన్నుల వసూళ్ళు, జమాఖర్చుల లెక్కలు సరిచూసి మిగుళ్ళు రాజుకు సక్రమంగా చేరవేసే కరణాలు కూడా ఉన్నారు. వారి నాయకుడు వేతనశర్మ.

నడ్డి వంగిపోయిన ప్రజారాశులు ఇక ఎంతమాత్రమూ పన్నుల పీడన భరించలేని స్థితిలో మార్కండేయుడనే ఋషిసత్తముడు ప్రజలే రాజులు కావడం తప్ప ఈ పీడనకు మరో మార్గంలేదని గ్రహించేడు. గ్రహించి ఊరుకోకుండా మీ రాజ్యం మీరేలండంటూ ప్రజలకు సత్యబోధ చేసేడు. బోధ ఫలించిన ఫలితంగా ప్రభువర్గం మీద సామాన్యజనం తిరగబడ్డారు. ఈ తిరుగుబాటుకు సుందరసేన మహారాజు ముందు కొంచెం తల్లడిల్లినా, వెంటనే తెప్పరిల్లి మార్కండేయ మహర్షి మీద నీచమైన కుట్రలు అమలుజరిపి అడ్డు తొలగించుకున్నాడు. తదుపరి తిరుగుబాటుదార్లూ, రాజ్యవ్యతిరేకులు, రాచభటులకు వ్యతిరేకులైన అందరినీ వెంటాడి వేటాడతారు. ప్రజలతో కలసి రాజుపై తిరుగుబాటు చేసిన కరణాల మీద కూడా వేట ప్రారంభమౌతుంది. చదువుకున్న వాళ్ళకి బుద్ధి చెపితే, మిగిలినవాళ్ళకి మరింత బాగా బుద్ధొస్తుందని రాజు నమ్మి, కరణాలను మరింత ఎక్కువగా హింసించి చంపసాగాడు.

ఈ భీతావహ పరిస్థితిలో వేతనశర్మ చురుకుగా ఆలోచిస్తాడు. అసలు తిరుగుబాటుకు కారణమేమిటి?!. రాజ్యవర్గపు దోపిడి – మరైతే ఈ రాజ్యవర్గపు దోపిడీ వలన మన కరణాలకేమిటి నష్టం?.... ఏమీలేదు. కేవలం జీతాలు తక్కువైనంత మాత్రాన మామూలు మనుషుల్లాగ తిరుగుబాట్లు చేసి ప్రాణాలు త్యాగం చేయాల్సిన అవసరం కరణాలకు ఉందా?!.... అని ప్రశ్నించుకోగా, లేదనే అతనికి సమాధానం తోచింది. దరిమిలా కరణకులతిలకుల సమావేశం ఏర్పాటుచేసి, ఇదే విషయాన్ని బోధించి, వారందరినీ ఒప్పిస్తాడు. వారంతా కలిసి వేతనశర్మనే తమ ప్రతినిధిగా రాజు వద్దకు పంపగా,.... మాకు విప్లవాలు అవుసరంలేదు. జీతాలు మాకు పెంచండి – మిమ్మల్ని దించే కార్యక్రమాలు మేము చేపట్టం.... అని విధేయంగా పలికి సానుకూల ఒప్పందాలు చేసుకో గలుగుతాడు. ఇదీ కథ.

తిరుగుబాట్లు చెలరేగుతూ విప్లవాల బాటలో నడుస్తున్న చరిత్ర పొడుగునా వేతనశర్మలను రాజ్యం సృష్టిస్తూనే వుంది. ఉద్యమాలకు వెన్నుపోట్లూ పొడిపిస్తూనే ఉన్నది. అందుకే ప్రజల నుండి ఉద్యోగ వర్గాన్ని వేరుచేసి ప్రభువుల అడుగులకు మడుగులొత్తుతూ ప్రభుతకు అనుచరులుగా ఉద్యోగవర్గాన్ని మలిచారు. సామాజిక, ఆర్థిక దోపిడీ పీడనలను ప్రజలతో పాటు గురౌతూనే రాజ్యం యొక్క బంటులుగా, రాజ్యాన్ని కాపాడే అధికారులుగా, కుహనా అధిపతులుగా ప్రజల నుండి వేరుచేయబడ్డారు. వ్యక్తిగత స్థాయిల్లో ప్రజాందోళనలు, ఉద్యమాలపట్ల సంఘీభావమే తప్ప,.... వర్గంగానే కదిలి ప్రజారాశులకు అండగా వెన్నంటి ఉండే పరిస్థితి తక్కువగా కనబడుతుంది. 32 మంది సామాన్య ప్రజలు ప్రాణత్యాగం చేసిన ఫలితంగా పొందిన విశాఖ ఉక్కు పరిశ్రమ వేలాదిమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించింది. దాని ఉత్పాదకతతో దేశ ఆర్థికంలో తన వంతు పాత్ర నిర్వహించింది. అటువంటి విశాఖ ఉక్కు కర్మాగారాన్నే గత పాలకులు ప్రయివేటీకరణ మొదలుపెట్టారు. దానిని కొనసాగిస్తూ నేటి పాలకులు ఏకంగా ఉక్కు కర్మాగారాన్నే అమ్మివేసి చేతులు దులుపుకుంటున్నారు. విశాఖ ఉక్కు

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 500 రోజులుగా జరుగుతున్న ఉద్యమంలో ప్రజల నుండి ప్రభుత్వాల నుండి రావల్సినంత తోడ్పాటు రావటంలేదు. పాలకవర్గ పార్టీలు ఎన్ని ఉన్నా అవి అన్నీ అధికారం చేజిక్కించుకోవటంలో ఐక్యతగా ఉన్నాయి తప్ప ప్రజలపట్ల, ప్రజలకు చెందిన ఉత్పత్తి వనరుల పట్ల ఏ విధమైన బాధ్యత వహించడంలేదని అర్ధమవుతుంది. ప్రజలను కదలించలేకపోతున్నాయి. పే రివిజన్ కమీషన్ (పిఆర్‌సి) అమలుచేయక పోవడం, డి.ఏ.ల (కరువుభత్యాలు) ఎగవేత తదితర సమస్యలపై ఇటీవల లక్షలాదిమంది ఉద్యోగ ఉపాధ్యాయులు విజయవాడలో కదం తొక్కినపుడు, సాధారణ ప్రజలూ సానుకూలంగా స్పందిస్తూ మంచినీరు, మజ్జిగలు అందించారు. విజయవాడ బిఆర్‌టిఎస్ రోడ్డుకిరువైపులా పదుల సంఖ్యలో గృహస్థులు ఉద్యమకారులను తమ యిండ్లలోనికి పిలిచి సేదతీర్చుకోనిచ్చారు.

గ్రామగ్రామాన సర్కారీ పాఠశాలల ఎత్తివేత, ఉపాధ్యాయ పోస్టుల ఎత్తివేత, ఉద్యోగ నియామకాల నిలిపివేత తదితర చర్యలతో ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న పాలకుల ప్రజావ్యతిరేక విధానాలు ప్రజలకు చేరటంలేదు. అలాగే కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయులలో సైతం తాము కూర్చొన్న కొమ్మలు ఒక్కొక్కటిగా నరికివేయబడుతున్నా పరిస్థితి తీవ్రతను అర్ధంకానివ్వకుండా రకరకాల సంక్షేమ పథకాల ప్రలోభాలకు లోను చేస్తున్నారు. కథలో చెప్పినట్టు..., "ఎక్కువ జీతాల కోసం సమ్మెలే తప్ప, సమసమాజం కోసం విప్లవాలు వొద్దంటారు ప్రభువులు. ఔనంటారు ప్రభుత్వోద్యోగులు" అనే వేతనశర్మ తత్త్వం దశాబ్దాల తరబడి ఘనీభవించిపోయిన పరిస్థితి ఫలితమిది. వేతనశర్మలందించే ప్రయోజనాలను లొట్టలు వేసుకుంటూ రుచి చూస్తున్న పాలకులు తమకు కావలసిన వేతనశర్మలను తామే తయారుచేసుకుంటూ, వంచన కళలో ఆరితేరుతున్నారు. ఇటీవలి పిఆర్‌సి ఉద్యమం సందర్భంగా లక్షలాదిమంది ఉద్యోగ ఉపాధ్యాయుల ఆశల మీద నీళ్ళు కుమ్మరించడంలో జెఎసి నాయకులు నిర్వహించిన పాత్ర అందరకూ తెలిసినదే. ప్రజలపై అమలౌతున్న శ్రమదోపిడీని అంతం చేయాలంటే ప్రజల రాజ్యం ప్రజలే ఏలుకోవాలన్న మార్కండేయ మహర్షి చెప్పిన విప్లవ సూత్రాన్ని ప్రజలకు చేరవేయవలసిన కర్తవ్యానికి బద్ధులై ఉండకుండా, దోపిడీ పాలకవర్గపు తోకగా యిమిడిపోయే వేతనశర్మల అవకాశవాదాన్ని బానిసత్వపు శిలాజంగా.... ఎత్తిచూపిన కథ 'వేతనశర్మ' కథ.

వేతన శర్మల విషయంలో రాచకొండవారి కథనం అద్భుతంగా ఉంది. మార్కండేయ మహర్షి విషయంలో మాత్రం పాఠకుడికి కొన్ని ప్రశ్నలు మిగులుతాయి. రాజవర్గపు కత్తులకు, వేతనశర్మల వెన్నుపోట్లకు గురై గాయపడిన విప్లవం అలసట తీర్చుకుని మరునాడెప్పుడో చిచ్చుగా మారడానికి అడవులలో తలదాచుకుందన్నారు. మీ రాజ్యం మీరేలండని, విప్లవ బాధ్యత ప్రజలే నిర్వర్తించాలని మార్కండేయ మహర్షే చెప్పినప్పుడు.... అది సేదతీరాలన్నా, పుంజుకొని చిచ్చుగా మారాలి అన్నా ప్రజల మధ్యే కదా తలదాచుకోవాలి....రాజ్యంలో తప్ప అడవులలో రాజు అధికారం ఉండదా?!.. వేట సాగదా?!.. ప్రజల సమష్టి శక్తి కాకుండా వేరే ఏ ఇతర శక్తి ఐనా ప్రజలు లేని అడవులలోంచి పుంజుకొని వచ్చి విప్లవ చిచ్చును రగిలిస్తుందా?!.. విప్లవ గమనంలో అడుగడుగునా అడ్డుతగిలే వేతనశర్మల వెన్నుపోటుతత్వాన్ని అద్భుతంగా పట్టి చూపించిన కథలో ఈ ఒక్క గందరగోళమూ లేకుంటే ఎంతో బాగుణ్ను. ✦

## ప్రముఖ ఉర్దూ సాహిత్య విమర్శకుడు

# గోపీచంద్ నారంగ్ మరణం



**ఉర్దూ,** హిందీ, ఇంగ్లీషు భాషలలో పలు సాహిత్య విమర్శనాగ్రంథాల రచయిత, ఆచార్యుడు అయిన గోపీచంద్ నారంగ్ 2022 జూన్ 15న తాను స్థిరపడిన అమెరికాలో 92వ ఏట మరణించారు. ఆయన బెలూచిస్థాన్ (నేడు పాకిస్తాన్)లోని దుక్కిలో 1931 ఫిబ్రవరి 11న జన్మించారు.

ఆయన తండ్రి ధర్మచంద్ నారంగ్ పర్షియా సంస్కృత పండితుడు. గోపీచంద్ ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ఉర్దూ సాహిత్యంలో ఎం.ఏ. చదివారు. 1958లో డాక్టరేటు సాధించారు. ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్ కళాశాల, ఢిల్లీ విశ్వవిద్యాలయం జామియా మిలియా ఇస్లామిక్ విశ్వవిద్యాలయాలలో వివిధ హోదాలలో పనిచేశారు.

1998–99లో ఢిల్లీ ఉర్దూ అకాడమీ ఛైర్మన్‌గా చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీకి ఉపాధ్యక్షునిగా రెండు పర్యాయాలు 1998 – 2002లోనూ, 2003–2007లోనూ చేశారు.

విభిన్న సంస్కృతుల మధ్య వారధిలా పనిచేయగల శక్తి అంతర్గతంగా ఉర్దూ భాషకు వుందనీ, మన మిశ్రమ సంస్కృతికి ఒక ప్రముఖమైన ప్రతీకగా ఉర్దూ నిలుస్తుందనీ, ఆయన చెప్పేవారు.

"ఉర్దూ గజల్ : భారతదేశపు మిశ్రమ సంస్కృతి ఇచ్చిన కానుక", 'ఫెయిజ్‌లో సంప్రదాయమూ – నూతన ఆవిష్కరణ' అనే పుస్తకాలతోపాటు ఆయన 65 గ్రంథాలు రచించారు.

పుస్తక పరిచయం

# డిజిటల్ శ్రమ - కార్ల్‌మార్క్స్

సారాంశ సమర్పణ : జి.వి. భద్రం **- *Christian Fuchs***

*గతసంచిక తరువాయి..*

## కాల్‌సెంటర్ పని - కత్తిరించి, కుదింపబడిన, గృహిణీకరింపబడిన సేవల శ్రమ

**2010** నాటికి 27 యూరోపియన్ దేశాలలోని 82,400 కేంద్రాల్లో కాల్‌సెంటర్ పనులు జరుగుతున్నాయి. భారతదేశంలో కూడా ఎన్నో కాల్‌సెంటర్లు ఏర్పడ్డాయి. మనదేశంలోని కాల్‌సెంటర్లకు 73% మేరకు విదేశీక్లయింట్లే.

ఈ కాల్‌సెంటర్లన్నింటిలోనూ మహిళలే ఎక్కువగా పనిచేస్తారు. ఎందుకంటే వీరు మృదువుగా మాట్లాడుతూ కష్టమర్లను ఓపికతో సంబాళించి ఆకట్టుకోగలుగుతారు కనుక. వీరు కాల్‌సెంటర్ సమాచార క్లర్కులుగానూ, కాంట్రాక్టు సేల్స్‌పర్సన్స్‌గానూ పనిచేస్తారు. కాల్‌సెంటర్ సమాచార క్లర్కులు ఒక సంస్థకు చెందిన క్లయింట్లకు, ఆ సంస్థ యొక్క వినియోగ వస్తువుల గురించి కానీ, ఆ సంస్థల సేవల గురించి కానీ, ఆ సంస్థల విధానాలు గురించి కానీ, వివరిస్తారు. సలహా యిస్తారు. వారి ప్రశ్నలకు జవాబులిస్తారు. క్లయింట్ల యొక్క లావాదేవీలను టెలిఫోన్ ద్వారా కానీ, ఇ-మెయిల్ లాంటి ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా గాని ప్రాసెస్ చేస్తారు.

కాంటాక్టు సెంటర్ సేల్స్‌పర్సన్స్ అయితే ప్రస్తుత క్లయింట్స్‌ను గానీ, క్లయింట్స్ కావటానికి అవకాశమున్న వారిని గాని టెలిఫోన్ ద్వారా లేదా యితర ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా కానీ సంబంధం పెట్టుకొని కంపెనీకి చెందిన వస్తువులను, సేవలను అమ్మటానికి నచ్చజెప్తారు. అమ్మకాలకు అంగీకరింపజేసి, క్లయింట్లతో సేల్స్ విజిట్లను ఏర్పాటుచేస్తారు. వీరు ఒక కష్టమర్ కాంటాక్టు కేంద్రంలోనైనా పనిచేయవచ్చు. లేదా కేంద్రీకరింపబడిన ఏ యితర చోటు (ఆవరణ) నుండైనా పనిచేయవచ్చును.

ఈ కాల్‌సెంటర్ పనిని ఔట్‌సోర్సింగ్ ద్వారా నిర్వహించే బడా సబ్‌కాంట్రాక్టరు కంపెనీలున్నాయి. చిన్న కంపెనీలూ వున్నాయి. సబ్‌కాంట్రాక్టర్ల దగ్గర పనిచేసే ఉద్యోగులు నిర్వహించాల్సిన పనులు, నేరుగా అసలు కంపెనీలో నిర్వహించాల్సిన పనులకన్నా తక్కువ సంక్లిష్టంగా వుంటాయి. ఈ సబ్ కాంట్రాక్టర్ కంపెనీలలో ఉద్యోగులపై నిఘా వుంటుంది. తక్కువస్థాయి ఉద్యోగ వివక్షతా వుంటుంది. ఇక్కడ ఉద్యోగులకు సమిష్టి బేరసారాలు చేసే అవకాశం వుండదు. అందువలన వీరికి తక్కువ వేతనాలు వుంటాయి. వీరి పని పెర్ఫార్మెన్సు (ఎలా పనిచేస్తున్నారో)పై అంటే వీరు టెలిఫోన్ కాల్‌లో వ్యవహారం నడిపించే సమయాలు, పని పూర్తిచేసే సమయాలు, కాల్ వెయిటింగ్ సమయాలపై ఎక్కువ నిఘా వుంటుంది.

ఫార్చ్యూన్ 500 కంపెనీలలో 400 కంపెనీలకు భారతదేశంలో కాల్‌సెంటర్లున్నాయి. పాశ్చాత్య దేశాల క్లయింట్ల అవసరాలు తీర్చటం కోసం మనదేశంలోని కాల్‌సెంటర్లు రాత్రిపూట పనిచేస్తాయి. వీటిలో పనిచేసే ఉద్యోగుల పనిపైన రికార్డు చేసిన కాల్స్ రూపంలోనూ, పెర్ఫార్మెన్స్ మానిటరింగ్ మరియు కార్డు ఆధారిత రిజిస్ట్రేషన్ పద్ధతి వలన, ఎక్కువ స్థాయిలో నిఘా ఉంచుతారు. ప్రతీ ఉద్యోగికి ఎన్ని కాల్సు నిర్వహించాలి అనే లక్ష్యాన్ని కూడా నిర్ణయిస్తారు. పెర్ఫార్మెన్స్ సమీక్షలలో యీ లక్ష్యాన్ని నిరంతరం పెంచుతూ వుంటారు. ఉద్యోగుల పెర్ఫార్మెన్స్ వివరాలను అందరూ చూడటానికి వీలుగా ప్రదర్శించటం వలన సహఉద్యోగుల మధ్య ఒత్తిడిని సృష్టిస్తారు. ఒక్కో ఉద్యోగికి నెలకు 8,000 రూపాయల నుండి 10,000 రూపాయల దాకా వేతనం యిస్తారు. ఈ కాల్‌సెంటర్ ఉద్యోగినులను తరచుగా మేనేజర్లు విసిగిస్తూ వేధిస్తూ వుంటారు. ఈ ఉద్యోగినులు రాత్రిపూట పనిచేయాల్సి రావటం వలన వీరిలో చాలామంది లైంగికదాడులకు గురయ్యే ప్రమాదం వుంది.

వీరు నిరంతరం క్రమశిక్షణకు గురిచేయబడటం వలన, వీరిపై నిఘా వుండటం వలన, వీరు ఒకే రకమైన పనిని తిరిగి తిరిగి చేయాల్సి రావటం వలన, నిరంతరం కంప్యూటర్ స్క్రీన్‌ను చూస్తూ వుండాల్సి రావటం వలన, యీ ఉద్యోగినుల ఆరోగ్యం దెబ్బతింటుంది. కండరాల ఒత్తిడి, తలపోట్లు, కళ్ళ అలసట, వికారం, అస్వస్థత, నలత లాంటి జబ్బులకు తరచుగా గురవుతూ వుంటారు.

వీరు పశ్చిమ దేశాల క్లయింట్లతో వ్యవహరించటం వలన, ఆ క్లయింట్లు వీరిని తెల్లజాతేతర రంగుజాతివారిగా గుర్తుపట్టినప్పుడు, వీరితో చులకనగా మాట్లాడుతారు. పచ్చి బూతులు తిడతారు. వీరిని తమ యింటి సేవకులకన్నా హీనంగా పరిగణిస్తారు. కాల్‌సెంటర్ ఉద్యోగినులు యీ రకమైన అనవసర వేధింపులను, నోరెత్తకుండా భరించాల్సి వుంటుంది.

వీరి పని స్వభావం, యింటిలో గృహిణి నిర్వహించే పనుల స్వభావం లాంటిది. వీరికి యూనియన్ల రక్షణ వుండదు. కార్మిక చట్టాల రక్షణ వుండదు. వీరు ఏ సమయంలోనైనా పనిచేయాలి. ఎంత వేతనం చెల్లిస్తే అంతే తీసుకుని పనిచేయాలి. వీరి పని శ్రమగా గుర్తింపబడదు. కేవలం 'కార్యకలాపం'గా మాత్రమే గుర్తించబడింది. వీరికి తమ అర్హతను పెంచుకునే అవకాశం లేదు. పై స్థాయికి ప్రమోషన్ అయ్యే అవకాశం లేదు. వీరికి హక్కులు లేవు. సామాజిక భద్రత లేదు. కేవలం

పని చెయ్యాల్సిన బాధ్యత మాత్రమే వుంది. అందువల్లనే వీరి పని గృహిణీకరింపబడిన, కత్తిరించి, కుదింపబడిన పనిగా నిర్వచింపబడింది.

ఈ రకంగా యీ కాల్‌సెంటర్లలో అనియతమైన పని, నియంత్రణలేని అంతులేని శ్రమదోపిడీకి వనరుగా మారింది.

ఇంట్లో గృహిణి కుటుంబసభ్యులందరి సంరక్షణను చేపట్టినట్లుగా, కాల్‌సెంటర్లలో పనిచేసే ఉద్యోగినులు, కస్టమర్లకు చెందిన వినియోగ వస్తువుల వాడకం, కొనుగోలు, రిపేరు తదితర సమస్యలన్నింటినీ పట్టించుకొంటూ తగు సలహాలు అందించి జాగ్రత్త తీసుకొంటూ, క్లయింట్ల యొక్క వినియోగ వస్తువుల సంరక్షణ బాధ్యతను చేబట్టి నిర్వహించాలి.

పెట్టుబడిదారీ విధానం కూడా పితృస్వామిక భావాలనూ, సిద్ధాంతాలనూ ఉపయోగించుకొని మహిళల శ్రమశక్తిని దోపిడీ చేస్తూ, యీ కాల్‌సెంటర్ల ద్వారా సూపర్ లాభాలను గడిస్తోంది.

డిజిటల్ పరిశ్రమ మహిళల శ్రమను ఏ రకంగా దోచుకుంటుందో, యీ కాల్‌సెంటర్ల ఉద్యోగినుల అనుభవాలు బహిర్గతపరుస్తున్నాయి.

## సోషల్‌మీడియా ద్వారా శ్రమ దోపిడీ!

డిజిటల్ పరికరాలను ఉపయోగించేవారు వాటి కొనుగోలుదారులు గానూ, వినియోగదారులుగానూ వ్యవహరిస్తారు. ఉదాహరణకు వారు డెస్క్‌టాప్ కంప్యూటర్లను, మానిటర్లను, లేప్‌టాప్‌లను, మొబైల్‌ఫోన్లను, టేబ్లెట్లను, ప్రింటర్లను, కీబోర్డులను, మౌస్‌లను, గేమ్ కన్సోల్స్‌ను, ఆపరేటింగ్ సిస్టమ్‌లను, అప్లికేషన్ సాఫ్ట్‌వేర్ లేదా సంగీతాన్ని, టెక్స్ట్‌లను, వీడియోలను, ఇమేజ్‌లను ఆన్‌లైన్ ద్వారా పొందే పరికరాలను కొనుగోలు చేస్తారు, వాడుతారు. వీరు యీ సాధనాల పట్ల నిర్వహించే అన్ని పాత్రలలోనూ, వాళ్ళు వినియోగదారులుగా తమ డబ్బును, వినియోగ వస్తువులతో మార్పిడిచేసి, వినియోగ వస్తువు పెట్టుబడిగా (డబ్బు రూపంలో) అవి పరిణామం చెందేట్లు వ్యవహరిస్తారు.

వీరు యీ వినియోగ వస్తువులను వినియోగించుకొనే ప్రక్రియలోనే, వాటి వాడకందారులుగా భావాన్ని (అర్థాన్ని) తయారుచేసే సాంస్కృతిక ప్రక్రియలో నిమగ్నమయిపోతారు. వీరు నిత్య జీవితంలో వాడుకొనే యీ వస్తువులకు, వాడే క్రమంలో అనేకానేక అర్థాలను సృష్టిస్తారు. ఈ ప్రక్రియలోనే వారు సాంస్కృతిక వస్తువులను ఉపయోగించటానికో అర్థాన్ని సృష్టిస్తారు.

ఇంటర్నెట్‌ను వాడుకొనేవారు గూగుల్, ఫేస్‌బుక్, యూట్యూబ్, బైడు లాంటి ప్లాట్‌ఫారాల్లో సెర్చి (వెతుకులాట) చేస్తారు. ఈ రకరకాల ప్లాట్‌ఫారంలలో వాడకందారులు వివిధ రూపాల వాడకంలో నిమగ్నమయి వుంటారు. సెర్చింగ్, సోషల్ నెట్‌వర్కింగ్, షేరింగ్, వాడకందారులు సృష్టించిన విషయాల సారాంశాన్ని చూడటం, బ్లాగింగ్, షార్ట్‌మెసేజ్ బ్లాగింగ్ లాంటి పనుల్లో వాడకందారులు నిమగ్నమవుతారు.

ఈ రకంగా ఐ.సి.టి. ఉపయోగదారులు, వినియోగదార్లుగా క్రమంగా పాక్షికంగా ఇంటర్నెట్ వినియోగ – ఉత్పత్తిదారుల పాత్ర వైపుకు సాగుతున్నారనే విషయాన్ని అధ్యయనం చేసినవారు అభిప్రాయపడుతున్నారు.

ఈ ప్లాట్‌ఫారంలు అన్నీ చేస్తున్న పని ఏమిటంటే, ఉపయోగదారుల యొక్క విషయం, ప్రొఫైల్స్, సోషల్ నెట్‌వర్క్, ఆన్‌లైన్ బిహేవియర్ డేటాను ఉపయోగించుకొనే లక్ష్యపూరిత అడ్వర్‌టైజింగ్‌పై ఆధారపడిన వ్యాపారపు నమూనాను వాడుకొంటున్నాయి.

వినియోగ వస్తువులు వాటిని సృష్టించే ఉత్పత్తిదారులను కలిగి వుంటాయి. అదేవిధంగా పైన పేర్కొన్న ఇంటర్నెట్ ప్లాట్‌ఫారంల యొక్క వినియోగ వస్తువు, ఉపయోగదారుల డేటా అయితే, ఈ డేటాను సృష్టించటానికి జరిగే ప్రక్రియను తప్పనిసరిగా విలువను సృష్టించే శ్రమగా పరిగణించాలి. అంటే **యీ రకమైన ఇంటర్నెట్‌ను ఉపయోగించటమన్నది ఉత్పాదక వినియోగం (ప్రొసంప్షన్) అవుతుంది. డిజిటల్ శ్రమను గురించిన యీ అభిప్రాయం ప్రాధాన్యతను సంతరించుకొంది.**

యాజమాన్యాలకు (కంపెనీల) చెందిన ఆలోచనాపరులు, శ్రమపై ఖర్చును తగ్గించుకోవటం కోసం, లాభాలను పెంచుకోవటం కోసం, శ్రమను ఉపయోగదారులు, వినియోగదారులకు ఔట్‌సోర్సు చేయాలని సిఫార్సు చేశారు. ఆ రకంగా 'క్రౌడ్ సోర్సింగ్' అనే అవగాహనను ప్రవేశపెట్టారు. దీనిని వారు 'ఆర్థిక ప్రజాస్వామ్యంగా' అభివర్ణించి కొత్త రూపంలో పెట్టుబడి సంచయనానికి (ప్రోగుపడటానికి) ఒక నమూనాను రూపొందించారు.

సోషల్ మీడియా సంస్కృతి, నిత్యజీవితంలో, రాజకీయాల్లో అమోఘమయిన పాత్రను నిర్వహిస్తుందని పదే పదే ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారం అంతా కేవలం మార్కెటింగ్ ప్రజాసంబంధాలలోనూ, ఎడ్వర్‌టైజ్‌మెంట్‌లోనూ చేయబడే ప్రచారమే. ఎందుకంటే అది సోషల్‌మీడియా నిర్వహించే వ్యతిరేక ప్రభావం గురించి కానీ, వినియోగ వస్తువుగా (డేటాను) మార్చే విషయం గురించి కానీ, సోషల్ మీడియా యొక్క యజమానులు (అధిపతులు) ఎవరు, అందులో వచ్చే లాభాలను ఎవరు స్వంతం చేసుకొంటున్నారు అన్న విషయాల గురించికానీ మాట్లాడదు. జరిగే ప్రచారం యొక్క మొత్తం లక్ష్యం అంతా మరింత ఎక్కువమంది వాడకందారులను సంపాదించి, వారు ఎక్కువ సమయాన్ని ఆ సోషల్ మీడియా ప్లాట్‌ఫారంపై గడిపేటట్లు చేయటమే!.

ఇందుకు మంచి ఉదాహరణగా ఫేస్‌బుక్‌ను తీసుకోవచ్చును. ఈ ఫేస్‌బుక్‌కు యజమానులు (స్వంతదారులు) దాని వాడకందారులు కాదు, కానీ దాని యొక్క డైరెక్టర్లు కొన్ని కంపెనీలు అని మనం గుర్తుపెట్టుకోవాలి. ఫేస్‌బుక్‌లో కొందరు ఉద్యోగులున్నారు. అలాగే సాంకేతికత కూడా వుంది. వీరంతా ఆ ప్లాట్‌ఫారంను నడపటానికి కావాల్సిన ఏర్పాట్లు చేయటానికీ, అభివృద్ధి పరచటానికీ, ఆ ప్లాట్‌ఫారంను ఒక ఉత్పత్తి సాధనంగా కొనసాగించటం కోసం నియమించినవారు. అయితే ఫేస్‌బుక్ సృష్టించే శ్రమ యొక్క వస్తువు (Object of Labour)

మానవుల అనుభవాలే! అంటే మానవుల అనుభవాల నుండి డేటాను తయారుచేసి, దాన్ని ఒక వినియోగ సరుకుగా చేసి, దానిని అడ్వర్‌టయిజ్‌మెంటర్లకు అమ్ముకొని లాభాలను ఆర్జించుచుతుంది. ఈ లాభాలను ఫేస్‌బుక్ వాటాదారులు తీసుకొంటారు. ఫేస్‌బుక్ వాడకందారులైన వారికి ఎటువంటి పారితోషికం కానీ, వేతనం కానీ లభించదు.

అయితే చాలామంది ఫేస్‌బుక్ వినియోగదారులు తాము ఏ రకంగానూ నష్టపోవటంలేదనీ, తాము ఆ ప్లాట్‌ఫారంను వాడుకోవటం వలన ఆనందాన్ని పొందుతున్నామనీ, తాము స్వచ్ఛందంగానే ఫేస్‌బుక్‌లో తమ అనుభవాలను, యితరుల అనుభవాలతో పంచుకొంటున్నామని, కనుక తాము శ్రమ దోపిడీకి గురికాబడటంలేదనీ వాదిస్తారు. కాని యిది నిజం కాదు. కొంచెం లోతుగా పరిశీలిస్తే, ఒకవైపు వాడకందారులుగా ఫేస్‌బుక్‌ను వాడుకొంటూనే, మరోవైపు తాము ఆ ప్లాట్‌ఫారంపై ఎంతో సమయాన్ని వెచ్చించి, తమ ఆలోచనలను, అభిప్రాయాలను, అనుభవాలు నమోదుచేయటంలో ఎంతో శ్రమను వెచ్చిస్తున్నారనీ, యీ శ్రమ ఫలితంగా సృష్టింపబడే డేటాను ఫేస్‌బుక్ అమ్మకపు వస్తువుగా అడ్వర్‌టైజ్ కంపెనీలకు అమ్ముకొని, లాభాలను గడిస్తోందని, ఆ రకంగా తమకు తెలియకుండానే ఎటువంటి చెల్లింపులూ లేని తమ శ్రమను, ఫేస్‌బుక్ దోపిడీ చేసుకొంటోందని అర్థం చేసుకొంటారు.

అంటే ఫేస్‌బుక్ వినియోగదారులు ఏక కాలంలో ఆ ప్లాట్‌ఫాం వలన యితరులతో (సమాజంతో) సంబంధాలు పెట్టుకొంటేనే, అదే సమయంలో ఆ ప్లాట్‌ఫాంపై ఎంతో సమయాన్ని వెచ్చించి, తమ ఆలోచనలు, అభిప్రాయాలు, అనుభవాల గురించిన వివరాలను, అందించే రూపంలో శ్రమపడుతూ, డేటా ఉత్పత్తిదారులు కూడా అవుతున్నారన్నమాట.

ఫేస్‌బుక్ అకౌంట్‌ను తెరిచినవారు, తాము ఫేస్‌బుక్ యొక్క ప్రైవసీ విధానానికి, దానిని ఉపయోగించుకోవటం కోసం పెట్టిన నిబంధనలకు అంగీకరిస్తున్నామనీ, అంగీకారాన్ని తెలియజేస్తారు. వీటి ప్రకారం వినియోగదారుడు తాను ఆ ప్లాట్‌ఫరంపై పంచుకొన్న అనుభవాలను ఫేస్‌బుక్ తన ఆర్థిక లక్ష్యాల కోసం వాడుకోవచ్చునని అంగీకరించినట్టే. అందువలన, ఫేస్‌బుక్ వినియోగదారులు ఆ కంపెనీకి తమ అనుభవాలను ప్రతిఫలించే డేటాను, వాడుకొని, పెట్టుబడిని అభివృద్ధి చేసుకొనే హక్కును దఖలు పరిచారన్నమాట. తమ సోషల్ మీడియా కార్యకలాపాలు ఏరకంగా, ఎందుకోసం ఆర్థికపరంగా వాడుతున్నారు అన్నదానిపై తమ అదుపును కోల్పోతున్నారు. ఫలితంగా ఫేస్‌బుక్ దీనిని సొమ్ముచేసుకొని లాభాలు గడిస్తోంది.

ఫేస్‌బుక్ తన వినియోగదారులపై (వాడకందారులపై) శారీరకమైన బలవంతాన్ని ఉపయోగించదు. అందుకు బదులుగా అది ఒక సామాజికరూపంలో అంటే మీరు నన్ను (ఫేస్‌బుక్‌ను) వాడుకోకపోతే మీరు సామాజికంగా ఒంటరివారై వేరుపడిపోతారు, అందువలన మీకు సామాజికంగా అనేక అననుకూలతలకు గురౌతారు అన్న ప్రచార రూపంలో వాడకందారులను తన వైపుకు లాక్కొంటుంది. అనంతరం వారు దానిపై సమయాన్ని వెచ్చించి, శ్రమపడి తమ ఆలోచనలను, అభిప్రాయాలను, అనుభవాలను ఆ ప్లాట్‌ఫారం యొక్క స్వంతం చేస్తారు. ఈ రకంగా వీరు వేతనం చెల్లింపబడని శ్రమను చేస్తారు.

ఇక ఫేస్‌బుక్ తన లాభాలను పెంచుకొని, పెట్టుబడిని ఎలా అభివృద్ధి చేసుకొంటుంది అంటే, అది తాను లక్ష్యం చేసుకొన్న అడ్వర్‌టైజ్‌మెంట్లు ద్వారా తన లాభాలను పొందుతుంది. ఫేస్‌బుక్ యొక్క అడ్వర్‌టైజ్‌మెంట్ల లక్ష్యం, ప్రధానంగా వాడకందారులను కొన్ని నిర్దిష్టమయిన వినియోగ వస్తువులు కొనుగోలు చేయమని చెప్పటం. అందువలన ఈ అడ్వర్‌టైజ్‌మెంట్లు కొన్ని వినియోగవస్తువుల అమ్మకంపై ప్రధానంగా కేంద్రీకరించే విషయాన్ని కలిగి వుంటాయి. ఆ రకంగా వాడకందారులను ఆ వస్తువులను కొనేటట్లు చేయటమన్నది యీ అడ్వర్‌టైజ్‌మెంట్ల లక్ష్యం.

సోషల్‌మీడియా వాడకందారులు ఒకే డిజిటల్ పనిని చేస్తూ రెండు విభిన్న ఉపయోగ విలువలను సృష్టిస్తారు. అవి : సమాచార ప్రసారం మరియు ప్రజలందరూ చూడదగిన సమాచారాన్ని ఉత్పత్తి చేయడం. అంటే వినియోగదారుల, యితర ప్రజల మధ్య సామాజిక సంబంధాలను సృష్టిస్తారు. మరోవైపు పెట్టుబడికి అవసరమైన ఉపయోగపు విలువను ఉత్పత్తి చేస్తారు అంటే అడ్వర్‌టైజింగ్ పరిశ్రమకు అవసరమయిన లక్ష్యపూరిత అడ్వర్‌టైజింగ్‌కు చోటు (విశాలమైన ప్రదేశం)ను ఉత్పత్తి చేస్తారు.

ఫేస్‌బుక్ తన వాడకందారులు సోషల్ నెట్‌వర్కింగ్ చేసుకొనటానికి వీలు కల్పించే అవకాశం అన్నదాని వెనుక, వాడకందారులు తన యొక్క లాభార్జన ప్రయోజనాలకు సేవ చేస్తున్నారన్న వాస్తవాన్ని మరుగున పెడ్తుంది.

రకరకాల పద్ధతులలో ఫేస్‌బుక్ వాడకందారులను ఆకర్షించి, ఎటువంటి వేతనం చెల్లించకుండా వారి శ్రమను దోపిడీ చేస్తుంది. ఉదాహరణకు ఫేస్‌బుక్ తన వాడకందారులను ఎటువంటి చెల్లింపులు లేకుండా, తన సైట్‌ను యితర భాషలలోకి అనువాదం చేసిపెట్టమని అడిగింది. వాడకందారులచే ఉత్పత్తి చేయబడ్డ ప్లాట్‌ఫారం తర్జుమాను ఫేస్‌బుక్ యాజమాన్యం, చాలా చక్కని, వివాదరహితమైన విషయంగా చూస్తుంది.

కానీ యీ విషయమై వికీపీడియాకు స్వచ్ఛందంగా అనువాదాలు చేసి యిచ్చే కేలిఫోర్నియాకు చెందిన వేలెంటిన్ మార్‌సియోస్ అనే దక్షిణ కొరియాలో ఇంగ్లీషు భాషను బోధించే ఉపాధ్యాయుడు ఇలా తెలియజేస్తున్నాడు : "లాభాపేక్ష లేకుండా నేను ఇంటర్నెట్ ఎన్‌సైక్లోపీడియా అయిన వికీపీడియాకు తర్జుమా చేసి యివ్వటానికి స్వచ్ఛందంగా ఒప్పుకొన్నాను. కానీ ఫేస్‌బుక్ అటువంటి లాభాపేక్షలేని, దాతృత్వ సంస్థ కాదు. ప్రజలు, మల్టీ మిలియన్ డాలర్ కంపెనీ అయిన ఫేస్‌బుక్ యొక్క వలలో (ట్రిక్కులో) పడి, దానికి వారి సమయాన్నీ



శక్తినీ దానం చేస్తున్నారు. కానీ ఆ కంపెనీ ఏదో ఒకరకమైన పరిహారం చెల్లించకుండానే (తర్జుమా ద్వారా) అనేక మిలియన్లను లాభంగా మూటగట్టుకొంటుందని ఎవరికీ తెలియదు."

ఇదేరకంగా సి.బి.ఎస్. కంపెనీకి చెందిన వర్క్-షాప్-ప్లే. (పనిచేయి, కొనుగోలుచేయి, ఆడుకో) అనే ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం తన యొక్క లక్ష్యం గురించి యిలా ప్రకటించింది : "మేము అభిప్రాయాలు, ఆలోచనలు, ప్రవర్తన లాంటి అనేకరకాల టాపిక్‌ల సాధారణ ఫీడ్‌బాక్ పట్ల (సమాచారం అందుకోవటం పట్ల) ఆసక్తి కలిగివున్నాం. అందుకుగాను మిమ్ములను ఒక వారంపాటు ప్రజలు ప్రస్తుత వార్తలపట్ల ఎటువంటి అభిప్రాయం కలిగి వున్నారో తెలుసుకోవటానికి సర్వేకు పంపుతాం. మరో వారం మీరు తరచుగా ఎన్ని కప్పుల కాఫీలు తాగుతారు, ఏ బ్రాండ్ కాఫీని కొంటారు, లేదా ఏ కాఫీ షాపులో తాగుతారు అనే విషయంపై సర్వే చేయమంటాం! లేదా కొత్త సాంకేతికతకు చెందిన ఏ పరికరాలను మీరు కొనుక్కొన్నారు, ఎందుకు వాటిని కొనుక్కొన్నారు అని ప్రజలను సర్వే చేయమని అడగొచ్చును. సి.బి.ఎస్. పెద్ద పేరున్న బ్రాండ్‌లతో ఔట్‌డోర్ వర్క్‌ను చేస్తుంది. వారికి తమ ఉత్పత్తులను అమ్ముకోవటానికీ, క్లయింట్లకు సేవలు అందించటానికి ఎంత బాగా అడ్వర్‌టైజ్‌మెంట్ చేసుకోవచ్చో మేము చెపుతాం. కొన్నిసార్లు సి.బి.ఎస్ ఔట్‌డోర్ వద్దనున్న పరిశోధక బృందం మీరు చేసిన సర్వే ఫలితాలను, ఈ బ్రాండ్లవారికి మార్కెటింగ్‌ను గురించీ, అమ్మకం గురించీ చెప్పాల్సిన విషయాలను సృష్టించి, సంసిద్ధం చేస్తాయి. కొన్నిసార్లు మా సర్వే ఫలితాలను ఫేస్‌బుక్, ట్విట్టర్లలో కూడా పోస్టుచేస్తాం. మేము యీ వర్క్-షాప్-ప్లే అన్న ప్లాట్‌ఫాంను ఏర్పాటు చేసినప్పుడు మా సభ్యులకు ఏ విధంగా ప్రతిఫలం చెల్లించాలని ఎంతో గట్టిగా ఆలోచించాము. మేము అందరికీ నచ్చుతుందనే ఒక బహుమతుల జాబితాను రూపొందించాం! ఆ బహుమతులు ఎటువంటివంటే : సినిమాకు, నాటకానికి టిక్కెట్లు, షాపింగ్ ఓచర్లు, మేగజైన్ పుస్తకాలకు చందా కట్టడం, బ్రిటన్‌లో పట్టణాలను సందర్శించేందుకు గైడ్‌బుక్స్‌కు చందా కట్టడం లాంటివి. అప్పుడప్పుడూ, పెద్ద హోటళ్ళలో రాత్రిపూట భోజనం పెట్టించడం లాంటివి. ఒకసారి ఒకే బహుమతి వుండవచ్చును. మరొకసారి 10 లేక అంతకన్నా ఎక్కువ బహుమతులు వుండవచ్చు!"

**పై ప్రకటనను బట్టి సోషల్‌మీడియా ప్లాట్‌ఫాంలు, తన వాడకందారులచేత ఉచితంగానో లేదా స్వల్పంగా ప్రతిఫలం యిచ్చో, పని చేయించుకొని, వారి అభిప్రాయాలు, ఆలోచనలు, అనుభవాలను డేటాగా మలచుకొని, లాభాలను ఆర్జించే వ్యాపారాలను నిర్వహిస్తున్నాయి అని అర్థమవుతుంది.**

ఈ రకంగా వాడకందారుల యొక్క శ్రమను, గ్లోబల్ ఐ.సి.టి. కార్మికుని యొక్క శ్రమలోని భాగాన్ని ఎటువంటి చెల్లింపు లేకుండా ఫేస్‌బుక్ లాంటి సోషల్‌మీడియా ప్లాట్‌ఫాంలు, దోపిడీ చేసుకొంటున్నాయి.

ఇతర వాడకందారులతో సంబంధం ఏర్పరచటం అందులో వాడకందారుకి కలిగే ఆనందం మాటున, యీ సోషల్‌మీడియా కంపెనీలు తాము జరుపుతున్న శ్రమదోపిడీని దాచివేస్తున్నాయి.

# అమెజాన్ కంపెనీలో శ్రమదోపిడి

డిజిటల్ సాంకేతికతపై ఆధారపడిన ప్లాట్‌ఫాంల ద్వారా వ్యాపారం చేస్తూ సూపర్ లాభాలను గడిస్తున్న కార్మికుల శ్రమను గరిష్టంగా దోచుకొంటున్న కంపెనీలలో అమెజాన్ కంపెనీ ఒకటి. ఇటీవలి కాలంలో దీని వ్యాపారం భారీ ఎత్తున మనదేశంలో కూడా విస్తరించింది.

అమెజాన్ మెకానికల్‌టర్ అనే ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం ఈ కంపెనీకి వుంది. 'పనికి మార్కెట్టు ప్రదేశం' అని యీ కంపెనీ చెప్పుకొంటుంది. ఈ కంపెనీ వ్యాపారస్థులకు డెవలపర్లకు డిమాండులో వున్న అవసరమైన సిబ్బందిని అందుబాటులోకి తెస్తుంది. ఈ ప్లాట్‌ఫాంపై క్లయింట్లు తమకు కావలసిన ఫలానా పనిచేసే కార్మికుల కోసం, వారు ఎంత వేతనం చెల్లిస్తారో తెలుపుతూ అడ్వర్‌టైజ్‌మెంట్ చేస్తారు. కార్మికులు వేలాది రకాల పనులలో తమకు నచ్చిన పనిచేయటానికి సిద్ధపడతారు. కంపెనీలు కోరిన సేవలు / పనులు చేయదలచుకొన్నవారు ఆన్‌లైన్‌లో ఆయా కంపెనీలతో సంప్రదిస్తారు. ఇరువర్గాలు అంగీకరించాక ఉద్యోగులు ఆ పని పూర్తిచేసి, క్లయింట్లకు ఆన్‌లైన్‌లో తమ ఫలితాలను సమర్పిస్తారు. సాధారణంగా యీ పనులు పూర్తిగా అనియతమైన పనులుగా వుంటాయి. ఉదాహరణకు ట్రాన్‌స్క్రిప్షన్ పనులుగా యివి వుంటాయి. అంటే ఒక భాషలో చేసే ఉచ్చారణను బట్టి, దాన్ని మరొక భాషలోకి రాయటం. అయితే ఒకరు ఒక గంటసేపు యింటర్వ్యూలో మాట్లాడినదాన్ని వేరొక భాషలోకి రాయాలి అంటే అందుకు ఆరుగంటల సమయం పడుతుంది. ఒక రకానికి చెందిన యీ ట్రాన్‌స్క్రిప్షన్ పనికి గంటకు 15 అమెరికన్ డాలర్ల నుండి 25 అమెరికన్ డాలర్లదాకా ఛార్జి చేస్తారు. కానీ యీ ప్లాట్‌ఫాం ద్వారా వచ్చే పనికి కేవలం గంటకు కేవలం మూడు లేక నాలుగు అమెరికన్ డాలర్ల వేతనమే ఆ పని చేసిపెట్టిన కార్మికులకు ముడుతుంది. ఈ రకంగా అమెజాన్ తన ప్లాట్‌ఫాం ద్వారా తాను లాభం పొందుతూ, కార్మికుల శ్రమ దోపిడీ చేసుకోవటానికి దళారీగా వ్యవహరిస్తుంది.

అమెజాన్ ఆన్‌లైన్ ద్వారా సరుకులు అందించే వ్యాపారాన్ని నిర్వహిస్తోంది. ఇందుకోసం అది సరుకులను నిలవ వుంచే అతిపెద్ద గోడౌన్‌లను, భారీఎత్తు వేర్‌హౌస్‌లను నిర్వహిస్తోంది.

జర్మనీ దేశంలో అమెజాన్ నిర్వహిస్తున్న అటువంటి భారీ వేర్‌హౌస్‌లో పనిచేసే కార్మికులు పని పరిస్థితులు గురించి, ఎ.ఆర్.డి. అనే ప్రభుత్వరంగ ప్రసార కేంద్రం ఒక డాక్యుమెంటరీని ప్రసారం చేసింది (2013లో). "అమెజాన్ జర్మనీలో యాజమాన్యపు దయా దాక్షిణ్యాలపై కాంట్రాక్టు కార్మికులు" అనే పేరిట ఆ డాక్యుమెంటరీ ప్రసారమైంది. అందులో యిలా రిపోర్టు చేసారు.

"అమెజాన్ జర్మనీ తన వేర్‌హౌస్‌లో 5,000 మంది వలస కార్మికులచేత పని చేయించుకొంటోంది. వీరు కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్నారు. వీరు పోలెండ్, రుమేనియా, స్పెయిన్, హంగేరీ తదితర దేశాల నుండి యిక్కడకు వలస వచ్చినవారు. ఈ కార్మికులకు అతి తక్కువ జీతం యిస్తున్నారు. ఆరుగురు నుండి ఏడుగురు కార్మికులు

గుంపులు గుంపులుగా చిన్న చిన్న గుడిసెల్లో నివాసముంటారు. ఒక్కో గుడిసెలో రెండు చిన్న చిన్న గదులే వుంటాయి. ఈ కార్మికులు ఎవరూ మరొకరని ఎరిగివున్నవారు కాదు. వీరు తాత్కాలిక కంపెనీల ద్వారా, తాత్కాలిక పని ఒప్పందాలతో పనికి కుదురుతారు. వీరి పని నియామక ఒప్పందాలు జర్మన్ భాషలో వుంటాయి. చాలామంది కార్మికులు జర్మన్ భాషను అర్థంచేసుకోలేరు. ఆ వేర్‌హౌస్‌లో పనిచేసే ప్రతీ కార్మికుడు రోజుకు 17 కిలోమీటర్ల దూరం నడుస్తాడు. అందువలన వీరి పాదాలు, చర్మం దెబ్బతింటాయి. ఈ కార్మికులు ఒప్పందపత్రంలో (పని నియామక) ఏమి వ్రాసి వుందో చూడకనే సంతకాలు పెడతారు. అందువలన వీరిని పనిలో పెట్టుకొనేముందు వీరికి వాగ్దానం చెయ్యబడ్డ వేతనం కన్నా తక్కువ వేతనం ఇస్తారు. ఉదాహరణకు ఒక కార్మికుడికి గంటకు 9.68 యూరోల వేతనం యిస్తామని వాగ్దానం చేసినా, తీరా ఒప్పందపత్రంలో చూస్తే గంటకు 8.52 యూరోల వేతనమే యిస్తామని వ్రాయబడి వుంది. అమెజాన్ యీ కార్మికులను తన యిష్టానుసారం పనిలో పెట్టుకోవచ్చును – పని నుండి తొలగించవచ్చును. వెర్డీ కార్మిక సంఘ నాయకుడు యీ కార్మికులను "హక్కులు లేని కార్మికులు"గా పేర్కొంటాడు.

ఈ కంపెనీలో డ్రైవరుగా పనిచేస్తున్న ఒక కార్మికుడు యిలా అంటున్నాడు : "నేను బానిస వ్యాపారాన్ని సమర్ధించను. ఈ తాత్కాలిక పనిని అంగీకరించను. ఆ కార్మికుల దగ్గర చాలా తక్కువ డబ్బు వుంటుంది. తరచుగా వాళ్ళు క్యాంటీన్‌లో తమకు కాఫీ యిప్పించండి అని అడుక్కొంటారు". ఒక స్పానిష్ కాంట్రాక్టు కార్మికుడు యిలా అన్నాడు : "అది ఒక యంత్రం లాంటిది. ఆ యంత్రంలో మేము ఒక చిన్న నట్టులాంటివాళ్ళం". ఈ డాక్యుమెంటరీలో అమెజాన్ తన కార్మికులు కోసం చెల్లించాల్సిన సామాజిక భద్రతాటాక్స్‌ను చెల్లించకుండా ఏ రకంగా ఎగవేస్తుందో, వివరించారు. అమెజాన్‌లో పనిచేసే కార్మికులు తమ పని ప్రదేశానికి ఎంతో దూరం క్రిక్కిరిసిన బస్సుల్లో ప్రయాణించి చేరుకోవాలి. ఒకవేళ బస్సులు ఆలస్యంగా చేరుకొంటే వేతనంలో కోత పడుతుంది. కార్మికులు గంటలకొద్దీ వేచివుండి గంటలపాటు ప్రయాణం చేయవలసి వుంటుంది. ఈ కార్మికులను, బయట కూడా ఏ సమయంలోనైనా యాజమాన్యం అదుపు చేయగలదు. కంపెనీ సెక్యూరిటీగార్డులు కార్మికులు నివాసముంటున్న హౌసింగ్ ఎస్టేట్లలోనూ, వారు తిండితినే భోజనశాల గదుల్లోనూ, ఫ్యాక్టరీ ఆవరణలోనూ అనుక్షణం పహారా కాస్తూనే వుంటారు. అంతేకాక హెచ్.యు.ఎస్.ఎస్. కంపెనీకి చెందిన యీ సెక్యూరిటీ గార్డులు పారామిలటరీ దళాలుగా వ్యవహరిస్తారని యీ డాక్యుమెంట్లో చూపించారు. కార్మికులు యిళ్ళలో లేనప్పుడు యీ సెక్యూరిటీ గార్డులు వారి యిళ్ళలో ప్రవేశించి ఫోటోలు తీసుకొంటారు. ఒక కార్మికుడు యిలా చెప్పాడు : "మేము తిండి తింటున్నప్పుడూ యీ సెక్యూరిటీ గార్డులు అన్నిచోట్లా వుంటారు. మేము యిళ్ళలో లేనప్పుడూ, మేము నిద్రపోతున్నప్పుడూ లేదా మేం స్నానాల గదిలో స్నానం చేసేటప్పుడు కూడా యీ గార్డులు ప్రవేశించి అక్కడా మమ్మల్ని చూస్తూ వుంటారు."

మరొక కార్మికుడు యిలా చెప్పాడు : "ఈ గార్డులు యిది మా ఇల్లు, మేం చెప్పినట్లు చేయండి, మేము యిక్కడ పోలీసుల్లాంటివాళ్ళం!" అంటూ వాదిస్తారు. ఈ గార్డులలో కొంతమంది నియో–నాజీ బ్రాండ్ కంపెనీ అయిన థోర్ స్టీయనార్‌కు చెందిన దుస్తులను ధరిస్తారు.

ఆ రకంగా అమెజాన్ జర్మనీ, తన కార్మికులను, ఆధునిక నాజీతరహా బానిస క్యాంపులాంటి పనిపరిస్థితులలో పని చేయించుకొని వారి శ్రమశక్తిని, దారుణంగా దోపిడీ చేస్తోంది.

అమెరికా అధినేత అయిన జో బైడెన్ అమెజాన్ కార్మికులు సంఘాన్ని ఏర్పాటుచేసుకొనే హక్కును సమర్ధిస్తున్నానంటూ ప్రకటిస్తూనే, మరోవైపు వారు యూనియన్ పెట్టుకొనటానికి సమ్మతి తెలుపుతూ ఓటును వేయకుండా నిరోధించారు. ఇలా వారు యూనియన్ పెట్టుకోవటానికి వీలులేకుండా చేసిన ఒక ఉదాహరణను యిటీవలనే మనమందరం చూశాం!

అమెరికా దేశంలోని అలబామా వేర్‌హౌస్‌లోని కార్మికులు చట్టప్రకారం యూనియన్‌ను పెట్టుకోవటానికి ఏప్రియల్ 2021లో ఎన్నికలు జరిగాయి. 3,215 మంది కార్మికులు ఓట్లు వేయగా, మెజార్టీ ఓట్లు "యూనియన్ వద్దు!"కు పడ్డాయి. కేవలం 600 మంది మాత్రమే 'యూనియన్ కావాలి' అని ఓటు వేశారు. అమెజాన్ 26 సంవత్సరాల చరిత్రలో రెండుసార్లే యీ రకమైన ఎన్నికలు జరిగాయి.

అమెజాన్ కంపెనీ అధికారికంగా యూనియన్లను వ్యతిరేకించకపోయినా, అలబామా వేర్‌హౌస్ కార్మికులు యూనియన్ పెట్టుకోవటానికి వ్యతిరేకిస్తూ, పరోక్షంగా పనిచేసింది. అందుకోసం కార్మికుల బాత్‌రూంలలో, యూనియన్ వద్దు అనే ఫ్లయర్స్ (బ్యానర్లు) ఎగురవేసింది. యూనియన్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా సమావేశాలు నిర్వహించింది. ఆఖరుకు యూనియన్ అవసరం లేదని వాదించే ఒక వెబ్‌సైట్‌ను ప్రారంభించింది.

సామాజిక కార్యకర్తలూ, రాజకీయ నాయకులూ యూనియన్ పెట్టుకోవటాన్ని ఎంతగా సమర్ధించినా, అమెజాన్ యాజమాన్యం ఎంతో చాకచక్యంగా యూనియన్ పెట్టుకోకుండా, ఓట్లు రాకుండా శాసించి, ఆ ప్రయత్నాన్ని నిరోధించింది.

ఈ రకంగా అమెజాన్ కంపెనీ, ప్రపంచమంతటా, తన ఈ–కామర్స్ వ్యాపారం ద్వారా కార్మికుల శ్రమశక్తిని కొల్లగొట్టి ఏటా మిలియన్లకొద్దీ డాలర్ల లాభాలను కూడగట్టుకొంటున్నది.

## ముగింపు

పైన పేర్కొన్న అధ్యయనాలు, 2014 వరకూ జరిగిన అధ్యయనాల సారాంశంపై ఆధారపడి క్రిష్టియన్ ఫుక్స్, శ్రామికవర్గ సిద్ధాంతపు వెలుగులో, అనేక రూపాలలో ఉన్న డిజిటల్ శ్రమ యొక్క స్వభావ, స్వరూపాలను సిద్ధాంతీకరించారు.

సమాచార, సమాచారప్రసార సాంకేతికత, దానికదే సంపదను సృష్టించదనీ, అది కేవలం ఒక ఉత్పత్తి సాధనమేనని, మానవ శ్రమ



వల్లనే యీ సాంకేతికత ద్వారా సంపద సృష్టింపబడుతుందనీ, డిజిటల్ పరిశ్రమల ఉత్పత్తిలో మానవశ్రమ అదనపువిలువను సృష్టిస్తోంది, ఈ అదనపువిలువే పెట్టుబడి ప్రోగువేతకు కారణం, పెట్టుబడిదారులైన పరిశ్రమాధిపతులు సాంకేతికతను తమ అదుపులో పెట్టుకొని, మానవశ్రమను (కార్మికుల అదనపు శ్రమను) దోపిడీ చేసుకొంటూ, లాభాలను వృద్ధి చేసుకొంటున్నారు. యీ వాస్తవాన్ని కప్పిపెట్టడానికి సమాచార, సమాచార సాంకేతికత అన్నదాని సుగుణాలు అనబడేవాటిని పదేపదే ప్రచారం చేస్తూ, యిప్పుడు సమాజంలో వర్గఘర్షణ జరగాల్సిన అవసరం లేదనీ చెప్పుతున్నారు. కానీ యీ సాంకేతికత వర్గపోరాటాల అవసరాన్ని రద్దుచేయకపోగా, వర్గపోరాట అవసరం మరింతగా పెరిగిందనీ ఆయన సిద్ధాంతీకరించారు.

డిజిటల్ పరిశ్రమలో వివిధ రూపాలలో సాగుతున్న శ్రమ దోపిడీని, దాని స్వభావాన్ని అర్థం చేసుకోవటానికి యీ "డిజిటల్ శ్రమ – కార్ల్‌మార్క్స్" అన్న గ్రంథం చక్కగా ఉపయోగపడుతుంది. **(అయిపోయింది)** ✦

కవిత

## వెన్నెలా! కన్నతల్లీ! పేదోడి దీపమా!

– రావిశాస్త్రి

వెన్నెలా వెన్నెలా
నువు చూపే దృశ్యాలకి మనసు చెదురుతుందే వెన్నెలా
నువు చూపే చిత్రాలకి గుండె కరుగుతుందే వెన్నెలా
అది సహజమే వెన్నెలా
కాని ఆయా దృశ్యాలకి, చిత్రాలకి
నీ తడిలో పడుచు రక్తం ఉడుకుతుందే వెన్నెలా
అది కూడా అతి సహజం కాదటమ్మా వెన్నెలా

అవును – యువకరక్తం ఉడుకుతుంది వెన్నెలా
సుళ్ళుగా పరవళ్ళు తొక్కుతుందది వెన్నెలా

వెన్నెలా ఓ వెన్నెలా
అవునానాడూ వెన్నెలే
ఎడతెరిపి లేకుండా, పట్టపగ్గాల్లేకుండా
దివి నుండి భువికి కురిసినది ఆనాడది
ఎంతో చక్కని వెన్నెలే
ఆ వెన్నెల్లో
ఆ శారదరాత్రిలో
తన ఇంటి ముంగిట నీడలో
బితుకు బితుకుమని కూర్చున్నప్పుడు
తనకి వినిపించినవి కేకలే
ఆవేశపు కేకలు విని వేడెక్కినది తన రక్తమే
అంతలోనే ఆ కేకల మధ్య
ఆ సత్యాహింసల మధ్య
ఏవిటివి అవేవిటివి?
అవి
అధర్మానివి మరతుపాకులే
అన్యాయానివి కోరల కరువులే
ఊరుకోలేక ఉండబట్టలేక
వడివడిగా తడబడుతూ వెళ్లిచూస్తే
మిల్లు చుట్టూ మరతుపాకులే
వాటికెడంగా జనప్రవాహమే.

పైకి చూస్తే
ఆకాశం నిండా ఏటి చల్లని వెన్నెలే
చుట్టూ చూస్తే
వీధి నిండా వెండి తెల్లని వెన్నెలే వెన్నెలే
కింద చూస్తే
రోడ్డు నిండా ఉడుకు రక్తపు మడుగులే మడుగులే
అందులో ఎర్రనెర్రని వెన్నెలే తడివెన్నెలే

ఏ బాధలు చూడలేక
ఏ అన్యాయాలని సహించలేక
ఏ అధర్మాన్ని క్షమించలేక
ఏ మంటలు భరించకపోతే పోయిందని
ఏమయితే అయిందని ఎదిరించి నిల్చిన
తన కొడుకు ప్రాణపు వేడి నెత్తురు
ఎక్కడమ్మా వెన్నెలా?

నెత్తురంతా చిమ్మి
అరవైమందొక్కసారి కూలినపుడు
నెత్తురంతా ఒకటే
అవును తల్లీ ఒక్కటే
మా నెత్తురంతా ఒక్కటే.

(రావిశాస్త్రి కవిత్వం – ఎన్నెలో వెన్నెల నుండి) ✦

# సామాజిక, సాంస్కృతిక జీవనాన్ని రికార్డు చేసిన
# రావిశాస్త్రి కథలు

– గౌరీశంకర్

**సజీవమైన** తన రచనల ద్వారా ఇరవయ్యో శతాబ్దపు రెండవ అర్థభాగంలో తెలుగు సామాజిక, సాహిత్యరంగాలపై గొప్ప ప్రభావాన్ని వేసిన ప్రముఖ రచయిత రాచకొండ విశ్వనాథశాస్త్రి. ఆయన సమాజంలోని అన్యాయాలపై, దోపిడిపై, పెత్తందారీ విధానపు దౌష్ట్యంపై అక్షరాయుధాలను సంధించి వదిలాడు. ఆయన ఎన్నుకున్న వస్తువులు, శిల్పం, కథనాన్ని నడిపిన క్రమం, వ్యంగ్యోక్తులు పాత్రలను సజీవంగా మనముందు సాక్షాత్కరింపజేసిన వర్ణనాచాతుర్యం, ఉత్తరాంధ్ర మాండలికాన్ని వాడిన తీరు దేనికదే సాటి. ఆయన ఉపయోగించిన భాష కూడా అతిసరళంగా వుండి చదువరులను హాయిగా ముందుకు నడిపిస్తుంది.

"చట్టాలు, న్యాయస్థానాలు, పోలీసు వ్యవస్థ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న సంపన్నుల రక్షణకే ఎక్కువగా పాటుపడుతున్నాయి. నల్లకోటు ధరించిన దురాశాపరులు, పోలీసులు కలిసి చట్టంలోని లొసుగులను ఆధారంగా న్యాయాన్ని మంటగలుపుతున్నారు" అంటూ న్యాయం కోసం నిలబడ్డ న్యాయవాదిగా అటు వృత్తిరీత్యా, రచయితగా ప్రవృత్తిరీత్యా పేదలకు, దళితులకు, అణగారిపోతున్నవారికి న్యాయం జరగాలని నిజాయితీగా కోరుకున్న ప్రజారచయిత రావిశాస్త్రి.

"కూలీలు మరియు వ్యవసాయదార్లు వారి స్వంత ప్రయోజనాలను కాపాడుకోవాలి. వారు అణచివేతను సహించకూడదు. పాలకులు హిరణ్యకశిపులుగా మారినపుడు ప్రజలు ఉగ్రనరసింహులు కావాలి" అని సామాన్యులకు ఉద్బోధ చేశారు.

రచయిత అయిన ప్రతివాడు తాను చేసే రచనల మూలంగా మంచికి హాని, చెడుకు ఉపకారం జరగకుండా జాగ్రత్త వహించాలని వారి బాధ్యతను గుర్తుచేసాడు.

ఆయన రచించిన 'ఆరు సారా కథలు' ఆయనకు రచయితగా మంచిపేరును తీసుకువచ్చాయి. ఈ 'ఆరు సారా కథ'ల్లో ప్రత్యేకంగానూ, ఇంచుమించు ఆయన రచనలు అన్నిటిలోనూ ప్రఖ్యాత జర్మన్ నాటక రచయిత బెర్టోల్డ్ బ్రెష్ట్ పరాయీకరణ సూత్రం కనిపిస్తుంది. అంటే పాఠకులు కథలతో తాదాత్మ్యం పొందుతూన్న సమయంలో దాన్ని విచ్ఛిన్నం చేస్తూ, ఇది కథ అనుకుంటూనే దానిలోని సామాజిక, రాజకీయ, నైతిక సంఘర్షణలను గ్రహించేలా చేయడం. వృత్తిరీత్యా ఈ కథలోని కేసుల వంటివి ఆయన చాలానే వాదించి ఉంటారు. అందువల్లనే ఈ కథలన్నీ వాస్తవికతకు ప్రతీకలుగా వుంటాయి. వాటిలోని పాత్రలు మనతో ప్రత్యక్షంగా సంభాషిస్తున్న అనుభూతికి పాఠకులు గురవుతారు. ఎన్ని జీవితాల్ని దగ్గరగా, లోతుగా పరిశీలిస్తేనో కదా ఇంత సహజంగా వ్యాఖ్యానించడం!

'ఆరు సారా కథ'ల్లో రాజ్యం వలసవాద శిక్షాస్మృతి అడుగుజాడల్లోనే నడుస్తూ తన ప్రధాన అంగాలైన పోలీసు, న్యాయవ్యవస్థల సహాయంతో బడుగువర్గాలవారిని ఎలా అణచివేస్తుందో వ్యంగ్యంగా, విమర్శనాత్మకంగా ఇంకా చెప్పాలంటే ఒక తిరస్కారభావంతో రాశాడనిపిస్తుంది. జీవనాన్ని కొనసాగించడానికి తప్పనిసరి పరిస్థితుల్లో బడుగులు (ముఖ్యంగా స్త్రీలు) సారా వ్యాపారంలోకి దిగడం గురించీ – అటు పోలీసులు, ఇటు న్యాయవాదుల మధ్య చెరుకు క్రషర్‌లో చెరుకుముక్కలా నలిగిపోవడం గురించీ – పేదవర్గాల పట్ల సహానుభూతితో, వారి నిస్సహాయతను, జీవితాల్ని కోల్పోతున్న పరిస్థితులను తన రచనలలో అక్షరబద్ధం చేసాడు.

'పాపి' కథలో సారా వ్యాపారంలోని ముఠాల మధ్య తగాదాలు, సర్దుబాట్లు, ఒకరి వ్యాపారాన్ని మరొకరు ఆక్రమించుకునేందుకు ఎత్తులు పై ఎత్తులు ఎలా వేసేదీ; అవసరమైతే కేసులు తమ మీద వేసుకుని జైలుకు వెళ్ళడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా వుండే మనుషుల్నీ, యజమానులను కేసుల నుండి బయట పడేయటానికి పక్కనే వుండే లాయర్లు, సలహాలివ్వడానికి ఆంతరంగిక కార్యదర్శులు, చూసీ చూడనట్లు వ్యవహరించే పోలీసులు మనకు కనబడతారు.


కథ మొదట్లోనే "మొత్తం మీద అందరి చలవవల్లా, ఒడుదుడుకులేమీ లేకుండా త్రివేణీ సంగమం వద్ద సరస్వతీనదిలా ఊరంతా సారా ప్రవహిస్తోంది" అంటాడు. ఈ ఒక వాక్యంలోనే సారా యజమానుల మధ్య; యజమానులు – పోలీసుల మధ్య సర్దుబాట్లు ఎలా ఉంటాయో చెప్పాడు. త్రివేణీ సంగమం అంటేనే మూడు నదుల కలయిక. సరిగ్గా అక్కడే సరస్వతీనది. సరస్వతీనది అంతర్వాహిని. ఈ పోలిక సారా ఆ వూళ్ళో ఎంత విచ్చలవిడిగా దొరుకుతుందో, ఎంత సులువుగా చేతులు మారుతుందో, అడ్డంకుల్ని సులువుగా ఎలా దాటుతుందో – ఇన్ని అర్థాలు స్ఫురిస్తున్నాయి పై ఒక్క వాక్యంలో.

"సెక్రటరీ చూపు మాయని దాచినది. మొత్తం మీద సంస్కృతీ విజ్ఞానాలు అతని సొమ్ము" అంటూ వ్యంగ్యంగా సారా యజమానుల వద్ద, పెత్తందార్ల వద్ద ఉండే ఆంతరంగికులు అన్ని విషయాల్లోనూ ఎలా ఆరితేరి ఉంటారో, వాళ్ళు మేకవన్నె పులుల్లా ఎలా వుంటారో చెప్పాడు.

"దక్షిణ అమెరికాలో అమెరికన్ రాయబారి మాట వంటిది ఇన్‌స్పెక్టరుగారి మాట. ఆ మాటకి తిరుగులేదు" అంటూ అమెరికన్ సామ్రాజ్యవాదం మూడవ ప్రపంచ దేశాలన్నిటినీ ఎలా శాసిస్తుందో సింబాలిక్‌గా చెప్పాడు.

"బస్! అంతే! ఇంజను మరింక ఆగదు" అంటూ పామరజనం మాట్లాడుకునే భాషతో, యాసతో సాహిత్యాన్ని సృష్టించాడు.

సారా కథల్లో రెండవది 'మాయ'. కథాంశానికి సరిగ్గా అతుక్కుపోయే శీర్షిక 'మాయ'. ఈ కథ చదువుతున్నంతసేపు మన న్యాయవ్యవస్థ, పోలీసు వ్యవస్థలను స్కాన్ చేసి రాసాడా అనిపిస్తుంది. ఈ కోర్టులూ, జైళ్ళు, సాక్షులూ, 'లా' పుస్తకాలు.... అన్నీ ఇంగ్లీషువాడి చలవే అంటాడు. నిజమే కదా మన రాజ్యాంగం 1935 భారత ప్రభుత్వ చట్టం ఆధారంగానే



రాయబడిందంటారు. ఇప్పటికీ ఇంగ్లీషువాడు చేసిన చట్టాలనే మనం అనుసరిస్తున్నాం. ఇప్పుడు విస్తృతంగా ప్రజల నోళ్ళలో, పత్రికలలో, ప్రసార మాధ్యమాలలో వినబడుతున్న 'దేశద్రోహం' చట్టం కూడా 1870లో ఇంగ్లీషువాడు చేసిందే.

"అసలైన మాయగాడు ఇంగ్లీషువాడే. అసలుకే ఎసరొచ్చే పరిస్థితి వచ్చేసరికి స్వతంత్రాన్ని తన ఏజెంట్లయిన (దళారీలు) టాటాలకు, బిర్లాలకూ అప్పగించి వెళ్ళిపోయాడు" అంటాడు. వలస పాలన స్వరూపాన్ని, సామ్రాజ్యవాద తత్వాన్నీ సులభమైన మాటలతో తెలియ చేశాడు. దేశంలో దళారీ వ్యవస్థ పాతుకుపోయింది. దీనికి ప్రతీకగా 'జామీను మనిషి'ని చూపించాడు. ఆ పాత్రచేత "తమరిత్తమరు తీసుకోండి – మాది మాకు పారేయండి" అని చెప్పించాడు. దీనినే ఇప్పటి ఆర్థిక పరిభాషలో 'క్విడ్ ప్రోకో' అంటున్నారు. పంచాయితీ స్థాయి కాంట్రాక్టరు నుండి ప్రధానమంత్రి కార్యాలయం వరకూ పరస్పరం ఇచ్చి పుచ్చుకునే పద్ధతినే అనుసరిస్తున్నారు.

"నువ్వేకాదు, ఈ బాబే కాదు ఏ మనిసి మంచోడని ఒవురు సెప్పినా నాను నమ్మను, ఈ నోకంల డబ్బ్భా యాపారం తప్ప మరేట్నేదు. పసువులు – నోర్లేని సొమ్ములు. ఆటికి నీతుంది కానీ మనకి లేదు" అని ప్రధానపాత్ర ముత్తేలమ్మ చేత చెప్పిస్తాడు. ఈ మాటలు మానవ సంబంధాలు ఎంతలా వ్యాపారమయ్యాయో చెబుతున్నాయి. సమాజాన్ని అవినీతి ఎంతగా కమ్ముకుందో కూడా చెబుతున్నాయి. పక్కనున్నవాడిని, చివరికి తోబుట్టువులను కూడా నమ్మలేని పరిస్థితుల్లో మనం బతుకుతున్నాం.

కేసును వాదించిన లాయరుకే కోర్టులో ఏం జరిగిందో తెలియలేదు. అంతా ఒక మాయలా వుంది. కేసు చిక్కుముడి ఎలా వీడిందో? పోలీసువ్యవస్థ తలచుకుంటే తానే కేసులు సృష్టించగలదు, కేసులు లేకుండా మాయ కూడా చేయగలదు. దోపిడీవ్యవస్థ సృష్టించిన మాయ, మనిషి మనిషికీ మధ్య మాయ తెరలను ఎలా సృష్టించిందో ఈ కథలో రచయిత ఆవిష్కరించాడు. "సారా టూబులూ, గాజు గలాసులూ దాసుకున్నాను గానీ కన్నకూతుర్ని దాసుకోలేకపోనాను. ఏం బతుకు బాబూ నాది?" ముత్తేలమ్మ పాత్ర చేత చెప్పించిన ఈ మాటలు అణగారిన జీవితాల్లో ఉండే విషాదాన్ని మన కళ్ళముందు ఆవిష్కరింపజేస్తుంది.

సారా కథల్లో మూడవది 'న్యాయం'. ఈ కథలో న్యాయస్థానాల్లో పేరుకుపోతున్న పెండింగ్ కేసులు, వాటిని క్లియర్ చేయాల్సిన సందర్భంలో తొందర తొందరగా మేజిస్ట్రేటులు తీసుకునే తప్పుడు నిర్ణయాలు, అమాయకులకు శిక్షలు పడడం, ఆ ఒత్తిడిని తట్టుకోలేని సున్నిత మనస్కులైన న్యాయమూర్తులు ఎంత ఆవేదనకు గురయ్యేదీ చూపించాడు. కథకు ఒకవైపు ఇదుంటే మరొకవైపు వేశ్యల జీవితాలు విటులకు, పోలీసులకు, న్యాయవాదులకు మధ్య ఎలా నలిగిపోతాయో చూపించాడు. ఇది చదివినపుడు నాకు "తను శవమై.... ఒకరికి వశమై.... తనువు పుండై..... ఒకరికి పండై.... ఎప్పుడూ ఎడారై.... ఎందరికో ఒయాసిస్సై...." అనే అలిశెట్టి ప్రభాకర్ కవిత గుర్తుకు వచ్చింది.

కథ మొదట్లోనే "గుప్పున సారా కంపు! కోర్టు. గొల్లున సంతగోల! కోర్టు. అబద్దాల పాముల పుట్ట! కోర్టు. బందిలదొడ్డికి రాచబాట! కోర్టు." అంటూ చిన్న చిన్న పదాలతో కోర్టు నిజస్వరూపాన్ని నగ్నంగా మన కళ్ళముందుంచాడు.

"అన్నీ సమస్యలే, ఏదీ యెవరూ సాఫీగా నడవనివ్వరు" అన్న జడ్జిగారి మనోవేదన మన పాలక గణానికీ, అధికారవర్గాలకీ సరిగ్గా సరిపోతుంది. ఇక్కడ ఏ వ్యవస్థనూ సక్రమంగా నడవనివ్వడంలేదు. పేదవాడికీ, కష్టజీవులకే కాదు మధ్యతరగతి వర్గానికి కూడా అన్నీ సమస్యలే.

మేజిస్ట్రేటుగారికి కాళ్ళు తేలిపోతున్నట్టుగానూ, బరువుతో దిగలాగి పోతున్నట్టుగానూ రెండు విధాలుగా కూడా వుంది. "పోనీ ప్రథమ తప్పు క్రింద వదిలేస్తాను" అన్నాడు మేజిస్ట్రేటు. "పాతకేసులు మరో మూడున్నాయి బాబూ దీనిమీద" చివరికి నాలుగు కేసుల్లోనూ కలిపి "ఒక నెల" అన్నారు కోర్టువారు. "న్యాయం" అన్నాడు హెడ్డు. ఇక్కడ ఎవరికి న్యాయం జరిగిందో, ఎవరు న్యాయం చేసారో చెప్పలేం. కొండలా పేరుకుపోయిన కేసులొకవంక, "అయినా అది కూడా మనలాంటి మనిషేగా" అని వేశ్యల బతుకుల పట్ల సానుభూతి మరొక వంక, చట్టబద్ధ దగుటచే మనసు చంపుకొని ఒకనెల జైలుశిక్ష వేయక తప్పింది కాదు.

"ఒకరు కాదు, ఇద్దరు కాదు. ఒక్క రాత్రికి అంతమంది ఇలా కరిసేసి, రక్కేసి, రక్తం తాగేసి ప్రాణాలు తీసేస్తే నిన్న రాత్రి – ఇందరు ప్లీడరు బాబులు, యిందరు జవాను బాబులు, ఇందరు ధర్మప్రభువులు ఇంతమందీ వున్నారు. నిన్న రాత్రి ఏ బాబొచ్చి అడ్డుకున్నారు?" అని వేశ్య పాత్ర చేత మదమెక్కిన మానవ మృగాలు ఎంత పాశవికంగా ప్రవర్తిస్తున్నదీ చెప్పించాడు. ఈ వాక్యాలు చదువుతుంటే పాఠకులకు కూడా "ఆమె కూడా మనిషే కదా!" అని హృదయం ద్రవించక మానదు. 'నేరమే అధికారమై ప్రజలను నేరస్తులను చేసి వేటాడుతుంటే ఊరక చూస్తూ కూర్చున్న ప్రతివాడూ నేరస్తుడే' నన్నట్లు పాఠకుడ్ని మేల్కొల్పుతోంది.

'మోసం' కథలో నమ్మించి మోసం చేసే పాత్రలను, అమాయకంగా నమ్మి మోసపోయే పాత్రను, మధ్యలో పోలీసులు అమాయకులు నెత్తిమీద ఎలా చేతులేసేదీ చూపించాడు.

"నువ్వెర్రి పీరువి. శిశువుని గురువుకి బోధజేస్తున్నాను, ఇనుకో! నోకంలో యెవరు ఈ రోజుల్లో బావుపడాలన్నా, డబ్బుండాలి! మాయుండాలి! దబాయింపు సెక్సనుండాలి! బోధపడిందా! డబ్బులో దేవుడున్నాడు" అని నమ్మకమైన శిష్యుడిలా నటించిన అప్పారావు పాత్రచే పలికించాడు. జీవితంలో నెగ్గుకురావడానికి ఏ లక్షణాలు అవసరమో మూడు ముక్కల్లో చెప్పించాడు. 60ల్లోనే ఈ విధమైన సంభాషణ రాసాడంటే అప్పటికే సమాజంలో మాయలు, మోసాలు, కపటం, దబాయింపులు ఉన్నాయన్నమాట. ఈ రోజుల్లో అయితే అసలు చెప్పనవసరంలేదు. ఎన్నో రూపాల్లో మోసం జరుగుతుంది. అమాయకులు, అట్టడుగువర్గాలవాళ్ళు నిత్యం మోసపోతూనే వున్నారు. దళితుల, బలహీనుల భూముల్ని దబాయించి కబ్జాలు చేస్తున్నారు. ఇదే అప్పారావు పాత్రచే "గవర్నమెంటంటే ఓట్లు కాదు.... నోట్లు" అని చెప్పించాడు. ఓటుకు నోటు వ్యవహారం ఇవాళ చాలా మామూలు విషయం అయిపోయింది. డబ్బుకు లోకం దాసోహం అన్నది నిత్యసత్యం దీనినే "డబ్బుంటే అంతమందిరీ దేవుళ్ళే. లచ్చి తల్లికి జాతి భేదం నేదు" అని చెప్పించాడు.

ఇదే కథలో మాయలు, మోసాలు చేయడంలో ఆరితేరిన పోలీసులు తమ విధి నిర్వహణలో ఎన్ని అగచాట్లు, అవమానాలు, మోసాలకు

గురవుతుంటారో హెడ్ కానిస్టేబుల్ పాత్ర ద్వారా చెప్పించాడు. "ఇదెక్కడి పోలీసుద్యోగంరా నాయనా! సస్తన్నాం! తెల్లర్లేస్తే నాలుగు సెవాలు, పదెక్సిడెంట్లు, యిరవై సోరీలు! ఈటితో సస్తంటే ఇయి సాలక ఎయ్యిమందికి బందోబస్తులు. రోజుకి పీకలమీదికి తకతక్కువ తొంబైమంది మినిష్టర్లు. ఈల్లందరి కోసం ఎండల మన పడిగాపులు. తిండుండదు, కంటిమీద కునుకుండదు. ఇయన్నీకాక కుక్క జట్టీలు. దేసెంల యింతమంది లంజికొడుకులు ఉన్నారుగానీ ఒక్కడూ కాణీ కసగడు గదా! ఎవణ్ణెత్తిమీద సేతులెడదామా అని మనం ఎయ్యి కళ్ళతో యెదుకుతుంటే, ఎనకనుంచి సబిన్స్పెట్రుబాబు మన నెత్తిమీన యేస్తాడు అస్తం!"

ఈరోజు పోలీసులతో స్నేహం చేయడం కూడా చాలా ప్రమాదకరమని అందరూ అంటుంటారు. విపరీతమైన బాసిజమ్ వుంటుంది, మరోపక్క రాజకీయ ఒత్తిడి. జగన్మోహనరెడ్డి 62 ఏళ్ళకు సర్వీస్ పెంచితే ఎందుకురాబాబూ సస్తన్నాం అని చాలామంది పోలీసులు అంటున్నారు. ఒక పక్క డబ్బుకి ఆశపడుతూనే విపరీతమైన ఒత్తిడికి, సంఘర్షణకూ లోనవుతున్నారని రచయిత చెప్పాడు.

'ఎండ' కథ పేదరికంలోని దైన్యం, విషాదం, నిస్సహాయతలను మన కళ్ళముందుంచింది. ఈ కథ చదువుతున్నపుడు నాకు చాసోగారి 'కుంకుడాకులు' కథ గుర్తుకు వచ్చింది. ఈ రెండు కథల్లోనూ ఆరేళ్ళ అమ్మాయిలు పేదరికంతో పడే అవస్థలు మనల్ని కదిలిస్తాయి. 'ఎండ' కథలో "అమ్మా! అమ్మా! ఎండెప్పుడొస్తుందమ్మా?" అని శారదమ్మ ఆరేళ్ళ కూతురు అడుగుతుంది. అప్పుడు ఈ ప్రశ్న పాఠకులకేమీ అర్థంకాదు. కానీ కథ చదువుతూ పోతుంటే ఆ అమ్మాయికి, ఆ కుటుంబానికీ ఎండ ఎంత అవసరమో పాఠకులకు అర్థమవుతుంది. కథనాన్ని నడిపించిన తీరు అద్భుతంగా వుంది. కథలోని పాత్రలన్నీ మనముందు సజీవంగా ప్రత్యక్షమవుతాయి. వర్షం కొంతమందికి హర్షాన్నిస్తే రోడ్డెక్కితేనే గానీ పూట గడవని ఎందరో అభాగ్యులకు తీరని వ్యధను మిగులుస్తుంది. ఈ విషయాన్ని 'ఎండ' కథలో రచయిత చాలా నైపుణ్యంగా, చదివేవారి గుండెల్లో ఏ మూలనో వున్న తడిని ఊరేలా శ్రద్ధగా మలిచాడు.

ఎన్ని కష్టాలు వచ్చినా శారదమ్మ దేముని పై విశ్వాసాన్ని వదులుకోలేదు. "దేముని దయుంటే ఎండ వస్తుందమ్మా!" అంటుంది బిడ్డతో. "దేమునికి మనందరిమీదా కోపమా? అని బిడ్డ అడిగితే "లేత్తల్లీ" అంటుంది. ఈ మాటల్లో ఒక చిన్నారి ఎండకోసం పడే తాపత్రయం, దేమునికి మన మీద కోపం లేకపోతే ఎండ వస్తుందనుకునే అమాయకత్వమూ, కష్టాలు వరుసగా వచ్చిపడుతున్నా దేముడే ఏదోవిధంగా కాపాడతాడు అనుకుంటూ కోట్లాదిమందిలా శారదమ్మల నమ్మకమూ, సగటు మనుషుల అంతరంగాన్ని వాస్తవికంగా చిత్రించాడు రచయిత. ప్రపంచంలో కోట్లాదిమంది దేముడు దయ చూపకపోతాడా అనుకుంటూనే తమ ధన, మాన, ప్రాణాలను కోల్పోతున్నారు. వీళ్ళందరిపై దేమునికి దయ వుందా, లేదా? ఇటువంటి ప్రశ్నలన్నిటికీ మన దగ్గరున్న ఒకే ఒక పరిష్కార మంత్రం ఖర్మ సిద్ధాంతం! చీకటి ఎంత భయంకరంగా వుంటుందో, ముసురుపట్టిన బతుకులు ఎంత విహ్వలంగా ఉంటాయో రచయిత వర్ణించిన తీరు, శైలి చదివి తీరాల్సిందే. "చూరు నుండి కిందికి పడే నీటిబొట్లు చేసే చప్పుడు చావు చప్పుడులా వుంది. పైన వర్షపు హోరు అదేదో రాక్షస రాజ్యంలో ప్రజలందరి ఘోషలా వుంది" అంటాడు. అకాల వర్షాలకు కళ్ళముందే పండిన పంటంతా కుళ్ళిపోతే రైతుల గుండె ఘోషలా వుంది.

'హారతి పళ్ళెం' కథ "కుక్కపిల్ల, సబ్బుబిళ్ళ, అగ్గిపుల్ల, తలుపుగొళ్ళెం, హారతిపళ్ళెం.... కాదేదీ కవితకనర్హం" అని శ్రీశ్రీ చెప్పినదాని నుండి ప్రేరణ పొంది ఆయా పేర్లతో రాసిన కథలలో ఒకటి. ఈ కథలో తండ్రి లేని ఐదేండ్ల ఒక పేద బాలిక తల్లీ, అన్నా జబ్బుపడి ఉంటే తల్లి యిచ్చిన కాణీతో మట్టి వినాయకుని ప్రతిమ కొని ఆ మట్టి బొమ్మ ముందు తన మనసులోని ఆర్తినంతటినీ వెళ్ళబోసుకుంటుంది. ఆ పాప చేత పలికించిన మాటలను చదివితే లోకం ఎరుగని ఒక పసిపాప మనసులోని రచయిత పరకాయ ప్రవేశం చేసాడా అనిపిస్తుంది. "నాకాకలేస్తోంది, నాకన్నం తినాల్దేవుడా" అనే వాక్యం చదివితే ఎటువంటివారికైనా గుండె తరుక్కు పోతుంది. 'నాక్కొంచెం ఏడన్నం పెట్టవా దేవుడూ?' అన్న పాప మాటలను బట్టి ఆ కుటుంబం అన్నం వండుకొని ఎంతకాలమయ్యిందో కదా' అనిపిస్తుంది. మూడు పూటలా అన్నానికి నోచుకోని లక్షలాది కుటుంబాలలోని పసిపిల్లలకు ప్రతీక ఈ పాప. కనీస బాధ్యత అయిన 'ఆహారభద్రత'ను కూడా మన రాజ్యం కల్పించలేకపోతున్నది. అట్టడుగు వర్గాలలోని 91 శాతం మంది పసిపిల్లలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారని ఇటీవలి ఒక సర్వే వెల్లడించింది.

"శారద (పాప) వెల్లకిలా పడుకుంది. ఏ బాధలైనా తీర్చమనిగాని, ఏ భయాలైనా పోగొట్టమని కాని ఏ దేముణ్ణయినా ప్రార్థించవలసిన అవసరం ఆమెకిప్పుడు లేనే లేదు. ఆమెకిప్పుడు ఆకల్లేదు...." అంటాడు. నిత్యం ఆకలి, పస్తులతో, రోగాలతో అలమటించేవారికి మృత్యువు మాత్రమే నిజమైన ఉపశమనం కలుగజేస్తుందని రచయిత భావం కావచ్చు. ఎందుకంటే అటువంటి దరిద్ర నారాయణుల్ని పట్టించుకోని లోకం ఇది.

సర్వజ్ఞుడూ, సర్వలోకపాలకుడూ సకల బలసంపన్నుడూ కరుణా సముద్రుడూ దీన జనబాంధవుడూ అయిన భగవంతుడు విఘ్నేశ్వర రూపంలో అక్కడి శారద (పాప) వేసిన పీటమీద, శారద వేసిన పూల మధ్య నిశ్చలంగా నిశ్శబ్దంగా గంభీరంగా తవ్వి తీసిన మన్నుగా, మనిషి చేసిన మనోహరమైన బొమ్మగా కదలకుండా అలా కూర్చునే వున్నాడు" అంటాడు కథ చివర్లో. కథువాలో ఎనిమిదేండ్ల బాలిక ఆసిఫా బానో పై గర్భగుడిలోనే సాక్షాత్తూ గుడి పూజారి అత్యాచారానికి పాల్పడినపుడు కూడా దేవత అలా చూస్తూనే ఉండిపోయింది. ఇలాంటివి ఎన్ని దారుణాలు చోటుచేసుకుంటున్నాయో కదా!

'తప్పు' కథలో నిలువెల్లా స్వార్థంతో నిండిపోయి, సంపాదన మాత్రమే ముఖ్యమనుకునేవారి అంతరంగాల్ని రచయిత ఆవిష్కరించాడు. అదే సమయంలో కూటికి గతి లేకపోయినా మనసుకు మాత్రం తక్కువ కాదనే ఒక కష్టజీవి అంతరంగాన్ని కూడా మనముందుంచాడు. "అపకారికి నుపకారము" అనే వేమన పద్య సారాన్ని రావిశాస్త్రిగారు ఈ కథ ద్వారా మరింత వివరంగా తెలియజేసారు.

"నా తెలివితేటలు వాడుకోవాలంటే నా రేటు నాకివ్వాలమ్మా! నేను ఎవర్నీ అన్యాయం చెయ్యలేదు. ఎవరి సొమ్మూ నేను పడేసుకోడంలేదు. వాళ్ళకి పనికొచ్చే తెలివితేటలు నాకు మాత్రం ఇచ్చేడు భగవంతుడు.

దానికి నేను ఖరీదు ఇంత అని కట్టి వుంచాను. అందులో తప్పేంవుంది" అని ఒక లాయరు చేత పలికిస్తాడు రచయిత. అదేవిధంగా "నాకు దేముడు ఓ రకం శక్తి ఇచ్చేడు. ఆ శక్తిని నేను నా ఇష్టం వచ్చినంత ఖరీదుకి నా ఇష్టం వచ్చినవాళ్ళకి అమ్ముతాను. ఇందులో అన్యాయం, అధర్మం అటువంటివేమీ లేవు" అని ఒక పేరున్న వైద్యునిచేత పలికిస్తాడు.

సమాజంలో విద్య, వైద్యం, ఇతర ముఖ్యమైన సేవలు వ్యాపార మయం అయిపోయాయి. తన దగ్గర నైపుణ్యం వున్న ప్రతి వృత్తికారుడూ (స్వార్థపరులైతే) ఇలాగే అతి తెలివిగా మాట్లాడుతూ తమ ప్రతిభకు, తమ సేవలకు తమకు నచ్చినంత విలువను వారే నిర్ణయించుకుంటున్నారు. ముఖ్యంగా ప్రైవేటు కార్పొరేటు కళాశాలల్లోనూ, ప్రైవేటు కార్పొరేటు హాస్పిటల్స్‌లోనూ ఈ రకమైన విలువల్నే మనం నిత్యం చూస్తున్నాం. డబ్బుగలవారికి ఒక రకం చదువు, డబ్బు లేనివారికి వేరొక రకం (సాదా) చదువు అందుతున్నాయి. సరైన వైద్యం చేయించుకోవాలంటే ఆస్తులు తాకట్టు పెట్టుకోవడమో అమ్ముకోవడమో చేయాల్సి వస్తుంది.

డబ్బు, పదవులు ఉన్నవారి నైజం ఎలా ఉంటుందో కూడా చెప్పాడు. "కింది మనుషుల్తో హెర్ హిట్లర్లా ఉండకపోతే తినేరూ మనల్ని?! మనవాళ్ళతో ఒకలా వుండాలి. వాళ్ళతో ఇంకోలా ఉండాలి. మన లెవెల్ వేరు, వాళ్ళ లెవెల్ వేరు. తక్కువ్వాడి దగ్గర మన ఎక్కువతనం చూపించకపోతే వాడు మనకంటే ఎక్కువ్వాణ్ణనుకుంటాడు. అందుచేత ఎవరి లెవెల్లో వాళ్ళని ఉంచాలి." ఇది పేరు, డబ్బు బాగా సంపాదిస్తున్న ఒక డాక్టరుచే పలికించిన సంభాషణ. ఈ రకం మనుషుల్ని మన చుట్టూ చూస్తూనే వుంటాం. "ఎవడి గొప్ప వాడిది, ఎవడికుండేది వాడికుంటుంది" అని అనుకుంటా వుంటాం.

ఇక నరసయ్య పాత్రలో "అపాయంలో చిక్కుకున్నవారు ఒకనాడు తనకు సహాయం నిరాకరించారు కాబట్టి ఇప్పుడు నేను ఎందుకు సాయపడాలి వీరికి" అని సగటు మనిషిలా ఆలోచించినా కష్టజీవుల్లో వుండే త్యాగం, నిస్వార్థం వంటి గొప్ప విలువలకు ఈ పాత్ర ద్వారా చూపిస్తూ పాఠకులను మంచి, చెడులకు బేరీజు వేసుకు చూడమనే విచక్షణనూ సందేశమిచ్చాడు. కరోనా సమయంలో ఏమీ ఆలోచించకుండా కులం, మతం వంటివి పట్టించుకోకుండా ఇతరులకు సాయపడినవారిని చాలామందిని చూసాం.

ఇక మార్క్సిస్టు దృక్పథంతో రాసిన 'పిపీలకం' ఆయనకు ఎంత పేరు తెచ్చిందో మనకు తెలిసిందే. కష్టజీవి అయిన చీమకు తానెవరో తెలుసుకోవాలనే తపనతో ఎందరెందరివో పండితులను ఆశ్రయించినా గాని తెలియనిది తమ నివాసాన్ని ఆక్రమించుకొన్న పాము చెబితే తెలిసింది తానొక 'కష్టజీవి'ని మరియు అల్పజీవిని అన్న విషయం.

ఇక్కడ పాము పెట్టుబడిదారీ మరియు కార్పొరేటు వర్గానికి ప్రతీక. అందువలన పాముచే ఈ విధంగా పలికించాడు రచయిత, "ఒరే పిపీలకాధమా! నేను సుఖభోగిని. నువ్వు ఈ లోకంలో ఒకానొక తుచ్ఛపు కష్టజీవివి. కష్టజీవులంతా కష్టపడాలి. సుఖభోగులు సుఖించాలి. అలా జరుగుతుందనేది ప్రకృతి ధర్మం. అలా జరగాలనేది భగవదాదేశం. అందుచేత చీమ వెధవలంతా కష్టపడవలసిందే! మీ కష్టం మీద మేం సుఖించవలసిందే! మాకు అదే న్యాయం! అదే ధర్మం! కాదన్నవాణ్ణి కాటేసి చంపుతాం!" ఈ సంభాషణ సారాంశాన్ని మనం ఇపుడు మరింత స్పష్టంగా, నగ్నంగా చూస్తున్నాం. ఆదివాసీల దళితులు, మైనారిటీల భూముల్ని కబ్జాలు చేస్తున్నారు. అయ్యా మాకు అన్యాయం జరిగిందని పోలీసు స్టేషన్లకి వెళ్ళి మొరపెట్టుకుంటే తిరిగి వాళ్ళపైననే కేసులు నమోదు చేస్తున్నారు. కార్మిక చట్టాలను క్రోడీకరించి వారికి కనీస వేతనాలుగానీ, సంఘాలు పెట్టుకునే హక్కుగానీ లేకుండా చేస్తున్నారు, దేశంలోని పెట్రోలియం, సహజవాయువు, బొగ్గు, పోర్టులు, విమానాశ్రయాలు ఒక్కొక్కటిగా కార్పొరేట్లు ఆక్రమించుకుంటున్నారు. తరిమెల నాగిరెడ్డిగారు చెప్పినట్లు 'తాకట్టులో భారతదేశం' నుండీ "అమ్మకానికి భారతదేశం" అని బహిరంగంగా ప్రకటిస్తున్నారు. ప్రజల ప్రజాస్వామిక గొంతులను నొక్కి, కాకులను కొట్టి గద్దలకు వేసినట్టు కార్పొరేట్లకు దేశాన్ని ముక్కలు ముక్కలుగా అమ్మిపారేస్తున్నారు.

ఇక చీమ కష్టజీవులకు, కార్మికులకు, అట్టడుగువర్గాల వారికి ప్రతీక. దీనిని ప్రతిబింబించేలా రచయిత చీమ చేత ఇలా చెప్పించాడు. "ఒరే రాక్షసాధముడా మేం కష్టజీవులమే కావచ్చు. కాని నువ్వు మా కష్టాన్ని అపహరించి మాకు అన్యాయం చేయడం మేం సహించం! మేం తిరగబడతాం! నువ్వు చెప్పిన న్యాయం భగవన్న్యాయమైనా సరే అది అన్యాయం కాబట్టి దాన్ని మేం మారుస్తాం! అందుగురించి మేం తిరగబడతాం! మీమీద మేం తిరగబడి తీరుతాం." ఈ కష్టజీవుల తిరుగుబాట్లు, ఉద్యమాలు, నిరసనలు నేడు దేశవ్యాప్తంగా కొనసాగుతూనే వున్నాయి. విశాఖజిల్లా మన్యంలో బాక్సైటు తవ్వకాలకు రాజశేఖరరెడ్డి ప్రభుత్వం పూనుకున్నపుడు అక్కడి గిరిజనులంతా ఏకమై తమ సంప్రదాయ ఆయుధాలను చేతబూని తమ జీవనోపాధిని, సంస్కృతిని రక్షించుకోవడానికి చంపడానికైనా, చావడానికైనా సిద్ధమని ప్రకటిస్తే ప్రభుత్వం వెనుకడుగు వేసి ఆ ప్రయత్నాన్ని విరమించుకుంది. ఢిల్లీలో రైతులు ఏడాది పైగా అనేక త్యాగాలకు ఓర్చి సంఘటితంగా ఉద్యమం చేస్తే కేంద్రం మూడు నల్లచట్టాలను వెనక్కి తీసుకుంటున్నట్టుగా ప్రకటన చేయాల్సి వచ్చింది.

యువరచయితలూ, అభ్యుదయవాదులు, సమాజంలోని కుళ్ళు పట్ల ఆవేదన చెందుతున్నవారూ రావిశాస్త్రి రచనలను చదవాలి. ఆయన రచనలు సమాజంపట్ల సామ్యవాద చింతనను కలిగిస్తాయి. అరవై ఏళ్ళ క్రితమే ఆయన చేసిన సాహిత్య సృజన ఈనాటికీ సజీవంగా, ప్రస్తుత సమాజాన్నీ ప్రతిబింబిస్తున్నాయా అంటే, వలసకాలం నాటి దోపిడీ పీడనలు సమాజంలో మాసిపోలేదనీ – అవి మరింతగా వేళ్ళూనుకొని మానవ సంబంధాలను, సమష్టితనాన్ని, శ్రమైక జీవనసంస్కృతినీ ఛిన్నాభిన్నం చేస్తున్నాయని స్పష్టంగా తెలుస్తుంది. ✦

> "పాపుల్లో సాహసులూ వుంటారు.
> భయస్థులూ వుంటారు.
> కాని భయానికీ, మంచికి పొందిక లేదు.
> పిరికివారెవరు కూడా మంచివారు కాజాలరు.
> మంచికి నిలబడలేరు. మంచిగా ఉండాలంటే
> గుండె నిబ్బరం చాలా ఉండాలి."
>
> **- 'అల్పజీవి'లో రావిశాస్త్రి**

# రావిశాస్త్రి "నిజం" - రాజ్యాంగ యంత్రాంగం

ఆచార్య వెలమల సిమ్మన్న

**పాలకవర్గం, తన వర్గ శత్రువుల ప్రతిఘటనను అణచడానికి ఉపయోగించుకొనే సాధనమే రాజ్యాంగ యంత్రం".**

- కారల్‌మార్క్స్

తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన సుప్రసిద్ధ సాహితీవేత్త, మేధావి, రావిశాస్త్రి. సాంఘిక చైతన్యానికి మారుపేరు రావిశాస్త్రి. పీడిత ప్రజల కోసం నిబద్ధతతో రచనలు చేసిన నేరానికి జైలుకి వెళ్ళిన విఖ్యాత న్యాయవాది రావిశాస్త్రి. ఒక్కమాటలో చెప్పాలంటే రావిశాస్త్రిది నూటికి నూరుపాళ్ళు ప్రజాస్వామిక దృక్పథం మార్క్సిస్ట్ దృక్పథం. అనాథుల ఆత్మబంధువు. పీడితప్రజల ప్రేమమూర్తి. "శాస్త్రిగారు పూర్తిగా రచయితే. ఆయన రాసిందంతా సాహిత్యమే. దారిద్ర్యంలోని బీభత్సాన్ని ఫోటోలు తీశాడాయన" అని నగ్నముని అన్నారు.

## "నిజం"

రావిశాస్త్రి "నిజం" నాటకాన్ని 1961లో రాశారు. దీన్ని విశాఖపట్నంలోని గురజాడ కళాకేంద్రం సభ్యులకు అంకితం ఇచ్చారు. 1962లో విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్‌వారు ప్రచురించారు. ఈ నాటకాన్ని మొదటిసారిగా 1965లో మచిలీపట్నం అడ్వకేట్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్‌వారు ప్రదర్శించారు. వివిధ ప్రాంతాల్లో ఈ నాటకం ప్రజల ఆదరణ పొందింది. విశాఖ నాట్యభారతివారు ఈ నాటకాన్ని డెబ్భైయైదు సార్లు ప్రదర్శించారు. ('ఆంధ్రజ్యోతి' – భమిడిపాటి – వ్యాసం – 7.1.1983). దీన్ని బట్టి ఎంత గొప్ప నాటకమో మనకు అర్ధమవుతుంది.

గురజాడ రాసిన "కన్యాశుల్కం" తెలుగు నాటకచరిత్రలో ఒక సంచలనం. రావిశాస్త్రి "నిజం" మరో సంచలనం. గురజాడ "కన్యాశుల్కం" తర్వాత, మనకున్న మంచి నాటకం "నిజం". తనకాలంనాటి సాంఘిక దురాచారాలమీద, ధ్వజమెత్తిన నాటకం "కన్యాశుల్కం". రాజ్యాంగ యంత్రాంగంలోని వ్యవస్థలు, ఎంతగా పతనావస్థకు చేరుకున్నాయో తెలియజేసే నాటకం "నిజం". ఈ రెండు నాటకాలు సామాజిక అభ్యుదయాన్ని కోరుకున్నవే సాంఘిక నాటక సృష్టిలో గురజాడకు అసలుసిసలైన వారసుడు రావిశాస్త్రి.

### నాటక నేపథ్యం :

రాజ్యాంగ యంత్రాంగంలో ముఖ్యమైన భాగాలు మూడు : 1. శాసనశాఖ; 2. కార్యనిర్వాహక శాఖ; 3. న్యాయశాఖ ఈ మూడు వ్యవస్థలు ధనవంతుల, రాజకీయ నాయకుల కబంధహస్తాల్లో ఎలా చిక్కుకున్నాయో, చెబుతుంది ఈ నాటకం. ప్రజలను కాపాడవలసిన రాజకీయ నాయకులూ, చట్టాన్ని గౌరవించవలసిన పోలీసులూ, న్యాయాన్ని రక్షించవలసిన ప్లీడర్లూ అందరూ కలిసి మూకుమ్మడిగా డబ్బుకు అమ్ముడుపోయి నిజం మెడలు ఎలా విరగగొడతారో, ఎలా పాతిపెడతారో, ఎలా సమాధి చేస్తారో, ఈ నాటకంలో మనం చూడవచ్చు. చట్టాలు, జైళ్ళు, పోలీసు వ్యవస్థ వీటిని మొత్తంగా ప్రభుత్వ యంత్రాంగం అని అంటారు. ఈ యంత్రాంగం నిరంతరమూ డబ్బు వున్నవాళ్ళకి, అధికారం వున్న వాళ్ళకి దాసోహం అవుతూ కొమ్ముకాస్తూ వుంటాయి. ఇదే విషయాన్ని శాస్త్రిగారు "నిజం" నాటకంలో కళ్ళకు కట్టినట్లు అద్భుతంగా చిత్రీకరించారు. ఆచరణలో, నిజ జీవితంలో, రాజ్యాంగ యంత్రం నూటికి నూరుపాళ్ళు పేదవాడికి ఎలా శత్రువుగా తయారవుతుందో తెలియజేస్తుంది "నిజం" నాటకం. స్వార్థ ప్రయోజనం కోసం రాజ్యాంగ వ్యవస్థలు ఎలా నిర్వీర్యం అయిపోతున్నాయో మనం ఈ నాటకంలో చూడవచ్చు.

సమకాలీన సామాజిక సమస్యలను బాగా అర్థం చేసుకొని రచనలు చేసిన సాహితీ చైతన్యమూర్తి శాస్త్రిగారు. నేటి సమాజంలో పేదవాడికి న్యాయవ్యవస్థలో న్యాయం జరిగే అవకాశాలు లేవు. ధనవంతులు, రాజకీయ బడా నాయకులు, అహంకారంతో, గర్వంతో విచ్చలవిడిగా అన్యాయాలు, అక్రమాలు చేస్తున్నారు. అంతేకాదు కావాలని తప్పుడు సాక్ష్యాలు సృష్టించి, పబ్బం గడుపుకుంటున్నారు. మీదు మిక్కిలి వాదించడానికి ప్రముఖమైన అనేకమంది లాయర్లను పెట్టి, అన్యాయాన్ని న్యాయంగా మార్చుకోగలుగుతున్నారు. న్యాయవ్యవస్థను కావాలని తుంగలో తొక్కుతున్నారు. అభం, శుభం తెలియని అమాయకుడికి పేదవాడికి, ఏమీ చేయనివాడికి, కఠినశిక్ష పడుతుంది. ఇక్కడ హత్యచేసిన వాడు ఒకడు. ఉరికంబం ఎక్కినవాడు మరొకడు. సమాజంలో ఈ వ్యవహారం సర్వసాధారణమైపోయింది. డబ్బుగలవారి వల్ల, బడా నాయకుల వల్ల, అన్నీ తారుమారు అయిపోతున్నాయి. రావిశాస్త్రి గురువు ప్రముఖ న్యాయవాది తాతా శ్రీరామమూర్తిగారు" శాస్త్రిగారి "నిజం" నాటకం చూచినా, చదివినా చట్టాన్ననుసరించి చేసే న్యాయం, న్యాయానికే అన్యాయం చేయడం అని బోధపడుతుంది. రచయితగా తన ధర్మం నిర్వర్తించారు శాస్త్రిగారు. సంస్కరణలు చేయడం సమాజం కర్తవ్యం" అని అన్నారు.

"నిజం" నాటకానికి ముందుమాట రాస్తూ రావిశాస్త్రి "వాళ్ళని బాగుచెయ్యడం కోసం పెద్దలెవ్వరూ ఏమీ చెయ్యడం మాత్రం కనిపించదు. లంచాలు జేబుల్లోకి వెళ్తున్నాయి. లాభాలు బ్యాంకుల్లోకి వెళ్తున్నాయి. రాజకీయవేత్తలు ఖద్దరు బట్టలు తొడుక్కొని పార్లమెంటుకు వెళ్తున్నారు. దేశంలో అందర్నీ ఉద్ధరించడానికి ఆర్థికమంత్రులు కోట్ల మీద అప్పు కోసం ప్రతీ దేశానికి వెళ్తున్నారు. దేముడు చెప్పిన న్యాయాన్ని నిలబెట్టేందుకు స్వాములు, మౌల్వీలు, బిషప్‌లు, రోజూ ఉపన్యాసాలకి వెళ్తున్నారు. కాని ఏ పాపం ఎరుగనివాళ్ళు మాత్రం జెయిళ్ళలోను, జెయిళ్ళబయటా మగ్గుతూనే ఉన్నారు. పాపంలా పెరిగిన పెద్దవారు ఎన్ని పాపాలు చేసినా సరే పెద్దవారుగా, ప్రభువులుగా ఉంటున్నారు. ప్రస్తుతం మన దేశంలో ప్రతిరోజు, ప్రతిచోటా ఎందరో కొందరు అమాయకులు వాళ్ళు చెయ్యని నేరానికి శిక్షలనుభవించడం



జరుగుతోందని నేను ఖచ్చితంగా ఘంటాపథంగా, ఛాలెంజీచేసి, చెప్పగలను. కాని ఆమాత్రం ఈమాత్రం డబ్బూ, పలుకుబడి, పదవీ, హోదా కలవాడెవ్వడూ మాత్రం ఆ పరిస్థితుల్లో ఇరుక్కోడు. ఒకవేళ ఇరుక్కున్నా పైకి తప్పించుకోగలడు. ఈ సంఘంలో పేదవాడికి న్యాయం దొరకదుకాక దొరకదు. తనకు అన్యాయం జరిగితే ఎదుర్కొనడానికి పేదవాడికి సంఘంలో అవకాశం లేదుకాక లేదు. ఈ పరిస్థితి మారాలని నాకుంది. అందుకే ఈ నాటకం రాసేను" అని అన్నారు. ప్రజాభ్యుదయం కోసం మాత్రమే రాసిన నాటకం ఇది. నాటక ప్రయోజనాన్ని ఉద్దేశ్యాన్ని సహృదయ ప్రేక్షకులకు, పాఠకులకు చాలా స్పష్టంగా తెలియజేశారు శాస్త్రిగారు.

**ఇతివృత్తం - ప్రాముఖ్యత :**

**"ఇతివృత్త స్వీకరణలో, రచనా శిల్పంలో, శైలీవిన్యాసంలో, ప్రత్యేకత నిలుపుకొని రావిశాస్త్రి ఎందరెందరికో మార్గదర్శకులయ్యారు"**

**- సి. నారాయణరెడ్డి**

ఒక పార్లమెంటు సభ్యుడు అధికారదర్పంతో, బలంతో, జులుంతో, ధనంతో, గర్వంతో, అహంకారంతో ముఖ్యంగా రాజకీయ పలుకుబడి వల్ల మొత్తం రాజ్యాంగ యంత్రాంగాన్ని భ్రష్టు పట్టించి, ఎలా తన గుప్పిట్లో పెట్టుకుని తన కొడుకుచేసిన హత్యానేరాన్ని అమాయకుడైన, పేదవాడి మీద మోపి, తన శక్తియుక్తుల వల్ల, కుట్రలు, కుతంత్రాల వల్ల సాక్ష్యాన్ని కొత్తగా సృష్టించి, అతనికి ఉరిశిక్ష విధింపచేయడం ఈ నాటకం ఇతివృత్తం.

ఇందులో ఆరు అంకాలు వున్నాయి. పాత్రల మనస్తత్వాలను, లోక వ్యవహారాలను చెప్పే సందర్భాల్లో వాడిన సుదీర్ఘ సంభాషణలు, సహృదయ ప్రేక్షకులకు విసుగును కలిగించకుండా వుండడానికి శాస్త్రిగారు ప్రదర్శనకు వీలుగా ఆయా అంకాలలో తొలగించుకోవలసిన భాగాలను కూడా నాటకానికి ముందుగా సూచించారు. శాస్త్రిగారు, నటుడు, దర్శకుడు, రచయిత కాబట్టి ఈ పని చేయగలిగారు. ఇందులో ఇరవైఐదుకు పైగా పాత్రలున్నాయి. ప్రధాన పాత్రలు మాత్రం సార్వభౌమరావు, సుశీల, సోమసుందరం, సుందరం, కృష్ణారావు, మధుసూదనరావు, కిష్టప్ప, పబ్లిక్ ప్రాసిక్యూటర్, డిఫెన్స్ లాయరు మొ॥.

సార్వభౌమరావు కొడుకు సుందరం, ప్రొఫెసర్ కోసలరావు అల్లుడు, లా విద్యార్థి సత్యం, పొలిటిక్స్ ఆనర్స్ విద్యార్థి కృష్ణారావు, మధుసూదనరావు, నలుగురూ కలిసి టవునుకు ఆరు మైళ్ళ దూరంలో వున్న చిట్టడివికి కారులో సరదా కోసం షికారుకు వెళ్తారు. నలుగురు కలిసి అక్కడ విస్కీ తాగుతారు. తాగిన మైకంలో వారి సంభాషణ పార్లమెంటు సభ్యుడైన సార్వభౌమరావు వుంచుకొన్న సుశీలపైకి వెళుతుంది. సత్యం సార్వభౌమరావుని ఉద్దేశించి అతను సుశీలకు అన్యాయం చేశాడని అంటాడు. సోమసుందరం అనే రౌడీతో అక్రమ సంబంధం వుందని అంటాడు. ఆ మాట తననే ఉద్దేశించి అన్నాడని భావించిన సుందరం కోపంతో, విస్కీ బాటిల్ తీసుకొని సత్యం తలపై గట్టిగా కొడతాడు. దాంతో సత్యం అక్కడికక్కడే చనిపోతాడు.

అనుకోకుండా జరిగిన ఈ సంఘటనకు భయపడిన మిగతా ముగ్గురు, సత్యం తెచ్చిన వాళ్ళ మామ కారులో రక్షణ కోసం వేగంగా సార్వభౌమరావు దగ్గరకు వెళ్తారు. వీరు వెళ్ళడానికి ముందే సార్వభౌమరావు, సుశీలతో అక్రమ సంబంధం కలిగివున్న సోమసుందరాన్ని రెడ్‌హేండెడ్‌గా పట్టుకుంటాడు. సుశీలను బెదిరించి, అతను దొంగతనానికి వచ్చినట్లు బలవంతంగా స్టేట్‌మెంట్ రాయిస్తాడు సార్వభౌమరావు. అంతేకాక తన పలుకుబడితో సోమసుందరాన్ని ఎస్.ఐ.గా పనిచేస్తున్న కిష్టప్పకు బలవంతంగా అప్పగిస్తాడు.

ఇంటికెళ్ళిన కృష్ణారావు, సార్వభౌమరావుతో సుందరం, సత్యాన్ని హత్యచేసిన విషయాన్ని చెప్తుతాడు. సుశీల సంఘటనతో అప్పటికే మనసు బాగులేక కోపంగా వుంటాడు సార్వభౌమరావు. ఈ విషయం మరింత కోపాన్ని కలిగిస్తుంది. కృష్ణారావును, మధుసూదనరావును నానా చీవాట్లు పెడతాడు. అంతేకాక తన కొడుకును రక్షించే పనిలో వుంటాడు.

తన సుపుత్రుడు సుందరంను కాపాడడం కోసం ఆ నేరాన్ని సోమసుందరంపై మోపుతాడు. ఆశ్చర్యకరమైన అసలు విషయం ఏమంటే కృష్ణారావును, మధుసూదనరావును సాక్షులుగా ఒప్పిస్తాడు. వారితో స్టేట్‌మెంట్ రాయించి ఎస్.ఐ. కిష్టప్పను పిలిచి, దబాయించి, బెదిరించి, అన్యాయంగా సోమసుందరంపై హత్యానేరం నమోదు చేయిస్తాడు. అసలు నేరస్తుడైన తన కొడుకును కాపాడడం కోసం అతన్ని ఉద్యోగం చేయడానికి బెంగుళూరు పంపిస్తాడు.

కేసు కోర్టుకు చేరుతుంది. ముద్దాయి తరఫున ప్రభుత్వంవారు డిఫెన్స్‌లాయర్‌ని ఏర్పాటుచేస్తారు. హత్యానేరం మోపబడిన సోమసుందరం కోర్టుబోనులో నిలబడతాడు. సార్వభౌమరావు, కృష్ణారావు, మధుసూదనరావు, సుశీల, కిష్టప్ప ప్రభుత్వ డాక్టర్‌లను సాక్షులుగా ప్రవేశపెడతారు. ఒక్క సుశీల తప్ప అందరూ సోమసుందరమే హత్య చేశాడని కోర్టులో సాక్ష్యం చెబుతారు. సార్వభౌమరావుకి భయపడి సుశీల మొదట అబద్ధం ఆడుతుంది. తర్వాత నిజం చెపుతుంది. అయితే కోర్టువారు ఆమె సాక్ష్యాన్ని పరిగణనలోకి తీసుకోరు.

డిఫెన్స్ లాయర్, సోమసుందర్ హత్య చెయ్యలేదని ఎన్ని కారణాలను చూపినా, జడ్జీ ఒప్పుకోరు. కేవలం పక్షపాత దృష్టితో అసలైన కారణాలను లోతుగా నిశితంగా పరిశీలించకుండానే సోమసుందరమే ఉద్దేశపూర్వకంగా హత్యచేశాడని తీర్పు చెప్పి, అతనికి ఉరిశిక్ష విధిస్తున్నట్లు ప్రకటిస్తాడు. నిర్దోషి అయిన సోమసుందరానికి ఉరిశిక్ష పడటాన్ని భరించలేకపోతాడు మధుసూదనరావు. కోర్టుకు వెళ్ళి అసలు నిజం చెపుతానని పెద్దగా కేకలు వేసి అరుస్తాడు. ఈ రహస్యం ఎవరికీ తెలియకుండా బయటపడకుండా వుండడానికి కృష్ణారావు, మధుసూదనరావును సార్వభౌమరావు దగ్గరకు తీసుకెళతాడు. సార్వభౌమరావు చెడామడా తిట్టి, మధుసూదనరావుని బెదిరించి తన అధీనంలోకి తెచ్చుకుంటాడు. అక్కడే వున్న సుశీలకి వాస్తవం తెలుస్తుంది. కలత చెందుతుంది. సార్వభౌమరావు ఎంత ప్రాధేయపడినా, వినకుండా అతన్ని విడిచి అక్కడనుండి వెళ్ళిపోతుంది. సోమసుందరంకు వేసిన ఉరిశిక్షను హైకోర్టు ధృవపరుస్తుంది. నిర్దోషి అయిన సోమసుందరంను సెంట్రల్ జైల్లో అధికారుల సమక్షంలో ఉరితీయడానికి తీసుకువెళ్ళడంతో నాటకం ముగుస్తుంది.

## నాటక రచనాశిల్పం :

**"రావిశాస్త్రిగారిలో శిల్పం మహా ప్రవాహంలా విరుచుకుపడుతూ వుంటుంది అది పెనుతుఫాను లేదా ప్రభంజనం లేదా ప్రళయఘోష."**

- పురాణం సుబ్రహ్మణ్యశర్మ

ఈ నాటకానికి "నిజం" అనే పేరు పెట్టడంలోనూ, నిజం కేంద్ర బిందువుగా కథావస్తువు నిర్మించడంలోనూ గొప్ప నాటక పరమార్థాన్ని, రచనాశిల్పాన్ని, సాధించారు శాస్త్రిగారు. స్వార్థపూరితమైన ఈ వ్యవస్థలో అడుగడుగునా "నిజం" ఎలా దగాపడుతున్నదన్న విషయాన్ని నాటక కర్త పూసగుచ్చినట్లు ఆద్యంతం ఆసక్తికరంగా చూపారు.

మొదటిఅంకం రాబోయే పాత్రల పరిచయం ప్రారంభమవుతుంది. సత్యాన్ని పార్లమెంట్ మెంబరు సార్వభౌమరావు కొడుకు సుందరం హత్యచేయడంతో మొదటి అంకం పూర్తి అవుతుంది. సత్యం హత్యచేయబడిన సన్నివేశం నాటకం మొత్తానికి కేంద్ర బిందువు. సన్నిహితుల మధ్య తాగుడు వాతావరణాన్ని ప్రవేశపెట్టి, వారి వ్యక్తిగత బలహీనతల ఆధారంగా ఒకరినొకరు నిందించుకునే తీవ్రస్థాయికి సంభాషణలను తీసుకెళ్ళి, సన్నివేశాన్ని అతి సహజంగా చిత్రీకరించాడు నాటకకర్త. అన్యాయాన్ని సహించలేనివారుగా ఈ అంకంలో సత్యం, కనబడతాడు. వ్యక్తుల మంచి చెడ్డలను గూర్చి, మనస్తత్వాల గూర్చి, నిజాయితీగా నిర్మొహమాటంగా మాట్లాడేవాడుగా మనకు కనిపిస్తాడు.

తాగడానికి ముందే సుందరాన్ని ఉద్దేశించి సత్యం "నీ ఆర్మీ గొప్పలు నా దగ్గర చెప్పకు, నాకు డబ్బంటే ఇష్టంలేదు. కానీ మనుషులంటే ఇష్టం లేకపోలేదు" అని అంటాడు. మధుసూదనరావును ఉద్దేశించి సత్యం "వెధవా! నీకు అంతరాత్మంటూ లేదు. ఉన్నదనుకుంటున్నావంతే. ఉంటే మాలతిని పెళ్ళాడేవుందువు" అని అంటాడు. తర్వాత సుందరం తండ్రి సార్వభౌమరావు గూర్చి "పురపాలకసంఘ అధ్యక్షులు, పార్లమెంట్ సభ్యులు, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్, శ్రీ ఎలక్ట్రికల్ ప్రొప్రైటర్ శ్రీ సార్వభౌమరావుగారి మాటకు ఎదురూ, తిరుగూ లేదు. వారు మనల్ని బతకమంటే బతకాలి, చావమంటే చావాలి" అని అంటాడు.

సత్యం మాటల ద్వారా రెండో అంకంలో రాబోయే సార్వభౌమరావు, ధనికవర్గపు ప్రతినిధిగా, రాజ్యాంగ యంత్రాంగాన్ని తన అధీనంలో వుంచుకొనే శాసనాధికారిగా ప్రజల హక్కులను హరించే వ్యక్తిగా మనకు కనబడతాడు.

తాగిన తర్వాత సత్యం, స్నేహితుల మాటలకు రెచ్చిపోయి, మరికొన్ని నిజాలను బయటపెడతాడు. సుందరం అడుగులకు మడుగులు ఎత్తే కృష్ణారావును ఉద్దేశించి "వీడు నీకు తైరుపోస్తాడు. వీడి బాబు నీ బాబుకు తైరుపోస్తాడు. తైరు అనగా మస్కా. మస్కా అనగా కాకా, కాకా అనగా క్రౌకాచింగ్" అని అతని బలహీనతలను ఎత్తి చూపుతాడు. ఆ తర్వాత సార్వభౌమరావు వుంచుకొన్న వంటమనిషి సుశీల ప్రస్తావనను తీసుకొచ్చి, సుందరంతో "నీకావిడ ఎటువంటి పిన్నిరా ఫూల్! నీ ఫాదరు ఆవిణ్ణి చేరదీసి, పాడుచేసి, సాకుతున్నాడు". అంతటితో ఆగక స్నేహితులతో సత్యం "నీ వయసుదావిడ. ఇప్పుడు ఆ సుశీలని సుందరంగాడు తాకుతున్నాడు" అని అంటాడు. దానితో సుందరం తననే అంటున్నాడని భావించి కోపంతో చంపేస్తానంటూ సత్యాన్ని బెదిరిస్తాడు. సత్యం మాటలకు అప్పటికే అహం దెబ్బతిన్న సుందరాన్ని మరింతగా రెచ్చకొడతాడు కృష్ణారావు.

కృష్ణారావు, సత్యంతో "ఒరే చంపేస్తారా సత్యం" అని అంటాడు. దానికి కొన్ని నిమిషాలలో చంపబడే సత్యం చెప్పిన మాటలు "సత్యాన్ని చంపడం నీ తరం కాదు" అని అంటాడు. ఈ మాటలోనే నాటకం యొక్క పరమార్థ బీజం వుంది. ఇక్కడ సత్యం అనబడే వ్యక్తి "నిజం" అనే భావానికి నిలువటద్దం.

సత్యం మాటల్లో ధ్వనిప్రాయంగా రాబోయే సార్వభౌమరావు యొక్క అధికార దర్పం, అతని భావాలు తేటతెల్లమవుతాయి. మధుసూదనరావు మాటల్లో భయంతో కూడిన అంతరాత్మ తెలుస్తుంది. కృష్ణారావు మాటల్లో అతని బానిసబుద్ధి వ్యక్తమవుతుంది. తర్వాతి అంకాల్లో వీరి మనస్తత్వాలు బట్టబయలు అవుతాయి. అదే మొదటి అంకంలోని ప్రత్యేకత. విశిష్టత.

రెండో అంకంలో నిర్దోషి అయిన సోమసుందరంపై హత్యానేరం మోపడంలో నాటకం ప్రధాన మలుపు తిరుగుతుంది. సోమసుందరానికి సుశీలతో అక్రమసంబంధం వున్న సంఘటనను శాస్త్రిగారు ప్రవేశపెడతారు. పోలీసుల దృష్టిలో నేరస్థుడైన సోమసుందరంపై సుందరం చేసిన హత్యానేరాన్ని మోపడానికి చేసిన పన్నాగం ప్రదర్శించడానికి అనువైన వాతావరణాన్ని కల్పించాడు నాటకకర్త. అదేవిధంగా పార్లమెంటు మెంబర్ అయిన సార్వభౌమరావు, తన కుమారుడి నేరాన్ని తన అధికార జులుంతో యస్.ఐ. కిష్టప్పనూ, కృష్ణారావు, మధుసూదనరావులను మరియు సుశీలను తన గుప్పిట్లో పెట్టుకొని, వారి వ్యక్తిగత మానసిక బలహీనతలను ఆసరాగా చేసుకొని న్యాయాన్ని అన్యాయంగా మార్చడానికి చేసే అన్ని ప్రయత్నాలను, పన్నాగాలను శాస్త్రిగారు రెండో అంకంలో చక్కగా చిత్రీకరించారు.

మూడు నాలుగు అంకాల్లో న్యాయం, అన్యాయంగా మారడానికి కోర్టులో ప్రవేశపెట్టబడిన సుదీర్ఘ సంభాషణలతో కూడిన దొంగ సాక్ష్యాలూ, డిఫెన్స్ లాయరు న్యాయాన్ని రక్షించడానికి చేసే ప్రయత్నాలూ, జడ్జీ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పక్షపాతబుద్ధితో న్యాయాన్ని తప్పుద్రోవ పట్టించే విధానం కన్పిస్తుంది. వీరి సంభాషణల ద్వారా అడుగడుగునా నిజం ఎలా మరుగునపడి, అబద్ధం ఎలా అందలం ఎక్కుతుందో నాటకకర్త రమణీయంగా చిత్రీకరించారు. ఇక్కడ నాటకకర్త గొప్పతనం కన్పిస్తుంది.

ఐదో అంకంలో శాస్త్రిగారు సోమసుందరానికి ఉరిశిక్ష పడినందుకు, మధుసూదనరావు అంతరాత్మ ఎదురుతిరిగి, నిజం చెప్పే ప్రయత్నంలో పిచ్చివాడిగా మారిపోతాడు. ఆ సన్నివేశాన్ని కమనీయంగా చిత్రీకరించాడు నాటకకర్త. తప్పు అంతా తానే చేసి, ఎదుటివాళ్ళను దబాయించే సార్వభౌమరావు మనిషి కష్టసుఖాలకు దేవుడూ, కర్మ అంటూ మభ్యపెడతాడు. న్యాయాన్ని నిలువునా పాతేసే సార్వభౌమరావు నిజస్వరూపాన్ని తెలుసుకొని సుశీల బయటపడే మార్గాన్ని శాస్త్రిగారు బాగా చూపారు.

ఆరో అంకంలో శాస్త్రిగారు తన ప్రతిభాప్రజ్ఞాపాటవాలతో నాటకాంతాన్ని అద్భుతంగా నిర్వహించారు. సోమసుందరానికి ఉరిశిక్ష పడుతుంది. సోమసుందరం సెంట్రల్‌జైల్లో జైలు సూపరింటెంటు,

జిల్లా మెడికల్ ఆఫీసరు, జైలు డాక్టరు, మేజిస్ట్రేట్ మొదలైన ప్రభుత్వ ప్రతినిధుల ఎదుట నిలబడి తన చివరికోరిక తెలుపుతాడు.

"సూపరెంటుగారూ లోకం అంతా నిజం పలకాలనేది నా ఆఖరి కోరిక. ఇక్కడున్న మీలో ఏ ఒక్కరైనా ఇక ముందెల్లప్పుడూ నిజానికి నిలబడతామని నాకోచిన్న వాగ్దానం చేయండి. చేస్తేచాలు. నేను హాయిగా ప్రాణం విడుస్తా" అని అంటాడు. ఆ మాటలకు అక్కడున్న ప్రభుత్వ ప్రతినిధులందరూ ఒకరి ముఖాలు ఒకరు దీనంగా చూసుకుంటారు. సోమసుందరం చివరి కోరిక తీరదు.

ఈ సమాజంలో "నిజం" నిజంగానే హత్య చేయబడినదన్న విషయాన్ని ఈ నాటక ముగింపు సన్నివేశం ద్వారా తెలుస్తుంది. ఇలా నాటకకర్త అన్ని అంకాల్లోనూ నాటకశిల్పాన్ని చక్కగా పోషించారు.

**వివిధ పాత్రలు :**

ఈ నాటకంలో ప్రధానపాత్ర సార్వభౌమరావు. స్వతంత్ర భారత దేశంలో ప్రజాస్వామ్య ముసుగులో, డబ్బుతో, సారాతో, దౌర్జన్యంగా, దర్జాగా, దొంగోట్లు వేయించుకొని పార్లమెంటుకు ఎన్నికైన ప్రజా ప్రతినిధి సార్వభౌమరావు. అంటే దొంగ ప్రజాప్రతినిధి అన్నమాట. ఇతడు సర్వాధికారాలను తన గుప్పిట్లో వుంచుకుంటాడు. ప్రజల హక్కులను కాలరాస్తూ, నియంత్రిస్తూ, నియంతలా ప్రవర్తిస్తూ పైకి పెద్దమనిషిలా కనిపించే పరమ లుచ్ఛాగాడు సార్వభౌమరావు. పేరుకు తగ్గట్టుగానే సార్వభౌమరావు మాటల్లో అహంకారం, పొగరుబోతుతనం, లెక్కలేనితనం, అధికారగర్వం, అడుగడుగునా ధ్వనిస్తాయి. నాటకకర్త, సార్వభౌమరావు పాత్రకు నామకరణం చేయటంలో రావిశాస్త్రి "సింబాలిజం" పాటించారు.

ఈ నాటకంలో మరో ప్రధానమైన పాత్ర సుశీల. సార్వభౌమరావు లైంగిక దోపిడీకీ, పీడనకూ గురియైన స్త్రీ సుశీల. స్త్రీని, పురుషుడు ఎంత బానిసగా ఉపయోగించుకుంటాడో మనకు అర్థమవుతుంది. మంచికి, చెడుకి మధ్య స్త్రీ ఎలా నలిగిపోతుందో, సతమతమౌతుందో సమాజానికి చూపించడానికి నాటకకర్త సుశీల పాత్రను ప్రవేశపెడతాడు. సుశీలలాంటి అనాథ స్త్రీలు వాస్తవాలను గ్రహించినప్పుడు, స్వేచ్ఛకై, శారీరక సుఖాలను సంపదలను లెక్కచేయరు అనే విషయాన్ని సుశీల పాత్ర ద్వారా మనం గమనించాలి. బలవంతుల ధనవంతుల దోపిడీకి, పీడనకు గురి అవుతున్న వ్యక్తులతో మమేకమై చివరకు తిరుగుబాటు చేస్తారన్న విషయాన్ని తెలియచేశాడు నాటకకర్త. అంతేకాక సార్వభౌమరావులాంటి వ్యక్తుల్లో మార్పు రావాలంటే ప్రజలు తప్పనిసరిగా తిరగబడవలసిందే, పోరాటం చేయవలసిందే అనే విషయాన్ని పురాణ పురుషులైన రాముడు, బలరాముడు, పరశురాముడులను ప్రతీకగా చూపాడు నాటకకర్త.

సార్వభౌమరావు పన్నిన కుట్రలో బలిపశువైన సోమసుందరం పాత్ర ఈ నాటకంలో ముఖ్యమైంది. వ్యవస్థలోని దోపిడీలను, దౌర్జన్యాలను, అన్యాయాలను, అక్రమాలను ఎదిరించడానికి నాటకకర్త న్యాయవ్యవస్థలోని లొసుగులను బహిర్గతం చేయడానికి రౌడీ షీటర్ సోమసుందరం పాత్రను ఎన్నుకున్నారు. ఈలాంటివాళ్ళు ప్రతీ ఊరిలో వున్నారు.

ఈ నాటకంలో ఎప్పటికైనా న్యాయం గెలిచి తీరుతుందనే భావనతో వుంటారు డిఫెన్స్ లాయర్. ఇతను మధ్యతరగతి మేధావివర్గ ప్రతినిధిగా మనకు కన్పిస్తాడు. నిర్దోషి సోమసుందరాన్ని గెలిపించడం కోసం తన శక్తినంతా దారపోస్తాడు. ప్రయోజనం వుండదు. చివరకు ఓడిపోతాడు.

సార్వభౌమరావు కొడుకు సుందరం. వీడు పెద్ద వెధవ. తండ్రి చేసిన అన్ని నీచమైన పనులకు వారసుడు. ఇతని అహంకారం అంతా ఇంతా కాదు. తండ్రిలాగే పరమ దుర్మార్గుడు. ఎవ్వరినీ లెక్కచేయడు. ఈ లక్షణాలన్నీ ఇతనికి పుట్టుకతో వచ్చాయి.

ఎస్.ఐ. కిష్టప్ప ప్రభుత్వ ఉద్యోగి. సార్వభౌమరావుకి నమ్మిన బంటు. సేవకుడు కూడా. ఒక్కమాటలో చెప్పాలంటే సార్వభౌమరావుకి కట్టుబానిస. అతను ఎంత చెప్పితే అంత. అతని మాటను జవదాటడు. మారు మాట ఉండదు. అది కిష్టప్ప వ్యక్తిత్వం. అది మంచిదా, చెడ్డదా అని ఆలోచించే ప్రసక్తి లేదు. అతను ఏమి చెబితే అది చేయడమే పోలీసు అధికారి ఎస్.ఐ. కిష్టప్ప డ్యూటీ.

"మతాబుల జల్లులాగ కురుస్తాయి, ఈ నాటకంలో సంభాషణలు" అన్నారు కొడవటిగంటి కుటుంబరావు. ఈ నాటక శైలి గురించి కేతు విశ్వనాథరెడ్డి "గురజాడ, శ్రీపాదల తర్వాత మాండలీక శైలిని ఆయనంత ఎక్కువగా వాడినవారు లేరు. ఇతర మాండలీకాలలో రచనలకు ఆయన ప్రేరకుడయ్యారు. అమానుషత్వం పెరుగుతున్న సమాజంలో గిలగిలలాడే వారి ఆరాటాలను చిత్రించాడు" అన్నారు. చలసాని ప్రసాద్ వ్యాఖ్యానంతో ఈ వ్యాసం ముగిద్దాం. "రావిశాస్త్రికి ముఖ్యంగా పోలీసువ్యవస్థ, న్యాయవ్యవస్థ, జైళ్ళమీద బాగా కసి వుంది. పై మూడు సమాజంలో జరిగే దోపిడీకి కవచాలని ఆయన అభిప్రాయం. ఆయన దోపిడీకి వ్యతిరేకం. ఈ మూడింటితోపాటు నాల్గవది అల్టిమేట్‌గా రాజ్యాంగ వ్యవస్థ – ప్రభుత్వ పరిపాలన. వీటి మీద ఆయన "విరసం" కంటే ముందే ఎప్పుడో విమర్శ ఎక్కుపెట్టాడు". ✦

"రావిశాస్త్రి రచనల్లో బాధలు, కష్టాలు, పీడన మొదలైనవాటిని చిత్రించే సందర్భాలలో దేవుడి ప్రసక్తి వస్తుంది. ఆ ప్రసక్తి సాధారణంగా ప్రార్థించే రూపంలో కాక ఎక్కువగా ప్రశ్నించే రూపంలో కనిపిస్తుంది. ఇందులో వేదన వ్యక్తం అవుతుంది. అలాగే వున్నవారు, దురహంకారులు, దైవం అన్న భావనని తమకి అనుకూలంగా ఎలా వాడుకుంటారో చెప్పవలసిన చోట్ల కూడా దేవుడి ప్రసక్తి వస్తుంది. ఇది ఆయన రచనాశిల్పంలో భాగం కూడా. అధికారం, అణచివేత, పీడన, ద్వేషం మొదలైనవాటి విషయంలో ఆయనకుండే నిరసనభావం, అసహ్యం లాంటి వాటిని పులి ప్రతీకతో చిత్రించడంలో వ్యక్తం అవుతుంది".

– కె. కె. రంగనాథాచార్యులు

శీలా వీర్రాజు స్మృతిలో....

# శీలావి నా స్వాప్నికుడు - ఆంతరంగికుడు!

- డా॥ నాళేశ్వరం శంకరం

**ఫోన్** స్టకాఫ్ కావడంతో గత్యంతరం లేక వివిధ వాట్సాప్ గ్రూపుల్లోని పోస్టుచేసినవాటిని తొలగించే ప్రయత్నంలో శీలా సుభద్రాదేవి ఫ్రీవర్స్ ఫ్రంట్ గ్రూపులో 'We are sad to announce that Sri Seela Veerraju is no more' చదివి నన్ను నేను మరిచిపోయేంత షాక్‌కు గురయ్యాను. ఎవరికీ చెప్పాచేయకుండా బయటకు వచ్చి ఆటో ఎక్కేసాను. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో చాలాసేపు శీలావితో మాట్లాడాను. రేపు సాయంత్రం వస్తానని కూడా చెప్పాను. ఇంతలో ఈ విషాదం. సారింటికి వెళుతున్నాను గానీ నా దుఃఖం పరిపరివిధాల కళ్ళలోకి వచ్చి, విషాద ముద్దను చేసి గడిపిన జ్ఞాపకాలలోకి లాక్కుపోయింది. తొమ్మిదివందల డభ్బైయేడు తొలిసారి ఆయనను చూసానుగానీ అదివరకే మా నిజామాబాదు జిల్లాలోని చిత్రకారుడు సైబా పరంధాములు కలిసినప్పుడల్లా శీలావిని గూర్చి ఆయనకున్న అనుభవాన్నంతా నాలోకి వొంపేవాడు. ఆటో శీలావి ఇంటికి వెళుతుంది గానీ ఏవేవో పద్ధతి పాడు లేకుండా జ్ఞాపకం వెంట జ్ఞాపకం న్యూస్‌రీల్‌లాగా కళ్ళముందు తిరగడం ఆగని దుఃఖంలోకి నన్ను నెట్టుతున్న స్థితిని ఆటో అతడు గమనించాడో యేమో 'సార్ ఎవరైనా వెళ్ళిపోయారా?' అని ఒకటికి రెండుసార్లు అడిగినా నా గద్గదస్వరం అతనితో మాట్లాడటానికి ఇష్టపడలేదు.

ఒక్కోమారు శీలా వీర్రాజు ఏకవ్యక్తి సంస్థలా శ్రమించేవారు. శీలావి మహానుభావుడు. నిజాయితీకి నిలువెత్తు నిలిచిన మహానుభావుడు. ఆయనకు అపారమైన స్నేహ సమూహాలు ఉండేవి. నేను తొలిరోజుల్లో శీలావికి నేనొక్కన్నే స్నేహితున్ని. నాకు ఆయనొక్కడే స్నేహితుడని అనుకునేవాణ్ణి. స్నేహ వృక్షానికి ఎన్నివేల ఆకులో, ఎన్ని విధాలైన భావబంధాలు కలవాడో మెల్లిమెల్లిగా అర్థమైంది. శీలావి జీవితాంతం సాధారణమైన ఒక సగటు మనిషిలాగే జీవించాడు. స్నేహితుల్ని రక్తబంధువులుగానే భావించేవాడు. ఆయన గొప్ప పనిమంతుడు. తీరికగా కాలుమీద కాలేసుకుని కూర్చునే మనస్తత్వం కాదు. ఎప్పుడూ ఏదో ఒక పని చేస్తుండేవాడు. ఏ పని లేకపోతే పుస్తకాలు చక్కగా బైండ్ చేసేవాడు. ఆయన బైండ్ చేసేప్పుడు చాల సునిశితంగా చూసేవాణ్ణి. నాకూ నేర్చుకోవాలన్న కాంక్ష కలిగింది. ఆయన అక్షరాలు నన్ను ఎంతో ఆకర్షించేవి. ఆయనలాగా రాయాలని అనిపించేది. ఆయన అక్షరాలను చూస్తేచాలు ఇవి శీలావి అక్షరాలేనని సాధారణ సాహిత్య పాఠకుడు కూడా గుర్తుపట్టే విధంగా ఉండేవి. ఆయన బొమ్మలేసేప్పుడు తదేకంగా చూసేవాణ్ణి. ఆయన బొమ్మ వేసాడంటే చాలు ఇట్టే శీలావి బొమ్మ అని గుర్తుపట్టేవిధంగా ఉండేది. చిత్రలేఖనంలో ఎంతో శ్రమించాడు. దాన్ని వ్యాపారానికి తాకట్టు పెట్టలేదు. కొన్ని వేలమంది కవుల, కథకుల, నవలాకారుల, పరిశోధకుల, విమర్శకుల పుస్తకాలకు బొమ్మలు వేసేవాడు. ఒక్క పుస్తకానికి ఇంత డబ్బు అని డిమాండ్ చేసి తీసుకున్న దాఖలా ఒక్కటిలేదు ఆయన జీవితంలో. ఉచితంగా వేయడానికి ఎన్నడూ వెనకాడలేదు. ప్రతి జిల్లా నుంచి తయారైన రచయితలు తొలిసారిగా ఆయనను కలిసి విషయం చెబితే చాలు ముఖచిత్రం మొదలుకొని పుస్తకం వచ్చేదాక తానే స్వయంగా తిరిగి పుస్తకం కోసం శ్రమించిన తీరు నాకు తెలుసు. తెలుగు నేలమీద సాహిత్యకారుల కోసం శీలావిలా శ్రమించిన మరో చిత్రకారుడు లేడు.

శీలావి సాహిత్యంలో నాకు బాగా నచ్చినవి ఆయన చేసిన ప్రయోగాలు. ప్రయోగవాదిగా శీలావి అని ఎవరైనా పరిశోధన చేయాలి. ఆత్మకథను సైతం వచన కవిత్వంలో రాసిన తొలికవి అతడే. ఆయన 'మైనా' నవలను సినిమాగా తీయాలని ఇద్దరు ఆయన దగ్గరకు వచ్చారు. వారితో శీలావి మాట్లాడినవి నాకు బాగా తెలుసు. నవలలో ఏ మార్పులు చేయడానికి అతడు ఇష్టపడలేదు. ఆయన పద్ధతికి తోక ముడిచి వెళ్ళిపోయారు. అలాగే మరికొన్ని కథలను టీవీ సీరియల్స్‌గా తీద్దామనుకున్నా ఏ మార్పులూ చేర్పులను ఆయన అంగీకరించలేదు.

శీలావికి పనితనం పట్ల శ్రద్ధ ఎక్కువ. ఇది నా పని కాదనే భావన తక్కువ. ఇతరుల పనిని చేయడంలో ఆయనకాయనే సాటి. అబ్బూరి ఛాయాదేవి 'వరద సర్వస్వం' వేసినప్పుడు దాని పనంతా చేసింది శీలావిగారే. కుందుర్తి తర్వాత ఎ టు జడ్ ఫ్రీవర్స్ ఫ్రంట్‌ను నడిపింది ఆయనే. తెలుగు సాహిత్యంలో అవార్డు సంస్కృతికి గౌరవాన్ని తెచ్చినవాడు శీలావి. వరవరరావు లాంటివారు సైతం ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డును గౌరవంగా స్వీకరించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకున్నంత గౌరవం ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డుకు వచ్చేటట్లు శ్రమించారు.

ఫ్రీవర్స్ ఫ్రంట్ తరఫున వేసిన సంకలనాలకు సైతం గొప్ప గౌరవం కలిగేవిధంగా శ్రమించారు. శీలావిగారికి అపారమైన మిత్రులున్నారు. విరసం మొదలుకొని అరసందాకనే కాదు లెఫ్ట్ ఓరియంట్‌తో కూడిన అన్ని సాహిత్యసంస్థలతో అనుబంధం ఉన్నవాడు. బేసికల్‌గా ముందు నుంచి శీలావి అభ్యుదయవాది. దిగంబరకవుల కాలంలోనే వచన కవిత్వోద్యమం విస్తరించిన సందర్భం. రెండు ఉద్యమాలు వేరు వేరు. రెండు ఉద్యమాల్ని నడిపినవారు ఉద్యమకారులు కారు. అయినా ఈ రెండు ఉద్యమాలకు తనదైన శక్తియుక్తుల్ని ధారపోసినవాడు శీలావి.

శీలావి చిత్రకారుల్లో గొప్ప చిత్రకారుడు. గొప్ప నవలాకారుల్లో నవలాకారుడు, గొప్ప కథకుల్లో కథకుడు, గొప్ప కవుల్లో గొప్ప కవి అంటూ పొగడ్త కోసం అనటంలేదుగానీ ఇది నిజం. అయితే చిత్రకారులు శీలావిని నవలాకారుడిగా గుర్తించేవారు. నవలాకారుల్లో కొందరు చిత్రకారునిగా గుర్తించేవారు. ఇలా ప్రతి ప్రక్రియలోనివారు అతన్ని మరో ప్రక్రియలో గొప్పవాడని అన్నారే తప్ప ఎవరూ ఆయనను పట్టించు కోవల్సినంతగా పట్టించుకోలేదు. అయినా ఎవరో పట్టించుకోలేదన్న భావన ఆయనకుండేది కాదు.

శీలావిలాంటి మరొకరు తెలుగు సాహిత్యంలో జన్మిస్తారన్న నమ్మకంలేదు. నిరుపేద జీవనంలోంచి బతుకుబండిని సాగిస్తూ

చిత్రకారుడిగా, నవలాకారుడిగా, కథకుడిగా, కవిగా అన్నింటికి మించి గొప్ప స్నేహశీలిగా జీవించిన ఆయన జీవితం, వ్యక్తిత్వం, శ్రమతత్త్వం నేటితరానికి స్ఫూర్తిదాయకమైంది. ఇప్పటికైనా ప్రభుత్వాలూ, విశ్వవిద్యాలయాలూ కళ్ళుతెరిచి పిల్లలకు పాఠ్యగ్రంథాలలో ఆయన రచనలు ఉంచేవిధంగా శ్రమించవలసిన అవసరం ఎంతో ఉంది. వీర్రాజులాగా సాహిత్య సమాజం జీవిస్తేనే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళిగా భావిస్తాను. ✦

కవిత

## తెలుగు కతల చాత్రిబాబు

**- ఎస్. శంకరరావు**

అల్పజీవుల ప్రతినిధీ!
కథా శిఖరమా - రాచకొండా!!
"నీ సాహిత్య సాగులో"
ప్రజల పక్షాన
ఎన్నెన్ని సామాజిక ఉత్పత్తుల్లో!
రచయితలకు ఎన్నెన్ని
శాస్త్రీయ సామాజిక బాధ్యతలో!!
"నీ రచనలలో"
ఒకచోట పేదల అగచాట్లు
మరోచోట ధనవంతుని ఆగడాలు
శ్రమ మానవ సంబంధాల
అంతర్మథనాలెన్నో!
నల్లకోటుతో నీ ఆశీస్సులెన్నో!!
కలాన్ని కాలంపై
కత్తిగా ఎక్కు పెట్టాలని
సమాజాన్ని ఆసాంతం
చదివి వడగట్టిన
అపూర్వ శైలీ శిల్పమా!
నీ రచనొక సందేశం!
ప్రజాస్వామ్య బూటకం
నీ రచనలో విస్పష్టం!
నీ రచనల పదును
తెలుగు ప్రజల భాషకు అదును!!
అట్టడుగు వర్గాల బతుకు వెతల
కథనాల ఛాత్రిబాబూ....!!
నీకు నూరేళ్ళు!!
నీ సాహిత్యానికి వెయ్యేళ్లు!!! ✦

## అపసవ్య విద్యారంగ సంస్కరణలు

**విద్య,** వైద్యం ప్రజలందరికీ ఉచితంగా అందించడం, దేశమంతటా కామన్ స్కూలు విద్యావిధానాన్ని అమలుచేయడం లాంటి మౌలికమైన సంస్కరణల కొరకు దశాబ్దాలుగా పోరాటం జరుగుతోంది. కాని వాటిని నిర్లక్ష్యం చేస్తూ, ఏ స్థాయి విద్య ఎన్నేళ్ళు అన్నదానిని మాత్రం మారుస్తూ, వారికి తోచినవాటిని సంస్కరణలుగా పాలకవర్గాలు ప్రవేశపెడుతున్నాయి.

కొన్నాళ్ళు ప్రాథమికస్థాయిలో యోగాసనాలు ప్రవేశపెట్టి ఉపాధ్యాయులకు పుట్టపర్తి సాయిబాబా వద్ద శిక్షణ ఇప్పించారు. వీడియో కేసెట్లు, టెలివిజన్ వచ్చిన తర్వాత బాపు, రమణల చేత వీడియో పాఠాలు తయారుచేయించారు. వాటిని చాల సృజనాత్మకంగా వారు తయారుచేశారు. కాని టి.వీ.లు, వీడియోలు అదృశ్యమయ్యాయి. ఇలా ఎన్నెన్నో....

ఇక ఇప్పుడు 4 నుండి 10వ తరగతి వరకు దేశంలో విద్యావ్యాపారం చేస్తున్న బైజూస్ సంస్థవారు రూపొందించిన పాఠాలు టి.వి. ద్వారా అందించడానికి మే 2022లో ఒక ఒప్పందాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేసుకుంది. పూర్వ విద్యామంత్రి నారాయణ తన ప్రైవేటు సంస్థ ద్వారా ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చినట్టు, 500 కోట్ల ఖర్చుతో బైజూస్‌వారితో శిక్షణ ఇప్పిస్తారట.

ఈ బైజూస్ సంస్థ దేశంలోని 200 పెద్ద నగరాలలో 500 ట్యూషన్ సెంటర్లను నిర్వహిస్తూ విద్యావ్యాపారాన్ని చేస్తోంది. ఇది అంతర్జాతీయంగా 115 మిలియన్ల డాలర్ల వ్యాపారాన్ని విస్తరించింది. వీరు తయారుచేసిన అభ్యసనా సామగ్రి (స్టడీ మెటీరియల్) మన సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల కనుగుణంగా వుండటం అసాధ్యం.

ఆన్‌లైన్ తరగతులు, యాంత్రీకరణ ద్వారా విద్యార్థులు నష్టపోయిన వాస్తవం మన కళ్ళముందు వుంది. బైజూస్‌ను మన విద్యావ్యవస్థలో అనుమతించడమంటే విద్యను ప్రైవేటుపరం చేయడమే - ధనిక విద్యార్థులకు మాత్రమే ఇది ఉపయోగ పడుతుంది. ✦

## రావిశాస్త్రి ఛలోక్తులు

**'మీరు రాస్తున్నవి విప్లవానికి ఎలా ఉపయోగిస్తాయి' అన్న ప్రశ్నకు రావిశాస్త్రి జవాబు.**

"యుద్ధకాలంలో అందరూ సైనికులైపోరుగదా.... తమ తమ ఊళ్ళల్లోనే వుండి సైనికులకు పనికివచ్చే మేజోళ్ళు అల్లి పంపిస్తారు. కొందరు రక్తదానం చేస్తారు. నన్ను మేజోళ్ళు అల్లువానిగా భావించుకోవచ్చు." ✦

శీలా వీర్రాజు స్మృతిలో....

# ‘అక్షర.. బొమ్మల’ రారాజు శీలా వీర్రాజు జ్ఞాపకాల తడిలో....

– జనజ్వాల

**ఒకరోజు** రాత్రి 9 గం॥కు “జనజ్వాల ఏమి చేస్తున్నావు!” “సార్ పుస్తకాలను నిమురుకుంటూ, సర్దుకుంటున్నా” “మంచిపని చేస్తున్నావు, అప్పుడప్పుడు పుస్తకాలను దులిపి సర్దకపోతే, వాటికి రోగం వస్తుంది. నేను పుస్తకాలకు తరచుగా ఇంజక్షన్ ఇస్తుంటా. మరిచిపోయి ఏదో వ్యాపకంలో పడి గతనెల ఇంజక్షన్ ఇవ్వకపోవడంతో, దానివల్ల నాకు కొద్దిగా అనారోగ్యం వచ్చి మొన్న ఆసుపత్రికి పోవలసి వచ్చింది”, “ఏమిటి సార్ మీరు కొత్తగా చెపుతున్నారు. పుస్తకాలకు ఇంజక్షన్ ఇవ్వడం ఏమిటి?” “కాదు జ్వాలా! నిజం చెబుతున్నా పుస్తకాలకు తప్పక ఇవ్వాలి ఇంజక్షన్”, “ఏమో సార్ మనుషులకు, జంతువులకు ఇవ్వడం చూశాను. ఇలా కొత్తగా....” చిరునవ్వుతో రాత్రి ఏదో చెప్పాలని ఇలా చివరికి సంభాషించి ముగించి ఫోన్ పెట్టేశాడు. అక్షర.... బొమ్మల శీలా వీర్రాజు.

నేను అభిమానించి ప్రేమించేవారిలో శీలా వీర్రాజుగారు ఒకరు. నా “మళ్ళీ ఒక మహాస్వప్న ఉద్యమం కోసం” కవితల పుస్తకానికి, అడిగిన వెంటనే రెండు రోజులలో అద్భుతమైన రంగుల ముఖచిత్రం పంపించారు. ఆ బొమ్మను మరో పుస్తకం నా కవిత ‘మహాకవిత్వం’ పుస్తకం లోపల కూడా బ్లాక్ అండ్ వైట్‌గా ముద్రించుకోవడం అతనిపట్ల నాకు ఉన్న ప్రేమతోనే, ఒక బొమ్మ ఇలా విడివిడిగా రెండు పుస్తకాలకు లోపల, బయట ముద్రించుకోవడం, ఇది చూసి “బాగుందయ్యా ఇది కొత్త ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్టుంది జ్వాల” అన్నారు.

ఇక యన్.టి. రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పటిమాట, ప్రతిరోజు తెల్లవారుజామున రెండు, మూడు గంటల సమయాన ముఖ్యమంత్రి పేషి నుంచి కారు రావడం, అందులో శీలా వీర్రాజు వెళ్ళి యన్.టి.రామారావుతో ముఖాముఖిగా కూర్చొని గంటల తరబడి ముఖ్యమంత్రి దినచర్యల సంభాషణలు, వారి ఉపన్యాసాలు రాసి పెట్టేవారు. ఇలా తరచుగా మూడు నాలుగు సంవత్సరాలు గడిచిన తరువాత, ఒకరోజు శీలా వీర్రాజుతో “మీరు ఎంతో ఓపికతో నాకు పనిచేసిపెట్టుతున్నారు. ఏ రోజు మీరు ఏదీ కోరుకోలేదు. నేను స్వయంగా అడుగుతున్నా మీకు ఏ సహాయం కావాలి?” అని ముఖ్యమంత్రి రామారావు అడిగిన వెంటనే తడబడకుండా “అన్నగారు ముందుగా నన్ను ఈ పని నుంచి విముక్తి చేయండి చాలు. రోజు తెల్లవారుజామున నా సాహిత్య, చిత్రకళాసృజనకు అంతరాయం కలుగుతోంది”. అనడంతో, యన్.టి.ఆర్.గారు బిగ్గరగా నవ్వి “ఏమయ్యా – నీలాంటి వ్యక్తిత్వం గలవారు తక్కువ. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రితో ఇంత చనువుగా వుంటే ఏవో ఆశిస్తారు. నీవు ఏమిటయ్యా ఇస్తానన్నా కాదంటావు” – ఇది శీలా వీర్రాజుగారి వ్యక్తిత్వానికి ఒక మచ్చు తునక.

ఇకపోతే అతడు బాల్యంలోనే ఒక నవల రాయడం అది ఆ ఊరు పెద్దమనిషికి తెలిసి, “ఓరేయ్ అబ్బాయి నీవు ఇంత చిన్నవయస్సులో నవల రాసి ఊరికి పేరు తెచ్చావురా అబ్బాయి. ఆ నవల స్వయంగా నా డబ్బులతో అచ్చు వేయిస్తాను. రేపు మా ఇంటికి భోజనానికి రా” అనడం, మరుసటిరోజు శీలా వీర్రాజుగారి ఇంటికిపోవడం ఆ పెద్దమనిషి ఇల్లు అంతా చూపించి, ‘భోజనం తయారు అయింది. ఇంతకు నీది ఏ కులంరా అబ్బాయి’ అని అడగటం, ఆయన ఫలానా కులం అని చెప్పడంతో, పెద్దమనిషి ముఖం మాడ్చుకొని, ఓరేయ్ నీవు అరుగుమీద కుర్చో పోరా అని ఒక విస్తరాకు వేసి ఇక్కడ భోజనం చేయి అని చెప్పడంతో, ఆత్మాభిమానం దెబ్బతిన్న శీలా వీర్రాజు ఇస్తరాకు తిరగేసి ‘నీవు వద్దు, నీ భోజనం వద్దు. నీవు నా నవల అచ్చు వేయించవద్దు’ అని కోపంతో వెళ్ళిపోయాడు. ధిక్కారం, ఆత్మాభిమానంకి ఇది మరో మచ్చుతునక. ఇలాంటి మహావ్యక్తిత్వం గల శీలా వీర్రాజు మన నుంచి భౌతికంగా దూరం కావడం జీర్ణించుకోలేని దుఃఖ వేదన. ఇది తడి జ్ఞాపకాలతో “అక్షర.... బొమ్మల’ రారాజు శీలా వీర్రాజుకు కవి అర్పిస్తున్న నివాళి. ✦

## ‘భావవీణ’ సంపాదకుడు కొల్లా శ్రీకృష్ణారావు మృతి



**తెలుగు** పండితుడు, పద్యకవి, ‘స్వతంత్రవాణి’, ‘భావవీణ’ సంపాదకులైన కొల్లా శ్రీకృష్ణారావు తన 94వ యేట 13 జూన్ 2022న గుంటూరులో మరణించారు. ఆయన 27 జనవరి 1928న పెదకూరపాడులో జన్మించారు.

భాషాప్రవీణ చదివిన శ్రీకృష్ణారావు పెదకూరపాడు ఉన్నత పాఠశాలలో 1951–61లో తెలుగు పండితునిగా పనిచేశారు. 1965లో ‘స్వతంత్రవాణి’ అనే వారపత్రిక ప్రారంభించి 30 ఏళ్ళపాటు నడిపారు. 2012 నుండి ‘భావవీణ’ అనే సాహిత్య మాసపత్రికను ప్రచురిస్తున్నారు. గుంటూరులో డా॥ కె. సదాశివరావు స్థాపించిన ‘సాహితీసదస్సు’కు సుదీర్ఘకాలం కార్యదర్శిగా పనిచేశారు.

జాషువా, ఏటుకూరి వెంకటనరసయ్యల శిష్యునిగా పద్య కవిత్వ రచనలో కృషిచేసి, ‘విశ్వశాంతి’, ‘శంఖారావం’, ‘రారాజు’, ‘పౌరుషజ్యోతి’, ‘కర్షక సాహిత్యం’, ‘నా సాహితీయాత్ర’ మొదలైన గ్రంథాలు రచించారు. ✦

## జాతీయ అక్షరయోధులు



## గిరీష్ కర్నాడ్

( 1938 - 2019)



5

సింగంపల్లి
అశోక్‌కుమార్

# సంచలనచిత్ర కళాకారుడు

చలన చిత్ర ఉత్తమనట కన్నడ సంస్కారం
నాటక సాహిత్యానికి జ్ఞానపీఠ పురస్కారం
'మీటూ అర్బన్ నక్సలైట్'నన్న గిరీష్ కర్నాడ్
ధిక్కార స్వరానికి శిరసువంచి నమస్కారం

ప్రశ్నించే మేధావులను 'అర్బన్ నక్సలైట్స్'అనడాన్ని తీవ్రంగా ఖండిస్తూ 'మీ టూ అర్బన్ నక్సలైట్' అనే బోర్డు మెడలో తగిలించుకుని సభల్లోనూ, సమావేశాల్లోనూ పాల్గొన్న ధిక్కార స్వరం గిరీష్ కర్నాడ్ భారతీయ కన్నడ కవి,రచయిత, నటుడు,చిత్ర దర్శకుడు నాటక రచయిత.

ప్రాథమిక విద్యలు ఉత్తరకర్నాటక జిల్లా సిరసిలోనూ, హైస్కూలు విద్య ధారవాడలోనూ చదివారు. కర్నాటక కళాశాలలో డిగ్రీ పూర్తిచేశారు.రోడ్స్‌సంస్థ ఉపకారవేతనంకు అర్హత పొందడంతో మరింత ఉత్తమశ్రేణి అభ్యాసానికి ఆక్స్‌ఫర్డ్ (ఇంగ్లాండు) వెళ్లారు.

పూణె ఫిలిం ఇన్స్టిట్యూట్‌లో నిర్దేశకుడిగా పనిచేశారు.తరువాత ముంబైలోకొన్ని సినిమాలలో నటించాక బెంగళూరు వచ్చి చురుకుగా నాటకరచనలు చేశారు.'యయాతి, తుగ్లక్, హయవదన, నాగమండల, తలిదండ, అగ్ని మట్టుమాలె, టిప్పువిన కనసుగళు' మొదలైనవి ప్రసిద్ధ నాటకాలు. ఇందులో 'నాగమండల' సినిమాగా రూపొందింది.

కర్నాడ్ రాసిన అనేక నాటకాలు కన్నడ భాష నుండి హిందీ, పంజాబీ, మరాఠీ తదితర భారతీయ భాషలలోకి అనువాదమయి. అనేక ప్రదర్శనలతో పలు ప్రశంసలు పొందాయి.

కర్నాడ్ సాహిత్యసేవ కేవలం కన్నడ భాషకేపరిమితం కాలేదు. నటుడిగా తన కళాజీవితం ప్రారంభించినా ఇతర భాషా నాటకసాహిత్యాన్ని గమనంలోకి తీసుకుని తన అసమాన ప్రతిభతో ఒక్కొక్కమెట్టు అధిగమిస్తూ ఒక ఉత్తమ భారతీయ నాటకసాహిత్యవేత్తగా ప్రసిద్ధి పొందారు. భారతదేశ నాటక సాహిత్యంలో విశిష్టమైన రచనలు రచించి జ్ఞానపీఠ పురస్కారం పొందిన తొలి నాటక సాహిత్య కృషీవలుడిగా గౌరవం అందుకున్నారు. 1972లో 13 దృశ్యాలుగల 'తుగ్లక్' అనే నాటకం రాశారు. అంతేకాకుండా జ్ఞానపీఠ పురస్కారం పొందిన ఇద్దరు కన్నడ కవుల కావ్యాలను చలనచిత్రాలుగా మలిచిన కీర్తి కూడా సొంతం చేసుకున్నారు.

యు.ఏ.అనంతమూర్తి కథ అందించిన 'సంస్కార' చిత్రం ఒక అద్భుతం. ఆ చిత్రంలోని 'ప్రాణేశాచార్య'గా గిరీష్ కర్నాడ్ నటన మరోఅద్భుతం. ప్రభుత్వ నిషేధానికి గురై, నిషేధం తొలగిన తర్వాత 'స్వర్ణకమలం' అందుకున్న తొలి కళాత్మక కన్నడ సినిమా. దీనికి దర్శకుడు తెలుగుకవి పట్టాభిరామిరెడ్డి. కర్నాడ్, బి.వి.కరంత్ కలిసి దర్శకత్వం వహించిన యల్.భైరప్ప కథ అందించిన విశిష్టచిత్రం 'వంశవృక్ష'కు ఉత్తమ జాతీయ దర్శకుడు అవార్డు అందుకున్నారు.

'ఆనందభైరవి, ప్రేమికుడు, శంకర్‌దాదా యం.బి.బి.యస్, ధర్మచక్రం, జీవనవేదం' మొదలైన తెలుగు - 'నిశాంత్, స్వామి, గోధూళి, రత్నదీప్, ఉంబర్తా' మొదలైన హిందీ సినిమాలలోనూ నటించారు.

కేంద్ర సంగీత నాటక అకాడమీ అధ్యక్షులుగా పనిచేశారు. జ్ఞానపీఠ, పద్మశ్రీ, పద్మభూషణ్, కర్నాటక విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ అవార్డులు అందుకున్నారు.

గిరీష్ కర్నాడ్ 1938 మే, 19న మహారాష్ట్రలోని మథేరాన్‌లో జన్మించారు. 2019 జూన్, 10 బెంగళూరులో కన్నుమూశారు.

సినిమా సమీక్ష

# దేశ రుగ్మతల్ని ఎత్తి చూపిన పొలిటికల్ థ్రిల్లర్ 'జన గణ మన' (2022)

– బాలాజీ (కోల్‌కతా)

**మలయాళంలో** వచ్చిన ఇటీవలి సినిమా 'జన గణ మన'. నెట్‌ఫ్లిక్స్‌లో పలుభాషల్లో ఇప్పుడు ప్రసారమౌతోంది. తెలుగులో సినిమా టైటిల్‌ను ఎందుకనో 'జన' వరకే కుదించారు. రవీంద్రనాథ్ ఠాకూర్ 1911లో రాసిన 'జనగణమన' గీతం 1950 నుండి జాతీయ గీతం అయింది. 'జన' అంటే ఒక్కో మనిషి, 'గణ' అంటే ఒక్కో ప్రజా సమూహపు, 'మన' అంటే మనసులు గెలుచుకునేలా పాలన వుండాలని రవీంద్రుడు కోరుకున్నాడు. కానీ స్వాతంత్ర్య అమృతోత్సవాలు జరుపుకుంటున్న ఈ రోజుకీ సామాజిక వివక్షలు సమసిపోకపోగా ఇటీవల మరింత పెరిగిపోతున్నాయి. పాలిటిక్స్ అఫ్ ఐడెంటిటీ (గుర్తింపు రాజకీయాలు), పాలిటిక్స్ అఫ్ హేట్ (విద్వేష రాజకీయాలు) వ్యక్తులకూ, సమూహాలకూ జీవన్మరణ సమస్యలు తీసుకొస్తున్నాయి. ఆధిపత్య రాజ్యం, రాజ్యం చేతిలోని మీడియా, మీడియా చేత ప్రజాభిప్రాయ నిర్మాణం! పోస్ట్ ట్రూత్ లేక సత్యానంతర యుగంలో ఓ అదృశ్య నిజనిర్మాణ వ్యవస్థ పనిచేస్తోంది. తర్కాలూ, రుజువులూ గాలికెగిరి, ప్రజలు నమ్మి తీరాల్సినవే నిజాలుగా చలామణి అయిపోతున్నాయి. తక్షణ నిర్మిత ప్రజాభిప్రాయాలు 'ఇన్‌స్టంట్ టీ, ఇన్‌స్టంట్ కాఫీ' లాగా 'ఇన్‌స్టంట్ జస్టిస్' అనగా తమకిష్టమైన తక్షణ న్యాయం కోరుకుంటున్నాయి. కోరినది దొరికితే పండగ చేసుకుంటున్నాయి. దిశ బూటకపు ఎన్కౌంటర్ సమయంలో ఈ విషయం ప్రస్ఫుటంగా కనిపించింది. పోలీస్ ఆఫీసర్లపై పూలు చల్లిన, స్వీట్లు పంచిన సమూహాలే అది బూటకం అని తెలిసి మౌనం వహించాయి.




విశ్వవిద్యాలయాల్లో కూడ వ్యవస్థీకృత కుల వివక్ష వికృత రూపం ప్రదర్శించినపుడు 'కార్ల్ సాగన్ అంతటి సైన్సు రచయిత అవుదామను కున్నవాడు' '(నిమ్న కులంలో) నా పుట్టుకే ఒక తప్పిదం' అని నోటు రాసి హాస్టల్‌లోనే వురి వేసుకున్నాడు. దిశ కేసులానే, రోహిత్ వేముల కేసు కూడా మన ఉమ్మడి రాష్ట్ర రాజధానిలోనే జరిగింది. కానీ విచారకర విషయమేమిటంటే ఈ సంఘటనలేవీ మన తెలుగు దర్శకులను కదిలించలేకపోయాయి. మలయాళ యువ దర్శకుడు డిజో జోష్ అంథోనీ మాత్రం తన రెండో సినిమాలో ఈ రెండు సంఘటనలనూ ఒక ఆసక్తికరమైన కథతో పెనవేసి ఒక పొలిటికల్ థ్రిల్లర్‌గా మలిచాడు.

సబా మరియం (మమతా మోహన్‌దాస్) అనే కాలేజ్ ప్రొఫెసర్ మృతదేహం రోడ్డు పక్కన బాగా కాలిపోయిన స్థితిలో కనిపిస్తుంది. పోస్టుమార్టం నివేదికలో ఆమెను అత్యాచారం చేసి(?) చంపేసి ఆ తర్వాత మృతదేహాన్ని దహనం చేసినట్లు రిపోర్టు వస్తుంది. కేసును ఏసీపీ సజ్జన్ కుమార్ (సూరజ్ వెంజారమూడు)కు అప్పగిస్తారు. ఒక ప్రత్యక్షసాక్షి చెప్పిన సాక్ష్యం ఆధారంగా సజ్జన్ నలుగురిని అరెస్టు చేస్తాడు. అయితే రాజకీయ వత్తిడి మేరకు ఆ కేసును వేరే ఆఫీసర్‌కి అందించాల్సి వస్తుంది. నిందితులను వేరే స్టేషన్‌కి షిఫ్ట్ చేసే సమయంలో సజ్జన్ వారిని ఎన్‌కౌంటర్ చేస్తారు. ప్రజలు, కాలేజీ విద్యార్థులు సజ్జనుడికి ఈ దుందుడుకు చర్యకు నీరాజనాలు పడతారు. కానీ ఇంటర్వెల్ తర్వాత కథ తారుమారౌతుంది. మానవ హక్కుల వారు కోర్టులో కేసు పెడతారు. సజ్జన్‌కు వ్యతిరేకంగా వాదించడానికి లాయర్ అరవిందన్ స్వామినాథన్ (పృథ్వీరాజ్ సుకుమారన్) వస్తాడు. అరవింద్‌కు వేరే బ్యాక్‌గ్రౌండ్ కథ వుంటుంది. అతడు కోర్టులో ఒక్కో అంశాన్ని పొరలు పొరలుగా విప్పుతూ వుంటే హీరోలుగా కనిపించిన వారు విలన్లుగా తేలుతుంటారు. ప్రజల కోపం మరోవైపుకు మళ్ళుతుంది. సినిమాలోని సస్పెన్స్ అంశంకు భంగం వాటిల్లకుండా ఆ కథావివరాల్లోకి వెళ్ళకుండా ఈ సినిమాలోని గొప్పతనాన్ని, ఇది చూపిన సాహసాన్ని మాత్రమే చెప్పుకుందాం.

ప్రతి సంఘటనకూ, దానిపై వచ్చే స్పందనకూ ఒక రాజకీయ నేపథ్యం వుంటుంది. ఆ విశాలమైన నేపథ్యాన్ని విశ్లేషిస్తే ఆ సంఘటనలు అలానే ఎందుకు జరుగుతున్నాయో కూడా మనకు అర్థమౌతుంటాయి. ఈ సినిమా ఆ పనిని చేసింది. దేశంలోని యూనివర్సిటీ, కాలేజీ కాంపస్‌లలో ఇటీవల జరిగిన బోలెడు సంఘటనలు ఈ సినిమాలో చోటుచేసుకున్నాయి. గౌరీ అనే స్టూడెంట్‌పై రూలింగ్ పార్టీ యూనియన్ గుండాలు దాడి చేసినప్పుడు వైరల్ అయిన వీడియోలో అచ్చం జేఎన్‌యూ ఐషీ ఘోష్ కనిపిస్తుంది మనకు. ఆ పాలక పార్టీ స్టూడెంట్ గుండాలతో దాడి చేస్తున్నపుడు 'జై ....' అని అరుస్తాడు. నినాదంలోని మిగతా మాట ఏమై వుంటుందో మనం ఊహించుకోవచ్చు. ఆయనకు రివాల్వర్ అందించినాయన పోలికలు ఎవరివో కూడా మనం అర్థం చేసుకోవచ్చు. 'సబా చావు ఒక వార్నింగ్‌గా మనకు గుర్తుండాలి' అని చనిపోయిన ప్రొఫెసర్ పట్ల కూడా అగౌరవంగా మాట్లాడే వీసీవి ఎవరి పోలికలో కూడా మనకు హింట్ వదిలేస్తాడు దర్శకుడు. ప్రశ్నించే విద్యార్థుల్నీ, ప్రొఫెసర్లనీ, మేధావుల్నీ ఎలా ఇరికిస్తున్నారో, ఎలిమినేట్ చేస్తున్నారో మనం చూస్తున్నాం. భీమా కోరేగావ్ కేసులో అరెస్టులు చేయడానికి వచ్చిన పోలీసు ఆఫీసర్లే ఆ మేధావుల కంప్యూటర్లలోకి

హ్యాక్ చేసి, ఈ-మెయిళ్లూ, వగైరాలూ ప్రవేశ పెట్టారనీ తాజా పరిశోధనలు వెల్లడిస్తున్నాయి.

'వేషధారణ బట్టి కనిబెట్టేయవచ్చు' అని ఝార్ఖండ్ మీటింగ్‌లో ఎవరన్నారో మనకు తెలిసిందే. అలా ఆయన అన్న తర్వాత స్కల్ క్యాపులు ధరించి ప్రభుత్వ ఆస్తుల్ని ధ్వంసం చేస్తూ బెంగాలు పోలీసులకు పట్టుబడిన వారు ఏ పార్టీకి చెందిన వారో మనకు తెలుసు. ఈ సినిమాలో దర్శకుడు ఏ పార్టీనీ, వ్యక్తినీ పేరు పెట్ట చూపలేదు. సింబాలిక్‌గా పాత్రలు వేసుకున్న దుస్తుల్ని బట్టి, వారు తమ చేతిలో పట్టుకున్న జెండాల్ని బట్టి వారు ఎటువైపో పోల్చుకోమన్నాడు. జామియా మిలియా లైబ్రరీలో చదువుకుంటున్న విద్యార్థులపై దాడి జరిగింది. ఆ దృశ్యం ఈ సినిమాలో ఓ చోట కనిపిస్తుంది. ఇటువంటి సంఘటనలన్నీ ఉత్తర భారతదేశంలో ఎటువంటి రాజకీయ పార్టీ అధికారంలో ఉన్న చోట జరిగాయో మనకు తెలుసు. ఆ నేపథ్యాన్ని దక్షిణ భారతదేశంలో చూపడానికి దర్శకుడు ఎన్నుకున్న రాష్ట్రం కర్ణాటక. ఉన్నావ్ రేప్ దేశమంతా సంచలనం సృష్టించింది. ఒక మైనర్ బాలికను రేప్ చేసి, ఆమె కోసం న్యాయపోరాటం చేస్తున్న కుటుంబాన్ని, బంధువులను చంపి, కేసు వాదిస్తున్న లాయరుపై దాడిచేసి, బాధితురాల్ని ట్రక్‌తో గుద్దేయడం కూడా మనకు గుర్తుంది. అటువంటి ఒక సంఘటనను కోర్టులో వాదిస్తాడు అరవిందన్. ఆ దుర్మార్గుడి పేరును 'కులదీప్' యాదవ్ అని పెట్టడం పెద్ద సాహసమే. 'బీద నేరస్తుల విషయంలో తక్షణ న్యాయం కోరే వారు ఈ దుర్మార్గుడి ఎన్కౌంటర్ ఎందుకు కోరుకోరు?" అని ప్రశ్నిస్తాడు అరవిందన్. ఎందుకంటే మనకు తెలీకుండానే 'కులం, రంగు, సామాజిక శ్రేణి లాంటి గుర్తింపు రాజకీయాలు' మనలో దాగి వున్నాయి. రెండో క్లాసు పుస్తకంలో 'ఫెయిర్ అండ్ అగ్లీ'కి సంబంధించిన కాన్సెప్టులు పసి మెదళ్లలోకి ఎలా ప్రవేశపెడుతున్నారో వివరిస్తాడు అరవిందన్ ఈ కోర్టు వాదనలో.

దళిత పీహెచ్‌డీ స్టూడెంట్‌కీ, ఆమె గైడ్‌కీ జరిగిన సంభాషణ ఒళ్లు జలదరింపజేస్తుంది. 'అగ్రవర్ణాలు చూపే ఔదార్యాన్ని కళ్ళకద్దుకుని పడుండాలి' అని చెబుతాడు ఆ అగ్రవర్ణ దురహంకారి ఒక పనిమనిషిని చూపుతూ. 'ఆ పనిమనిషి తల్లి కూడా పనిమనిషే, ఆమె కూతురు కూడా పనిమనిషిగానే ఉంటుంది. మేము తినేయగా మిగిలినది ఆమెకిస్తే ఆనందంగా తీసుకుంటుంది. ఉచితం లేదా ఔదార్యం అన్నది అధికారం కాకూడదు' అంటూ రిజర్వేషన్లపై హేళన చేసి, ఆమె రీసెర్చిని చులకన చేసి మాట్లాడతాడు. ఈ తీవ్రమైన వివక్షే దళిత విద్యార్థుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసి వారిని ఆత్మహత్యలకు పురికొల్పుతోంది. ఈ దృశ్యం నిజంగా వణుకు పుట్టిస్తుంది.

ఈ సినిమాలో విద్య కోసం నిధులు తగ్గించి మూడున్నర కోట్లతో విగ్రహాలు కట్టడంపై సెటైర్లు వున్నాయి. చరిత్రనూ, సిలబస్ నూ తారుమారు చేయడంపై విసుర్లు వున్నాయ్. అధికారం కోసం 'మత ఊచకోతలు' సృష్టిస్తారన్న కఠిన వాస్తవం ప్రస్తావన వుంది. రాంనగర్ కొట్లాటలకు కారణమైన ఆ హోంమంత్రి ముఖ్యమంత్రి కావడానికి 'నోటునైనా, వోటునైనా రద్దుచేస్తా'నంటాడు. అభిమానులను అంధ భక్తులుగా ఎలా తయారు చేయవచ్చో సెలవిస్తాడు. 'అభిప్రాయాల్ని మార్చుకుంటున్నప్పుడు వారిలో ప్రారంభమయ్యే పిచ్చిని ముదిరేలా చేయాలట. భావోద్వేగాలను రెచ్చగొట్టాలట. అలా పార్టీ అభిమానులను అంధభక్తులుగా మార్చేయవచ్చట!' అలా రెచ్చగొట్టి మారణహోమాలు సృష్టించి రెండోసారి ముఖ్యమంత్రి అయిన వ్యక్తి ఎవరో మనకు తెలుసు. ఆ వ్యక్తి ప్రధాన పీఠాన్ని కూడా కైవసం చేసుకున్నాడు. కానీ తన రాష్ట్రంలో గెలుపు కోసం మైనారిటీల ఊచకోతకు సహకరించమని పోలీసు అధికారుల సమావేశంలో చెప్పిన సంగతిని ఆ కాలంలో సంజీవ్ భట్ అనే పోలీసు ఉన్నతాధికారి బయటపెట్టాడు. అది ఎంత తీవ్రమైన కంపనాలు సృష్టించిందో మనకు తెలుసు. అందుకే అతడిపై కక్షగట్టి మరో కేసులో అతడిని కటకటాల్లోకి పంపించడమూ మనకు తెలుసు. ఆ మొత్తం రిఫరెన్స్‌ను అరవిందన్ కథలో హింట్ ఇస్తాడు దర్శకుడు. ఇది కూడా మరో పెద్ద సాహసమే. 'ఎన్డీటీవీ'ని 'ఎన్సీటీవీ'గా చూపినా, రిపబ్లిక్‌ను మాత్రం పేరుపెట్టి చూపుతూ, అందులో గగ్గోలు స్వామి 'యాంటీ నేషనల్స్' గురించి చేస్తున్న వీరంగం చూస్తే తమాషాగా వుంటుంది. ప్రింట్ మీడియా అయినా, ఎలక్ట్రానిక్ మీడియా అయినా 'ఏది న్యూస్ కావాలి ఏది కాకూడదు' అనేది నిర్ణయించే మీడియా పాలిటిక్సును ఈ సినిమాలో బలంగా చూపారు. 'తీర్పులివ్వడానికి మీడియా, శిక్షలు అమలు పరచడానికి పోలీసులూ వున్నపుడు ఈ నల్లకోటులూ, నల్ల గౌనులూ వేసుకున్న ఇంతమంది బఫూన్లెందుకు?' అని ఘాటుగా కోర్టులో ప్రశ్నిస్తాడు అరవిందన్. లించ్ మాబ్‌ల గురించీ, తిండి దొంగిలిస్తే ఆదివాసీని చంపేయడం గురించీ, తూత్తుకుడి లాకప్ డెత్ గురించీ, నంబియార్ అనే ఇస్రో శాస్త్రవేత్త దేశద్రోహిగా ముద్రపడడం గురించీ, కిస్ ఆఫ్ ప్రొటెస్ట్ గురించీ చాలా సమకాలీన సంగతుల ప్రస్తావన తీసుకొస్తాడు దర్శకుడు ఈ సినిమాలో.

కానీ అన్నీ చెప్పేయాలన్న తపన ఈ సినిమా క్రాఫ్ట్‌ను సెకండాఫ్‌లో దెబ్బ తీస్తుంది. కళాత్మకత దెబ్బతిని ఉపన్యాస ధోరణి డామినేట్ చేసింది కొన్నిచోట్ల. ఎప్పుడూ పాత్రలు తోలుబొమ్మలూ, అట్టబొమ్మల్లా తయారుకాకూడదు. అలానే పృథ్వీరాజ్ పాత్రలో హీరోయిజాన్ని చొప్పించాలనుకోవడం వల్ల మరి కొంత నష్టం జరిగింది. నటన విషయానికొస్తే సురేష్ వెంజరమూడ్ తన నటనలో చాలా వేరియేషన్స్ చూపి భళా అనిపించుకున్నాడు. సుదీప్ ఎలామోన్ ఫోటోగ్రఫీ బాగుంది. జేక్స్ బిజోయ్ సంగీతం చాల ఎంగేజింగ్‌గా వుంది. కొన్ని లోపాలు ఉన్నప్పటికీ చాలా అవసరమైన, సాహసవంతమైన సినిమా 'జన గణ మన'. ఈ సినిమా రెండో భాగం కోసం అందరూ ఎదురుచూస్తున్నారు.✦

"తప్పులందరూ చేస్తారు, త్యాగాలు మాత్రం కొందరే చేయగలరు" అన్నవాడు రావిశాస్త్రి ఒక్కడే.

"ఉడుకు నెత్తురున్నవారు దుష్ట శిక్షణ కోసం కత్తులైనా పట్టాలి, కత్తుల్లాంటి కలాలైనా పట్టాలి" అన్నవాడూ ఆయనే.

"భగవంతుడు గోవులకు కొమ్ములిచ్చినట్టే రచయితలకు కలాలిచ్చాడు" అని చెప్పినవాడూ ఆయనే.

- కె.వి.యస్. వర్మ

# మరణం తటస్థ మూల్యాంకనానికి అడ్డు కాదు

('ప్రజాసాహితి' 1993 డిసెంబరులో ప్రచురించిన 'రావిశాస్త్రి నివాళి సంచిక'పై సమీక్ష)

ఎ. కె. ప్రభాకర్

*'చిత్తశుద్ధి, నీతి నిజాయితీ, విశ్వసనీయత గల ఒరిజినల్ రచయిత రావిశాస్త్రి. ఎవరికోసం రాస్తున్నాడో ఎందుకు రాస్తున్నాడో తెలిసి చాలా స్పష్టంగా బాధ్యతగా రచన వ్యాసంగం చేశాడు. కీర్తి కండూతికో, పదవులకో, సన్మానాలకో, ఎవరినో సంతోషపెట్టడానికో తన కలాన్ని సారించలేదు. అక్షరాయుధుడై ఆగ్రహంతో, ఆవేశంతో కోర్టుల, జెయిళ్ళ, పోలీసుల, ప్రభుత్వ కార్యాలయాల, సారా కాంట్రాక్టర్ల, పైరవీరాయుళ్ళ, ధనమదాంధుల, భోగలాలసుల, భూకామందుల అకృత్యాలను, అన్యాయాలను, దౌర్జన్యాలను, కపటత్వాన్ని చీల్చి చెండాడాడు. కలం కొరడా ఝుళిపించి అక్రమాలపై తిరగబడమని ప్రబోధించాడు. నిత్యదరిద్రంలో కడుపునిండక రాక్షసరతికి బలవుతున్న పతితులూ, నేరగాళ్లూ, జూదగాళ్ళూ, వ్యవస్థచక్రంలో నలిగిపోతున్న అధోజగత్ సహోదరులూ, అమాయకులూ, అభాగ్యులూ, అల్పజీవులూ ఆయన కథల్లో, నవలల్లో ప్రాణం పోసుకున్నారు. విశాఖ మాండలికంలో వారంతా సజీవంగా దృశ్యాలై మన హృదయాలపై చెరగని, మరవనిముద్ర వేస్తారు.'*

కొండంత రచయిత రాచకొండ విశ్వనాథశాస్త్రి జీవిత, సాహిత్య వ్యక్తిత్వాలను అద్దంపట్టి చూపిన పై మాటలు 'ప్రజాసాహితి' ప్రచురించిన రావిశాస్త్రి ప్రత్యేకసంచిక (డిసెంబర్ 1993) సంపాదకీయంలోనివి. రావిశాస్త్రి మరణించిన రెండు మూడు వారాల్లోనే 'ప్రజాసాహితి' ఆయన మీద ప్రత్యేకసంచిక తేవటం విశేషం. ఇలా యెందరో ప్రగతిశీల రచయితలపై లెక్కకు మించిన ప్రత్యేకసంచికలు తెచ్చిన సాహిత్య, సాంస్కృతికోద్యమ పత్రిక మరొకటి లేదు. తక్కువ కాలంలో తెచ్చినందువల్ల ఏర్పడ్డ పరిమితులు ఉన్నప్పటికీ ఈ సంచిక చాలా విలువైనది. ఇటువంటి సంచికలు ఆయా రచయితల కీర్తిని వుగ్గడిస్తూ ఎక్కువభాగం ఎలిజీలతో నిండి ఉంటాయి. వ్యక్తులు చనిపోయినప్పుడు చేసే మూల్యాంకనాలు సాధారణంగా ఉద్వేగ ప్రధానంగా సాగుతాయి. చాలా సందర్భాల్లో వుద్వేగం ఆబ్జెక్టివిటీకి అడ్డంకి కావొచ్చు. అందుకు భిన్నంగా ఈ సంచిక రావిశాస్త్రి రచనలపై విమర్శనాత్మకమైన వెలుగుని ప్రసరింపజేస్తుంది. మరణం విమర్శకు సమయం/సందర్భం కాదని కొందరు భావించినప్పటికీ హేతుబద్ధమైన లోచూపు యెప్పుడూ తప్పు కాదు, అనడానికి యీ సంచిక రుజువుగా నిలబడుతుంది.

"కథలే మిగిల్చి కరిగిపోయిన 'రాచకొండ'కు కలాల నివాళి" పేరుతో రాసిన సంపాదకీయం చక్కటి నివాళి వ్యాసం. అయితే దీన్ని విరసం కార్యవర్గ సభ్యుడు సి. రామ్మోహన్ రాయటం విశేషం. బాబ్రీ విధ్వంసం తర్వాత మతతత్త్వశక్తుల్ని సాంస్కృతికంగా అడ్డుకోడానికి కొద్దికాలమైనా విప్లవ కార్యాచరణలో ఉన్న ప్రజాసంఘాల మధ్య వొక ఐక్యతాభావన వెల్లివిరిసింది. అంతకు ముందే అఖిలభారత విప్లవ సాంస్కృతిక సమితి (AILRC) దశాబ్ది ఉత్సవాల మహాసభల్లో విరసం, జనసాహితి, అరుణోదయవంటి సాంస్కృతికసంస్థలు ఐక్యకార్యాచరణకు నడుంకట్టాయి. ఈ సంపాదకీయం కూడా ఆ నేపథ్యం నుంచే వెలువడి వుండొచ్చు.

'అభ్యుదయ రచయితలు ఆగిపోయిన చోటు నుంచి రావిశాస్త్రి పయనం ప్రారంభమౌతుంది' అన్న రామ్మోహన్ సంపాదకీయ వ్యాఖ్య/సూత్రీకరణ సమాజం అవసరం తీర్చడానికి రాచకొండలాంటి రచయితలు యెప్పుడూ తయారవుతూనే వుంటారనీ, వ్యవస్థాపక సభ్యుడిగా వివిధ బాధ్యతలలో విరసంతో ఆయన కలిసి నడవడం కూడా అందులో భాగంగానే జరిగిందని చెప్పక చెప్పింది.

వల్లంపాటి వెంకటసుబ్బయ్య, కావూరి అనురాధ, దివికుమార్, చంద్రశేఖర్ ఆజాద్ రాసిన వ్యాసాలు ఆ సంచికలో రావిశాస్త్రి రచనాదృక్పథంపైన, వస్తువైవిధ్యంపైన, శిల్పంపైన ప్రత్యేకంగా విమర్శనాత్మకంగా దృష్టి సారించాయి. కొత్త కోణాల్ని ఆవిష్కరించాయి. మరింత లోతైన అధ్యయనానికి తలుపులు తెరిచాయి. అయితే వీటిలో వల్లంపాటి, ఆజాద్ వ్యాసాలే సంచిక కోసం కొత్తగా రాసినట్లు కనిపిస్తాయి.

దివికుమార్ వ్యాసం రావిశాస్త్రి షష్టిపూర్తి సందర్భంగా (1982) చలసాని ప్రసాద్ ఆధ్వర్యంలో విరసం ప్రచురణగా వెలువడ్డ 'రావిశాస్త్రీయం' గురించి బేరీజు వేస్తూ రాసినది. ఒక విధంగా అది ఆ పుస్తకంపై సమీక్ష. కానీ అది సమీక్ష పరిమితుల్ని అధిగమించి రావిశాస్త్రి సామాజిక, సాహిత్య వివేచనలోని మంచిచెడ్డల్ని యెత్తిచూపే విధంగా విస్తృతమైంది. రావిశాస్త్రి రచనాజీవితంలో, ఆయన దృక్పథంలో

వచ్చిన మార్పుల్ని లోతుగా విమర్శకు పెట్టింది. వివిధ సందర్భాల్లో రావిశాస్త్రి ఆలోచనలన్నీ ఒకచోట చూసినప్పుడు కలిగిన స్పందన అది. గాంధీ, నెహ్రూల పట్ల శాస్త్రిగారి తొలినాటి అభిప్రాయాల్నీ, ఆ తర్వాత ఆయన విరసంలో చేరిన దరిమిలా వచ్చిన మార్పుల్నీ ఆ వ్యాసంలో దివికుమార్ నిశితంగా పరిశీలించారు. ఐచ్ఛిక దారిద్ర్యం వంటి గాంధీ వ్యక్తిగత జీవితపు విలువల పట్ల, సత్యం అహింస వంటి సామాజిక ఆదర్శాల పట్ల, గ్రామీణ స్వరాజ్యం వంటి ఆర్థికవిధానాల పట్ల, నెహ్రూ మార్క్ సోషలిజం పట్ల, అలీన విదేశాంగవిధానం పట్ల చాలామందికి లాగానే (శ్రీశ్రీ, తిలక్, వివి, అంపశయ్య నవీన్.... ఈ లిస్ట్ పెద్దదే) తొలిరోజుల్లో శాస్త్రిగారికి కూడా భ్రమలు వున్నాయి. కాలక్రమంలో వాటిలో కొన్ని తొలగిపోయాయి, కొన్ని కొనసాగాయి. అలాగే 1969ల నాటి ప్రత్యేక తెలంగాణ వుద్యమాన్ని 1950ల నాటి ఆంధ్రరాష్ట్రోద్యమంతో పోల్చి చూడటాన్ని కూడా దివికుమార్ తప్పు బట్టారు. ఆంధ్రరాష్ట్రోద్యమంలో ప్రజాతంత్ర స్వభావాన్ని చూసిన వ్యాస రచయిత తెలంగాణ రాష్ట్రోద్యమాన్ని అవకాశవాదంగా భావించారు. రావిశాస్త్రి ఆలోచనల్లో ఆచరణలో కొండొకచో వైరుధ్యాలు వుండి వుండవచ్చేమో గానీ పాఠకులను చెడువైపు నడిపించే రచనలేవీ చేయలేదని నా నమ్మకం.

అనురాధ రాసిన వ్యాసం కూడా పాతదే (1987). శాస్త్రిగారికి స్త్రీలపట్ల ఉన్న దృక్కోణంపై పెట్టిన బలమైన విమర్శ. రావిశాస్త్రి బలాన్నీ, బలహీనతనీ ఆమె నిర్మొహమాటంగా, లోతుగా విశ్లేషించారు. అభివృద్ధి నిరోధకులు కూడా ఆయన రచనల్ని మెచ్చుకోవడంలోని ప్రమాదాన్ని పసిగట్టారు. విశ్వనాథశాస్త్రి స్త్రీ పాత్రల్ని ఆమె ఏడు రకాల మూసల్లోకి సర్దవచ్చని ప్రతిపాదించారు. అయితే ఏ మూసా స్త్రీ విముక్తి లక్ష్యంతో సృష్టించినది కాదని నిర్ధారించారు. ఆయన స్త్రీ పాత్రలకు స్వతంత్ర ప్రతిపత్తి లేదనీ, రాజ్యస్వభావాన్ని తెలియజేయడానికి అవి రిఫరెన్స్ పాయింట్స్ మాత్రమేననీ చెప్పారు. పురుషాధిపత్యాన్ని నిలదీసే స్త్రీలు ఆయన రచనల్లో కనిపించకపోడానికి కారణాలు అన్వేషించారు. స్త్రీల స్వరూప స్వభావాలను వర్ణించే సందర్భాల్లో ఆయన పితృస్వామ్య భావజాల ప్రభావం నుంచి బయటపడలేదని విమర్శించారు. సందర్భశుద్ధిలేని శిల్పప్రలోభం రావిశాస్త్రి వస్తు, దృక్పథాలకు కీడు చేసిన వైనాన్ని కూడా అనురాధ గుర్తించారు.

ఈ వ్యాసంలో అనురాధ లేవనెత్తిన అంశాలు విపులమైన చర్చకు దారులు వేస్తాయి. రావిశాస్త్రి రచనల్ని పునర్మూల్యాంకనం చేయడానికి పురిగొల్పుతాయి.

నిజానికి ముత్యాలమ్మ, నూకాలమ్మ, సముద్రాలు, సరళ, మరిడి మాలక్ష్మి వీరందరూ బలమైన పాత్రలు. కానీ వీళ్ళలో ఎవరూ స్త్రీ స్వేచ్ఛ వైపు ఆలోచించరు. స్వీయ అస్తిత్వ పోరాటం వారి ఆచరణ కాదు. దాని సామూహిక వ్యక్తీకరణ అసలు ఉనికిలోనే లేదు. స్త్రీ విముక్తి, స్వేచ్ఛ ఈ పాత్రల పరిధిలోకి రావు. అది రావిశాస్త్రి సాహిత్య ఎజెండా కాదు. స్త్రీవాదకోణం నుంచి రాసిన కథలు కావు. సామాజికనీతి, న్యాయం, చట్టం, రాజ్యం.... ఈ చట్రంలో నలిగిపోతున్న పీడిత సమూహంలో భాగంగా స్త్రీలపై అమలయ్యే హింసని 'కూడా' చిత్రించడమే రచయితగా తన బాధ్యత అని ఆయన భావించి వుండవచ్చు. 'న్యాయం' కథలో స్త్రీ పాత్ర తాను తప్పు చేశానని ఒప్పుకుంటూ నేరం చేయలేదు అనటంలో ఉద్దేశించిన ప్రయోజనం అదే. తప్పు నైతికత చెందిన విషయం. నేరం శిక్షాస్మృతికి చెందినది. నీతికి చట్టానికి మధ్య ఉన్న వైరుధ్యాన్ని తెలియజేయటానికి రచయిత ఆ పాత్రను ఉపయోగించుకున్నాడు. న్యాయవ్యవస్థలోని డొల్లతనాన్ని తెలియజెప్పడానికే 'మాయ' కథలో ముత్యాలమ్మ పాత్ర. అట్టడుగువర్గానికి చెందిన ఈ స్త్రీ పాత్రలు వాస్తవికమైనవే తప్ప శాస్త్రిగారు కల్పించినవి కావు. రావిశాస్త్రి గుర్తించిన లంపెన్ స్త్రీలు కావొచ్చు, సృష్టించిన మధ్యతరగతి స్త్రీలు కావొచ్చు మొత్తం సమాజంలోని అమానవీయతపై, అసమానతలపై వాళ్ళు ఏదో ఒక రూపంలో తమ అసమ్మతిని, అసహనాన్ని ప్రకటించారు. అదొక తిరుగుబాటు రూపమే.

దివికుమార్ అనురాధల విమర్శలు రావిశాస్త్రి జీవించిన కాలంలోనే వెలువడ్డాయి. వీటిపై శాస్త్రిగారు ఎలా ప్రతిస్పందించారో! తనపై విమర్శల పట్ల ఆయన మౌనం పాటించేవారని వినికిడి.

పి. చంద్రశేఖర ఆజాద్, రావిశాస్త్రి రచనలకూ జీవితానికీ మధ్య ఉన్న వైరుధ్యాల్ని విమర్శకు పెడితే, గోపరాజు నారాయణరావు 'బల్లచెక్క' కథలో ఆర్థికదోపిడీ మూలాల్ని యెత్తి చూపారు. రచయితల జీవితాల్ని పరీక్షించే గీటురాయి రచనలే అని హెచ్చరించిన ఆజాద్ రైటప్ రావిశాస్త్రికే కాదు రచయితలందరికీ స్వీయవిమర్శకు తోడ్పడుతుంది. అదేసమయంలో రావిశాస్త్రి శైలీ, శిల్పాలకు ప్రభావితం కాకుండా ఉండటం అసాధ్యమని కూడా అజాద్ తీర్మానించాడు. శాస్త్రిగారికి సొంత పాఠకులు ఏర్పడటానికి కారణాలైన శాస్త్రిగారి శైలీ, శిల్పాలను విశ్లేషిస్తూనే యువరచయితలు అందిపుచ్చుకోవాల్సిన అంశాల్ని కూడా ప్రస్తావించాడు.

'సొమ్ములు పోనాయండిలో పాలనాయంత్రాంగం' మంచి పరిశోధనావ్యాసం. పాలనాయంత్రాంగంలోని ప్రధానంగా శాసనవ్యవస్థ, కార్యనిర్వాహకవ్యవస్థ, న్యాయవ్యవస్థ దోపిడీదారులకు అండగా నిలబడి పీడితులకు శత్రువులుగా యెలా వ్యవహరిస్తాయో వల్లంపాటి సోదాహరణంగా వివరించారు. అంతకు ముందు సాహిత్యమాధ్యమంగా రాజ్యస్వభావాన్ని విప్పిచెప్పిన శాస్త్రిగారు 'సొమ్ములు పోనాయండి'లో మరో అడుగు ముందుకు వెళ్లి ఆ స్వభావం యే వర్గదృక్పథం నుంచి, ఏ సామాజిక ఉత్పత్తిసంబంధాలలో నుంచి రూపొందుతుందో' నిరూపించారు. బాధితసమూహాలకు ఆ నవలిక ప్రబోధించే కర్తవ్యాన్ని కూడా వల్లంపాటి తన వ్యాసం ద్వారా వెల్లడించారు.

'అల్పజీవి', 'రాజు-మహిషి', 'రత్తాలు-రాంబాబు' నవలల్లో రావిశాస్త్రి చర్చకు పెట్టిన మానవ స్వభావాన్ని సాంఘిక నైతికతనీ విశ్లేషించిన జె.పి.ఎల్. గ్విన్ 'మూడు నవలలు' షష్టిపూర్తి సందర్భంగా రాసినదే. వి.వి. రమణమూర్తి జ్ఞాపకాలు శాస్త్రిగారు చనిపోయిన వెంటనే రాసిన నివాళి వ్యాసం. అది దినపత్రికల సాధారణ పాఠకుల కోసం ఉద్దేశించినదే గానీ సాహిత్యవ్యాసం కాదు.

"ఇల్లు ఉండటానికి గూడు కొందరికైతే, ఇల్లు కొందరికి సంపాదించవలసిన ఆస్తి" - **రావిశాస్త్రి**

రావిశాస్త్రికి యెంతో యిష్టమైన ప్రక్రియ గల్పిక. ఎ.బి. సుందరరావు గల్పిక 'నా ప్రాణంలో సంగోరు ఇచ్చినా' శాస్త్రిగారిపై అవ్యాజ అభిమానంతో రాసింది. 'దేవుడు అడిగితే నా ప్రాణంలో సంగోరు ఛాత్రి బాబుకిచ్చీనా'అనే స్త్రీ అనురాధ పేర్కొన్న యే మూసలో యెందుకు యెలా యిముడుతుందో అన్న ఆలోచన కలగక మానదు.

కవితారూపంలో వ్యక్తమైన నివాళి విషయానికొస్తే – మురళీకృష్ణ రాసిన ఎలిజీలో 'కథాకథన శిల్పి', 'వచనానికి రారాజు', 'పీడితజనం జీవనశైలికి రాచకొండ', 'కథావృక్షం కూలిపోయింది' అంటూ చెప్పిన మాటల్ని కేవలం ప్రశంసాత్మక కవితాభివ్యక్తిగా కాక సాహిత్యవిమర్శలో భాగంగానే చూడాలి. శాస్త్రిగారిని తెలుగు డికెన్స్ అని పోలుస్తూ చందు సుబ్బారావు రాసిన కవిత 'రాసినవాడు ఫల్గుణుడు' షష్టిపూర్తి నాటిదే మళ్ళీ ప్రచురించారు. రావిశాస్త్రి మరణంతో 'పేదవాడి గూటి దీపం మలిగిపోయింది' అని ఇమ్రోజ్ భావిస్తే 'రావిశాస్త్రి కాలాన్ని అధిగమిస్తాడు' అని త్రిపురనేని శ్రీనివాస్ హామీ యిచ్చాడు. రావిశాస్త్రి పాత్రగా మారి విశాఖ మాండలికంలో ఛాయారాజ్ ఘటించిన స్మృత్యంజలి ('దండాలండి బావు – చాత్రి బావుకు దండాలు') యెంతో ఆత్మీయంగా మనసును స్పృశిస్తుంది.

శాస్త్రిగారి స్వీయ రచనలు 'ఆఖరి దశ' కథ, 'సామాజిక స్పృహగాళ్ళు'ట అన్న వ్యంగ్యభరితమైన (రావిశాస్త్రి ట్రేడ్‌మార్క్) వ్యాసం, మహీధర రామ్మోహనరావుకు ఆయన రాసిన ఉత్తరాలు యీ స్మారికకు అదనపు హంగుని సమకూర్చాయి. కళ కళ కోసమే, కథ కథ కోసమే అనే బుకాయింపులకు సమాధానం 'సామాజిక స్పృహగాళ్ళు'ట. రచయితల నిబద్ధత గురించి పదునైన వ్యాఖ్యలతో నిండిన యీ వ్యాసం యిప్పటికీ ప్రాసంగికమే.

'రచయిత ప్రతివాడు తాను రాస్తున్నది ఏ మంచికి హాని కలిగిస్తుందో ఏ చెడ్డకి ఉపకారం చేస్తుందోనని ఆలోచించవలసిన అవసరం ఉందని నేను తలుస్తాను. మంచికి హాని, చెడ్డకి సహాయం చేయకూడదని నేను భావిస్తాను. ఇది తెలుసుకుందికి తెలియజెప్పటానికి నేనిదంతా రాసేను' ఈ సంచికలో శాస్త్రిగారి మీద అభిమానంతో రాసినవారికీ విమర్శనాత్మకంగా రాసినవారికీ అందరికీ ఆయన నమ్మిన యీ వాక్యాలు స్ఫూర్తిదాయకంగా వున్నాయని నా అభిప్రాయం.

అయితే తెలుగునేల మీద రావిశాస్త్రి రచనాసాగర మథనం పూర్తిగా జరగలేదని నా అభియోగం. అలవికాని అభిమానం, మితిమీరిన వ్యతిరేకత రచయితగా రావిశాస్త్రిని సమగ్రంగా ఆవిష్కరించవు. ఆ లోటుని శతజయంతి సంచిక తీరుస్తుందని ఆశిస్తున్నాను. జయంతులూ, వర్ధంతులూ, సంస్మరణలూ కేవలం వ్యక్తుల జ్ఞాపకాల తలపోతగా మిగలకూడదు. వారి ఆలోచనల మదింపుకు పాదులు కట్టాలి. ఆశయాల కొనసాగింపుకి వుత్తేజాన్నివ్వాలి. ఆచరణల అవిచ్ఛిన్నతకు దోహదం చేయాలి.

**(రావిశాస్త్రి శైలీశిల్పాలకూ. వస్తువైవిధ్యానికీ సామాజిక దృక్పథానికీ వినమ్రంగా కట్టుబడి....)** ✦

# కొనసాగుతున్న మనుధర్మం!

**రైళ్ళు,** బస్సులు, హోటళ్ళు వచ్చిన తర్వాత అంటరానితనం, దళితులపట్ల వివక్ష అదృశ్యమైపోతాయని అనుకున్నవారి ఆకాంక్షలను భగ్నం చేస్తూ, ఇటీవల పలు సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. అగ్రవర్ణ దురహంకారం కొనసాగుతూ దళితులపై మూకుమ్మడి హత్యలూ, సజీవ దహనాలు, అవమానాలూ చోటుచేసుకుంటున్నాయి. దళితుల వివాహ వేడుకల్లో పెళ్ళికొడుకు గుర్రంపై వూరేగడం నిషిద్ధం. విందు భోజనాలలో నెయ్యి వాడటం నిషిద్ధం. వారి సెల్‌ఫోన్లలో అంబేడ్కర్‌పై పాటలు కాలర్‌ట్యూన్‌గా పెట్టుకోవడం నిషిద్ధం. మధ్యాహ్న భోజన పథకంలో వంట వండేవారు దళితులు కారాదు.

వీటన్నిటికీ పరాకాష్టగా ఉత్తరప్రదేశ్‌లో జొమాటో ఆహారాన్ని సరఫరా చేసే అతను దళితుడని, అతను తెచ్చిన ఆహారాన్ని నిరాకరించడమేగాక అతని ముఖంపై ఉమ్మివేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది.

బిజెపి అధికారంలోకి వచ్చినప్పటినుండి ముస్లిముల మీద, దళితుల మీద దాడులు ఎక్కువయ్యాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో నివేదిక ప్రకారం ప్రతి 10 నిముషాలకూ దేశంలో దళితులపై దాడులు కొనసాగుతున్నాయి. ఈనాటికీ గిరిజనులకూ, దళితులకూ సమానత్వ హక్కు అందని ద్రాక్షగానే వుంది. చాల గుడుల్లోకి దళితుల ప్రవేశం ఈనాటికీ నిషిద్ధమే. భారత రాష్ట్రపతి కూడా దీనికి మినహాయింపు కాదు.

అంటరానితనాన్ని నేరంగా రాజ్యాంగం ప్రకటించినా, చట్టాలు చేసినా, వేల సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయి. కాని నేర నిరూపణ, శిక్షలు మాత్రం అతి తక్కువ. దళితులు, గిరిజనులు, మైనారిటీలు సంఘటితమవ్వాలి. వివిధ రూపాలలో, స్థాయిలలో ఆధిపత్యవర్గాల అన్యాయంపై పోరాడాల్సిన అవసరాన్ని పై సంఘటనలు తెలియచేస్తున్నాయి. ✦

"రావిశాస్త్రిగారి శైలిలో నాకు అమితంగా నచ్చిన విషయం ధ్వని. (భుజశ్చన్).... కథ చదవడం అయిపోయిన తర్వాత పాఠకుల మెదడుకు పదును పెట్టేది ఇదే". **- నిడదవోలు మాలతి**

# 'నిజం' నాటకంలో హతులు, హంతకులు!

**దివికుమార్**

**రాచకొండ** విశ్వనాథ శాస్త్రి 'నిజం' నాటకంలో, న్యాయశాస్త్రం చదువుకుంటున్న సత్యం అనే పాతికేళ్ల లోపు యువకుడు, ఆర్మీలో ఆఫీసర్‌గా పనిచేస్తున్న తన బాల్యమిత్రుని చేతులో హత్యకు గురవుతాడు! అదీ మరో ఇద్దరు మిత్రులు చూస్తూ ఉండగా!! సాధారణ ప్రేక్షకులు నాటకంలో జరిగినది ఈ ఒక్క హత్యే ననుకుంటారు. పారిశ్రామికవేత్త, సహకార బ్యాంకు ఛైర్మన్, పార్లమెంటు సభ్యుడు అయిన సార్వభౌమరావు ఏకైక సుపుత్రుడు, సుందర్‌గా పిలువబడే సుందరరావుపై హత్య చేశాడు. తన చేతుల్లో ఉన్న విస్కీ బాటిల్‌తో వెనక నుండి నాలుగు దెబ్బలు నెత్తినకొట్టి సత్యంను సుందర్ చంపేశాడు. పై హత్య ఆరు అంకాల 'నిజం' నాటకంలో మొదటి అంకంలోనే జరుగుతుంది.

రెండవ హత్యను చట్టం చెప్పినదే న్యాయం అని నమ్మే పెద్దమనుషులు ఎవరూ హత్య అనరు. దాన్ని వారు శిక్ష అంటారు. చట్టం విధించిన ఉరిశిక్షకు గురైన ఆ వ్యక్తి హంతకుడు కాదని న్యాయస్థానాలకు తప్ప అందరికీ తెలుసు. మరణశిక్ష పడిన అతనిని ఉరి తీసినట్లు ప్రేక్షకులకు దృశ్యరూపంలో కనబడదు. కానీ నాటకం యొక్క ముగింపులో విస్పష్టంగా సూచితమవుతుంది. అలా ఉరిశిక్షకు గురైన వ్యక్తి పేరులో కూడా సుందరం ఉంటాడు. అయితే ఇతను అసలైన హంతకుడు సుందర్ కాడు. జులాయిగా తిరిగే ఓ చిన్న సైజు రౌడీ లాంటివాడు ఈ సోమసుందరం. తన కొడుకును కాపాడుకోవటానికి తండ్రి సార్వభౌమరావు భారత రాజ్యాంగాలలోని న్యాయవ్యవస్థ చేతులతో ఈ హత్య చేయిస్తాడు.

ఉరిశిక్ష తీర్పు ఇవ్వడానికి ముందు చట్టబద్ధంగా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి సమక్షంలో, ప్రభుత్వం తరపు న్యాయవాది (ప్రాసిక్యూటర్) అలాగే ముద్దాయి తరపు (డిఫెన్స్) న్యాయవాది సాక్షులను ప్రశ్నలపై ప్రశ్నలతో విచారించి, వాదోపవాదాలు చేస్తారు. చివరగా హంతకుడు కాని సోమసుందరాన్ని హంతకుడిగా నిర్ధారించిన సెషన్స్ జడ్జి ఉరిశిక్షను ఖాయం చేస్తాడు.

ఈ చట్టబద్ధహత్య విచారణకు అసలు హంతకుడిని కోర్టుకే రానివ్వకుండా, హత్యా సంఘటనలో ఉన్నట్లే తెలియనివ్వకుండా, పోలీసులను లాయర్లను సాక్షులను వెరసి న్యాయస్థానాన్ని మలుపుకుని అదుపు చేసి తీర్పు తనకు అనుకూలంగా వచ్చేటట్లు చేసుకున్నవాడు, రాజ్యాంగం మీద ప్రమాణం చేసి, ఈ దేశాన్ని ప్రత్యక్షంగా ఏలే పార్లమెంటు సభ్యుడయిన సార్వభౌమరావు.

సత్యాన్ని హత్య చేసిన అసలు హంతకుని తండ్రే రెండవ హత్యను పోలీసు, న్యాయవ్యవస్థల ద్వారా, సాక్షులను ఒకవైపు బెదిరించి మరోవైపు బ్లాక్మెయిల్ చేయడం ద్వారా విజయవంతంగా జరిపిస్తాడు. ఈ చట్టబద్ధ హత్యా ప్రక్రియ విజయవంతంగా నిర్వహించడానికి సార్వభౌమరావుకి ఆర్థిక అధికార సంపత్తితో పాటు జ్ఞానసంపత్తి కూడా తోడయి ఉన్నందువల్ల సాధ్యపడినట్లు మనం ఈ నాటకంలో చూస్తాము!

న్యాయవ్యవస్థను తప్పుదోవ పట్టించగలిగిన శక్తి, చాకచక్యం పోలీసు వ్యవస్థకు ఉన్నాయనే 'నిజం' కూడా ఈ నాటకం తెలుపుతుంది. ఆ విధంగా పోలీసు వ్యవస్థను అదుపు, ప్రభావితం చేయకలిగినవారు, స్వతంత్ర భారతంలో న్యాయాన్ని తమకు అనుకూలంగా తిప్పుకునే వెసులుబాటు ఉందని ఈ నాటకం సూచించింది. చివరికి అసలు హత్యతోనూ, హత్యాసంఘటనతోనూ ఏ మాత్రం సంబంధంలేని సోమసుందరం, ఉరిశిక్షకు గురయి చట్టబద్ధంగా హత్య గావించబడతాడు. దీనిని ఈ నాటకంలో జరిగిన రెండవ హత్యగా మనం భావించవచ్చు. అయితే గ్రహించవలసిన మరో రెండు హత్యలు కూడా ఇందులో ఉన్నాయి. అవి భౌతికంగా కనిపించే హత్యలు కాదు. సామాజిక విలువల పరమైనవి. సమాజంలో జనాంతికంగానో, బహిరంగ రహస్యంగానో ఒక సాంస్కృతిక విలువగా నిరంతరాయంగా నిలిచి ఉండే "సత్యం" అనే భావనకు నాటకంలో సత్యం పాత్రను ప్రతీకగా రూపుదిద్దుతాడు రచయిత. సత్యం ఎందుకు హత్యకు గురైనాడు? సత్యం మాట్లాడినందుకే!! దానిని సామాజిక విలువగా, ప్రజల నడుమ నడయాడే అంశంగా గుర్తిస్తేనే మనకది మరో హత్యగా అర్థమవుతుంది.

కడుపులో దాగిన అంతర్య భావనలను కడుపులోకి వెళ్లిన మందు బయటకు నెట్టివేస్తుందని చెబుతారు. నాటకంలోని వర్తమాన రాజ్యవ్యవస్థకు ప్రతీక అయిన సార్వభౌమరావు బూటకత్వాన్ని మాత్రమే కాక ఆయన కొడుకు తరం వారైన నలుగురు స్నేహితుల స్వభావాలు కూడా 'సత్యం' పాత్రను ఆధారంగా చేసుకుని రచయిత మొదటి అంకంలోనే తాగుబోతు స్నేహితుల సంభాషణల ద్వారా బహిరంగ పరిచారు.

1. సార్వభౌమరావు ఓటర్లకు డబ్బులు పంచి, సారా తాగబోయించి దొంగ ఓట్లతో ఎన్నికలలో గెలుస్తాడనీ, పబ్లిక్ ఎనిమీ నెంబర్‌వన్ అంటే ప్రజాద్రోహి అనీ స్నేహితుల నడుమ వాదులాటలో బయటపడుతుంది. ఈ విషయం లోకంలో ఎక్కువమంది ఎరిగిన సత్యమే అయి ఉంటుంది. దీనితో పాటు తన ఇంటి పనిమనిషి కూతురు అయిన సుశీల అనే చిన్నవయసు పిల్లను సార్వభౌమరావు లోబరుచుకుని రావణాసురునిలా చెరబట్టాడు అనే మరో సత్యాన్ని కూడా మొదటి అంకంలో సత్యం పాత్ర ద్వారా రచయిత బహిర్గతపరుస్తాడు.

2. తమ స్నేహితుల బృందంలో కృష్ణ అని పిలువబడే కృష్ణారావు, జేబులో తేలు లాంటి వాడనీ, సార్వభౌమరావు లాంటివారిని తైరుకొట్టి

(కాకాపట్టి) తన పనులు గడుపుకునేవాడని చెప్పించి, తరువాత నాటకంలో దొంగ సాక్ష్యాలతో రెండవ హత్యకు అంటే చట్టబద్ధ ఉరిశిక్షకు కృష్ణ చక్కగా దోహదపడినట్లు చూపుతారు.

3. స్నేహబృందంలో నాలుగోవాడైన మధు అని పిలువబడే మధుసూదనరావు, ఆత్మసాక్షిగా ఆత్మవంచన పరవంచన చేసుకునే పిరికి స్వభావంగల చాపకింద నీరు లాంటి వానిగా చిత్రిస్తారు. ఇతని వల్ల మాలతి అనే అమ్మాయి అబార్షన్ చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చి పిచ్చాసుపత్రిలో చేరుతుందని మొదటి అంకంలో మనకు తెలుస్తుంది.

4. స్నేహితుల్లో నాలుగోవాడు సుందర్, సత్యానికీ కృష్ణకు ఇతను బాల్య స్నేహితుడు. ఇతనే సత్యాన్ని హత్యచేసిన ఆర్మీ ఆఫీసర్.

అసమానతల సామాజిక వ్యవస్థను కాపాడే రాజ్యానికుండే దోపిడి, పీడనల స్వభావాన్ని బహిర్గతపరచే 'సత్యం' యొక్క నోరు నొక్కి గలిగిన సాయుధశక్తికి ఈ పాత్ర ప్రతీక.

'నిజం' నాటక విశ్లేషణలో ప్రధాన పాత్రలకు ఉండే రెండు లక్షణాలను మనం అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

1. ఆ పాత్ర యొక్క సామాజిక ప్రతీక గుణం.
2. వ్యక్తిగత ప్రవర్తన స్వభావం.

నాటకంలో సుందర్‌తో సత్యం పాత్ర ఘర్షణ పడే సందర్భంలో రచయిత ముందుగా, ఒక 'సత్యం' ఇలా చెప్పిస్తాడు.

"షటప్! లెఫ్టినెంట్ అయితే నాకేం భయం అనుకున్నావా? లక్ష మంది ఆర్మీ ఆఫీసర్లు నా కాలి కింద బలాదూర్! నీ ఆర్మీ ఆర్మీ అంతా నా కాలికింద బలాదూర్!" ఈ ప్రకటనను ఒక వ్యక్తితో కాక ఏశక్తికీ భయపడని 'సత్యం' అనే ఒక సామాజిక విలువతో చెప్పించిన మాటగా మనం అర్థం చేసుకోవాలి.

కొడుకును హత్య కేసు నుండి రక్షించుకోవడానికి, సార్వభౌమరావుల కొడుకు పాత్ర సాధారణంగా ఆర్మీ ఆఫీసర్ అయి ఉండవలసిన అవసరం లేదు. మరెవరైనా కావచ్చు. కానీ, రాజ్యవ్యవస్థ దోపిడీవర్గ స్వభావాన్ని బహిర్గతపరచే శక్తులను అణచివేయగలిగిన సాయుధశక్తికి ప్రతీకగా ఆ కొడుకు పాత్రను రచయిత ఉద్దేశపూర్వకంగా అలా కల్పించాడని భావించవచ్చు.

ఈ నాటకం రాయడానికి సరిగ్గా పాతికేళ్ల క్రితం, రావిశాస్త్రి పదిహేనేళ్ల ప్రాయంలో ఉండగా శ్రీ శ్రీ రాసిన ఈ పంక్తులను ఒకసారి గుర్తు చేసుకుందాం

"మీ చూపులు సన్నని సరళరేఖలో / రేఖ చెదిరితే గొల్లుమనిపోతారు / రేఖకు అవతలి వారంతా నేరగాళ్లు / రేఖను రక్షించడానికే న్యాయస్థానాలు రక్షకభట వర్గాలు చెరసాలలు ఉరికొయ్యలు / రేఖను కాపాడక తీరదు!!" ఇది ఒక సామాజిక సత్యం. అంటే దోపిడి వర్గము శ్రామిక వర్గము అనే రెండు ప్రపంచాల నడుమ గల వ్యత్యాసాన్ని ఎత్తిచూపింది కవితలో భాగం. ఈ మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథంలో భాగంగా, పై వాక్యాలను దృశ్యమానం చేసిన నాటకమే 'నిజం'!

పైన ఆర్మీ గురించిన మాటల తర్వాత కొద్దిసేపటికే సత్యం మళ్లీ ఇలా అంటాడు.

"ఒరేయ్ సుందర్! నువ్వు మంచివాడివే. నీ ఫాదర్ పాడుచేశాణ్నిన్ను. కొంతవరకు ఖాకీ డ్రెస్సు పాడు చేసింది. మరి కొంత వరకు ఈ వెధవ, ఈ విషపు వెధవ, క్రిష్ణ పాడు చేశాడు. అంచేత అలా పాడయేవు."

తన బాల్య స్నేహితుడు సుందర్ గురించి సత్యం చెప్పిన మాటలలో గల ప్రతీకార్థ స్వభావాన్ని, నిజ జీవితలక్షణాలను పాఠకులు పరిగణనలోకి తీసుకోవటానికే పైవాటిని ఉటంకించాను.

మొదటి అంకంలోనే సత్యం మాట్లాడిన ఒక నిజాన్ని, తోటి స్నేహితులే కాదు పాఠకులు ప్రేక్షకులు కూడా పొరపాటుగా అర్థం చేసుకోవడానికి అవకాశం ఇచ్చే ఒక చిన్న మెలిక రావిశాస్త్రి కల్పించారు. సార్వభౌమరావు అధీనంలో ఉన్న సుశీలను సుందర్ సాకుతున్నాడని మొదట చెప్పించి, ఆ తర్వాత ఆమెను బోల్తా కొట్టించిన డాకూ... సుందరం నెంబర్ టూ! అంటాడు. మొదటి మాటకే – సార్వభౌమరావు అధీనంలో ఉన్న సుశీలను సుందర్ సాకుతున్నాడని అనగానే రంగంలోని పాత్రలు, వెలుపల ప్రేక్షకులు కూడా సార్వభౌమరావు కొడుకు సుందర్‌కు దాన్ని ఆపాదించుకుని అపోహపడే అవకాశం ఉంది. సుందర్ బాగా రెచ్చిపోయే విధంగా ఆ మాట ఉంటుంది. హత్య చేసే అంత ఉద్రేక వాతావరణ సృష్టికి నాటకీయంగా అది కల్పించబడినది. సుందరం అని పిలవబడే సోమసుందరం ఎవరో, అతనికి సుశీలతో గల సంబంధం ఎలాంటిదో మనకు రెండవ రంగంలో కానీ తెలియదు.

సుశీల కోసం సార్వభౌమరావు ఇంటికి సోమసుందరం వచ్చి ఉన్న మధ్యాహ్నం 12 గంటల సమయంలోనే, చిట్టడవికి వెళ్ళిన స్నేహితుల నడుమ సరదాగా ప్రారంభమైన సంభాషణ, మందు ఎక్కువయే క్రమంలో, చిలికి చిలికి గాలివానయి సత్యం హత్యకు దారితీస్తుంది. ఆ సమయంలో సార్వభౌమరావు ఇంటిలోనే ఉన్న సోమసుందరం మూడు, నాలుగు రంగాలలో సాగిన కోర్టు విచారణ, వాద, ప్రతివాదనల సందర్భంలో, కోర్టు ఆనవాయితీకి భిన్నంగా ఎంత మొత్తుకున్నా చివరికి ఉరిశిక్షకు గురవుతాడు. ఈ న్యాయ విచారణ, తీర్పుల ప్రక్రియ నడుమ హత్యకు గురైనది 'నిజం' అనే మరొక సామాజిక విలువ. ఆ విధంగా ఒక సత్యం మరొక సుందరం భౌతికంగా హత్యకు గురయితే విలువల రూపంలో ఉన్న, ఎన్నిసార్లు చంపినా తిరిగి తిరిగి ప్రత్యక్షమయ్యే సత్యం హత్యను మొదటి అంకంలో చూపించారు.

దోపిడీ వర్గ సమాజం దాని న్యాయ ప్రక్రియ తన వ్యవస్థను కాపాడుకోవడానికి ప్రతిరోజూ "నిజాన్ని" ఎంతలా హత్య చేస్తూ ఉంటుందో 60 ఏళ్ల క్రితమే రావిశాస్త్రి కళ్లకు కట్టించారు.

'నిజం' నాటకం రాసేనాటికి మన దేశానికి స్వాతంత్రం వచ్చిందని చెప్పి 14 ఏళ్ళు దాటింది. ఈ నాటకం రాసిన 1962 నాటికి ఆవడి సోషలిజం పేరుతో దేశాన్ని ప్రగతిపథంలోకి తీసుకు వెళుతున్నట్లు పాలకులు ఆనాటి మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తూ ఉండేవారు. అయితే సార్వభౌమరావుల చేతుల్లో రాజకీయ, సాంఘిక, న్యాయవ్యవస్థలు చిక్కుబడి ఉన్నాయని చెప్పగల సాహసం, నిశిత పరిశీలన, ప్రజా రాజకీయ దృష్టి, నిజాన్ని నిర్భయంగా చెప్పే నిజాయితీ కల రావిశాస్త్రి లాంటి కొద్దిమంది రచయితలలో మాత్రమే ఉండేదని మనం అర్థం చేసుకోవాలి.

ఇటీవల ఈ నాటకాన్ని ఎవరైనా ప్రదర్శించినట్లు నాకైతే తెలియదు గానీ నలభై, యాభై ఏళ్ల క్రితం చాట్ల శ్రీరాములు, ఏఆర్ కృష్ణ, అత్తిలి కృష్ణారావు లాంటివారు దీనిని విస్తృతంగా ప్రదర్శించిన కాలం ఉంది. రావిశాస్త్రి కూడా ప్రాసిక్యూషన్ లాయర్‌గా నటించేవారట! కాకరాల లాంటి సీనియర్ నటులు ద్వారా ఈ విషయాలు తెలిశాయి.

ఒక సంస్థగా అభ్యుదయ రచయితల సంఘ ఉద్యమ నిర్మాణ కార్యకలాపాలు ఈ నాటకం రాసే కాలం నాటికి స్తబ్దతలో ఉండినా, దేశం ప్రగతిపథంలోకి సాగిపోతున్నదని పాలకవర్గాలు మోగిస్తున్న బాకాలకు కొందరు వంత పాటదారులు తయారైనా, శ్రీశ్రీ, కొ.కు., రావిశాస్త్రి, కాళీపట్నం రామారావు, సి.వి., కె.వి. రమణారెడ్డి లాంటివారు భారత పాలకవ్యవస్థ యొక్క అభివృద్ధి నిరోధక ప్రజావ్యతిరేక స్వభావాన్ని తమ తమ పద్ధతులలో ఎండగట్టే సాహిత్యాన్ని సృష్టిస్తూనే ఉన్నారు. దీన్నంతా కొనసాగుతున్న ప్రజాజీవన సంఘర్షణలో, సామాజిక రాజకీయ సంఘర్షణలో అంతర్భాగంగా చూడాలి. **(ఇంకా వుంది)** ✦

## తీస్తా సేతల్వాడ్ అరెస్టును ఖండించండి!

**ప్రముఖ** పౌర హక్కుల ఉద్యమకారిణి, మతోన్మాద బాదితులకు న్యాయసహాయం చేసేందుకు ఏర్పాటైన సిటిజన్స్ ఫర్ జస్టిస్ అండ్ పీస్ కార్యదర్శి తీస్తా సేతల్వాడ్ అరెస్ట్ ను జనసాహితి ఖండిస్తోంది. 2002 గోద్రా మతోన్మాద దాడుల బాధితులకు న్యాయం జరగాలని, దోషులను చట్టం ముందు నిలబెట్టడానికి ఆమె చేసిన ప్రయత్నాలను, హిందూ మతోన్మాద పాలకులు విఫలం చేశారు. రాజ్యం మద్దతుతో దోషులు న్యాయస్థానంలో తప్పించుకున్నారు. ఐతే బాధితులకు ఇన్నేళ్లపాటు అండగా నిలిచారనే కక్షతో ఆమె నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థకు సంబంధించి ఆర్థిక దుర్వినియోగం నేరారోపణలతో తీస్తా సేతల్వాడ్‌ను గుజరాత్ (ఉగ్రవాద నిరోధక బృందం పేరుతో) పోలీసులు ముంబై లో అరెస్ట్ చేసారు. వ్యక్తులపై నిర్బంధాన్ని ప్రయోగించడం ద్వారా న్యాయాన్ని అపహాస్యం చేయాలని ప్రయత్నం చేస్తున్న పాలకులు తప్పక అపహాస్యం పాలవుతారు. రచయితలూ, మేధావులు, ప్రజాతంత్రవాదులు ఈ నిర్బంధకాండను ఖండిస్తూ, వీరి ఫాసిస్టు పాలనను జనం ముందు నగ్నంగా నిలబెట్టాలని జనసాహితి పిలుపునిస్తోంది. **– జనసాహితి**

## కృతజ్ఞతలు

**వేములపల్లి రాధిక, పరుచూరి పాండురంగవరప్రసాద్‌గార్ల అబ్బాయి ప్రకాష్‌చంద్ర, రెనీల వివాహ సందర్భంగా 'ప్రజాసాహితి' ఈ నెల సంచిక ప్రచురణకు ఆర్థిక సహాయం అందించారు. వారికి ధన్యవాదాలు.**

**– ప్రజాసాహితి**

### ప్రజానుకూల రచయిత
## 'ఎల్లి' అరుణ మరణానికి సంతాపం



**రచయిత,** నాటకకర్త, ప్రజానుకూల సాహిత్యాన్ని సృష్టించిన అరుణ 16-6-2022న హైదరాబాద్‌లో మరణించారు. ఆమె కృష్ణాజిల్లా ఉప్పులూరు గ్రామంలో జన్మించారు. అరుణ, తన జీవన సహచరుడు సౌదాతో కలిసి సాహిత్య జీవన ప్రయాణాన్ని కొనసాగించారు. అరుణ విరసంలో పనిచేసినపుడు ఎరుకల జీవితాన్ని వెల్లడిచేసే 'ఎల్లి' అనే నవలను రాసింది. ఆ నవల విరసం ప్రచురణగా వెలువడింది. తెలంగాణా రైతాంగ పోరాటాన్ని తెలియచేస్తూ ఆమె మొదటినవల 'రెండు నదులు' వెలువడింది. ఆమె 'నీలి' అనే మరొక నవలను కూడా రాశారు. ఆమె నిశితమైన పరిశీలనతో, తనదికాని జీవితాలలోని సాంస్కృతిక సామాజిక కోణాలను ఆవిష్కరిస్తూ ప్రతిభావంతంగా నవలలు రాశారు. మనువాద బ్రాహ్మణీయ భావజాలానికి ప్రత్యామ్నాయంగా 'అపూర్వ పురాణ కథలు' అనే రచనను సౌదాఅరుణలు తీసుకువచ్చారు. వీరు 'న్యూ సిలబస్ ప్రచురణ' సంస్థ పేరుతో తమ ప్రచురణలను ముద్రించారు. మత విద్వేషం, దేశభక్తి వేషం వేసుకుని యుద్ధోన్మాదం వైపు నడిపిస్తూన్న సామాజిక పరిస్థితుల్లో పిల్లలలో మానవీయ గుణాలను ఉన్నతీకరించే 'నల్ల గుర్రపునాడా' పుస్తకాన్ని తీసుకువచ్చారు. పుస్తక పఠన కార్యక్రమాన్ని 5 రూ॥ల ఎంట్రీ ఫీజుతో నిర్వహించారు. అదే పుస్తకాన్ని ఏలే లక్ష్మణ్ లితోకట్ బొమ్మలతో, పాతకాలపు రష్యన్ పిల్లల బొమ్మల పుస్తకం రూపంలో తిరిగి ముద్రించారు. దీనితో పాటుగా బొమ్మలతో పుస్తకాలు 'ఏక్‌మినార్', 'గులిస్తాన్'లనూ, బుర్రకథ పితామహుడు నాజర్ ఆత్మకథ 'పింజారీ'ని, 'ది లాస్ట్ బ్రాహ్మిణ్' పుస్తకాలను తీసుకువచ్చారు.

న్యూ సిలబస్ ప్రచురణ సంస్థకు అనుబంధంగా 'దస్య' థియేటర్‌ను ప్రత్యామ్నాయ నాటకాలను పరిచయం చేయటానికి రూపొందించారు. సంప్రదాయ నాటకరీతులను ఆధునిక నాటక రంగపు అనుభవాలతో మేళవించి నాటకాలను ప్రదర్శించారు. మొదటగా సౌదాఅరుణల పుస్తకం 'అపూర్వ పురాణ కథలు'లోని 'బర్బరీకుడు' కథను నాటకంగా మలిచారు. అనేక ప్రదర్శనలిచ్చారు. 'బలి–వామన', 'మహాత్మా జ్యోతిబాపూలే', 'అంబేద్కర్ వర్ణ నిర్మూలన' వంటి నాటకాలను రూపొందించి, ప్రదర్శించారు.

మార్క్సిజాన్ని విశ్వసిస్తూ జీవితాన్ని ప్రారంభించిన అరుణ, అస్తిత్వ ఉద్యమాలవైపు ప్రయాణించారు. ఆమె నమ్మిన భావజాలాన్ని చివరికంటా కొనసాగించారు. స్నేహశీలి అరుణ మరణానికి సంతాపాన్ని ప్రకటిస్తున్నాం. ఇన్నేళ్ళగా సౌదా అరుణలుగా కొనసాగిన సౌదాకి మా ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నాం. ✦

# 'గూఢచారి 666' రావిశాస్త్రి రాసిన పొట్టి పిట్ట కథలు

– అరుణ

**పెద్ద** కథలు, చిన్న కథలు, గొలుసు కథలు, కథలో కథలు, పిల్లల కథలు, పొడుపు కథలు, పిట్ట కథలు, ఇలా వివిధ రూపాలలో కథాప్రక్రియ కొనసాగుతూ వస్తుంది. అరేబియన్ నైట్స్, కాశీమజిలీ కథల వంటి సుదీర్ఘమైన కథలు, గ్రీకుల ఈసప్ నీతికథలు, మన పంచతంత్ర కథలు వంటి చిన్న కథలను మనం చదువుకున్నాం. ఇక జానపద వాఙ్మయంలో తాతలు, బామ్మలు అశువుగా చెప్పే చిట్టి పొట్టి కథలకు కొదవేలేదు. 'ఏడు చేపల' కథ కార్యకారణ సంబంధాన్ని, 'దాహం వేసిన కాకి కథ' సమయస్ఫూర్తిని, 'పిల్లి పోరూ పిల్లి పోరూ పిట్ట తీర్చిన' కథ న్యాయవ్యవస్థ డొల్లతనాన్ని.... ఇలా కథలన్నీ వివిధ సామాజిక విషయాలను తేలికగా విశ్లేషించి, రీజనింగ్‌ని నేర్పిస్తాయి. 'పంచతంత్ర' కథలలోని 'మిత్రలాభము', 'మిత్రభేదము' కథలు రాజ్యపాలన, లౌకిక అంశాలపై తెలిసిన అంశాల నుండి తెలియాల్సిన అనుభవ జ్ఞానాన్ని పాఠకులకు అందిస్తాయి.

ఆధునిక కథాసాహిత్యంలో మినీ కథనాల కథలను ఒక ప్రక్రియగా కొడవటిగంటి కుటుంబరావు 'గల్పిక', 'అల్పిక'లు రూపంలో విస్తృతం చేశారు. 'చిత్రగుప్త' పత్రికలో 'కార్డుకథలు' ప్రచురించేవారు. ఆ తర్వాత 'బొమ్మకు కథ', 'కాలమ్ దాటని కథలు', 'సింగిల్ పేజీ కథలు' ప్రత్యక్షమయ్యాయి. కథారూపం తక్కువ వాక్యాలతో ఉన్నా పాఠకుడిలో ఒక మెలకువనూ, చైతన్యాన్ని, సామాజిక స్పృహను కలిగించాలి. ఆ కోవకు చెందినవే రావిశాస్త్రి రాసిన పొట్టి పిట్ట కథలు.

ఆరు మూర్ల గూఢచారి, మూడే ఆర్ల గూఢచారి, గూఢచారి మూడు ఆర్లు, అతి గూఢచారి ఆరారారు పేర్లతో రావిశాస్త్రి రాసిన ఈ 22 పిట్ట కథలను 'స్వాతి' పత్రికలో జూలై 1978 నుండి జనవరి 1980 వరకూ ప్రచురించారు. చిన్న చిన్న సంభాషణల ద్వారా సాగిన ఈ కథలు సమకాలీన సామాజిక పరిస్థితులపై చెణుకుల్లా సాగాయి. ఈ పొట్టి పిట్టకథలకు కార్టూన్‌లనూ జతపర్చారు.

మొదటికథలో పసికూన 'ఆకలేస్తోంది' అని అమ్మ నడుగుతుంది. 'అన్నం లేదు తల్లీ అంటుంది' అమ్మ. 'మరేం చేయాలని' పసికూన అడుగుతుంది. అమ్మ 'అయ్యని అడగమంటుంది'. 'అయ్యా, అయ్యా ఆకలేస్తోంది!' అని అడుగుతుంది పసికూన. 'జీతం చాలతల్లీ' అంటాడు అయ్య. 'మరేం చెయ్యటం' అని పసికూన అయ్యనడుగుతుంది. అయ్య 'ప్రభుత్వాన్నడుగమంటాడు. 'ఏమండీ ఏమండీ ఆకలేస్తోంది' అడుగుతుంది పసికూన. 'ఇన్ని కుటుంబ నియంత్రణ కేంద్రాలుండగా ఈ కునికిద్రపుకూనెలా వచ్చింది? తగలెయ్యండి దీన్ని' అంది ప్రభుత్వం. 'ఇలా తగలెయ్యకపోతే, చంపేయకూడదా?' అని ఏడ్చింది పసికూన. 'మేం అహింసావాదులం. మేం చంపం నువ్వే చచ్చిపో!' అంది ప్రభుత్వం. 'అప్పుడు పసికూన చచ్చిపోయింది'. వేలాదిమంది రైతుల, చేనేత కార్మికుల, విద్యార్థుల, నిరుద్యోగుల, నిస్సహాయుల ఆత్మహత్యలకు కారణాలేమిటో స్పష్టంగా ఈ కథ ద్వారా అర్థం అవుతుంది. ఈ కథకు వేసిన కార్టూన్‌లో '7వరోజు నిరాహారదీక్ష' అనే బోర్డు టెంటుకు ఒకవైపు, టెంట్‌లో ఏడుస్తూన్న పసికూన, టెంట్‌కి రెండోవైపు బోర్డులో 'కనీసపు కోర్కె కడుపునిండా అన్నం కావాలి' అని వుంటుంది. ఆకలి తీరటం కోసం నిరాహార దీక్ష చేస్తున్నారన్నమాట.

తర్వాత కథలో 'తెల్లవారింది ఆవు నిద్రలేచింది'. 'చీకటయ్యింది పులి నిద్రలేచింది' 'ఏమిటి తినడం?' అనుకుంది ఆవు. 'ఎవర్ని తినడం' అనుకుంది పులి. 'నిద్రలేచి ఏమిటి తినడం? ఎవర్ని తినడం అని అనుకునేవాడు మాత్రం మనిషి మాత్రమే' అంటూ ఈనాటి మనిషి తనాన్ని చిత్రించారు రావిశాస్త్రిగారు. దీనికి వేసిన కార్టూన్‌లో 'మానవుడు' అనే టైటిల్‌తో ఆవు తల, పులి శరీరం వున్న బొమ్మ వుంటుంది.

ఒక కుర్రాడు బాగా చదివి పరీక్షకి వెళ్ళేడు. అతని దగ్గర కాపీకొట్టి ఇంకో కుర్రాడు పరీక్ష రాశాడు. మరో కుర్రాడు లంచమిచ్చి పరీక్షాపత్రాలు సంపాదించి పరీక్ష రాశాడు. 'రెండో కుర్రాడు దొంగైతే, మూడో కుర్రాడు గజదొంగ ఐతే' మొదటికుర్రాడెవరు?' అని ప్రశ్నించిన రచయిత, 'ఒస్, ఆపాటి తెలీదా? ఆడు కూలోడు!' అని సమాధానము ఇస్తారు. నీతి, నిజాయితీ శ్రమతత్త్వంలోనే, శ్రమసంస్కృతిలోనే ముడిపడి వుంటాయని ఈ పిట్ట కథ ద్వారా రావిశాస్త్రి చెప్పారు. దీనికి వేసిన కార్టూన్‌లో కులాసాగా నుంచున్న కుర్రాడు బీదవాడైన అమాయకపు పిల్లాడితో 'ఇందాక పరీక్షలో నీ పేపరు కాపీ కొట్టాను – ఇంద రూపాయి తీసుకోమంటాడు'.

ఓ మనిషి దేముడున్నాడు అని నమ్ముతాడు, మరో మనిషి దేముడు ఉన్నాడా? లేడా? అన్న సందేహంలో వుంటుంటాడు. ఇంకో మనిషి మాత్రం దేవుడు లేడని రీజన్ తీసి వాదిస్తాడు. రచయిత 'మనిషికి దేముడికీ తేడా ఏమిటి?' అని ప్రశ్నిస్తారు. సమాధానంగా "ఇతను అతని గురించి ఆలోచిస్తాడనటానికి ఎన్నో ఆధారాలున్నాయి. అతను ఇతని గురించి క్షణమైనా ఆలోచిస్తాడనటానికి ఏ ఆధారమూ లేదు' అని తేల్చేశారు. దీనికి వేసిన కార్టూన్‌లో 'ఇంటర్వ్యూ బోర్డులో జనరల్ నాలెడ్జిలో లేని ప్రశ్న ఒకటి అడిగారు గురూ, అదేవిటంటే దేవుడున్నాడా, లేడా?' అని ఇంటర్వ్యూ నుండి వచ్చినతను మిగతావారికి చెబుతుంటాడు.

ఒక కవి 24 గంటలలో 18 గంటలు రాసేస్తుంటాడు. ఎలా రాయగలుగుతున్నారండీ అని రచయితను అడిగితే 'రాస్తూంటే విస్కీ తాగినంత హాయిగా వుంటుందోయ్' అంటాడు. అదే రచయిత తర్వాత రాయడం పూర్తిగా మానేస్తాడు. ఏమని అడిగితే 'నేను విస్కీ తాగుతున్నానోయ్!' అని జవాబు చెప్తాడు. రచయితకు రాయటానికి ఏం కావాలో నిర్ణయించుకోమంటారు రావిశాస్త్రి. దీనికి వేసిన కార్టూన్‌లో 'పెన్నులో సిరా బదులు కాస్త సారా పోసాను. దీం దుంపతెగ తెగ రాస్తోంది' అని రచయిత చెప్తుంటాడు.



'పగలు పదిన్నరకి ముద్దాయి నేరం చేస్తుండగా ఎస్సయ్‌గారు పట్టుకున్నట్లుగా పోలీసువారు ఛార్జిషీటు పెట్టి కేసు పెట్టేరు.' 'అర్ధరాత్రి 12 గంIIకు అతన్ని పట్టుకున్నట్లుగా ఎస్సయ్‌గారు కోర్టులో సాక్ష్యం చెప్పారు'. కోర్టువారు ఎస్సయ్‌గారు పొరపాటుగా చెప్పారంతేనంటారు. ఆ తర్వాత ఎస్సయ్‌గారు, మెజిస్ట్రేటుగారు పై స్థాయిలకు ప్రమోట్ అవుతారు. ముద్దాయిగారు జైలుకు వెళతారు.

అని న్యాయస్థానం, పోలీసువ్యవస్థ మీద వ్యంగ్యాన్ని, చూపిన రావిశాస్త్రి ఆ కథకి క్రింద బ్రాకెట్లలో, 'ముద్దాయిని గారు ఎందుకు చేసేరు?' అని ప్రశ్నించి 'ముందిద్దరూ 'గార్లు' అయినపుడు ఇతను ఎందుకు కాకూడదు అంటారు. దీనికి వేసిన కార్టూన్‌లో బోనులో వున్న ముద్దాయి, లాయరుతో 'నే చేసిన నేరం రుజువు అయ్యేదాక నన్ను గౌరవంగా పిలువెహె!' అంటుంటాడు.

ఒక అతను స్నానం చేసి అర్జంటుగా బయటకు వెళ్ళాల్సిన పని వుండి గడ్డం చేసుకోవటానికి బ్లేడు తీసుకురమ్మని పెద్దపిల్లవాడిని అడుగుతాడు. అతను డ్యూటీకి వెళ్ళాలి కుదరదంటాడు. చిన్నవాడిని అడుగుతాడు వాడు బ్యాట్మింటన్ ఆడుకోవటానికి వెళ్ళాలంటాడు. మూడోవాడు ఇంట్లో లేడు. పనిమనిషి పాలకోసం అప్పటికే బయటకు వెళ్ళిపోయింది. అఖరివాడు ఇంకా నిద్ర లేవలేదు. పక్కవాటా అబ్బాయిని అడుగుదామంటే వాళ్ళావిడకి ఆ ఇంటివారికీ నిన్ననే గొడవ అవుతుంది. ఇంటిముందు రిక్షా అతనితో చెప్దామంటే అతనికీ బేరం దొరికి వెళ్ళి పోతాడు. ఆ బ్లేడు సమస్య ఎలా తీరుతుందా అని గిజగిజలాడుతున్న ఆ మధ్యతరగతి బుద్ధిజీవికి చివరకు 'నేనే వెళ్ళి తెచ్చుకోవచ్చు కదా' అనే ఐడియా వస్తుంది. దానికి వేసిన కార్టూన్‌లో కుర్చీలో చేతులు కట్టుకుని, గడ్డం పెంచుకుని, పక్కన షేవింగ్ కిట్‌తో కూర్చున్న భర్తగారి భార్య పక్కింటావిడతో 'ప్రతిదానికీ మావారు నామీదనే ఆధారపడ్తారు – గడ్డం కూడా నే జెయ్యాల్సిందే! అని చెప్తూంటుంది.

ఐదోక్లాసు చదువుతున్న అందంగా, అమాయకంగా, సన్నగా వుండే పదేళ్ళ అప్పారావు బడి దగ్గిర్లోని చింతచెట్టు ఎక్కి కష్టపడి రెండు జేబులనిండా లేచింతకాయలు కోసుకొని చెట్టు దిగుతాడు. దిగీదిగగానే పాపయ్య వచ్చి రెండు జెల్లలు వేసి జబర్దస్తీగా ఎడమ జేబులోని చింతకాయలను చాలావరకు లాక్కొంటాడు. పాపయ్య స్నేహితుడు సంగీతరావు వచ్చి కుడి జేబులోని చింతకాయలను చాలావరకు లాక్కుంటాడు. రచయిత 'ముగ్గురు మూడు విధాలుగా ఆస్తులు సంపాదించేరన్నమాట' అని అంటూ 'అయితే నష్టపోయిందెవరు?' అని ప్రశ్నించారు. రకరకాల పన్నులు, అధిక ధరలతో కేంద్రం ఒకవైపు, రాష్ట్రం ఒకవైపు సంపదనంతా గుంజుకుంటుంటే నష్టపోతుందెవరో వారే, ఆ ప్రజలే, శ్రమజీవే అని మనకూ తెలుస్తూందిగా. దీనికి వేసిన కార్టూన్‌లో ఓ పెద్దమనిషి ఎదురుగా నౌఖరు నుంచొని 'గర్భనిరోధక మాత్తర్లు తయారుచేసే ఫాక్టరీ ప్రక్కనే పెట్టడం మూలాన ఈ ఏడాది మామిడితోట్లో ఒక్క కాయ కాయలేదయ్యగోరు! అని చెప్తుంటాడు.

ఒకసారి కరువొచ్చి, దాగివున్న ధాన్యం కోసం జనం అంతా ఎగబడ్డారు. పోలీసులు జనాన్ని ఆపలేకపోయారు. సైన్యం రంగంలోకి దిగింది. శాంతిభద్రతలను నెలకొల్పటం కోసం చాలామంది చనిపోయారు. 'శాంతిభద్రతలు ఎవరికోసం నెలకొల్పబడ్డాయి' అనే ప్రశ్నకి సమాధానం తెలుసుకోవటానికి ప్రయత్నించేమందు – తెలుసు కోవల్సిన అతి ముఖ్య విషయాన్ని రావిశాస్త్రి చెప్పారు. అదేమిటంటే – 'ధాన్యం దానంతట అది దాగోదు. దాన్ని దాస్తారు' అని. ధాన్యం దాచినవాడే కరువును సృష్టించి, శాంతిభద్రతలను కాపాడే నెపంతో జనాన్ని చంపుతారన్నమాట. నేడు నిరుద్యోగాన్ని సృష్టించిన పాలకులే అగ్నిపథ్ వీరులను సృష్టిస్తున్నట్లు. దీనికి వేసిన కార్టూన్లో ఒక ఆసామీ పక్కన బంధించబడిన ధాన్యం బస్తా అంటుంది 'నా అంతట నే దాక్కోలేదండి బాబూ! ఈనే నన్ను దాచాడు!' అని.

చలికాలం రాత్రి తొమ్మిదిగంటల సమయంలో కొండమీద నుండి దిగుతున్న బస్‌లో నుండి చూస్తుంటే 'లోయలో ఊరు! చుక్కలన్నీ స్నానం చేసి ఒక్క లోగిట్లోకి వచ్చినట్లుంది' అనుకున్నాడు అతను. ఆ సౌందర్యాన్ని ఆస్వాదిస్తుంటే 'ప్రక్కనున్నవాడు, ముప్ఫైఏళ్ళ వృద్ధుడు, ఈకెలు తెంపిన కోడికి చింకిలాల్చి తొడిగినట్లున్నవాడు 'ఎందుకెత్తేవు తెర'? అని మళ్ళీ మళ్ళీ అడిగాడు. 'అందాన్ని ఆరాధించటానికి' అని ఊరి సౌందర్యాన్ని చూపించబోయాడు. కానీ ప్రక్కవాడు పరమ క్రూరంగా చూస్తూ 'అందాన్ని ఆరాధించటానికి నీకు ఉన్నికోటూ, మఖ్మల్ మఫ్లరూ ఉన్నాయి! నే చల్లో ఛస్తున్నా' అని చెప్పి కిటికీ తెరను సర్రున దించాడు. నిజమేగదా ప్రకృతి, వెన్నెలా వాటివరకూ అవి ఒకేలా వుంటాయి. కానీ పూరిగుడిసెలోని వెన్నెలకీ, భవంతులలోని వెన్నెలకి ఎంత తేడా వుంటుంది. మనదేశం లాంటి "రెండు దేశాల కథకి" ఇది సరిగ్గా సరిపోతుంది. దీనికి వేసిన కార్టూన్‌లో నిండైన మనిషి స్వెటర్, మంకీ కాప్ పెట్టుకుని, పక్కనున్న పల్చని గుడ్డలతో వున్న బక్కపల్చని వ్యక్తితో ఈ 'పూళ్ళో చచ్చేంత చలి వుంటుందన్నారు – ఏదీ!' అని అంటుంటాడు.

విస్కీ సీసాని కౌగిలించుకుని తెస్తూ మెట్ల మీద బోర్లాపడి అతను సీసా పెంకులు గుచ్చుకుని చనిపోతాడు. అతను పోయినందుకు భార్యాబిడ్డలు విచారిస్తుంటే సీసాలోని స్కాచ్ విస్కీ నేలపాలయినందుకు స్నేహితులు విచారించారు అంటారు. ఎవరి ప్రయోజనాలు వారివి మరి. దీనికి వేసిన కార్టూన్‌లో స్నేహితులంతా గోడకు తగిలించిన అతని ఫోటో ప్రక్కనున్న విస్కీ ఫొటోకి దండ వేసి దణ్ణం పెట్టుకుంటుంటారు.

పందికొక్కులన్నీ సభ పెట్టుకుని వాటి రక్షణ కోసం దండుని ఏర్పాటు చేయాలనుకుంటాయి. ముసలికొక్కు 'దండును ఏర్పాటు చేయవలసి వస్తే గండు పిల్లులు దండును ఏర్పాటు చేయటమే మంచిది' అంటుంది. 'అవి మనల్ని తినీవా' అని కొక్కులు అడుగుతాయి. 'ఎలుక లున్నంతకాలం అవి మన జోలికి ఎన్నటికీ రావు' అని ముసలికొక్కు భరోసానిస్తుంది. విభజించి పాలించే రాజనీతిని సులభంగా చెప్పారు రావిశాస్త్రి. దీనికి వేసిన కార్టూన్‌లో గండు పిల్లి దగ్గరకు ఒక పందికొక్కు వెళ్ళి మిగతా కొక్కులను పిలుస్తూ 'పిల్లిగారు మనబోటి పందికొక్కులను ఏమీ అనరు – నువ్వు భయపడకుండా రా!' అని పిలుస్తుంటుంది.

షావుకార్లంతా దైవభక్తులైపోయి ఆస్తులను పోగేసుకోవటాన్ని పసిగట్టిన బికార్లకి భగవంతుడి మీద కోపం వచ్చి అల్లరి చేస్తుంటారు. షావుకారు మనవడిని పిలిచి "ఏమిటి అల్లరి?" అని అడుగుతాడు. 'బికార్లు భగవంతుడు లేడంటూ దేవాలయాల మీదికి దండెత్తుతున్నారు' అని చెప్పాడు మనవడు. ఆలోచించిన షావుకారు, మనవడిని నాస్తికుడివైపోయి బికారుల్లో కలసి వాళ్ళకి నాయకుడవ్వమంటాడు.

రావిశాస్త్రి ఇచ్చిన ముక్తాయింపు ఏమిటంటే 'ఫలితంగా భగవంతుడు చనిపోయాడు. కాని షావుకార్లు బతికి బాగుపడుతూనే వున్నారు" అని. దేవుడు పేరుతో పాలకులే వ్యాపారం చేస్తున్న నేటి పరిస్థితులను స్పష్టంగా ఈ కథ చెప్తుంది. దీనికి వేసిన కార్టూన్‌లో ఒక తాత, మనవడితో 'దేవుడిమీద నమ్మకం లేకపోతే తప్పకుండా బికారివవుతావు!' అని చెప్తుంటాడు.

ఒక పోలీసు సూపరింటెండెంటు దొరగార్ని కలవటానికి వెళ్తే గార్డు డ్యూటీలో వున్న జవాను ఆపేసాడు, సంజాయిషీ ఇస్తే వరండాలోకి పంపించాడు, వరండాలో వున్న వాడిపళ్ళ బొచ్చుకుక్క అరుపులను సముదాయించిన ఆర్డర్లీ క్యాంప్ క్లర్క్‌గారు కాసేపట్లో వస్తారని ఎదురు చూడమన్నాడు. క్లర్క్‌గారు వచ్చారు. కొంతసేపటి తర్వాత క్లర్క్ ఫోన్‌లో మాట్లాడి ఇంకొంతసేపు ఎదురుచూడమన్నారు. చాలాసేపటి తర్వాత వచ్చిన దొర, కలెక్టర్ని చూడాలని వెంటనే వెళ్ళారు. వారి దర్శనానికి 4, 5 సార్లు తిరిగిన తర్వాత తెలుసుకున్నది ఏమంటే 'అడ్డంకులుంటేనే గాని అధికార్ల ఆధిక్యత జనానికి తెలిసిరాదు' అని. 'అందుకే పెద్దలు పెద్దపెద్ద దేవుళ్ళని కొండలమీద, అడవుల మధ్యా ఉంచుతారు' అని – అదన్నమాట సంగతి. దేవుళ్ళు పెద్దపెద్ద అడవుల్లో కొండలమీద ప్రజలకి దూరంగా ఎందుకుంటారో అర్థమవుతుంది.

ఓ పెద్ద షావుకారు ఓ భోజన హోటల్ పెడతారు. పచ్చటి అరిటాకుల్లో చక్కటి భోజనం పెట్టటంతో వ్యాపారం పెరిగింది. వెనుక సందులో అరిటాకులకుప్పా పెరిగింది. ఊరిలో వున్న బక్క డొక్కు ఆవులన్నింటికీ కూడా ఉచితంగా ఆహారం దొరికింది. హోటల్ యజమాని, ఉచితంగా ఆవులన్నీ మేయటాన్ని చూసి గిజగిజలాడి – ఎంగిలన్నానంతా ఓ కాంట్రాక్టరుకి, ఎంగిలాకులన్నీ గేదెల ఫారం వున్న పాల కాంట్రాక్టర్‌కి అమ్ముకుంటాడు. పాపం ఆవులు యథావిధిగా సినిమా పోస్టర్లని తింటూ వుంటాయి. సినిమా హీరోల అభిమానుల సమన్వయ సంఘం పోస్టర్లను ఆవులు తినకుండా పోస్టర్ల రక్షణకు పూనుకుంటుంది. పాఠకుల బుర్రల్లో మరి ఆవులు బ్రతికేదెలా అనే ప్రశ్నను రచయిత మొలిపిస్తారు. సంపద పోగుబడుతున్నకొద్దీ, పెట్టుబడిదారుడులో ఇంకా ఇంకా పెంచుకోవాలనే తత్త్వం మానవత్వాన్ని చంపేస్తుందని సూచించారు.

ఓ కూలివాడు చితికిపోయి, కుళ్ళిపోయి, ఎండిపోయి చనిపోతాడు. అతని భార్య ముష్టిదవుతుంది. కొడుకు దొంగ అవుతాడు. కూతురు వెలయాలై పరదేశాలకి అమ్ముడవుతుంది. కూలివాడి కుటుంబం అంతా సర్వనాశనం అవుతుంది.

కానీ అటు చూడండి అంటారు రచయిత.

"అతని చేతికి బంగారు కంకణం వుంది. అతని మెడలో పువ్వుల దండలు గుత్తుగుత్తులుగా వున్నాయి. అతను పండిన గుమ్మడిపండులా వున్నాడు. అతని ఎర్రి నోటినిండా కోరపళ్ళూ చిరునవ్వులూ వున్నాయి. అతని కడుపునిండా స్కాచ్ విస్కీ వుంది. అతను ఈ మధ్యే ఎమ్మెల్సీగా నామినేట్ అయ్యాడు. భక్తులతణ్ణి ఊరేగిస్తున్నారు ఓపెన్‌టాప్ కార్లో".

రచయిత చూపించిన పై లక్షణాలు వున్న అతను ఎవరంటే కూలివాడి కుటుంబం గురించి కథలూ, గేయాలు రాసిన కవిగారన్నమాట. రాజ్యానికి అమ్ముడవుతున్న కవులను గురించి రచయిత చెప్పిన నిజాలవి. ఈ కథ వేసిన కార్టూన్‌లో 'కూలి జన కవి'గారు ప్లేటుల కొద్దీ విందు ఆరగిస్తూ 'బ్రేవ్!.... ఇప్పుడే మాంచి మూడొస్తుంది – ఆకలిమీద అరవై పేజీలు రాసి పడేస్తాను'. అని అంటుంటారు.

ఆఫీసుల్లో సాగే లంచాల ప్రక్రియ గురించి రాస్తూ 'బంట్రోతు లంచం అడుగుతాడు. చిన్న గుమస్తా లంచం అడుగుతాడు, పెద్ద గుమస్తా లంచం గుంజుతాడు. హెడ్ గుమస్తా లంచాలు దండుతాడు, చిన్న ఆఫీసర్ లంచాలు పీల్చేస్తాడు పెద్ద ఆఫీసరు మాత్రం ధర్మరాజు. అతను లంచాలు పుచ్చుకోడు – కిందివారి నుంచి వాటాలే తప్ప' అంటారు.

ఓ పిల్లకోడికి బాగా ఆకలేసి తల్లికోడితో ఆకలిగా వుంది, కనుచూపుమేరలో ఆవగింజంత చోదు గింజైనా లేదని చెప్పి విలపిస్తుంది. తల్లికోడి, పిల్లను సముదాయిస్తూ 'భగవంతుడు ప్రతి అవసరమూ తీరుస్తాడని, నారుపోసినవాడు నీరు పోయక మానడని చెప్తూ' దూరంగా జరుగుతున్న పెండ్లి విందు వద్దకు వెళ్ళి భోజనము విస్తరాకులలో మిగిలిన పప్పు పరమాన్నములను తింటాయి. తృప్తిగా తినిన తల్లి 'నే చెప్పాను కదా భగవంతుడంతా చూసుకుంటాడంటుంది'. అదే సమయంలో డేగ పిల్ల ఆకలి బాధను తట్టుకోలేక తల్లి డేగతో మొరపెట్టుకుంటుంది. తల్లి డేగ సుష్టుగా తిని బయల్దేరిన కోడిపిల్లను పట్టి పిల్లడేగకి ఇచ్చి 'నే చెప్పలేదా భగవంతుడు మన ప్రతి అవసరాన్ని తీరుస్తాడని, కరుణా మయుడైన ఆ భగవంతునికి నమస్కరించి, ఆ తర్వాత కోడిపిల్లను భక్షించు' మంటుంది. 'డేగ బిడ్డ అట్లే చేసెను, భగవంతుడు సంతసించెను" అని రావిశాస్త్రి ముక్తాయింపు ఇచ్చారు. దేవుడు ఎవరిపక్షాన వున్నాడో, కర్మ సిద్ధాంతాన్ని ఉన్నవాడూ లేనివాడూ పాటించినా అది ఎవరికి ప్రయోజనకారో అలా చిటుక్కున చెప్పేశారు.

అతని స్నేహితుడు అతని దగ్గర రెండువేల రూపాయలు దాచుకున్నాడు. మరొక స్నేహితుడు డబ్బు అప్పుగా కావాలి అని అడిగితే అతను ఆ రెండువేల రూపాయలని 2 వారాలకి 200ల రూ॥ వడ్డీకిచ్చాడు. తిరిగి రెండు వందలతో సహా తీసుకున్నాడు. డబ్బు దాచుకున్న స్నేహితుడు అతని దగ్గరకి వచ్చి తనకి డబ్బులు అవసరం ఇవ్వమని అడిగితే తనకి తెలియకుండా తన భార్య తన తల్లికి ఇచ్చిందని మోసపు మాటలు చెప్పి, స్నేహితుడికి ప్రోనోటు రాసి పంపించాడు. కానీ అతను తన మరదలి పెళ్ళికి తన మామగారికే మూడు రూపాయల వడ్డీకి ఆరునెలల కాలానికి సరిపడా వడ్డీ డబ్బులు మినహాయించి మరీ ఇచ్చాడు. దాన్తోపాటు మామగారి ఇంటిని తనఖా పెట్టించుకుని, ఇంటి అద్దె కూడా తనే తీసుకుంటూ ఆఖరికి అప్పు తీర్చలేకపోయిన మామగారి ఇంటిని వేలం వేయించి తనే కొనుక్కున్నాడు.

ఇదంతా రావిశాస్త్రి ఎవరి గురించి చెప్పారంటే 'పేదల పెన్నిధి పార్టీ' తరపున తమ గ్రామానికి గెలిచిన ఎమ్మెల్యేగారి గురించి. రాజకీయ వ్యవస్థ అలా వుంది. ఈనాటి రాజకీయాలు అంతకు మరింతగా దిగజారిపోయాయి. అంతేకాదు మన సహజవనరులను, సంపదలను కొల్లగొట్టుకుపోతున్న బహుళజాతి బడా కంపెనీల దేశాలవారే మనకు అనేక నిబంధనలు, షరతులతో అప్పులివ్వటం, నెమ్మదిగా మనదేశాన్ని అమ్మకానికి పెట్టిన స్థితికి 'అభివృద్ధి' చేశారు. దోపిడీ వ్యవస్థకి సంపదలను పోగుచేసుకోవటమనే తన ప్రయోజనాలు ఉంటాయే తప్ప వారు చెప్పే 'దేశభక్తి' నినాదం మోసం అన్నది అర్థమవుతుంది. రావిశాస్త్రి ముక్తాయింపుగా 'ఆ ఎమ్మెల్యే చాలా మంచివాడు. ముండకి మేడ



కట్టించేదు. భార్యకి భరణం ఇస్తున్నాడు' అని రాశారు. విలువలను, మానవ సంబంధాలను డబ్బు మృగ్యం చేస్తుంది.

ఒక ఎక్స్‌ప్రెస్ బస్‌లో పెళ్ళి పార్టీవారు. పిక్నిక్ పార్టీవారు ఎక్కవలసి వచ్చింది. జనం రద్దీగా వుండటం వలన తోపులాటలు జరిగి తన్నుకున్నారు. ఏదైతేనేం రెండు పార్టీలవారు బస్ ఎక్కారు. బస్ కదిలింది కానీ రెండు పార్టీలవారి మనసుల్లో జరిగిన తోపులాట గొడవ సద్దుమణగలేదు. ఇరుపార్టీలు ఒకే వూరికి వెళ్తున్నారు. గనుక దిగిన తర్వాత ఒకరు అంతు మరొకరు చూసుకుందాం అనుకున్నారు. సగం దూరం వెళ్ళాక ఓ చిన్నపిల్ల ఏడవటం మొదలుపెట్టింది. ఎంతకీ ఆపదాయె, ఎందుకో ఎవరికీ తెలియటంలేదు. పిల్ల ఎంతసేపటికీ ఏడుపు ఆపకపోవటంతో పిల్ల తల్లీ ఏడుపు లంకించుకుంది. ఇక బస్‌లో వున్న వున్నవారంతా వారి ఏడుపును ఆపే పనిలో పడ్డారు. పెళ్ళి పార్టీవారు మంచినీళ్ళు కూడా తెచ్చుకోలేదు. పిక్నిక్ పార్టీవారు ఆ పిల్లకి తమ దగ్గరున్న మంచినీళ్ళు తాగించారు. ఆ పిల్ల మంచినీళ్ళు వెక్కివెక్కి ఏడుస్తూనే పూర్తిగా తాగింది. 'తాగేక పూలతోటలా నవ్వింది'. ఇరుపార్టీలవారు వైషమ్యాలు మరచి కబుర్లలో పడ్డారు. రావిశాస్త్రి 'ఏక పనిలో కొన్ని పార్టీలు ఏకం అవుతాయి' అంటారు. పని, శ్రమ ఏ వైషమ్యాలు లేనిది. ఎవరిమధ్యనైనా బంధాలను ఏర్పర్చేవి అందుకే పాలకవర్గ పార్టీలు శ్రమజీవులను వేరుచేసే సంస్కృతిని నిరంతరం వెదజల్లుతూ వుంటాయి.

వ్యాపారస్థుల పదిశాతం వాటాతో, ప్రజల ప్రభుత్వం అనబడేది 90% వాటాతో మహారాజా బంగళాలాంటి హోటలు కట్టించారు. ఆ హోటల్‌కెళ్ళటానికి సామాన్య ప్రజల స్థోమత సరిపోదు. పెద్దవారు అనేవారంతా ఆ వూరు వచ్చాక ఆ హోటల్‌కే వెళ్తారు. ఎందుకంటే డబ్బు పారేస్తే కావలసిన భోగాలన్నీ అక్కడ దొరుకుతాయి. అక్కడ చాలా క్లీన్‌గా వుంటుంది. భోజనశాలలో అయితే ఒక ఈగైనా, దోమైనా, బొద్దింకైనా కనపడదు. అంత క్లీన్‌గా వుంటుంది. ఈగలు, దోమలు, బొద్దింకలు – వాటి కాళ్ళూ రెక్కలు అక్కడ ఎందుకు దొరుకుతాయి 'అన్నీ వంటగదిలోనే వుంటాయ'ని రచయిత అంటారు. ప్రజల ప్రభుత్వపు వాటా వున్న హోటల్ సామాన్య ప్రజలకి అందుబాటులో లేవన్నది ఒక వాస్తవం అయితే – అక్కడకొచ్చే పెద్దవాళ్ళందరికీ కావల్సిన మెరుగులు చూపించే వ్యాపారపు దృష్టి గురించి సెటైర్ వేశారు.

ఇప్పటి కరోనా కాలానికి సరిగ్గా సరిపోయే పిట్ట కథ ఇది. పేదరికం కారణంగా చాలా జబ్బులు పుడతాయని రాజుగారు తన కొడుకుని భద్రంగా ఒంటి స్తంభపు మేడలో వుంచి పెంచుతుంటాడు. ఆ కుర్రాడికి కొద్దికాలానికి పెద్ద రోగం అంటుకుంది. కారణమేమంటే 'ఆ పిల్లాడి పరిచారికి ఒంటి స్తంభపు మేడలో పెరగలేదు. తన పెద్దరోగపు పెత్తల్లి దగ్గర పెరిగిందని' చెప్పి 'కొందరే బాగుండడం కుదరదని రాజుగారికి తెలిసొచ్చిందా?' అని ప్రశ్నించిన రచయిత 'తెలిసింకా రాలేదని అనుకుంటాను' అని సమాధానమిస్తారు. ఎలా తెలిసి వస్తుంది రాజుల ప్రయోజనం అందరూ బాగుండటం కానప్పుడు.

ప్రభుత్వ ఆఫీసులో పాతిక సంవత్సరాలు ఉద్యోగం చేసి, రిటైర్ అయిన ఉద్యోగి 'దిక్కులేనివారికి నువ్వే దిక్కు, మరి నీకెవరు దిక్కు?' దేవుడా అని (కార్టూన్‌లో) అడిగిన కథ ఇది. అతను ఉద్యోగం చేస్తూన్న కాలంలోనే ముగ్గురు కూతుళ్ళకీ పెళ్ళిళ్ళు చేశాడు. పెళ్ళి అయ్యాక ఒక కూతురు చనిపోతే, రెండో కూతురు భర్త చనిపోయాడు. మూడో కూతురి భర్త విడిచిపెట్టాడు. కొడుకుల్లేని ఆ ఉద్యోగికి పెళ్ళీడు కొచ్చిన చిన్న నత్తి, చిన్న మెల్లా వున్న కూతురు వుంది. ఆ పిల్ల కోసం పాతిక తులాల బంగారం దాచిపెట్టి వుంచాడు. కట్నానికి ఆశపడిన ఓ పెళ్ళి కొడుకు ఆమెను పెళ్ళి చేసుకోవటానికి ఒప్పుకున్నాడు. పెళ్ళి కుదిరింది. కట్నం డబ్బులు కోసం రేపు బంగారాన్ని అమ్మేద్దామనుకుంటుండగా ఆ రోజు రాత్రి దొంగలుపడి బంగారాన్ని ఎత్తుకుపోతారు. పోలీసువారికి రిపోర్టు చేశాడు కానీ అతనికి వారి మీదకన్నా కొండమీద వెలసిన కృతయుగపు దేవుడి మీద నమ్మకంతో, బంగారం తిరిగి దొరకాలని ఆయాసపడి మెట్లన్నీ ఎక్కిఎక్కి భగవంతుడి చెంతకు చేరతాడు. కానీ గుడి మూసేసి వుంది. కారణమేమంటే 'దేవుడి కోటిరూపాయలు నగలు దోచుకుపోయారని దర్యాప్తు జరుగుతుందని పోలీసువారు చెప్తారు' 'అయ్యో దేవుడా!' అనుకుని ఉద్యోగి ఇంటికెళ్ళిపోతాడు. పాపం 'మెల్లపిల్ల కళ్ళు వేణ్ణీళ్ళతో నిండిపోయేయి' అని కథను ముగిస్తారు. ఈ కథను 1979లో ఆయన రాశారు. ఇప్పటికీ ఇదే పరిస్థితి. అయినా 'దిక్కులేని వారికి దేవుడే దిక్కు' అనే నానుడి అన్నది ఇంకా ఎందుకు బ్రతికి వుందో, ఎవరు బ్రతికిస్తున్నారో, ఎవరికి అవసరమో – మనకి అవగతమవుతుంది.

మహాత్మాగాంధీగారు మనకి మరీమరీ చెప్పిందేమిటంటే చీనా కోతులతోటి – చెడు వినవద్దు, చెడు కనవద్దు, చెడు అనవద్దు అని. ఒకటి పాపం చూడదు, మరోటి వినదు, ఇంకొకటి పలుకదు. రావిశాస్త్రి దీనిలోపలి మతలబుని ఇలా బయటపెట్టారు. 'చూడనది వినొచ్చు, పలకవచ్చు' విననది చూడొచ్చు, పలకొచ్చు. పలకనిది కళ్ళారా చూడొచ్చు. చెవులు రిక్కించి వినొచ్చు. పాపం చూడనదీ, విననదీ, పలకనదీ కూడా పాపం చెయ్యొచ్చు'. అలా పపంచకం అంతా – అందులో భాగంగా మనదేశంలోనూ మరందులో భాగంగా మన రాష్ట్రాలలోనూ రాష్ట్రాలలో ఊరుల్లోనూ పాపాలు జరుగుతున్నాయోచ్.

'మనిషికి మహిలో ఆస్తిహక్కు ఉండకూడదని అతను చాలా చాలా గ్రంథాలు రాశాడు. వాటి అమ్మకాల ద్వారా లక్షలు లక్షలు వచ్చాయి. ఆ గ్రంథాలలో కొన్నింటిని అతను అనుమతి లేకుండా మరొకరు ప్రచురించి, అమ్ముకుని, సొమ్ములు చేసుకున్నాడు. అలా 'ఇంకొకతను తన ఆస్తిహక్కుకి భంగం కలిగించేరని వారి మీద దావా వేసేడు అని' రావిశాస్త్రి ముగించారు. చెప్పేవాటికి – ఆచరణకి మధ్య పొంతన వుండాలని పాఠకుడికి అర్థమవుతుంది.

చిన్న గ్రామంలో సాదా జనంతో కలసి తిరుగుతూ వుండే ఓ రాజు రాజుగారయ్యారు. రాజైన చాలా ఏళ్ళ తర్వాత ఎక్కడకో వెళ్తూ దార్లో తను తిరగాడిన గ్రామం మీదుగా వెళ్ళేరు. జనం దారి పొడవునా జయజయధ్వానాలు చేశారు. ఆ జనంలో వున్న ముసలమ్మని చూసి రాజుగారు 'నిన్ను ఎప్పుడో చూసినట్లు జ్ఞాపకం. నీ పేరేంటి?' అని అడిగారు. ముసలమ్మ సమాధానం చెప్పలేదు కానీ ఓ చిన్న పిల్ల మాత్రం "దాన్ని ఎర్రి రాద అంటారండి" అని చెబుతుంది. రచయిత ముగింపేమంటే 'ప్రశ్నించిన రాజుగారు వసుదేవకుమారులు శ్రీకృష్ణులవారు' అని. దీనికి వేసిన కార్టూన్‌లో శ్రీకృష్ణుడు ముసలి రాధతో 'యోగాసనాలు వెయ్యకపోతే ఎంత ముసలిదానిలా కన్పిస్తున్నావో చూడు రాధా!' అంటుంటారు.

'తాతగారు రాత్రి రహస్యంగా ఉంపుడుగత్తె ఇంటికి వెళ్ళేరు. నాన్నగారు రాత్రి రహస్యంగా పేకాట క్లబ్‌కి పోయేరు. మనవడు అదే రాత్రి మార్క్సిస్టు లెనినిస్టు మహాసభల ఏర్పాటుకి – రహస్యంగానే అయితేనేం – పయనమయ్యేడు' అని రాసిన రావిశాస్త్రి మాటలకి ఇంటికొచ్చిన పోలీసులకి ఇంటావిడ తలుపు తీసి 'ఎక్కడికెళుతున్నారో చెప్పి చచ్చే అలవాటు మా ఇంట్లో ఒక్కడికీ లేదు. ఎక్కడికెళ్ళారని చెప్పను' అంటుంది.

'మేజిస్ట్రేటుగారు ఇదివరకు ఏ మాత్రం సాక్ష్యం చాలకపోయినా కేసులు కొట్టేసేవాడు కదా, ఇప్పుడు ఏ సాక్ష్యం లేకపోయినా అందర్నీ శిక్షిస్తున్నారెందుచేత?' అనే ప్రశ్నకి సమాధానంగా "మరేంలేదు పై జడ్జిగారు మారేరు అందుచేత' అంటారు రచయిత. చట్టాలు, న్యాయాలు ఎన్ని ఉన్నా, ఎంత పకడ్బందీగా రాసుకున్నా అమలుచేయదల్చుకున్నవాడి ప్రయోజనాలమీదే ఆధారపడి వున్నాయి. 'స్వతంత్ర' భారతంలో, ప్రజల చేత, ప్రజల కొరకు ఎన్నుకోబడిన ప్రజాస్వామ్య దేశంలో అలా ఉండేడ్చిందన్నమాట.

రావిశాస్త్రి ఈ పొట్టి పిట్ట కథల ద్వారా సమాజంలో వున్న పరిస్థితుల మీద వ్యాఖ్యానించారు. ఆయన రచనలన్నీ.... కథలు, కథానికలు, నవలలు, నాటకాలు, వ్యాసాలు ప్రక్రియలతోపాటు ఈ పొట్టి పిట్ట కథలు కూడా అణగారిన వర్గాల ప్రజల జీవితాలను, వారిపై సాగుతున్న దోపిడీ పీడనల సాంస్కృతిక రూపాలను అక్షరీకరించారు. 71 సం॥ల ఆయన జీవిత కాలంలో (1922 జూలై 30న శ్రీకాకుళంలో పుట్టారు. 1993 నవంబరు 10న విశాఖపట్నంలో మరణించారు) 55 ఏళ్ళకు పైగా రచనా వ్యాసంగంలో వున్నారు. 1938లో ఆయన రాసిన "దేవుడే చేశాడు" అనే కథ మొదటి రచన కాగా 1993లో పూర్తిచేసిన 'ఇల్లు' నవల చివరి రచన. రావిశాస్త్రి పేరుతోనేగాక ఆయన కాంతా కాంత, జాస్మిన్, గోల్కొండ రాంప్రసాద్, శంకరగిరి గిరిజాశంకరం, అన్‌జానా, గూఢచారి 666 మొదలైన కలం పేర్లతో కూడా రచనలు చేశారు. ఆయన చెప్పదల్చుకున్న విషయాన్ని అతిపెద్ద రచనల ద్వారానూ ఇలాంటి పొట్టి పిట్ట కథల ద్వారానూ చెప్పగల నేర్పరి. పాఠకులను ఆయన రచనలు మేల్కొల్పాయి. ఇప్పటికీ చైతన్యపరుస్తున్నాయి. ✦

# చైతన్యవాహిని

**12-6-2022న హైదరాబాదులో** జరిగిన శీలా వీర్రాజుగారి సంస్మరణ సభకు 200 మంది సాహిత్యకారులు, చిత్రకారులు, కుటుంబసభ్యులు, బంధువులు హాజరైనారు. 20 మందికి పైగా ప్రముఖులు ఆయనతో తమకు ఉన్న అనుబంధాలను సభలో పంచుకున్నారు. మొదటగా వీర్రాజుగారి చిత్రపటానికి శీలా సుభద్రా దేవిగారు పూలమాల వేసి నివాళులర్పించారు. నిండుగా జీవించి, జీవితమంతా సాహిత్యంతో పెనవేసుకున్న విలువైన, నిబద్ధతతో కూడిన జీవితాన్ని వీర్రాజుగారు గడిపారని వక్తలు అభిప్రాయపడ్డారు. సభ ప్రారంభంలో 'ప్రజాసాహితి' వీర్రాజుగారిపై వెలువరించిన సంస్మరణ సంచికను నాళేశ్వరం శంకరం ప్రముఖులతో (సుధామ, శివారెడ్డి, నగ్నముని, నిఖిలేశ్వర్, బి.ఎస్. రాములు, నందిని సిధారెడ్డి, కొండేపూడి నిర్మల, వారాల కృష్ణమూర్తి)తో కలిసి ఆవిష్కరించి మొదటి కాపీని సుభద్రా దేవిగారికి అందించారు. వీర్రాజుగారి 'మైనా' నవలను హిందీలోకి అనువదించి తయారుచేసిన పుస్తకాన్ని కాలెపు గణేష్‌రామ్ బ్రతికి ఉండగా వీర్రాజుగారి చేతిలో పెట్టలేకపోయాను అంటూ చిత్రపటం ముందు ఉంచారు. సభలో పైన పేర్కొన్న ఆవిష్కర్తలతోపాటు, ఎన్. గోపి, డా. భట్టు లక్ష్మీనారాయణ, బైస దేవదాసు, శిఖామణి, విహారి, శిలాలోలిత, ప్రసాదమూర్తి, చంద్రశేఖరరెడ్డి, వి.ఎస్.ప్రకాశరావు, కుందుర్తి కవిత, ఏ.ఎల్.కిస్మత్ కుమార్, ప్రభాకర్, గోపాలం, మాట్లాడారు. సభను ఎం.లక్ష్మి నిర్వహించగా, వీర్రాజుగారి మనుమరాలు ఆశ్లేష ముగించారు.

**19-6-22న విజయవాడ,** పటమటలోని సీనియర్ సిటిజన్స్ ఫోరం హాలులో సీనియర్ సిటిజన్స్ ఫోరం, అరసం సంయుక్త ఆధ్వర్యంలో సభ జరిగింది. ఈ సభలో జనసాహితి ప్రధాన కార్యదర్శి అరుణ, కందుకూరి వీరేశలింగం సామాజిక కృషి – సమకాలీనత అంశంపై మాట్లాడారు. ఆమె తన ఉపన్యాసంలో కందుకూరి వీరేశలింగం చేపట్టిన వితంతు వివాహాలు, బాల్య వివాహాల రద్దు, స్త్రీలకు విద్య, దేవదాసీ విధానం రద్దు ఉద్యమాల సమయంలో ఆయన ఎదుర్కొన్న కష్టాలను, వాటిని ఎదుర్కొంటూ మొక్కవోని దీక్షతో ఆయన చేసిన కృషిని తెలియ చేశారు. గ్రాంధికభాషావాది అయిన వీరేశలింగం వ్యావహారిక భాషావాదిగా మారిన విధానం, ఆ తర్వాత రచించిన పుస్తకాలు, స్త్రీలకు అందుబాటులో చదువు వుండాలనే దీక్షతో వైద్యశాస్త్రం, సైన్సు పుస్తకాలను తెలుగులోకి అనువదించిన విషయం గుర్తుచేశారు. మాతృభాషలో విద్యను వ్యతిరేకిస్తున్నవారంతా వందేళ్ళకన్నా ముందే ప్రజల భాషలో చదువుల కోసం ఆయన చేసిన కృషిని తెలుసుకోవాలన్నారు. సంప్రదాయవాది నుండి హేతువాదిగా మారిన ప్రయాణంలో ఆయన రాసిన ప్రహసనాలు చాలా గొప్పవన్నారు. అవి ఈనాటికీ ప్రాసంగికత కలవి అన్నారు. సందర్భానుసారంగా అవసరాన్ని బట్టి సంప్రదాయ వాదులను ఎదుర్కోవటానికి ఆయన అనేక పత్రికలనూ, సాహిత్యాన్ని తీసుకువచ్చారన్నారు. స్త్రీల కోసం పాఠశాలలను, ఉపాధి కేంద్రాలను, నిర్వహించారన్నారు. ఆయన నిర్వహించిన ఉద్యమాలన్నింటా అతని భార్య రాజ్యలక్ష్మమ్మ అండగా నిలచారని ఉదాహరణతో వివరించారు. అస్పృశ్యతా నిర్మూలన కోసమూ ఆ జంట ఆనాటి సంఘ నియమాలకు ఎదురొడ్డి నిలిచారన్నారు. వీరేశలింగం చిట్టచివరి మాటలను చదివి విన్పించారు. ఆ లేఖలో తను ఆర్థికంగా లేనివాడని, ఆరోగ్యమూ సరిగా లేనివాడని, పెద్ద చదువులూ లేనివాడని అయినా 'దేశభక్తి' ఉండటం వల్ల, నా తోటి ప్రజలందరూ సంతోషంగా ఉండాలని కోరుకుంటూ ఈ సంస్కరణోద్యమాలు నిర్వహించానని తెలియచేశారు. నేటి 'దేశభక్తుల' పాలనలో సమస్త సంపదలు, సహజవనరులు.... ఆఖరికి దేశాన్నే అమ్మకానికి పెట్టారని, అలాగే మన చరిత్రనంతా వక్రీకరిస్తున్నారనీ, అసలు చరిత్రే లేకుండా చేస్తున్న విధానాల మీద మీ వంటి పెద్దవారంతా ఐక్యమై, ఆనాటి ఉత్తేజాన్ని ఆ ఉద్యమాల స్ఫూర్తిని ఇప్పటితరానికి అందివ్వాల్సిన బాధ్యత మీ మీద వుందని చెప్తూ ముగించారు. ఆ తర్వాత కవితాగోష్టి కార్యక్రమం జరిగింది. ✦




**పూండ్ల రామకృష్ణయ్య సాహిత్యలేఖలు : సంపాదకులు - డా॥ మాచవోలు శివరామప్రసాద్**

పూండ్ల రామకృష్ణయ్య నెల్లూరు సమీపాన వున్న దువ్వూరు గ్రామంలో 14-7-1860న జన్మించి - ఐదవ ఫారం వరకు చదివి - కలక్టరాఫీసులో ఉద్యోగం చేస్తూ, సంస్కృతం, ఇంగ్లీషు భాషలనభ్యాసం చేసారు. 1 జూన్ 1885న 'అముద్రిత గ్రంథ చింతామణి' అనే పత్రిక ప్రారంభించి, తాను మరణించేవరకు అంటే 1904 సెప్టెంబరు 1 వరకు ప్రచురించారు. తన 44 సంవత్సరాల జీవితంలో ప్రముఖ సాహిత్యవేత్తలు కొక్కొండ వేంకటరత్నం పంతులు, మాడభూషి వేంకటాచార్యులు, పనప్పాకం అనంతాచార్యులు, వేదం వేంకట రాయశాస్త్రి, బహుజనపల్లి సీతారామాచార్యులు, ధర్మవరం రామకృష్ణమాచార్యులు, కోలాచలం శ్రీనివాసాచార్యులు మొదలగువారితో సాహిత్య పరిచయం పెంపొందించుకున్నారు. తను ప్రచురించిన 'అముద్రిత గ్రంథ చింతామణి' పత్రికలో తాళపత్రాలలో శిధిలమైపోతున్న గ్రంథాలను వెలికితెచ్చారు. యువతకు సాహిత్యాభిమానం కల్గిస్తూ, సాహిత్య సందేశాలు పత్రిక ద్వారా తీర్చారు. ఇదికాక మరో 21 పుస్తకాలు ప్రచురించారు.

డా॥ మాచవోలు శివరామప్రసాద్ తన డాక్టరేట్‌కై పూండ్ల రామకృష్ణయ్య సాహిత్యసేవపై పరిశోధన చేశారు. వీరి సంపాదకత్వాన 'అలనాటి సాహిత్య విమర్శ - అముద్రిత గ్రంథ చింతామణి'ని రాష్ట్ర ప్రభుత్వ మాన్యుస్క్రిప్ట్ లైబ్రరీవారు ప్రచురించారు.

వేదం వేంకటరాయశాస్త్రికి పూండ్ల రాసిన సాహిత్యలేఖలు 154 పుటల్లో శివరామప్రసాద్ అందించారు. ఆ లేఖల్లో ప్రస్తావించిన విషయాలకు 34 పుటల వివరణలు ఇచ్చారు. ఇవిగాక పూండ్లకు ధర్మవరం కృష్ణమాచార్యులు కోలాచలం శ్రీనివాసరావు, వావిలికొలను సుబ్బారావు, ఆర్. వెంకటసుబ్బయ్య రాసిన లేఖలు కూడా ఈ సంపుటిలో వున్నాయి.

ఈ లేఖలలో ఆనాడు ప్రచురింపబడుతున్న సాహిత్య పత్రికలు 'సత్యసాధని', 'శశిలేఖ', 'ఆంధ్ర ప్రకాశిక', 'కళావతి', 'రాజహంస', 'పుష్ప సంజీవని', 'వాగ్వల్లి', 'సరస్వతి', 'దేశపకారి' మొదలగువాటి ప్రస్తావనలు, సాహిత్య వాద వివాదాలు అనేకం ఈ లేఖలలో చూడగలం.

సాహిత్య విద్యార్థులందరూ తప్పక చదవాల్సిన గ్రంథం.

1/8 డెమ్మీలో 248 పుటలు. వెల : రూ. 200/- ప్రథమముద్రణ : సెప్టెంబరు 2019. ప్రతులకు : డా॥ ఎం. శివరామప్రసాద్, 4-638 ఉస్మాన్‌సాహెబ్ పేట, నెల్లూరు - 524002. సెల్ : 94415 95080.

**రాయలసీమ నాటక వికాసం (500 నాటక, నాటికల సంక్షిప్త విశ్లేషణ) : రచన - డా॥ మూల మల్లికార్జునరెడ్డి**

యోగివేమన విశ్వవిద్యాలయంలో లలితకళల విభాగపు ఆచార్యుడు మల్లికార్జునరెడ్డి యు.జి.సి.వారి మేజర్ రీసర్చ్ ప్రాజెక్టు ద్వారా చేసిన పరిశోధన ఇది.

1860లో కోరాడ రామచంద్రశాస్త్రి రాసిన 'మంజరీ మధుకరీయం' మొట్టమొదటి తెలుగు నాటకం. ఆనాటినుండి ఈనాటివరకు 162 ఏళ్ళ కాలంలో వేలాది నాటకాలు, నాటికలు తెలుగునాట వచ్చాయి. వాటిలో 100 ప్రసిద్ధ నాటకాలను ఎన్నికచేసి, 2021 నవంబరులో అరవింద ఆర్ట్స్, తానావారు సంయుక్తంగా ఆరు సంపుటాలుగా విడుదల చేశారు. వాటిని వల్లూరు శివప్రసాద్, గంగోత్రి సాయి సంపాదించారు. ఇప్పుడు 2022లో మల్లికార్జునరెడ్డి రాయలసీమకు చెందిన రచయితలు రాసిన 500 నాటక, నాటికల సంక్షిప్త విశ్లేషణ వెలువరించారు.

తెలుగు నాటకం - పరిణామక్రమం; రాయలసీమ నాటక నేపథ్యం; రాయలసీమ పౌరాణిక నాటకాలు; నాటికలు, ఏకాంకికలు; రాయలసీమ చారిత్రక నాటకాలు, నాటికలు, ఏకాంకికలు; రాయలసీమ అనువాద నాటకాలు, నాటికలు, ఏకాంకికలు; రాయలసీమ నాటకం - సామాజిక చైతన్యం అనే ఏడు అధ్యాయాలలో వీటిని పరిచయం చేశారు. ఇన్ని నాటకాలు చదివి వాటిని విశ్లేషిస్తూ రాసిన రచయిత కృషి ప్రశంసనీయం. ఈ ఐదు వందలేగాక, మరో ఐదువందల నాటకాలు, నాటికలు కూడా తాను సేకరించినట్లు రచయిత తెలియచేశారు.

ఇంతవరకు సాహిత్య విమర్శకు, విశ్లేషణకు సరిగ్గా నోచుకోని నాటక సాహిత్యంపై ఈ పరిశీలన నాటకరంగంపై కృషి చేసేవారికి బాగా ఉపయోగపడుతుంది. మొత్తం లభ్యమౌతున్న వేయి నాటకాలు, నాటికలు, ఏకాంకిలలో ఒక వందో, రెండువందలో అచ్చువేయడం ద్వారా అవి అదృశ్యం గాకుండా కాపాడే ప్రయత్నం ఏ సంస్థ ఐనా చేపట్టడం అత్యవసరం.

1/4 క్రౌన్ సైజులో 32+390 పుటలున్న ఈ గ్రంథం వెల : రూ. 500/- మొదటిముద్రణ : 2022. సుమ బాలరెడ్డి ట్రస్టు ప్రచురణ. ప్రతులకు : డా॥ మూల మల్లికార్జునరెడ్డి, 73/121-16-1, వేమన నగర్, వి.ఆర్.ఆర్. కాలనీ, రామరాజుపల్లి - కడప - వైఎస్ఆర్ జిల్లా. ఫోను : 7700003399. email : mula.mallikyuv@gmail.com

**పఠాభి రచనలు : సర్వలభ్య రచనల సంకలనం. సంపాదకులు - ఆర్వీయస్ సుందరం, కాళిదాసు పురుషోత్తం, పారా అశోక్‌కుమార్.**

పఠాభిగా తెలుగు సాహితీలోకానికి పరిచయమైన విలక్షణ కవి అసలుపేరు తిక్కవరపు పట్టాభిరామిరెడ్డి. పద్యకవితల నడుమ వచన పద్యాలనే దుడ్డుకర్రతో విరగ్గొడతానన్నాడు. ఇప్పటికీ పాఠకులను ఆశ్చర్యపరుస్తున్న, 'ఫిడేలు రాగాల డజన్'ను 1938లో తన 19వ యేట రాశాడు.

ఆయన భాషాంతర, కులాంతర, మతాంతర, రాష్ట్రాంతర వివాహం చేసుకున్నారు. భార్య స్నేహలత తల్లిదండ్రుల్లో ఒకరు తమిళులు, మరొకరు బెంగాలీ. ఈ పెళ్ళితో తండ్రితో తెగతెంపులు చేసుకోవలసి వచ్చింది. కూతురు నందన, కొడుకు కోణార్క పుట్టిన తర్వాత ఈ కుటుంబం 1968లో బెంగుళూరులో స్థిరపడ్డారు. సినిమారంగంలో ప్రవేశించి 'సంస్కార' సినిమా నిర్మించగా, అది నిషేధానికి గురైంది. అయితే 1970లో నిషేధం రద్దయి, 1971లో జాతీయ స్వర్ణపతాకం పొందింది. అత్యవసర పరిస్థితిని వ్యతిరేకించడంతో పఠాభి కుటుంబ సభ్యులందరూ అరెస్టయ్యారు. జైలులోనే అనారోగ్యంతో 1977లో స్నేహలత మరణించారు.

ఈ సంపుటిలో పఠాభి రాసిన కవితల, పన్‌చాంగము, యాత్రా ఛందస్సులు 272 పుటలు వుండగా, ఆయన రాసిన వ్యాసాలు, ఇతరాలు 83 పుటలు. ఇంగ్లీషు రచనలు, లేఖలు 104 పుటలున్నాయి.

1/8 డెమ్మీలో 24+461 పుటలు. వెల : రూ.200/- ప్రథమ ముద్రణ : 19 ఫిబ్రవరి 2019. ప్రచురణ : మనసు ఫౌండేషన్. ప్రతులకు : ఎమెస్కో బుక్స్ 1-2-7, బానూకాలనీ, గగన్‌మహల్ రోడ్డు, హైదరాబాదు - 500029. తెలంగాణ. emai : emescobooks@yahoo.com

**డా॥ ఎం.వి. రమణారెడ్డి స్మృతి సంచిక : సంపాదకులు - డా॥ అప్పిరెడ్డి హరనాథరెడ్డి**

సాహితీవేత్త, విప్లవ రచయిత, కథారచయిత, అనువాదకుడు, రాయలసీమ విమోచన సమితి స్థాపకుడు, శాసనసభ్యుడు, రాజకీయ నాయకుడు, కార్మికనేత, వైద్యుడు, ఫ్యాక్షనిస్టు ముద్ర ధరించినవాడు, పత్రికా సంపాదకుడు, ఉత్తమ సినిమాల విశ్లేషకుడు, తిక్కన పద్యాల ప్రేమికుడు నాలుగు విద్యాసంస్థల స్థాపకుడు అయిన డా॥ ఎం.వి. రమణారెడ్డి 1944 ఏప్రిల్ 4న జన్మించి తన 78వ యేట 29 సెప్టెంబరు 2021న మరణించారు.

ఒక్కొక్కరికి ఒక్కోవిధంగా కనిపించే యం.వి.ఆర్. బహుముఖ రంగాల అసాధారణ వ్యక్తిత్వంలోని భిన్న కోణాలను పరామర్శిస్తూ, ఆయన స్మృతిలో 54 మంది మిత్రులు, రచయితలు, రాజకీయ నాయకులు, ప్రజాస్వామికవాదులు రాసిన వ్యాసాల సంపుటి ఇది. అంతేగాక రమణారెడ్డి రాసిన మౌలిక రచనలపైనా, అనువాదాలపైనా, ఆయన ప్రచురించిన ఇతరుల పుస్తకాలపైనా 20 మంది రాసిన 21 వ్యాసాలు కూడా దీనిలో చేర్చారు.

డా॥ యం.వి.ఆర్. జీవలక్షణం సాహిత్యం. ఎన్ని ఇతరరంగాల్లో కృషిచేసినా ఆయన సాహిత్య జీవితమే మనముందు నిలుస్తుంది. ఆత్మకథతోపాటు 10 సొంత రచనలు; ఏడు అనువాదాలు కాక ఆయన 4 పుస్తకాలు ఇతరులవి ప్రచురించారు.

వివిధ సందర్భాలలోని ఆయన ఫొటోలు, ఆయన రాసిన పుస్తకాల ముఖచిత్రాల ఫొటోలు, 'ప్రభంజనం' పత్రిక మొదటిపేజీల ఫొటోలుతో కలిసి 1/4 క్రౌన్ సైజులో 204 పుటలు. ఈ స్మృతి సంచిక వెల : రూ.150/- ఏప్రిల్ 2022లో ప్రచురింపబడిన ఈ సంచిక ప్రచురణకర్త మల్లెల మురళీధర్, ఈ సంచిక కన్వీనర్ మెట్టుపల్లి జయదేవరెడ్డి. ప్రొద్దుటూరు, కవితా పబ్లికేషన్స్‌వారి ప్రచురణ. ప్రతులకు : కవితా పబ్లికేషన్స్, 3/75 రాయవరం, ఖాదరాబాదు (పోస్టు), ప్రొద్దుటూరు - 516362. కడపజిల్లా. emai : kavitabooks@gmail.com ఫోను : 94940 80926, 91827 95522.

**అస్మతున్నీసా మానవానుబంధాల కవితామాలికలు రెండు:**

రచయిత్రి - అస్మతున్నీసా తొలి కవితాసంపుటి 'అమరిన అక్షరాలు'. ఇప్పుడు మనముందున్నవి రెండవ సంపుటి 'అస్మదీయం', మూడవ సంపుటి 'అనంతాకాశంలో'.

యం.ఏ.బి.ఇడి చదివిన అస్మతున్నీసా గత 26 సంవత్సరాలుగా తెలుగు ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. ఇప్పటికి తన కవితలు మూడు సంపుటాలుగా వెలువడినా, వీరి కవితలు మూడు సంపుటాలుగా వెలువడినా, వీరి కవితలు ఏ పత్రికలోనూ కనబడవు. కారణం పత్రికలకు వారు పంపకపోవడమే! వివిధ సామాజికాంశాలకు కవితారూపంలో స్పందించడమేకాక ప్రకృతిలో పరవశించడమూ వీరి కవితలలో చూస్తాం. మతోన్మాదం, బసివి, శ్రమ సౌందర్యం, పోలీసు, కులం, పదుపుకత్తె, చెత్తబుట్ట, సమాధి మొదలైన అంశాలపై స్పందనలు వున్నాయి. కొన్ని కవితలు వీరు భవిష్యత్తులో మరింత గొప్ప కవితలు రాయగలరన్న భరోసానిస్తున్నాయి.

'కవిత్వంలోకి తొలి అడుగులు' అనే ముందుమాట ఆచార్య బి. తిరుపతిరావు రాశారు. మూడవ సంపుటికి కొలకలూరి ఇనాక్ 'అభినందన పత్రం' రాశారు.

1/8 డెమ్మీలో 152 పుటల 'అస్మదీయం' వెల : రూ.100/- 116 పుటలు. 'అనంతాకాశంలో' వెల : రూ. 100/- పుస్తకమిత్ర చదువరుల వేదిక తెనాలివారి ప్రథమ, ద్వితీయ ప్రచురణలు ఇవి. ప్రచురణకాలం : జనవరి 2020, ఆగస్టు 2020. ప్రతులకు : శ్రీమతి అస్మతున్నీసా, 1-29-22/ఎ, ఎస్.ఎల్.ఎన్.స్వామి గుడి వీధి, నాజరుపేట. తెనాలి - 522201. గుంటూరుజిల్లా. ఫోను : 95508 98059.

**విపరీత వ్యక్తులు (నవల) : రచయిత - పి. చంద్రశేఖర అజాద్**

సమాజం అంగీకరించిన నియమ నిబంధనలను పాటించని గౌతమ్ ఈ నవలలో సమాజం దృష్టిలో ఒక అరాచకవాది. అటువంటివారినే విపరీత వ్యక్తులు అంటారు. ఇంగ్లీషులో వీరిని idiosyncratic అంటారు. అంటే ప్రత్యేకమైన ఆలోచనలు, ప్రవర్తన వున్నవారన్నమాట.

ఈ నవల వెనుక వున్న కథ, ముందుమాటల్లో ఇలా అర్థమౌతుంది. పుదుచ్చేరి ప్రభుత్వంలో మంత్రిగా చేసిన మల్లాడి కృష్ణారావు, 25 సంవత్సరాలుగా ఓటమి ఎరుగని నాయకుడి జీవితాన్ని, దాట్ల దేవదానంరాజుతో రెండు గంటలసేపు చేసిన సంభాషణలో తెలుసుకున్న విషయాలూ, కలిపి గౌతమ్ అనే విపరీత వ్యక్తిని అజాద్ సృష్టించారు. ఈ నవలలో దాట్ల కూడా ఒక పాత్రే!

రాయుడు, రాజా, గౌతమ్, నయన, అబ్రహాం, సన్నిధానం శాస్త్రి, మొదటి ఆరుపేజీలలోనే చనిపోయిన దాసు, లలిత, జెస్సీ పాత్రలలో సమాజ నియమనిబంధనలను లెక్కబెట్టని గౌతమ్ ఒక్కడే విపరీతవ్యక్తి అని సమాజం భావిస్తుంది. మిగిలినవారందరూ సాధారణ వ్యక్తులే. మరి నవలకు 'విపరీత వ్యక్తులు' అని బహువచనం ఎందుకు వాడారో తెలియదు.

ఈ నవలలోని గౌతమ్ కవులమీదా, వారి చాపల్యాల మీదా, సంతాప సభల్లో కవిత్వాలు చదవడం మీదా, ఎక్కువెక్కువ సంపాదించుకోవాలను కునేవారిమీదా, ఫెమినిజంమీదా చేసిన వ్యాఖ్యానాలు ఆలోచించదగ్గవి.

గౌతమ్ తన సత్యాన్వేషణలో కలకత్తా వెళ్తాడు. కాశీ వెళ్తాడు. గంజాయిని ప్రోత్సహించాలంటాడు. ప్రవచకులందర్నీ షూట్ చేయాలంటాడు.

రెండవ అధ్యాయంలో గౌతమ్ తన కథ తానే చెప్తాడు. ఫ్లాష్‌బ్యాక్ ప్రక్రియలో తన సంగీత సాధన గురించీ, లలిత, జెస్సీల గురించీ, దళిత సంఘాల గురించీ, వ్యక్తిత్వ వికాసం అంటే అన్ని విలువలు వదిలెయ్యాట మేననీ, ప్రపంచ తాత్త్వికులారా ఏకం కండి అనీ చెప్తాడు. ఇది వింత వికృత ప్రపంచమైనా, లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ అనీ, ఈ జీవితాన్ని అందంగా దిద్దుకోవాలి అనే అతని ఆకాంక్షతో నవల ముగుస్తుంది.

1/8 డెమ్మీ 112 పుటలు. వెల : రూ.120/- ప్రథమముద్రణ : డిశంబరు 2020. పై రెండు పుస్తకాల ప్రతులకు : చంద్రశేఖరఅజాద్, ఫ్లాట్‌నెం. 909, సఫైర్ బ్లాక్, మైహోమ్ జ్యూయల్, మదీనాగూడ, మియాపూర్, హైదరాబాద్-500049. ఫోన్ : 92465 73575.✦

కవిత

# ప్రేమను కురిపించే కర్మయోగి మన ప్రధాని కావాలి!

కన్నడం : *రంగనాథ కంటానకుంటే* ఇంగ్లీషు : *సుమ ఎంబార్* తెలుగు : *కొత్తపల్లి రవిబాబు*

ఒక యంత్రంలా,
దేశ ప్రధాని 18 గంటలు పాటుపడుతున్నాడంటున్నారు
అబ్బే! అవసరం లేదు -
మన కార్మికుల్లా 8 గంటలు పనిచేస్తే చాలు,
అలసి, సొలసినపుడు విశ్రాంతి తీసుకోమనండి,
నిద్ర ముంచుకువస్తే నిద్రపొమ్మనండి,
కలల్లో పసిపిల్లల్లా చిరునవ్వులు చిందించమనండి,
ఆత్మీయుల ఆలింగనాలను ఆనందించమనండి,
కానీ కౌగిలింతలో వున్నవారిని కాల్చివేయకుండా వుండమనండి.
మన ప్రధాని యంత్రంగా గాక మనిషిగా వుండమనండి.

ప్రధానికి సంసార జంఝాటం లేదంటున్నారు,
డబ్బు, ఆస్తి పోగుచేయడంటున్నారు,
అలా కాదు,
మన ప్రధానికి ఒక కుటుంబం వుండాలంటాను,
ఆ కుటుంబం కోసం డబ్బు, ఆస్తి సంపాదించుకోనీయండి,
కానీ, ప్రజల ధనంతో విశ్వవిహారం చేయడాన్ని అడ్డుకోండి.
పిల్లలు, మనమ సంతానంతో
పెద్ద కుటుంబాన్ని వుండనీయండి,
అనుబంధాలు, బంధుత్వాలు తెలుసుకోనీయండి,
ప్రజలు అన్నం వండుకునే ఇంధనం ధర
అదుపులో వుంచమనండి,
రోజురోజుకి పెరిగే ఉప్పు, పప్పు, కూరగాయల ధరల గురించి
తెలుసుకోనీయండి
నాలుగు పైసలు గడించడానికి మన రైతులు చిందించే
చెమట గురించి తెలుసుకోనీయండి
శ్రమ ఫలితాలను దోచుకునేవారికి సంకెళ్ళు వేయమనండి.
ముందుగా,
పశుమాంసం మన జాతి ఆహార సంస్కృతిలో భాగమని
అర్థం చేసుకోనీయండి
అంతేకాదు, మాంసం ముక్కకన్నా మనిషి ప్రాణం
మరింత పవిత్రమని అర్థం చేసుకోనీయండి.

మన ప్రధాని రొమ్ము ఇన్ని అంగుళాలని చెబుతారు
అక్కర్లేదు - మనిషివి కావాలంటే
100 అంగుళాల రొమ్ము అక్కర్లేదు,
చిన్న ఉడత, చిట్టి చిలుక లేక కాకి గుండెల్లాంటి
చిన్న గుండె వుంటే చాలు.
అందర్నీ తనవారిగా విశాల దృక్పథంతో చూడమనండి,
ప్రజలను ప్రేమించమనండి,
ప్రజలను చీల్చి, చంపి, పరిపాలించే
క్రూర జంతువుగా మారవద్దని కోరండి.

మన ప్రధాని మంచి ఉపన్యాసకుడంటారు
గంటల కొద్దీ మాట్లాడగలరంటారు
అక్కర్లేదు - మన ప్రధాని మూగవాడైనా పరవాలేదు
ప్రతిపక్షాలపై ఆగ్రహావేశాలతో దాడి చేయవద్దని చెప్పండి.
ఆయన మాటలు ఎవరినీ గాయపరచకుండా,
భయపెట్టకుండా వుండాలని చెప్పండి
ఆయనకు ప్రేమికుల గుసగుసలూ, పక్షుల కువకువలూ వినే
హృదయం వుండాలని కోరుకోండి.
ఎవరి కిరీటమైనా శాశ్వతం కాదన్న వాస్తవాన్ని తెలుసుకోమనండి
ప్రజల ఆప్యాయతపొందే నిజమైన
ప్రజానాయకుడు కానీయండి
అణుబాంబుల గురించి మాట్లాడనీయకండి
ఇలా చేస్తే....
అప్పుడు మన దేశ సింహాసనంపై తనను తానే
కీర్తించుకునే రాక్షసుడిని మనం చూడం!

ధర్మ రక్షకుడు మన ప్రధాని అంటున్నారు
కానే కాదు ---
ప్రపంచంలో ఇప్పటివరకూ ఏ మతమూ ప్రజలను ఉద్ధరించలేదు
ప్రజల ఉద్ధరణకు మతం అక్కర్లేదు
వారి దాహం, ఆలసట తీర్చడానికి వారికి కావాల్సింది
పని, నీరు, ప్రశాంతత, ఆహారం, వస్త్రాలు, ఆవాసం, జ్ఞానం.
శ్రామికుల మతం శ్రమ.
ప్రేమే మతమార్గంగా నడిచే కర్మయోగి మన ప్రధాని కావాలి
బుద్ధ పూర్ణిమ వెదజల్లే ప్రకాశమే మన ప్రజలకు కాంతి నివ్వాలి.

(కన్నడంలో దీనిని రచించిన రంగనాథ కంటానుకుంటే. కర్ణాటకలోని హొన్నవరలోని ప్రభుత్వ ప్రథమశ్రేణి కళాశాలలో అధ్యాపకుడు.
కన్నడం నుంచి ఇంగ్లీషులోకి అనువదించినవారు సుమా ఎంబార్.
ఇది ఇంగ్లీషు వారపత్రిక 'జనత'లో జూన్ 9, 2019 సంచికలో ప్రచురితం)

# దండాలండి బావు - ఛాత్రి బావుకు దండాలు!

- ఛాయరాజ్

అతగాడి కేటి! మాన్ బావుడు. పాపిష్టి లోకాన్ని సూళ్ళేక పల్లక జారుకున్నాడు. దెబ్బయి పోనాం మనం గద.... అతగాడి క్లయింటులం కవులం కథకులం. బతికున్నప్పుడు “బాగు” జేసుకోలేక యిప్పుడు పిర్రా బుర్రా గోక్కుంటేట్లాబం?

లా తిరగేసేసి బుక్సులు సదివేసేసి కాలాన్ని కసిరేసేసోడు. కేసులు గెలిపించేసి కతలు రాసేసోడు, వయసును గెలిసేసోడు. ఫ్రెండుసులతో తిరిగిసొచ్చి సెజల్తో కలిసి పోయీవోడు. యేం మనిసండి బాబు ఛాత్రి బాబు - టప్పాదియ్యా! సిటంలోనే సిటాఫట్ యెక్కడిదక్కడే! యల్లాటోడు యెల్లాగై పోనాడు. ఆపీలేక పోనాం కదండీ! పోనాడండి బాబూ! పోనాడు బావు. యిప్పుడు బుర్ర బక్కురుకుంనేట్లాబం?

సెంవటోసు కున్నోళ్ళంటె వల్లమాని అభిమానం తోటి తల్లగిందులయీ వోడు. కలం గీకి నాడంటే కొత్త కత పుటీసి - ఎదిగేసి - పిటపిట లాడీసేది. కేడి గురించి రాసేసోడు, పటాసు గురించి రాసేసోడు. వాది గురించి సెప్పినా సెతివాది గురించి సెప్పినా రావ్యం బయట సెట్టేసోడు. కత సదివినా కత యిన్నా గలిక్కిన తన్ని కోరుటు నుండి పార్టీలోకి గెంటేసి వట్టుండె దర్రా!

పల్ల కున్నట్టుండోడు గాని గొప్ప పాలిటికలండి బాబు - సిన్న సిన్న కతల్జెప్పి సల్లగిచ్చు కొనోడు. నవ్వించి సెంప లోయించేసి, యేడిపించి గుర్రప్పం తీసి, సమాజానికి బాకీ సద్దారు తీరసండి బద్దిరిగాల్లారా.... మద్ది నుండి తప్పించుకోలేరు..... అటోలిటోలు కలిపి కమ్మగ గుద్దీ గ్రలివి, రాసిన కతవి దబిక్కినెత్తీసీడు. రాసుకోడమంటే అర్ధదీ - సారాన్ని సల్లగెక్కించీడం!

తలుసుకుంటె గుండి గతుక్కు మంటాది.... దబ్బలు కరిగిపోతాయి. అతగాడి కేటి! మాన్‌బావుడు! నిజ్జింగ! పున్నాత్తుడి కావుసు తక్కువ అయితేటి వి, యిక నిప్పుడు వకాల్త యవరికివ్వాలో. పాపిష్టోల పని పట్టండర్రాని సెప్పి ....... మొన్న పల్లకయి పోనాడు. కలం సొమ్ము పోనాది, విశాకుళం బాసలో కతల గను పోనాది. యింక “ఇల్లు” ముందు నిలబడి యవర్ని పిలాల. ఒకేల సొమ్ములు దొరికితే యవరికి సెప్పుకోవాల. బావు రావి కాదు మావి రసం కుండ. బావు ఛాత్రి గారు. ఛాత్రీయ మయిన కతల కొండ.

(ప్రజాసాహితి 1993 డిశెంబరు సంచిక నుండి)

ప్రజాసాహితి 30-7-6, అనపర్తివారి వీధి, అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం, విజయవాడ - 520002.
Editor : P.S. NAGARAJU, Edited, Printed and Published by K. RAVI BABU at Vanaja Press, Vijayawada - 520 002 for Co-operative Press, Vijayawada
A PUBLICATION OF JANASAAHITHI